సంపుటి: 22
సంచిక: 2

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

సెప్టెంబర్, 1976

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. వీ. మోహన్రావ్

తొలిమాట

నమస్కారము. "అపరాధ పరిశోధన" లో బహుళ ప్రజాదరణ పొందిన శీర్షిక 'లాయరు సలహాలు'. పాఠకుల ప్రోద్బలంవల్ల ఆ శీర్షికను శ్రీ పోతుకూచి సాంబశివరావుగారు తమ స్వంత పక్షపత్రిక అయిన 'విశ్వరచన' లో ప్రచురించ నిశ్చయించారు. కావున లాయరు సలహాలు కావలసిన పాఠకులు ఆ పత్రికకు వ్రాయవచ్చును.

ఈ నెలనుండి పత్రికలను అన్ని ముఖ్యనగరాలకు పొలిథిన్ బ్యాగ్‌లలో సీల్‌చేసి పంపుతున్నాము. త్వరలో ఇతర అన్ని పట్టణాలకుకూడా యీ పద్ధతిని విస్తరింప జేయగలము.

చాలామంది రచయితలు తమ రచనలు పంపవచ్చునా అని, బహుమతి పొందని నవలలకు పారితోషికం వుంటుందా అని, వ్రాస్తున్నారు. రచనలు ఎవరైనను పంపవచ్చును. ప్రచురింపబడిన ప్రతి కథకు, నవలకు తప్పనిసరిగా పారితోషికం వుంటుంది. బహుమతుల నిర్ణయాలు 11 వ తేదీన జరుగుతాయి. 12, 13 తేదీలలో బహుమతులు, పారితోషికాలు పంపించివేస్తున్నాము.

ఆగస్టు '76 నెల "సప్లిమెంట్" లో నిర్వహించిన బ్యాలెట్‌లో యీ నెలకూడా శ్రీమతి వసుంధరగారి నవల 'వందకు పదివేలు' ఉత్తమ నవలగా అత్యధిక మెజారిటీతో ఎన్నికైనదని .తెలుపుటకు సంతోషిస్తున్నాము. రచయిత్రికి బహుమతి రు. 116/- లు వెంటనే అందజేయబడినది.

సెలవా మరి—— మీ,

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. ముత్యపు చిప్పల దొంగలు—విజయ భాస్కర్.
17. గురువు చెప్పని శిష్యుడు—వై. రాజేశ్వరి.
39. ప్రాణం తీసిన తేనెటీగలు—ముద్దా సురేష్!
49. శ్యామల ఆత్మహత్య—వసుంధర..
79. కొండమీది రాక్షసుడు—శ్యాంబాబు.
92. బ్లాక్ మెయిలర్—అజీజ్.
99. ఉరిశిక్ష—బి. వై. నారాయణరెడ్డి.
116. చిల్లరదొంగ చిదానందం—కురుమద్దాలి విజయలక్ష్మి.
132. కట్టుడుపళ్ళు—ఏ. వీ. మోహన్రావ్.
155. మృత్యువు నీడ—ఎల్. రామ్‌గోపాల్.
164. పరలోక ప్రాప్తి—రమణశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. దేవతామూర్తి—సుజనశ్రీ.
51. నకిలీ జన్మ—శ్రీరాజ్.
98. ప్రేమలేఖలు—హుసేన్ బాషా.
149. ప్రేమపూజారులు—వసుంధర.

ఇవికాక—చెప్పుకోండి చూద్దాం, క్రైమ్‌లో తమాషాలు, అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, జోక్స్. మ.రెన్నో ఆకర్షణలు!!!

SRI VENK... PAN SHOP & BOOK ST... NEAR COURT ... Dist. (A.P.)

ముత్యపు చిప్పల దొంగలు!

విజయభాస్కర్

ఉదయం పోస్టులో వచ్చిన రిజిష్టర్డ్ కవరు జపాను నుండి అని తెలుసుకోగానే అది నా ప్రాణస్నేహితుడు మాధవ రావు నుండే అని గ్రహించాను. నాకు జపాన్‌లో ఉన్న పరిచయస్థుడు వాడొక్కడే.

కవరును విప్పాను. అందులో ఒక పాలనురగలాంటి అతి తెల్లని కార్డుపైన ఎంతో అందమైన ప్రింటింగ్‌లో, ఒక వైపున జపాన్ భాషలో, రెండో వైపున ఇంగ్లీష్‌లో వెడ్డింగ్ ఇన్విటేషన్ వుంది.

లెటర్ తీసి చదవసాగాను.

"నా ప్రియాతి ప్రియమైన విజయ్! నా కూతురు మాధవికి కోణార్క్ అనే జపానీయునితో వివాహం నిశ్చయమైనది. అతని తండ్రి మన భారతీయుడే. కానీ తల్లిమాత్రం జపానీయురాలు. అబ్బాయి పూర్తిగా తల్లిని పోలాడు.

అబ్బాయి వయస్సు 20 సంవత్సరాలు. అనుకోకుండా పెండ్లి నిశ్చయమైంది.

పెండ్లి 15 వ తేదీన కానీ నీవుమాత్రం పదోతేదీకల్లా జపాన్‌లో ఉండవలయును. ఇది నీ ప్రాణమిత్రుని కోరికగా మన్నించి రాగలవు. నీతో వేరొక పనికూడా ఉన్నది. తప్పక రాగలవు.

—నీ ప్రాణమిత్రుడు."

లెటర్‌ను తిరిగి కవరులోకి చేరుస్తూ ఆలోచనలో పడి పోయాను.

మాధవరావు నా ప్రాణస్నేహితుడు. వాడు నేను డిగ్రీ వరకు కలపి చదువుకున్నాము. ఆ తర్వాత మా పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి. కాలచక్రంలో పన్నెండేళ్ళు గిర్రున తిరిగిపోయాయి.

ఇల్లు, వాకిలి, భూములు అన్ని అమ్మి డబ్బు చేతపట్టు కొని, భార్యా పిల్లలతో సహా నాలుగు సంవత్సరాల క్రితం మాధవరావు జపాన్‌కు వెళ్ళిపోయాడు. అప్పటికే వాడికి పన్నెండేండ్ల కూతురు. పదేండ్ల బాబు ఉన్నారు. ఇపుడు ఆ అమ్మాయే 16 ఏండ్ల మాధవి. ఆ అమ్మాయి నన్ను అంకుల్ అని పిలిచేది. నిన్ననే విగ్రహాల స్మగ్లింగ్ కేసు పూర్తయింది. ఏ పనీ లేదు. కాబట్టి జపాన్‌కు పోవడానికి నిశ్చయించుకున్నాను.

2

జపాన్ ఏర్‌పోర్టులో దిగి కస్టమ్స్ చర్యలు ముగించుకొని బయటపడ్డాను. టాక్సీని పిలిచి అడ్రస్ చెప్పి పోనీ మన్నాను. పదిహేను నిముషాలలో 'పెరల్ ప్యాలెస్' (ముత్యాల భవనం) ముందాగింది టాక్సీ. టాక్సీ దిగి ఫేర్

చెల్లించి, లోనికి నడిచాను.

మాధవరావు భార్య లత, బాబు రాజేష్, పెండ్లికూతురు మాధవి ఎంతో ఆదరంగా పరామర్శించారు. మాధవరావు ఆనందంపట్టలేక నన్ను కౌగలించుకున్నాడు. తర్వాత ఎన్నో ఇండియా జపాన్ విశేషాలు మాట్లాడుకున్నాము.

భోజనంచేసి, మాధవరావుతో కలసి బయటకు బయలు దేరాను. పెండ్లి ఇంకా 4 రోజులుంది.

"ఒరేయి నాతో వేరే పని ఉందని వ్రాసావు. ఏం పనిరా" అని నవ్వుతూ అడిగాను.

"ఆహాఁ ఏమీలేదు. ముందు పెండ్లికానీ తర్వాత చెబు తాను. సరే మన 'స్వీట్స్టేట్'కు పోదాం పద," అని డ్రైవరును పిలిచి కారులో బయలుదేర తీసాడు.

పదినిముషాల తర్వాత సముద్రతీరంలోని ఒక ఐదంత స్థుల భవనం ముందాగింది కారు. 'పెరల్ ఐలెండ్' (ముత్యపు దీవి) అని పెద్దపెద్ద నియాన్ లైట్లతో పేరు వెలుగుతూ ఆరుతూ ఉంది.

"విజయ్! ఇది మా ఆఫీసు. మనకు ఎదురుగా ఉన్న సముద్రంలో 150 మైళ్ళ మేరకు హక్కు ఉంది. అంటే జపాన్ ప్రభుత్వం సముద్రంలోని ఆ మేరకు మాకు కంట్రాక్ట్ కిచ్చింది. ఆ మేరకు భాగంలో దొరికే ముత్యపు చిప్పలు మన పరమవుతాయి. ఈ వ్యాపారంలో మేం నలుగురం భాగస్థులం ఉన్నాము. వారిని పరిచయం చేస్తాను పద," అని బిల్డింగ్‌లోని రెండో అంతస్థులోని ఓ గదిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ ముగ్గురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు.

"హలో, పార్టనర్స్! ఇతడు నా ప్రాణస్నేహితుడు

విజయ్. ఇవాళే ఇండియానుండి వచ్చాడు" అని నన్ను వాళ్ళకు పరిచయం చేసాడు.

"విజయ్ ఇతను అన్వర్, ఇతను కాకురియన్, ఇతను కణ్ణన్. వీరు ముగ్గురూ నా పార్టనర్స్." అని నాకు తెలియ చేసాడు.

మిగతా మూడు రోజులలో ఎక్కువ భాగం జపాన్ రాజధాని అయిన 'టోక్యో'లో గడిపాను. ప్రపంచంలో కెల్లా ఖరీదైన అనగా, ఎక్కువ ఖర్చుకాగల పట్టణమది. దీని తర్వాతనే వరుసగా పారిస్, న్యూయార్క్‌లు ఖరీదైన పట్టణాలుగా పేరుమోసాయి.

ఐదవ రోజున, అనగా 15 వ తేదీన ఉదయం ఎంతో వైభవంగా జపాన్, భారతీయ పద్ధతుల మేళవింపులో కోణార్క్, మాధవిల వివాహం జరిగింది. ఇండియానుండి తెచ్చిన ఖరీదైన నగల సెట్టును మాధవికి కానుకగా ఇచ్చాను.

ఆ మర్నాడు, ఇక నే చేయవలసిన పని చెబుదూ, అని అడిగినపుడు మాధవరావు సీరియస్‌గా నా చేయి పట్టుకొని, "ఇక్కడ నీ డిటెక్టివ్ బుర్ర నుపయోగించి, నా ప్రాబ్లమ్ సాల్వ్ చేయాలి. నా కష్టం చెబుతున్నాను విను" అన్నాడు.

నేను ఆశ్చర్యంతోకాక నవ్వుతూ వాడివైపు చూస్తూ ఉండిపోయాను.

"నేను ఈ దేశం వచ్చి ముత్యాల వ్యాపారం చేసే అనేక లక్షల ధనం సంపాదించాను. నేను మొదటినుండీ అంటే నాల్గు సంవత్సరాలనుండీ ఈ ముగ్గురు పార్టనర్స్ తోనే ఉన్నాను. పోయిన మూడు సంవత్సరాలలో మా నలుగురికీ బాగానే లాభాలు వచ్చాయి.

కాని, ఈ సంవత్సరమే మా సముద్రభాగం నుండి ముత్యపు చిప్పలు మాయంకావడం జరుగుతున్నది. అది మాకెలా తెలిసిందంటే, కొందరు వ్యాపారస్తులు, కోటీశ్వరులు తమకు నచ్చిన, కావలసిన డిజైన్లలో ముత్యాలు కావాలంటారు.

మేము సన్నని అల్యూమినియం తీగలచే కాని, ఇతర విధాలుగా కాని వాళ్ళు చెప్పిన, చూపిన డిజైన్లను తయారు చేసి, మా పనివాళ్ళచేత సముద్రంలోకి పంపిస్తాము. వాళ్ళు ఆ డిజైన్లను తీసుకొని సముద్రంలోని ముత్యపు చిప్పల వద్దకు పోయి కృత్రిమ ప్రేరణలవల్ల అవి తెరుచుకునేట్లు చేసి, ఆ డిజైన్లను వానిలోకి వేస్తారు. తర్వాత ఆ ముత్యపు చిప్పలు మూసుకుంటాయి.

తర్వాత నిర్ణీతకాలంలో ముత్యపు చిప్పలలోని మాంటిల్ స్రావంవల్ల ఆయా డిజైన్లలో తయారైన ముత్యాలను ముత్యపు చిప్పలను కృత్రిమ ప్రేరణచే తిరిగి తెరిపించి సేకరిస్తాము. ఆయా డిజైన్ల కోసరము ఆయా ముత్యపుచిప్పలపైన మేము గుర్తులు వేసుకుంటాం....

ఆ విధంగా గుర్తులు వేసుకున్న మా ముత్యపుచిప్పలు ఈమధ్య చాలా కనబడుటలేదు. వాటిని మేము తీయాలంటే మా నిర్ణీత ప్రదేశం నుండే సముద్రంలోకి ప్రవేశించాలి. ముత్యాలను తీయడంవంటి పనులన్నీ మా నల్గురం కలిసి ఉన్నపుడే మా ముందే మా అనుమతితోనే జరుగుతుంటాయి.

మా సముద్ర ప్రదేశంచుట్టూ చాలా గట్టి కాపలా ఉంటుంది. ఎందరో సాయుధులు మా కంపెనీ తరఫున కాపలా ఉంటారు. అది నీవే చూద్దువుకాని పద. ఆ ముత్యపు

చిప్పల దొంగ ఎవడో నీవే వెదికి పట్టుకోవాలి.

వాడెవడో బయటివాడు మాత్రం కాదనిపిస్తుంది. అయితే మా పార్ట్‌నర్స్‌లో ఏ ఒక్కరైనా కావాలి. కాపలా వాండ్లకు అంత ధైర్యం, నేర్పు, పరికరాలుండక పోవచ్చును. అట్లాగని మా పార్ట్‌నర్స్‌లో ఎవ్వరినీ అను మానించే విధంగా లేదు.

ఈ వ్యవహారం ఇట్లాగే సాగితే ఈ సంవత్సరంతో మా కంపెనీ దివాలాతీయాల్సిందే. పైకి అందరూ ఆందోళన వెళ్ళబుచ్చుతున్నారు. నీవు డిటెక్టివ్‌వని ఎవరికీ తెలియదు. కావున నీ డిటెక్షన్ కొనసాగించి ముత్యపుచిప్పల దొంగ లను పట్టుకోవాలి" అన్నాడు.

"మిస్టర్, మాధవ్! నేను రెండు, మూడు రోజులు మీ ఎస్టేట్‌లోనే ఉంటాను. నాకు అలా వీలు కలిగించు" అన్నాను నేను.

"ఓ యస్! పద" అని గ్యారేజ్‌లోని కారు తీసుకు వచ్చాడు.

3

ఆఫీసులోకి చేరగానే ముందుగా నేనే ముగ్గురు పార్ట్ నర్స్‌కు విష్ చేసాను.

"డియర్ పార్ట్‌నర్స్, నా మిత్రుడు విజయ్‌కు సముద్ర వాతావరణం చాలా ఇష్టం. కొన్ని రోజులు మన ఆఫీస్ గెస్ట్‌రూమ్‌లో ఉంటాడు. అది మీ కిష్టమే అనుకుంటాను" అన్నాడు మాధవరావు.

"అలాగే ఉండనివ్వండి" అన్నారు ముగ్గురు.

వాళ్ళ కళ్ళలోని భావాలు చదవడానికి విఫల యత్నుడ్ని అయ్యాను.

నా కుండటాని కిచ్చిన భాగం రెండు రూమ్సుగా చేయ బడ్డవి. ఫ్రిజ్ వగైరా అన్నింటిని కలిగి ఉన్నది. నాకు సముద్రంమీద షికారు తిరగడానికి ఒక 'జపాన్ బుల్లెట్' మోటారుబోట్ ఇవ్వబడింది.

ఎవ్వరిని అనుమానించాలి ఎలా ఆచూకీ తీయాలీ అని ఆ రోజంతా ఆలోచిస్తూ ఉండిపోయాను. టైమ్ చూడగా మూడు దాటింది.

కాలినడకన ఎస్టేట్ చూడటానికి బయలుదేరాను. కాపలావాళ్ళకుకూడా నా గురించి అతిధిగా చెప్పాడు మాధవ రావు కావున వాళ్ళు నన్నేం అనలేదు. చాలాదూరం తిరి గాను. ఏం క్లూ దొరకలేదు.

మోటారుబోట్ తీసుకొని సముద్రంలోకి షికారు బయలు దేరాను. మోటారు బోట్‌లో చేపలు పట్టే వల కూడా వున్నది.

దానిని ఒకసారి సముద్రంలోకి వేసి లాగాను. ఇరవై వరకు చిన్నా పెద్ద చేపలు ఒక పంచరంగుల వింత ఆకర్షణ గల చేపా వచ్చాయి. ఆ చేప లన్నింటిని కాపలా వ్యక్తి సాయంతో రూమ్‌కు తీసుకు వెళ్ళాను.

రూమ్‌లో కూర్చుని అంతకుముందే మాధవరావుతో తెప్పించిన చిన్న చిన్న మైక్రోఫోన్స్ ఒక్కో చేప గిల్స్ (మొప్పలలో)లో అతి జాగ్రత్తగా పడిపోకుండా ఫిక్స్ చేసాను. పంచరంగుల చేపను మాత్రం రూమ్‌లోని చేపల తొట్టెలో ఉంచాను.

మైక్రోఫోన్స్ అమర్చిన పంథొమ్మిది చేపలను ఒక రెక్సిన్ సంచీలో వేసుకొని, తిరిగి మోటార్‌బోట్‌లోనే సముద్రంపైకి వెళ్ళాను.

ఎవరూ చూడకుండా ఏడెనిమిదిమైళ్ళకొక చేపను సముద్రంలోకి వదిలివేసాను.

తిరిగి రూమ్‌కు వచ్చేసరికి రాత్రి 10 గంటలు అయింది. డిన్నరు ముగించి, మైక్రోఫోన్ రిసీవర్సు వరుసగా పెట్టుకొని కూర్చున్నాను. అవి కేవలం మనుషులు సంచరిస్తే సంకేతం పంపుతాయి. ఈరోజు జాగారం అనుకుంటూ రూమ్‌లోని లైట్లు, తలుపులు మూసి రేడియంతో మెరుస్తున్న రిసీవర్స్ ముందు కూర్చున్నాను.

ఏయే నంబరు మైక్రోఫోన్ నానుండి ఏ దిశలో ఎంత దూరములో ఉందో కూడా ఆ రిసీవర్స్‌లో తెలిసిపోతుంది.

రాత్రి పన్నెండు, ఒకటి, రెండుకూడా గడిచిపోయింది. రెండున్నర ప్రాంతంలో నంబరు ఐదవ మైక్రోఫోన్‌నుండి మనిషి కదలికలను తెలిపే సంకేతాలు వచ్చాయి. సిగ్నల్ వచ్చిన దూరం, దిశ చూశాను. దాదాపు మైలుదూరంలో సముద్రపు ఒడ్డును చూపుతున్నది.

వెంటనే అక్కడికి పరుగెత్తాను. కాపలా వ్యక్తుల కాకీ యూనిఫాంకు బదులు ఆకుపచ్చని షర్ట్ కనబడింది. నేను అక్కడే ఉన్న పొద చాటున దాక్కున్నాను. గ్రీన్ షర్ట్ వ్యక్తి అప్పుడే సముద్రంనుండి పైకి వచ్చాడు. ఆక్సిజన్ సిలండర్ వీపుకు వేలాడుతూ ఉంది.

కొద్దిసేపటికి అతను ఒడ్డుకు చేరుకున్నాడు. షర్ట్‌కున్న బిగ్ ప్యాకెట్ నుండి తొందర తొందరగా ముత్యపు చిప్పలను తీసి అక్కడే ఉన్న ఒక బాక్స్‌లో వేస్తున్నాడు.

కొంతదూరంలో కాపలా వ్యక్తి స్పృహతప్పి క్రింద పడి ఉన్నాడు. కాపలా వ్యక్తి చేసే హెచ్చరికలు ఒక టేప్ రికార్డర్ కాపలావ్యక్తి గొంతుతో నిర్ణీత సమయాలలో చేస్తుంది.

ఇక నేను ఆలస్యం సహించలేకపోయాను. వెంటనే ముందుకు నడిచి రివాల్వర్‌తో వాడి యెదురుగా నిలుచున్నాను.

నల్లగా ఉన్న ఆ నీగ్రో నన్ను చూడగానే అదిరిపడ్డాడు. భయపడ్డట్టు నటిస్తూ, వెనక్కు తగ్గి వెంటనే రివాల్వర్ ఉన్న నా చేతిని పట్టుకొని జూడో పద్ధతిలో గాలిలోకి లేపి వదిలాడు నన్ను ఎంతో ప్రయత్నంమీద. దగ్గరలోనేపడ్డ నేను ఒక లాంగ్‌జంప్‌చేసి అదే ఊపులో వాడి పొట్టమీద కరాటే స్టయిల్‌లో దెబ్బవేశాను. ఆ కరాటే దెబ్బకు వాడు పొట్టపట్టుకొని అలాగే కూర్చుండిపోయాడు.

వాడు భయంగా ఏదో జపానీ భాషలో చెప్పసాగాడు. "ఇంగ్లీష్‌లో మాట్లాడు" గద్దించాను నేను.

"ప్లీజ్ దయచేసి నన్ను ప్రాణాలతో వదిలేయండి. నన్ను పట్టుకున్నా, చంపినా మీకు లాభంలేదు. నేను బానిసను. మీకేం కావాలో అడగండి చెప్తాను" అన్నాడు వాడు.

"అయితే ఈ పని నీతో చేయిస్తున్న దెవరు" అడిగాను నేను.

"అన్వర్ మియ్యా ఈ పని చేయిస్తున్నాడు. ఆయన ఈ సంవత్సరం ఆఖరులో తన స్వదేశమైన పాకిస్తానుకు వెళ్ళిపోతాడు. ఆలోగా చేతికి చిక్కినంత దోచుకపోవాలనుకున్నాడు. ఇప్పుడు మీరు నన్ను పట్టుకెళ్ళి అందరిలో చూపి నేను అన్వర్ మనిషినన్నా అతడు ఒప్పుకోడు. సరికదా నేను పట్టుబడిపోయానని నన్ను బ్రతకనివ్వడు.

మేము ఈ ముత్యపు చిప్పలను రహస్యంగా ఉంచే ప్రదేశాన్ని మీకు చెప్తాను. అక్కడే అన్వర్ మిగతా అను

చరులు ఎన్నో కోట్ల నల్లధనం మీకు లభిస్తుంది. నన్ను బానిసను చేసిన అన్వర్‌పై నా పగకూడా తీరుతుంది" చెప్పి ఊపిరి పీల్చుకున్నాడు వాడు.

"కానీ మీరు అన్వర్ ధనాన్ని అనుచరులను పట్టుకున్నా కూడా ఆ ధనం, ఆ మనుషులు తనవారు కాదని, తనవి కావని బుకాయించొచ్చు అన్వర్. కాబట్టి అన్వర్ నోటి నుండే ఎలాగైనా అతనే ముత్యపు చిప్పల దొంగతనానికి కారకుడని చెప్పివ్వండి. తర్వాత అతని ధనాన్ని పట్టు కోండి" స్నేహపూర్వకంగా చెప్పాడా నీగ్రో యువకుడు.

"ఆల్‌రైట్! నిన్ను కొట్టినందుకు వెరీవెరీ సారీ" అని చెప్పాను నేను.

"ఏం ఫర్వాలేదులెండి" అని రహస్య స్థావరం యొక్క అడ్రస్ చెప్పి, ముత్యపు చిప్పల బాక్స్ పట్టుకొని చీకటిలో కలసిపోయాడా వ్యక్తి.

4

అన్వర్ నోటితో తానే దోషినని ఎలా చెప్పించడమా, అని ఆలోచిస్తూ నా గదిలో పచార్లు చేయసాగాను. ఎదురుగా 'ఫిష్ ఎక్వ్యేరియమ్'లోని పంచరంగుల చేప కనులకింపుగా కనబడుతోంది.

వెంటనే నాకో ఆలోచన తట్టింది. ఆరోజు ఉదయం పదకొండుగంటలవరకు హాయిగా పడుకున్నాను.

11 గంటలకు లేచి, బ్రేక్‌ఫాస్ట్ కావించి, తలుపులు దగ్గరగా వేశాను. పంచరంగుల చేపను ఒక గ్లాస్‌జార్‌లోకి తీసుకొని, దానికి పిప్పరమెంట్ లిక్విడ్‌ను అలవాటు చేస్తుండిపోయాను.

మర్నాటికి ఆ చేప ఎంత బాగా అలవాటయిదంటే అది

నీటిలో ఎక్కడనైనా వుండనీ కొంచెం పిప్పర్‌మెంట్ వాసన తగలగానే టక్కున అక్కడకు వచ్చేస్తుంది. అంత బాగా అలవాటయింది. మనుషులంటే దానికి పూర్తిగా బెదురుపోయింది. హాయిగా నిట్టూర్చాను నేను.

తెల్లవారగానే ఆఫీసుకెళ్ళి నా దగ్గర ఒక మ్యాజిక్ చేప ఉందని, అది దొంగతనాలు చేసేవారిని ఇట్టే పట్టేస్తుందని, ముత్యాపు చిప్పల దొంగను పట్టుకోవడానికి దానిద్వారా నేను మీకు సహాయపడాలనుకుంటున్నానని, చెప్పాను. మాధవరావుతో సహా అందరూ ఆశ్చర్యంతో 'సరే' నన్నారు.

అన్వర్ ముఖంలో ఏవో భావాలు కదిలిపోయాయి. నా మ్యాజిక్‌ను సాయంత్రం చేస్తానని, అందరినీ రెడీగా వుంచమని చెప్పి. క్రిందికి వచ్చాను.

4 గంటల ప్రాంతంలో వేలికి పెట్టుకొనే తొడుగుల్లాంటి వాటిని తీసుకొని ఆఫీసుకు వెళ్ళాను. అక్కడ కాపలా వాళ్ళతో సహా అందరి వేళ్ళకు వాటిని తొడిగాను. వాళ్ళలో నిన్నటి నీగ్రో కూడా ఉండటం చూసి ఆశ్చర్యపోయాను. వాడి వేలికి కూడా తొడుగు తొడిగి కళ్ళతోనే నవ్వాను. వాడు ఏ భావాలు ప్రదర్శించలేదు.

ఒక పెద్ద గాజుజాడిలో నా పంచరంగుల చేపనుంచి, అందరి తొడుగు ఉన్న వేళ్ళను అందులో పెట్టిస్తూ వచ్చాను. నీగ్రో వ్యక్తి అందులో వేలు పెట్టినపుడు అన్వర్ బాగా ముందుకు వంగి వంగి ఎంతోఆందోళనగా చూశాడు.

నా చేప ఎవరి వ్రేలివద్దకూ రాలేదు. అది చూసి అన్వర్ ఒక నిట్టూర్పు విడిచాడు. అది గమనించి నేను నవ్వుకున్నాను. అందరూ అయిపోయారు. వాళ్ళను వెళ్ళిపొమ్మని చెప్పి పంపించివేశాను.

5

"అయితే మనవాళ్ళలో ఎవ్వరూ దొంగలు లేరన్నమాట" నవ్వుముఖంతో అడిగాడు అన్వర్ మియ్యా.

"ఆఁ అంతే. కానీ మీ నలుగురూ కూడా ఇందులో తొడుగులతో వేళ్ళుంచుతారనుకుంటాను...." అన్నాను తాపీగా.

"వాట్ ఈస్ నాన్‌సెన్స్! అయితే నువ్వనేది ఏమిటీ? మా సొమ్మును మేమే దొంగిలిస్తున్నామంటావా?" కోపంగా అడిగాడు అన్వర్.

"నో, నో, అలా నే ననలేదే. ఊరికే అడిగాను. మీ యిష్టం," అన్నాన్నేను.

అన్వర్ తప్ప మిగతా ముగ్గురు "సరే, ఆ తొడుగు లివ్వండి" అన్నారు.

సీగ్రోవాడ్ని ఆ చేప వదిలిందికదా ఇందులో ఏమి మ్యాజిక్కూ గీజిక్కూ లేదనే ధైర్యంతో చివరికి అన్వర్ కూడా ఒప్పుకున్నాడు.

మాధవరావు, కణ్ణన్, కొకురియన్‌లు చేతులుంచినపుడు దగ్గరకు కూడా రాని చేప అన్వర్‌మియా జాడిలో వేలుంచ గానే టక్కున వచ్చి వేలును పట్టుకుంది. అతడు తొడు క్కున చేతి తొడుగుకు పిప్పరమెంట్ లిక్విడ్ రాశానని ఎవరికీ తెలియదు.

"నో, నో, ఇదేదో మోసంగా ఉంది. లేకపోతే నా అనుచరుడైన సీగ్రోను వదిలి నన్ను మాత్రం ఎలా పట్టు కుంది ఈ దొంగచేప. వాడుకూడా దొంగే కదా!" అని అరిచాడు అన్వర్ మియ్యా.

అంతకుముందే నాచేత ఆన్ చేయబడి వున్న టేప్

రికార్డర్ అన్వర్ అరచిన మాటలను తనలో ఇముడ్చు కొంది.

తను అరచిన మాటలను గ్రహించి, జేబులోనుండి చటుక్కున రివాల్వర్‌ను తీసి, మా నల్గురిని బెదిరిస్తూ తలుపువైపు అడుగులు వేయసాగాడు అన్వర్.

టేబుల్ పైన ఉన్న నా ప్రియమైన చేపగల గాజుజాడి నందుకొని అన్వర్ చేతిపైకి విసిరాను బలంగా. గాజుజాడి తగిలి అన్వర్ చేతిలోని రివాల్వర్ దూరంగా పడిపోవడం, పోలీసులు లోనికి రావడం ఒకేసారి జరిగింది.

గాజుజాడి పగిలి కిందపడి కొట్టుకుంటున్న నా ప్రియమైన చేపను వెంటనే తీసి టేబుల్ పైన ఉన్న నీళ్ళగ్లాస్‌లో వేశాను.

నా ఇన్‌ఫర్‌మేషన్ ప్రకారం, అన్వర్ స్థావరాన్ని వశ పరుచుకొని, తిరిగి సమయానికి ఆఫీసుకు చేరిన ఇన్ స్పెక్టర్‌కు అభినందనలు తెలియచేశాను నేను.

అన్వర్‌లాంటి ద్రోహులను పట్టిచ్చి, అనేకకోట్ల నల్ల ధనాన్ని పట్టిచ్చినందుకుగాను ఎంతో ఎంతో అభినందించాడు నన్ను ఆ ఇన్‌స్పెక్టర్.

***

"డబ్బులున్న వాళ్ళకే దేవుడు కనబడతాడ టండీ!"

"అయితే మనకు కనబడ్డా?"

"అంటే మీ దగ్గర డబ్బులేదన్న మాటేగా?"

"లేదు."

"అయితే వస్తా...టయిం వేస్టు!"

—ఆడారి వెంకటరమణ, యలమంచిలి.

గురువు చెప్పని శిష్యుడు!

వై. రాజేశ్వరి

అతను జంక్షన్‌లో నిలబడి సిగరెట్ కాలుస్తున్నాడు. అతని చేతిలోని సిగరెట్ ఎర్రగా కాలుతోంది. అతని ఎర్ర జీరల కళ్ళు ఒక యింటిని నిశితంగా పరికిస్తున్నాయి.

ఆ ఇంటి గేటుకి ఎడమ ప్రక్కనున్న బోర్డు, ఆ ఇంట్లో రిటైర్డు స్కూల్ టీచరు జి. వి. వి. సుందర్రామయ్యగారు వుంటున్నారని చెపుతోంది. ఆ గేటుకి కుడి ప్రక్క మరో నేమ్ ప్లేట్ వుంది. దాని మీద జి. వి. వరప్రసాద్, బ్యాంకాఫ్ ఇండియా అని ఇంగ్లీషులో చెక్కబడి వుంది.

వాచీ చూసుకొన్నాడతను. తొమ్మిదిన్నర అవుతోంది. "టైమయ్యింది" అనుకొన్నాడు.

గేటు తీస్తున్న అలికిడి అయ్యింది.

సిగరెట్ దమ్ములాగి, యాష్ జేబులో దులుపుకుని బాగా వెనక్కు తిరిగి నిలబడ్డాడు అతను. ఆ ఇంటికి అతనికి మధ్యన ఒక తురాయి చెట్టు వుంది. ఆ ఇంటి గేటు దగ్గ

ర్నుంచి ప్రత్యేకించి అతను నిలుచున్న వేపు చూస్తే, అతని వీపు సగ భాగం మాత్రం కనిపిస్తుంది.

"వెళ్ళొస్తాను నాన్నా!"

"శుభం! క్షేమంగా వెళ్ళిరా నాయనా!"

మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

గేటు కిర్రుమని శబ్దం చేసింది.

మరి కొద్దిసేపు ఆగి, మెడ మీదినించి వెనక్కి తిరిగి చూసాడు అతను. మలుపు తిరిగి పోతున్న వ్యక్తి ఆచివర్న కనిపించాడు.

కాలు వెనక్కి మడిచి, చెప్పు మడమపై నుసి వేసి రాసి, జేబులో పడేసుకున్నాడు.

మెల్లగా ఆ ఇంటి వైపు నడిచాడు అతను. గ్లోవ్స్ తీసి చేతులకు తొడుక్కున్నాడు. గేటు తీసుకొని లోనికి వెళ్ళాడు. బజర్ నొక్కాడు, నిర్మానుష్యంగా వుంది.

విసిరి పారేసినట్టు దూర దూరంగా వున్నాయి ఇళ్ళు.

తలుపులు తెరుచుకొన్నాయి.

"నమస్కారం మాష్టారూ!" వినయం వుట్టిపడేలాగ అన్నాడు.

"నమస్కారం....ఎవరు బాబూ?" తలుపు తీసిన ముసలాయన కనుపాపలు వింతగా కదిలాయి. కనురెప్పలు కొట్టుకొన్నాయి.

ఆయన పేరు సుందర్రామయ్య. రిటైర్డు స్కూల్ టీచర్. కంటి చూపు లేదాయనకు.

"అబ్బాయి యిప్పుడే బేంకుకు వెళ్ళిపోయాడు."

"నేను మీ అబ్బాయి కోసం రాలేదు మాష్టారూ....మీ కోసమే వచ్చాను."

"నా కోసమా!" చూపులేని ఆయన కన్నులలో ఆశ్చర్యం తొంగి చూసింది.

"అవును మాష్టారూ....మీ కోసమే. నేను సుందరాన్ని మీ దగ్గర చిన్నప్పుడు చదువుకొన్నాను. అమ్మని వాళ్ళని చూద్దామని శెలవు మీద ఈ వూరు వచ్చాను, మిమ్మల్నొక సారి చూసి పోదామని ఇలా వచ్చాను."

"రా బాబూ....లోపలకు రా! ఆఁ....నీ పేరేమిటన్నావ్ సుందరమా?" మాట్లాడుతూ లోనికి నడిచారు సుందర్రామయ్యగారు.

అసలు, సుందర్రామయ్యగారికి ఈ సుందర మెవరో గుర్తు రాలేదు. అతను ఎందరికో చదువు చెప్పారు. అందులో ఎవరో ఏమిటో!

తలుపు లోపల గడియవేసి, ఆయన్ని అనుసరిస్తూ ఒక సారి హాలు నంతటినీ పరిశీలించాడు ఆ వ్యక్తి.

"ఈ హాలులో విలువైనవేమీ లేవు" అనుకొన్నాడు.

ఆ వ్యక్తి పేరు విజయవాడ పోలీసు రికార్డు ప్రకారం కే. డి. భాస్కరం. దొంగతనం అతని వృత్తి. అందులో పెద్దమనిషి తరహా అతని ప్రత్యేకత. విజయవాడ వదలి ఈ వూరు వచ్చి ఆర్నెల్లవుతోంది. ఏ వూళ్ళోను ఎక్కువ కాలం వుండడు.

భాస్కరం ఇంకెవరితోను చేతులు కలపడు. తాను ఒక్కడే వెళ్తాడు. పని పూర్తి చేసుకొని వచ్చేస్తాడు. ఏ రెండు ఇళ్ళలోను ఒకరకంగా దొంగతనం చేసే పొరపాటు చెయ్యలేదు.

ఒకసారి నూతిలో మన్ను తీసేవాడిగా వెళ్ళి, ఆ ఇంట్లోని మనుష్యులని బెదిరించి దోచుకొంటే, మరొక మారు మీటర్ రీడింగ్ చేసుకొనేవాడిలాగ వెళ్ళాడు.

దేనికీ తొందరపడడు. నిదానంగా, అన్నీ కూలంకషంగా పరిశీలించి ముందుగానే వేసుకొన్న ప్రణాళిక ప్రకారం పని జరుపుకొస్తాడు. అందుకే సాధారణంగా దొరకడు.

రెండు రోజుల క్రితం సుందర్రామయ్యగారింటికి ఇల్లు అద్దెకు కావాలనే మిషతో వచ్చాడు. ఆ ఇంటి పరిస్థితులన్నీ ఆకళింపు చేసుకొన్నాడు.

సుందర్రామయ్యగారు రిటైరైన స్కూల్ టీచర్. రైలు ప్రమాదంలో కంటి నరాలు దెబ్బతినటంతో ఆయన చూపు పోయింది. ఆ ప్రమాదంలోనే ఒక కాలు కూడా పోగొట్టుకున్నాడు.. అతనికి ఒక్కడే కొడుకు. పేరు వరప్రసాదరావు.

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నాడు.

వరప్రసాదరావుకి పెళ్ళి అయింది. అతని భార్య పురిటికి వెళ్ళింది. అయిదేళ్ళ కొడుకుని కూడా తీసికెళ్ళింది. మరొక మూడు నెలల వరకు రాదు.

వరప్రసాదరావు పొద్దున్నే వండేస్తాడు. తన కారేజీ సర్దేసుకొని రడీగా వుంచేస్తాడు. మిగిలినవన్నీ మరో కారేజీలో సర్దేసి డైనింగ్ టేబుల్‌పైనే వుంచేస్తాడు. అది తండ్రి కోసం.

టిఫిన్ తిని తొమ్మిదిన్నరకు బయలుదేరుతాడు వరప్రసాదరావు. సుందర్రామయ్యగారు టిఫిన్ తినరు.

చూపు పోయినా, సుందర్రామయ్యగారు ఇంట్లో అలవాటు ప్రకారం నడుస్తూ చిన్న చిన్న పనులు చేసుకోగలరు. సాయంత్రం ఇంటి కొచ్చి వరప్రసాదరావు మిగిలిన పనులు చూసుకొంటాడు.

"కూర్చో బాబూ...." సోఫా వైపు చేయి చూపిస్తూ అన్నారు సుందర్రామయ్యగారు. కూర్చున్నాడు. అతనికి చూపు లేదంటే నమ్మబుద్ధి కావటం లేదు భాస్కరానికి. కాని స్వయంగా తన కళ్ళతో చూస్తున్నాడు కాబట్టి నమ్మాడు.

పొద్దున్న తొమ్మిదిన్నర దగ్గర నుంచి సాయంత్రం అయిదున్నర వరకు ఒంటరిగానే వుంటారు సుందర రామయ్యగారు ఆ లంకంత కొంపలో.

మధ్యలో పదిం పావు, పదిన్నర మధ్యన పాలవాడు వచ్చి పాలుపోస్తాడు. పదకొండున్నరకి కేరేజి మనిషి వస్తుంది. ఉత్తరాలు ఏమైనా వుంటే పోస్టుమేను కూడా ఆ సమయంలో వస్తాడు. మధ్యాహ్నం మూడు గంటలకి కేరేజి మనిషి వచ్చి ఖాళీ కేరేజి ఇచ్చి వెళ్ళిపోతుంది. అయిదున్నరకి వరప్రసాదరావు వస్తాడు.

అనుకూలమైన సమయంలో వచ్చి ఆ ఇల్లు దోచుకోవటానికి ప్రణాళిక వేసుకొన్నాడు భాస్కరం. ఇప్పుడు ఆ పని మీదనే వచ్చాడు.

2

"ఏమిటో....వయసు మీదపడి ముసలితనం ఎక్కువ అవుతున్నకొద్దీ జ్ఞాపకశక్తి మరీ తగ్గిపోతోంది" నొచ్చుకొంటూ అని, "నువ్వు ఏ సంవత్సరం చదివానన్నావు బాబూ నా దగ్గర?" అంటూ అడిగారు సుందర్రామయ్య గారు....

"ఫోర్తుఫారంలోనండి" తడుముకోకుండా ఠక్కున సమాధాన మిచ్చాడు భాస్కరం.

రెండు రోజుల క్రితం అద్దె యిల్లు నెపం మీద వచ్చి

నపుడు ఎక్కువగా మాట్లాడటం అలవాటున్న సుందర్రామయ్యగారు చాలా విషయాలు చెప్పారు భాస్కరానికి. అంచేత కొద్ది తెలివి వుపయోగిస్తే సుందర్రామయ్యగారి ప్రశ్నలకు సమాధానం యివ్వటం అంత కష్టమైన పని ఏమీ కాదు.

"ఫోర్తు ఫారం 'ఏ' సెక్షనా? 'బి' నా?"

" "బి" సెక్షనండి" డ్రాయింగు రూమ్‌లోని వస్తువులకు ఉజ్జాయింపుగా వెల కట్టుకుంటూ జవాబిచ్చాడు భాస్కరం.

" 'బి' సెక్షనా? అంటే బికి నేను సైన్స్ కొచ్చేవాడినా? లెక్కల కొచ్చేవాడినా చెప్మా?" సాలోచనగా పైకి అనుకొన్నారు సుందర్రామయ్యగారు.

గదిని పరిశీలించటంలో పడిన భాస్కరం సుందర్రామయ్యగారి మొహంలో మారుతున్న భావాలు గమనించ లేదు.

"లెక్కల కొచ్చేవారండీ! అప్పుడు నేను లెక్కల్లో చాలా పూర్, మీరు స్పెషల్ కేర్ తీసుకొని చెప్పబట్టి అవంటే నాకు భయంతీరి, ఈనాటికి ఇంతవాడి నయ్యాను. ఇదంతా మీ చలవే. అందుకే మీ రెప్పుడూ గుర్తుంటారు నాకు."

సుందర్రామయ్యగారికి వెన్నులోంచి ఏదో పాకినట్టు అనిపించింది. ఒళ్ళు జలదరించింది. శరీరం రోమాంచితమైంది.

కళ్ళు భయంతో విల విలలాడాయి.

తాను కళ్ళు లేని అంధుడు.

అవతలి వ్యక్తి కళ్ళున్నవాడు.

మనసులోని భావాలు ప్రస్ఫుటమవకుండా నిగ్రహించు

కొన్నారు సుందరామయ్యగారు.

"అనుమానం లేదు. వీడెవడో తన శిష్యుడు మాత్రం కాదు. దొంగ వెధవే అయుండాలి. ఏ వుద్దేశంతో వచ్చాడో తెలియదు. కాని మోసం చెయ్యటానికి మాత్రం వచ్చాడు" అనే నిర్ధారణకు రాగలిగారు సుందరామయ్యగారు.

భాస్కరం తలుపు గడియవేసి తనను అనుసరిస్తున్న ఆ చెప్పులు చేసిన సన్నని ధ్వని విన్నప్పుడే అనుమానం కలిగింది సుందరామయ్యగారికి. ఆ ధ్వని • ఎప్పుడో, ఎక్కడో విన్నట్టు అనిపించింది ఆయన సునిశితమైన పరిశీలనా శక్తికి. ఎక్కడ విన్నాడో మాత్రం కొంత సేపు గుర్తు రాలేదు.

భాస్కరం మరి కొంతసేపు మాట్లాడేక ఒకటి రెండు ఉచ్చారణా దోషాలు విన్నాక గుర్తు కొచ్చింది, ఈ వ్యక్తి రెండు రోజుల క్రితం తమ ఇంట్లో ఖాళీగా వున్న వాటా చూడటానికి వచ్చినవాడని. గొంతు మాత్రం అది కాదు. ఆ రోజు గొంతు మార్చి వుండాలి.

ఇంట్లో అడవాళ్ళ వుద్దేశం కనుక్కొని మర్నాడు వచ్చి ఏ సంగతీ చెప్తానంటూ వెళ్ళిపోయిన పెద్దమనిషి, మళ్ళీ యీ నాడు "మీ పాత స్టూడెంటునండీ" అంటూ మరొక అవతారం ఎందుకు ఎత్తాడా అనే సందేహం కలిగింది సుందరామయ్య గారికి.

తన సందేహం సరియయినది అవునో కాదో నిర్ధారణ చేసుకొన్నారు సుందరామయ్యగారు. ఆయన సోషల్‌స్టడీస్ టీచరు. లెక్కలు, సైన్స్ ఎప్పుడూ చెప్పలేదు. వచ్చిన వాడు నిజమయిన పాత స్టూడెంటే అయితే "ఇదేమిటి మాస్టారూ, ఇలా అడుగుతున్నారు!" అని ప్రశ్నించేవాడే.

సుందర్రామయ్యగారు ఆలోచనలో పడ్డారు. ఈ ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవటమా అని ఆలోచిస్తున్నారు ఆయన.

పది గంటలలోగా తొందరపడదలుచుకోలేదు భాస్కరం. వరప్రసాదరావు ఏదయినా మరచిపోయి వుంటే ఇంటికి తిరిగిరావటానికి అవకాశం వుంది. పది దాటాక రావటానికి అవకాశం తక్కువ.

సుందర్రామయ్యగారు తన మామూలు ధోరణిలో మాట్లాడుకుపోతున్నారు. భాస్కరం తెలివిగా జవాబులు చెప్పుకొంటూ గడుపుకొస్తున్నాడు.

మాటల మధ్యలో లేచి రేడియో ఆన్ చేసాడు, భాస్కరం, ఏదో ప్రోగ్రాం వస్తూంది. లో వాయిస్‌లో వుంచాడు.

"సుందరం....సరిగ్గా సమయానికి దేముడిలా వచ్చావోయ్" వున్నట్టుండి అన్నారు సుందర్రామయ్యగారు.

"ఏమండీ?" ప్రశ్నార్థకంగా అడిగాడు భాస్కరం.

"నువ్వు మరోకలాగ అనుకోనంటే చిన్న సహాయం చేసి పెట్టాలి."

"చెప్పండి."

"మా కోడలుంటే అదే చూసుకొనేది ఈ విషయాలన్నీ కాని ఇవాళ నీకు శ్రమ ఇవ్వక తప్పటం లేదు."

"చెప్పండి మాష్టారూ ఫర్వాలేదు. మీకు వుపయోగ పడటంకంటే నాకు కావల్సింది ఏమిటి వుంటుంది?"

ఒక్క క్షణం సందేహిస్తున్నట్టుగా ఆగారు సుందర్రామయ్యగారు.

"మరేమీ లేదు, ఇవాళ సాయంత్రం నాలుగు గంటలకి

నర్సిహం అని మాకు తెల్సినాయన వస్తాడు. డబ్బు తెస్తాడు. అది లెక్కపెట్టి జాగ్రత్తగా తీసుకోవాలి. లేక పోతే ఈ రోజులలో ఎవర్నీ నమ్మలేం కదోయ్. వాడు తక్కువ ఇచ్చినా గట్టిగా పైకి చెప్పుకోలేని పరిస్థితి నాది.

మా అబ్బాయికి యిటువంటివి ఇష్టం వుండవు. అయినా ఇది ఏమంత కాని పని కనుక! ఎక్కువ వడ్డీలకు డబ్బు అప్పు యివ్వటం తప్పు అంటాడు మా అబ్బాయి. మధ్యన మన దేముంది? వాళ్ళ అవసరాన్ని బట్టి ఆ వడ్డీకి యిష్టపడే తీసుకుంటారు. ఎంత నచ్చ చెప్పినా వాడు ససేమిరా అంటాడు. అంచేత మా వాడికి తెలియకుండానే నడుపుకు వస్తున్నాం నేను, మా కోడలు పిల్లాను."

గుక్క కోసం ఆగారు సుందర్రామయ్యగారు. ఒక్క క్షణం ఆగి మళ్ళీ చెప్పసాగారు.

భాస్కరం జాగ్రత్తగా వింటున్నాడు.

"ఆ నర్సింహం ఒక బాపతు మొత్తం యివాళ యిచ్చేస్తానని కబురు చేశాడు. ఎలాగరా భగవంతుడా అని ఆలోచిస్తూ వుంటే సమయానికి దేమునిలాగ నువ్వు ప్రత్యక్షమయ్యావు. బాబ్బాబు....ఈ పూటకు ఇక్కడే భోంచేసి, మధ్యాహ్నం వుండిపోయి, ఐదు వేలు జాగ్రత్తగా లెక్కపెట్టి తీసుకొని ఇస్తే, నాకు ఎంతో వుపకారం చేసినవాడి వవుతావు."

సుందర్రామయ్యగారు భాస్కరం కోసం తడుముకొంటూ వేడికోలుగా అన్నారు.

భాస్కరం ఆనందంతో ఒక్క క్షణం తబ్బిబ్బు అయిపోయాడు. అనుకోని అదృష్టం కలిసివస్తోంది మరి. ఆనందాన్ని పక్కకి నెట్టి జాగ్రత్తగా ఆలోచించాడు.

ఈ సుందర్రామయ్యగారి అబ్బాయి యింటికి చేరేసరికి ఎలాగూ అయిదున్నర అవుతుంది. ఈలోగా దొరికినంత మట్టుకు అంతా సేకరించి మూట ముల్లె సర్దేసుకుని సిద్ధంగా వుంటే, ఆ నర్సింహం అనుకున్న సమయానికి వచ్చాడా సరే సరి. లేకపోతే అయిదు గంటలవరకు వేచి చూసి అప్పుడే వుడాయించెయ్యవచ్చును. చెడిపోయింది ఏమీ లేదు.

ఆ ఆలోచనతోనే, "ఎంత మాట మాష్టారూ. తప్ప కుండా అలాగే చేస్తాను....మీరు ఆజ్ఞాపించాలి కాని, యిలా బతిమాలుకోవటం మీకు ధర్మం కాదు...." గ్లోవ్స్ తీసిన చేతితో సుందర్రామయ్యగారి చేతులు మృదువుగా నొక్కుతూ అన్నాడు భాస్కరం.

గుండెల మీద నుంచి ఒక పెద్ద బరువు దిగినట్టు పెద్దగా శ్వాస వదిలారు సుందర్రామయ్యగారు.

భాస్కరాన్ని యిలా బ్రతిమాలటంలో సుందర్రామయ్య గారి వుద్దేశం వేరుగా వుంది. నాలుగు గంటలవరకు ఈ ఆగంతకుని వుంచగలిగితే, యీలోపల ఎవరో ఒకరు సహా యానికి రావచ్చునని సుందర్రామయ్యగారి ధైర్యం. అందుకే అబద్ధం ఆడారు.

3

బజర్ వినిపించింది.

భాస్కరం వైపు చూసాడు.

"పాలవాడు వచ్చినట్టున్నాడు. ఇప్పుడే వస్తానుండు" సుందర్రామయ్యగారు సోఫాలోంచి లేవబోయారు.

"మీ కెందుకు మాష్టారూ శ్రమ-నేను తెస్తానుండండి" లేవబోతున్న సుందర్రామయ్యగారిని బలవంతాన సోఫాలో కూర్చోబెట్టాడు భాస్కరం,

సుందర్రామయ్యగారి ప్రక్కగా వున్న చేతికర్రలు తీసి బాగా దూరంగా పెట్టాడు. మొహాన్ని సగ భాగం కప్పు తున్నాయా అన్నంత పెద్దవిగా ఉన్న డార్క్ బ్లూ కూలింగ్ గ్లాసెస్ పెట్టుకొన్నాడు. రేడియో వాల్యూమ్ పెంచాడు. వంటింట్లోని ఖాళీ గిన్నె తీసుకొని పాలు తేవటానికి వెళ్ళి పోయాడు. వెళుతూ వెళుతూ గ్లోవ్స్ తీసి జేబులో పడేసు కున్నాడు.

భాస్కరాన్ని అటు వెళ్ళనిచ్చి చేతి కర్ర కోసం వెతు క్కున్నారు సుందర్రామయ్యగారు. అవి దొరక లేదు. అతని గుండెలు జారిపోయాయి. అరవై ఎనిమిదేళ్ళ సుందర్రామయ్యగారికి, ఆ వయస్సులో తన నిస్సహాయ పరిస్థితి తలుచుకుంటే ఏడుపు ముంచుకొచ్చింది. పళ్ళ బిగువున నిగ్రహించుకొన్నారు.

సుందరం వెనకాతలే వెళ్ళి పాలవాడి సహాయం తీసు కొందామనుకొన్న ఆయన ఆలోచన వీలుకాలేదు. 'తాను వున్న చోటునుంచి గట్టిగా అరిచినా ప్రయోజనం లేదు. తన గొంతు ఆ రేడియో రొదలో అంతదూరం వినిపించక పోవచ్చు. మీదుమిక్కిలి తన మోసం గ్రహించినట్టు తెలిస్తే ఆ సుందరం ఏదైనా ప్రమాదం తలపెట్టవచ్చు.'

సుందర్రామయ్యగారు ఆలోచిస్తున్నారు.

"మాష్టారూ.... పాలు మరగబెట్టెయ్య మంటారా?" అంటూ వచ్చాడు భాస్కరం.

"నీ కెందుకు బాబూ ఆ శ్రమకూడా ...."సుందర్రామయ్య గారు లేవబోయారు.

"అమ్మమ్మమ్మ .... ఎంతమాట? కూర్చోండి. శ్రమ కేముంది?" అంటూ ఆయన్ని వారించి "అరే! వోల్టేజి

ఎక్కువైనట్టుంది. రేడియో వాల్యూమ్ పెరిగింది" అంటూ వాల్యూమ్‌ను తిరిగి తగ్గించాడు భాస్కరం.

చేసేదిలేక అవకాశంకోసం వేచి కూర్చున్నారు సుందర్రామయ్యగారు.

పాలగిన్నెని శుభ్రంగా తుడిచి వేలిముద్రలు మిగలకుండా చేసాడు భాస్కరం. రేడియో నాబ్ కూడా తుడిచాడు. గ్లోవ్స్ వేసేసుకొన్నాడు. కళ్ళజోడు జేబులో పెట్టుకొని పాలు కాచి గూట్లో పెట్టాడు. వంటింట్లో టేబిల్‌పైన భోజనం వడ్డించేసాడు.

"వడ్డించేసాను. రండి మాష్టారూ" అంటూ పిలిచాడు భాస్కరం.

సుందర్రామయ్యగారు చేతికర్రల కోసం తడుముకొన్నారు.

"ఇదుగోండి మాష్టారూ....ఇవి ఇటుపక్క వారిగిపోయి పడివున్నాయి" అంటూ దూరంగా వుంచిన చేతికర్రలని అందించాడు భాస్కరం.

"ఏమిటోనోయ్ సుందరం! ఇంటికొచ్చిన వాడివి. నీకు మర్యాదలు చెయ్యవల్సింది పోయి, నీచేత పనులు చేయించుకొంటున్నాను" బాధపడుతున్నట్టుగా అన్నారు సుందర్రామయ్యగారు.

"ఎంతమాట మాష్టారూ? మీకు మీ అబ్బాయి ఒకటి, నేను ఒకటీనా?" అంటూ సుందర్రామయ్యగారికి గ్లోవ్స్ తీసిన చేయి ఆసరా ఇచ్చి నడిపించుకొంటూ తీసికెళ్ళాడు భాస్కరం.

గడియారం ఒక గంటకొట్టింది.

టైము పదిన్నర అయింది.

ఎన్నెన్నో ఆలోచనలు వస్తున్నాయి సుందర్రామయ్య గారికి. కాఫీ కలిపి అందులో తను స్లీపింగ్ పిల్సు పడేసి ఇవ్వవచ్చు. వాసన, రుచి పసిగట్టిస్తాడేమో! రహస్యంగా ఒక ఉత్తరం వ్రాసి కొడుకు కేరేజికాడ క్రిందపెట్టి పంప వచ్చు. కొడుకు గదిలోకి రహస్యంగా వెళ్ళి అక్కడనించి బేంకుకి ఫోన్ చెయ్యవచ్చు. ఏమైనా చెయ్యవచ్చుకాని, ఆ దుష్టుని కళ్ళలో తన ప్రయత్నం పడితే వాడు దేనికైనా తెగిస్తాడు.

ఏవేవో మాటలు దొర్లిపోతున్నాయి. వాతావరణం అతి సహజంగా వుంది.

ఇరవై నిమిషాలలో భోజనాలు పూర్తి అయ్యాయి. గిన్నెలన్నీ ఒక వారగా సర్దేసి, భాస్కరం సుందర్రామయ్య గారు వంటింటి బయటకు వచ్చారు.

"కొంతసేపు మా అబ్బాయి మంచంమీద అలా నడుం వాల్చు బాబూ. నేను ఇక్కడ సోఫామీద నిద్ర తీస్తాను" భాస్కరంతో అన్నారు సుందర్రామయ్యగారు.

అది వరప్రసాదరావు పడకగది. దానికి వున్నది ఒకటే ద్వారం.

"అబ్బే....నాకు మధ్యాహ్నంపూట నిద్ర పట్టదు మాస్టారూ. మీరే ఆ గదిలో పడుకోండి. నేను ఇక్కడ కూర్చొని పుస్తకం చదువుకొంటాను."

"నాకు ఆ గదిలో నిద్దర రాదోయ్ సుందరం. నాకు ఫేను గాలి పడదు. ఆ గదిలో వుక్కవలన నిద్రపట్టదు. అంచేత నేను యెప్పుడూ ఇదుగో ఈ సోఫామీదనే పడు కొంటాను. ఆఁ....అన్నట్టు నీకు చెక్క వేసుకొనే అల వాటుందా?"

"లేదు మాష్టారూ."

"పోనీలే....బుద్ధిమంతుడివి. అక్కడ మావాడి మంచానికి తలవైపున వున్న అలమార్లో చెక్క డబ్బా వుంది. శ్రమ అనుకోక కొంచెం అందుకొంటావూ?" అతి మామూలుగా అడిగారు సుందర్రామయ్యగారు.

ఎలాగయినా అతన్ని ఆ గదిలోకి పంపి తలుపు గడియ వేసేద్దామని సుందర్రామయ్యగారి తాపత్రయం.

భాస్కరానికి అనుమానం ఏమీ కలగలేదు. గదిలోకి వెళ్ళాడు. వెనుకగా వెళ్ళిన సుందర్రామయ్యగారు వెంటనే తలుపులు వేసెయ్యబోయారు.

పాపం! ఆయన తడుముకోవటంలో రెప్పపాటు కాలం ఆలశ్యం అయింది.

అనుమానం వచ్చి వెనక్కి తిరిగిచూసిన భాస్కరం మెరుపులాగ వెనక్కి వచ్చి కాలు అడ్డం పెట్టాడు.

భయంతో సుందర్రామయ్యగారు వెనుగులాడారు.

4

భాస్కరం పళ్ళు కటకటలాడాయి. కోపంగా చేయి విసిరాడు. సుందరామయ్యగారి చెంప ఛెళ్ళుమంది. అతని గుండెలమీద చేయివేసి ఒక్కతోపు తోసాడు భాస్కరం.

ఆ వూపుకి తుళ్ళి సోఫాపక్కన నేలమీద కూలబడ్డారు సుందర్రామయ్యగారు. అతని తల గోడకి గుద్దుకుంది. అంతవరకు అణచిపెట్టుకున్న భయం వుప్పెనలాగ బయట పడి జీవంలేని కళ్ళలో ప్రతిబింబించింది. సుందర్రామయ్యగారి కళ్ళంట నీళ్ళు జలజల రాలాయి. ఆయన తలకి గాయం అయి రక్తం మెల్లగా పైకి వుబికి రాసాగింది.

"అయితే గ్రహించేశారన్నమాట. శెహబాష్. ఇంత

సేపూ చక్కగా నటిస్తూ అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు అన్నమాట. రైట్ ...యింక నేను త్వరపడాలి."

భాస్కరం సుందర్రామయ్యగారి దగ్గరకొచ్చి రెక్క పట్టుకుని లేవదీశాడు. భయంతో గడగడలాడసాగారు సుందర్రామయ్యగారు.

"చూడూ....నా పని నన్ను చేసుకు పోనిస్తే నీకు వచ్చిన భయం ఏమీలేదు. అతి తెలివితేటలకి కాని పోయావా, నీ ప్రాణం తియ్యటానికయినా వెనుకాడను. బోధపడిందా?" భాస్కరం చేతిలో సుందర్రామయ్యగారి ముసిలి జబ్బ నలిగిపోతోంది.

ఒక్క క్షణం ఆలోచించాడు భాస్కరం.

సుందర్రామయ్యగారిని వరప్రసాదరావుగదిలో పడేసి తలుపు వేసేస్తే క్షేమంగా వుంటుందని నిర్ణయించుకొన్నాడు.

"పద ...."

సుందర్రామయ్యగారిని ఈడ్చుకు వెళ్ళి మంచంమీద కూలేశాడు. ఒకసారి గది నంతటినీ పరిశీలించాడు.

గది చాలా సింపుల్‌గా వుంది. డబుల్ కాట్, రైటింగ్ టేబిలు, ట్రాన్సిస్టరు, టైంపీసు, అలమారలో ఒక నేషనల్ పానాసోనిక్ టేప్‌రికార్డరు, మనీపర్సు విలువైనవిగా కనిపించాయి.

పర్సు తీసి చూశాడు. మూడువందల పైచిలుకు వుంది. పర్సు, టేప్‌రికార్డరు, టైంపీసు, ఒకచోట చేర్చాడు. ఒక ప్లాస్టిక్ బాగ్ చూసి, అందులో వేశాడు అవన్నీ.

మరొకసారి గది నంతటినీ పరికించాడు. ఇక పనికి వచ్చేవి ఏవీ లేవని నిర్ధారణ చేసుకొన్నాడు.

టెలిఫోన్ డయల్‌కి వున్న లాకింగ్ ప్లేట్ నొక్కి

తాళంవేసి, తాళంచెవి జేబులో పడేసుకొన్నాడు.

ప్లాస్టిక్ బాగ్ తీసుకొని గది బైటకు వచ్చాడు.

"హేయ్ ముసలీ...." భాస్కరం కేకవేసాడు.

"ఈ గదిలో నా పని అయిపోయింది. మరొక్క గంటలో నేను అన్నీ సర్దుకొని వెళ్ళిపోతాను. ఈలోగా బుద్ధిగా పడుకో్క. ఈ గదిలో నువ్వు అరిచి గీపెట్టినా ఇనప్పెట్టెలాంటి ఈ గదిలోంచి ఒక్క శబ్దం కూడా బైట వాళ్ళకి వినిపించదు. వృథాగా ప్రయాసపడకు. బై బై ...."

సుందర్రామయ్యగారిని హెచ్చరించి గది తలుపు గడియ వేసాడు భాస్కరం. కోటలాంటి గదిలో బందీ అయిపోయారు సుందర్రామయ్యగారు.

అప్పటికి టైము పదకొండు అయ్యింది.

తలుపు గడియవేసిన చప్పుడు వినగానే సుందర్రామయ్య గబగబ లేవబోయారు. పడబోయి అల్మారా తలుపు పట్టుకొని ఒంటికాలిమీద నిలదొక్కుకున్నారు. చేతికర్రలు బయట వుండిపోయాయి.

ఏదో ఒకటి చెయ్యాలి. ఎలాగో ఒకలాగ ఇంటిని, తనని రక్షించుకోవాలి.

దేకుకొంటూ, తడుముకొంటూ వెళ్ళి తలుపులు లోపల్నించి గడియలు వేసేసుకొన్నారు. ఆత్రుతగా ఫోన్ దగ్గరికి దేకుకొంటూనే వెళ్ళారు. రిసీవర్ తీసి డయల్ మీద చేయి వేసారు. కుప్పగా కూలిపోయారు.

మనవడు అల్లరిగా గడియగడియకి డయల్ చేసేస్తూ వుంటే, ఆ కారణంగా వేయించిన డయల్ లాకింగ్ సిస్టమ్ ఇప్పుడు ఇలా కొంప ముంచటంతో ఆయనకి నవనాడులా కృంగిపోయాయి.

అది లాక్‌చేసి వుండగా డయల్ చెయ్యటం సాధ్యం కాదు. బయటినుండి ఎవరైనా ఫోన్‌చేస్తే బాగుండునని వేయిదేవుళ్ళకు మొక్కుకున్నాడు. కాని అరగంట గడిచినా కనీసం రాంగ్‌నెంబరైనా రాలేదు.

వెనక్కి వాలి, మంచానికి చేరబడి, రెండు చేతులలో మొహం దాచుకొని నిస్సహాయంగా విలపించసాగారు ఆ ముసలాయన.

5

భాస్కరం త్వరపడసాగాడు.

సాయంత్రం రావల్సిన నర్సింహం కోసం నిరీక్షించ దలచుకోలేదు. ఆలోచించి, ఆలోచించి సుందరరామయ్యగారు అబద్ధం చెప్పి వుంటారనే నిర్ణయానికి వచ్చాడు భాస్కరం. "అంటే ముసలాడు ఏదో ప్లాన్ వేసాడన్న మాట!" అంచేత సాధ్యమైనంత త్వరలో ఆ ఇంటినుంచి బయట పడదలచుకొన్నాడతను.

వంటింట్లో వున్నవాటిలో పనికొచ్చేవి మూట కట్టుకో వటం పూర్తి చేశాడు.

బజర్ మోగింది.

టైము చూసుకున్నాడు.

గ్లోవ్స్ తీసేసి, గ్లాసెస్ పెట్టుకొని వెళ్ళి కేరేజి అందించి మళ్ళీ తలుపులు వేసేసుకొన్నాడు. బ్యాంకు వాళ్ళ భోజనాల సమయం మధ్యాహ్నం రెండు గంటలకి. అప్పుడు కేరేజి మనిషి 'మీ యింట్లో ఎవరో కొత్త మనిషి వున్నాడండీ' అని వరప్రసాదరావుకి చెప్పినా ఫరవాలేదు. అప్పటికే తాను జారుకొంటాడు, కేరేజి కడిగేస్తారు కాబట్టి వేలి ముద్రలు మిగలవు.

సుందర్రామయ్యగారు ఆయన మనవడు పడుకొనే గదిలో గాడ్రేజ్ బీరువా వుంది. అందులో చాలా సామాన్లు వున్నాయి. అవి మూట కట్టుకోవటం మొదలు పెట్టాడు భాస్కరం.

మళ్ళీ బజర్ మోగింది.

అనుమానంగా వాచీ వైపు చూసుకున్నాడు భాస్కరం. అన్నీ ఒక పక్కగా సర్ది వీధి తలుపు దగ్గరకెళ్ళాడు. ఆ సమయంలో రావలసిన వాళ్ళెవరూ లేరు. గ్లోవ్స్ దాచుకొని, గ్లాసెస్ పెట్టుకొన్నాడు. జేబులో దాచిన కత్తి ఒకసారి తడిమి చూసుకున్నాడు. తలుపు తీసాడు.

"నమస్కారమండీ" అంటూ యిద్దరు ఆడవాళ్ళు ఇంట్లోకి జొరబడ్డారు.

యాంత్రికంగా నమస్కారం చేసాడు భాస్కరం.

"మేము సహస్ర ముత్తయిదువ నోము నోస్తున్నామండి. మీ ఇంట్లో ఆడవాళ్ళని ఒక్కసారి పిలుస్తారూ?"

"లేదండీ....తను వీధిలోకి వెళ్ళింది...." నమ్రతగానే జవాబిచ్చాడు భాస్కరం.

"ఫరవాలేదులెండి. కాస్త కుంకుమ భరిణ యిస్తారూ! నోము నోచుకుంటున్నాం." అంతకంటె మర్యాదగా అడిగారు వాళ్ళు.

వాళ్ళెవరో ఏమిటో పోల్చేశాడు భాస్కరం.

వాళ్ళూ తనలాగే పెద్దమనిషి తరహాగా దోపిడీ చేసే వాళ్ళే.

మొదట, బొట్టు పెట్టుకొంటాము, కుంకుమ భరిణె ఇవ్వండి అని అడుగుతారు. తర్వాత ఈ ఇంటికి ఫలానా కీడు వుంది శాంతి చేయించాలి, డబ్బు పత్రమ్మంటారు.

అదీ యిదీ చెప్పి, చాలా మట్టుకు దబాయించి గుంజు కొంటారు. తాము అడిగినవన్నీ యిచ్చి, చెప్పినట్టు చెయ్యక పోతే వ్రత దేవతలు ఆగ్రహిస్తారని, ఆ ఇంటిని సర్వ నాశనం చేస్తారని, జడిపించి సాధిస్తారు.

"తర్వాత రండి. మా ఆడవాళ్ళుంటారు."

"ఫర్వాలేదని చెబుతున్నాం కదండీ."

వాళ్ళమీద దాక్షిణ్యం చేసి లేనిపోని చిక్కులలో తల దూర్చ దలచుకోలేదు భాస్కరం. కొంతసేపు వాళ్ళకి నచ్చ చెప్పి, తాను తొందరపనిలో వున్నానని బోధపరచి, పది రూపాయలు సమర్పించి, మళ్ళీ సాయంత్రం తప్పక రమ్మని చెప్పి సాగనంపాడు చివరికి. పావుగంట సమయం వృధా చేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

వీధి తలుపు గడియవేశాడు భాస్కరం.

సుందర్రామయ్యగారి గదిలోకి వెళ్ళబోతూ ఏదో గుర్తు వచ్చిన వాడిలాగ ఆగాడు. వరప్రసాదరావు బెడ్‌రూమ్‌లోకి వెళుతున్న టెలిఫోన్ కనెక్షను కట్ చేసేసాడు. అట్నించి కాల్ రావటానికి వున్న ఒక్క అవకాశాన్ని తెంపేశాడు.

ఇల్లు అంతా కూలంకషంగా వెతికాడు. చాలా మట్టుకు మూట కట్టుకున్నాడు. తక్కువ విలువైనవి, మోసుకు వెళ్ళ టానికి కష్టమైనవి వదిలేసాడు.

భాస్కరం అంచనా ప్రకారం అన్నీ కలిపి కనీసం పదిహేను వేల రూపాయల పైచిలుకు విలువ కలిగి వుంటాయి.

సామాన్లన్నీ ఒక పెద్ద సంచి, ఒక బ్రీఫ్ కేసు, ఒక ప్లాస్టిక్ బాగ్‌లో సర్దేశాడు. మూడూ వీధి గుమ్మం వద్దకు చేర్చాడు.

ఇల్లంతా తిరిగి ఏవిధమైన క్లూ వదలలేదని నిర్ధారణ చేసుకున్నాడు. వరప్రసాదరావు గదిని పరిశీలించ వలసిన అవసరం లేదు అనుకున్నాడు. వేలి ముద్రలు పడినచోట్లన్నీ మరొకసారి తుడిచేసాడు.

వీధి గుమ్మం దగ్గరకు చేరాడు.

గడియారం ఒక గంట కొట్టింది.

సరిగ్గా పన్నెండున్నర అయ్యింది.

బజర్ మోగింది.

గడియ తియ్యబోతున్న వాడల్లా అనుమానంగా ఆగాడు.

సామాన్లు పక్కగా, గోడవారగా పెట్టాడు. గ్లోవ్స్ దాచుకొని, గ్లాసెస్ పెట్టుకొని గడియతీసాడు.

తలుపులు తెరుచుకొన్నాయి.

అంతే!

బిలబిలమంటూ లోనికి జొరబడింది పోలీసు బలగం.

తప్పించుకొనేందుకు శత విధాల ప్రయత్నించాడు భాస్కరం. కాని, అంత మంది మధ్య సాధ్యంకాలేదు.

మార్గాంతరం లేక లొంగిపోయాడు భాస్కరం.

వరప్రసాదరావు ఇంట్లోకి, తన గదికి పరిగెత్తాడు, బయట తలుపు గడియతీసి, తలుపు తట్టాడు. తలుపు తెరుచుకొంది.

ఎదురుగా సుందర్రామయ్యగారు కనిపించారు. అతని ముడతలు పడిన బుగ్గలపై కన్నీటి చారలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వరప్రసాదరావు తండ్రిని పొదివి పట్టుకొని ఆసరా యిచ్చి తీసికెళ్ళాడు. మంచంమీద కూర్చోబెట్టాడు. తానూ దగ్గరగా పక్కనే కూర్చున్నాడు.

సుందర్రామయ్యగారికి దుఃఖంతోను, సంతోషంతోను కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి. కొంతసేపటికి సేదదీరారు.

"నేను వస్తున్నాను. ధైర్యంగా వుండు అని చెబుతూ వుంటే లైను డిస్కనెక్ట్ చేసేసావేం?" తండ్రిని అడిగాడు వరప్రసాదరావు.

"నేను డిస్కనెక్ట్ చెయ్యలేదు. నువ్వే డిస్కనెక్ట్ చేసావేమోనని అనుకొన్నాను."

"అబ్బె.... లేదు.... అయితే లైను ఫాల్ట్ అయివుంటుంది!" అంటూ సాలోచనగా టెలిఫోన్ వైపు చూసిన వరప్రసాదరావు ఆశ్చర్యంతో తల మునకలయ్యాడు.

టెలిఫోన్ డయల్ లాకింగ్ ప్లేట్ లాక్ చేసి వుంది!

"మరి తండ్రి ఎలా ఫోన్ చెయ్యగలిగాడు??"

ఆ ప్రశ్నే ఆశ్చర్యంగా తండ్రిని అడిగాడు.

సుందర్రామయ్యగారు నీరసంగా నవ్వారు.

"నాకూ మొదట తట్టలేదురా! డయల్ లాక్ చేసాడని తెలియగానే నిస్పృహతో కూలబడిపోయాను. బయటి నుండి కూడా ఎవరూ ఫోన్ చేయలేదు. అకస్మాత్తుగా నాకొక పద్ధతి గుర్తుకొచ్చింది. డయల్‌ను ముట్టుకోవలసిన అవసరం లేకుండానే మనకు కావల్సిన నెంబరుకు కనెక్షను సంపాదించే మార్గం మరొకటి వుంది."

"నిజంగానే!!" నమ్మలేనట్టుగా అడిగాడు వరప్రసాదరావు.

"నిజంగానే!" చెప్పసాగారు సుందర్రామయ్యగారు.

"రిసీవర్ తీసి, మనం ఏ సంఖ్యనయితే డయల్ చేద్దామనుకుంటున్నామో, అన్నిసార్లు స్పీడుగా టాపింగ్ చేసి, సంఖ్యకి సంఖ్యకి మధ్యన గాప్ ఇస్తే మనకి కావల్సిన

నెంబరు కనెక్ట్ అవుతుంది."

"అంటే" అసలు ఏమీ బోధపడలేదు వరప్రసాదరావుకి.

"అలా చెప్తే బోధపడదు. ప్రాక్టికల్‌గా చూపిస్తా నుండు" అంటూ రిసీవర్ తీసారు సుందరరామయ్యగారు.

"ఇప్పుడు మనకి 3125 కావాలి చూడు...." అంటూ, రిసీవర్ పెట్టగానే కిందికి దిగిపోయే రెండు బటన్స్‌లోను, ఒకదానిమీద, వేలుపెట్టి మొదట మూడుసార్లు చాలా స్పీడుగా 'టాప్' చేసారు. ఈసారి ఒకమాటే 'టాప్' చేశారు. ఇలాగే రెండుసార్లు, అయిదుసార్లు కూడా 'టాప్' చేశారు. అప్పుడు రిసీవరు కొడుకు చేతికి ఇచ్చారు.

"త్రీవన్ టూ ఫైవ్ హియర్" అవతల్నించి రెస్పాన్సు వచ్చింది. సంభ్రమంగా చూసాడు వరప్రసాదరావు. తన కళ్ళని, తన చెవుల్ని తానే నమ్మలేకపోతున్నాడు. వెంటనే ఫోన్ పెట్టేశాడు.

"దొరికిందా కనెక్షను?"

"ఆఁ....దొరికింది!"

"ఈ పద్ధతిలో చాలా జాగ్రత్తగా చెయ్యాలి. లేకపోతే నెంబరు దొరకదు. ఒక సంఖ్యకోసం 'టాప్' చేస్తున్నప్పుడు స్పీడు తగ్గినా, లేక సంఖ్యకి సంఖ్యకి మధ్యన గాప్ సరిపోక పోయినా రాంగ్‌నెంబరు వచ్చేసే ప్రమాదంవుంది. అలాగే నీ నెంబరు రెండుసార్లు రాంగ్ కనెక్షన్ వచ్చింది. చివరికి ఎలాగయితేనేం! నీ నెంబరు దొరికింది" ఏదో తృప్తి ఆ జీవంలేని కన్నులలో కొట్టవచ్చినట్టు కన్పిస్తోంది.

ఆప్యాయంగా ఆ తండ్రి కళ్ళలోకి చూస్తూ వుండిపోయాడు వరప్రసాదరావు. ***

ప్రాణం తీసిన తేనెటీగలు!

ముద్దా సురేష్

"చెప్పండి మిస్టర్ సుకుమార్! నానుండి ఏ సహాయం కావాలి మీకు?" అన్నాడు ప్రొఫెసర్ మృత్యుప్రసాద్ స్కాచ్ విస్కీని రెండు గ్లాసుల్లో పోస్తూ.

నల్లని దేహం అతనిది. కాని తెల్లని దుస్తులు ధరించేడు. ముఖం మీద స్ఫోటకం మచ్చలు అతని వంటి రంగుతో సహాయపడి మరింత కురూపిని చేసేయి.

సుకుమార్ రెండు క్షణాలు మౌనం వహించేడు.

"ప్రొఫెసర్! నా భార్యను చంపడంలో మీ సహాయం కావాలి!"

వర్షంమధ్య పిడుగుల్లా వెలువడ్డాయి సుకుమార్ మాటలు.

ప్రొఫెసర్ మృత్యుప్రసాద్ పకపకా నవ్వేడు. తర్వాత గ్లాసు పైకెత్తి గడగడా తాగేడు విస్కీ.

"సారీ మిస్టర్ సుకుమార్! మీరు రాంగ్ ఎడ్రసు కొచ్చారు. నేను క్రిమినాలజీ ప్రొఫెసర్‌ను కాను, అంతు పట్టకుండా హత్యలుచేసే మార్గాలు చెప్పడానిక్కి."

సుకుమార్ పెదవులమీదికి నవ్వు తెచ్చుకొన్నాడు. "నాకు అంతా తెలుసు ప్రొఫెసర్! మీరు తేనెటీగలపై పరిశోధనలు చేస్తున్నారు. మీరు కాని నేను కాని ఈ హత్య చెయ్యం. తేనెటీగలు చంపుతాయ్ ఆమెను. ప్రాణాంతీసే ఆఫ్రికా తేనెటీగలు!! అయ్ నో యు గాట్ దట్ డెడ్ లీ బీస్....!

ప్రొఫెసర్ మృత్యుప్రసాద్ కోపంతో విరుచుకుపడకుండా తాపీగా పైపు ముట్టించుకోడం చూసి, ధైర్యంగా మళ్ళీ ప్రారంభించేడు సుకుమార్.

"ప్రొఫెసర్! మీరు ఊరికే ఈ సహాయం చేయబోవడం లేదు.... యూ విల్ బీ పైడ్ ఫర్దిస్.... కానీ, రాగిణి.... ఓహ్! చెప్పడం మరిచేను. నా భార్యపేరు రాగిణి. ఆమె పతనం 'యాక్సిడెంటల్ డెత్' క్రింద పోలీసుల దృష్టిలో అగుపడాలి."

"మిస్టర్ సుకుమార్! మీ భార్యనెందుకు పైకి పంపాలనుకొంటున్నారు?" అడిగేడు ప్రొఫెసర్.

సుకుమార్ మరో క్షణం మౌనం వహించేడు. తల వంచుకుని వేళ్ళమధ్య గ్లాసులోని బంగారురంగు విస్కీకేసి చూస్తూ చెప్పసాగేడు.

"ప్రొఫెసర్! నేను లక్షలున్న రాగిణిని పెళ్ళిచేసుకొన్నాను. ఆమెకు డబ్బుందనే అహంకారం ఎక్కువ. నాకు ఖరీదయిన అలవాట్లున్నాయ్. కారు పెట్రోలుకి కూడా ఆమెను డబ్బు అడిగి నేను పుచ్చుకోవాలి. ఈపాటికే మీకు

అర్థమయిందనుకొంటాను?"

మౌనంగా తల పంకించేడు ప్రొఫెసర్ మృత్యుప్రసాద్.

"అఫ్‌కోర్స్ మిస్టర్ సుకుమార్!.... అదిసరే. నాతో మీరు చాల కాన్ఫిడెన్షియల్ మాటర్స్ చర్చించేరు. మీకు సహాయ పడకుండా ఈ విషయాన్ని నేను లీక్ చేస్తే? మీరు కలకాలం కటకటాల్లో ఉండొచ్చేమో కదూ!"

సుకుమార్ గ్లాసులో మిగిలున్న విస్కీని గొంతుకలో పోసుకొని నవ్వేడు.

"ప్రొఫెసర్! నేరస్థుడు సాధారణంగా పోలీసులకు కొన్ని "క్లూ"లు వదిలిపెడతారు. కారణం ఆ నేరంచేసే క్షణాల్లో అతని గుండెల్లో పేరుకున్న కంగారూ, భయమూ. నాలో ఆ ఫియర్ కాంప్లెక్స్ లేదు. అవసరమైన, తెగువా, గుండెబలమూ నాలో ఉన్నాయనే నమ్ముతున్నాను. అయ్ గాట్ మై ఓన్ సెల్ఫ్ ఇమేజ్. పోతే ఈ విషయం మీరు లీక్‌చేసినా ఫర్వాలేదు. కారణం?

నేను చేయబోయే పనులూ ఆధారాలు ఎవ్వరికీ అందవు. సెంట్ పర్సెంట్ యాక్సిడెంటల్ డెత్ క్రింద నిరూపించే మరో ప్లాన్ టేకప్ చేస్తాను. ఎటొచ్చీ కొంత లేటవుతుం దంతే."

"వెల్ మిస్టర్ సుకుమార్! ఈ ఎస్సయిన్‌మెంట్‌లో నా ప్రతిఫలం ఎంత?"

"రెండు లక్షలు. అడ్వాన్సుగా ఏభయి వేలు మీకు ఈ క్షణాన చెల్లించబడతాయ్" సిగరెట్ ముట్టించేడు సుకుమార్.

"టూ లాక్స్" గొణుక్కున్నాడు ప్రొఫెసర్. "ఫారెన్‌లో స్థిరపడి పరిశోధనలు చేసుకోవచ్చు."

మృత్యుప్రసాద్ మెదడులో జోరీగ కదిలింది.

అతను వెనక్కి తిరిగి అల్మైరావేపు నడిచేడు. రెండు నిముషాల్లో అతని చేతిలో ఓ సెంటుబాటిల్లాంటి సీసా ప్రత్యక్షమైంది.

"మిస్టర్ సుకుమార్! లుక్ ఎట్ దిస్. దీనికి 'ఎక్స్ట్రాక్టో లిక్విడ్' అని పేరుపెట్టాను. ఇది వివిధ దేశాల్లో లభించే వేలాది పుష్పాల మకరందం. ఈ ఎస్సెన్స్ మీ భార్య దుస్తులకు కొంచెం రాస్తే చాలు. ఆ సువాసనకు పిచ్చెక్కిపోయి, నావద్ద ఉన్న ఆఫ్రికా తేనెటీగలు రాక్షసుల్లా ఆమెను చుట్టుముడతాయి, ఓ పది పదిహేను తేనెటీగలు మీ భార్య చర్మంపై కాటువేస్తే చాలు. చకచకా ఆమె రక్తం విష పూరితమౌతుంది? రెండు నిముషాల్లో మీకు స్వేచ్ఛ ప్రసాదించడాన్కి ఆమె ఈ లోకాన్నుంచి వెళుతుంది," అన్నాడు ప్రొఫెసర్ నవ్వుతూ.

"మార్వెలస్ ఇండీడ్ ప్రొఫెసర్!"

ఎగిరి గంతేసాడు సుకుమార్.

"మిస్టర్ సుకుమార్! రాగిణిని రేపు సాయంత్రం ఏడు గంటలకు ఇక్కడికి తీసుకురండి," అంటూ ప్లాన్ ఏదో వివరంగా చెప్పాడు ప్రొఫెసర్ మృత్యుప్రసాద్.

సుకుమార్ వికసించిన ముఖంతో కోటు జేబులోంచి ఓ నోట్లకట్టతీసి టేబుల్ మీదుంచాడు.

"మిస్టర్ సుకుమార్!" పిల్చాడు మృత్యుప్రసాద్.

"ఎస్ ప్రొఫెసర్!"

"ఈ 50 వేల విషయం మర్చిపొండి. పని పూర్తయిన తర్వాత రెండు లక్షలు ఇవ్వాలి నాకు. హాయిగా నిద్రపడుతుంది మీకు రేపు రాత్రి."

సుకుమార్ తేలిగ్గా నవ్వేశాడు.

"ఓ. కే. ప్రొఫెసర్" అన్నాడు టై సవరించుకుంటూ.

"ఇట్స ఎ డీల్" అన్నాడు ప్రొఫెసర్ సుకుమార్‌తో కరచాలనం చేస్తూ.

రెండు గ్లాసుల్లోనూ విస్కీ ప్రవహించింది. "ఛీర్స్ ఫర్ ది డెత్ ఆఫ్ రాగిణీ...." అన్నారు ముక్త కంఠంతో.

2

"రాణీ! బట్టలు మార్చుకో. ఈ సాయంత్రం ఓ మిత్రుడింటికి వెళ్ళాలి. రాత్రి అక్కడే గడుపుదాం" అన్నాడు ఆప్యాయంగా సుకుమార్.

రాగిణి అతనికేసి విచిత్రంగా చూసింది. "ఏమిటింత సడన్‌గా నామీద అనురాగం పుట్టుకొచ్చింది? డాన్సర్ రమోలా ఈ రాత్రికి "ఎంగేజ్‌డ్" అని ఫోన్ చేసిందా?" అంది ఛీత్కారంగా.

సుకుమార్ ఆ మాటలకు ఇంకో రోజయితే రెచ్చిపోయేవాడు కాని ఆ క్షణాన నవ్వు తెచ్చుకొన్నాడు.

రాగిణి బుగ్గల చుట్టూ సుకుమార్ చేతులు పడ్డాయి. "రాణీ! నువ్వే జయించేవ్. నేను మారిపోయాను. డబ్బుతో తృప్తిని కొనుక్కోలేనని గ్రహించేను. నా అలవాట్లు ఈ రోజునుంచీ మరచిపోతాను. ఇకమీదట గుర్రప్పందాలకు, అమ్మాయిలవేటకూ, మధుపానానికీ తగలెయ్యను."

రెండు క్షణాలాగి రాగిణి కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు సుకుమార్. "రాణీ! నా మాటలు ఇప్పుడే నమ్మమని నిన్ను అర్థించడంలేదు. క్రమంగా అన్నీ గ్రహిస్తావ్. ఈ రోజు నుంచీ నీ తృప్తే నా తృప్తి. మన దాంపత్యంలో వసంతం వచ్చింది. మనలో ప్రేమ మళ్ళీ చిగురులు వేయాలి" అన్నాడు తడిసిన కళ్ళతో.

రాగిణి అర్ధసంకోచంతో అతనివేపు చూసింది. "నన్ను క్షమించలేవా రాణీ!" గాద్గదికంగా అడిగేడు సుకుమార్. ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకొని ముద్దుపెట్టుకుంటూ.

"సుకుమార్! ఏ స్త్రీ భర్తను దూరం చేసుకోడానికి ప్రయత్నించదు. నాకున్న డబ్బుతో నే నెంతమాత్రం మనశ్శాంతిని పొందలేకపోయేను. 'నా' అనుకొనే మనిషి కోసం, మంచి మనసుకోసం తపించిపోయేను. నువ్వు ఈనాడు నన్ను 'కాష్ బాక్స్'గా కాక భార్యగా ప్రేమిస్తానంటే సంతోషించకుండా ఎలా ఉండగలను?"

సుకుమార్ గుండెల్లో భారం తగ్గినట్లయింది.

"రాణీ! అయితే నన్ను క్షమించినట్లేనా?" బెంగగా అడిగేడు.

ఆ సమయంలో సుకుమార్ చిన్నపిల్లాడిలా అవుపించేడు రాగిణికి.

సమాధానంగా చిరునవ్వుతో ఆమె అతన్ని దగ్గరగా తీసుకుని నుదుటిపై చుంబించింది.

రెండు నిమిషాల్లో కొత్త దుస్తులు ధరించి అతనిముందు ప్రత్యక్షమైంది రాగిణి.

ఆమెవైపు తేరిపార చూశాడు సుకుమార్.

తెల్లని నైలెక్స్ మాచింగ్ శారీ, తెల్లనిబొట్టు, తెల్లరాళ్ళ నెక్లెస్. అదే రంగు జోళ్ళు....

మంచు కడిగిన మల్లెలా ప్రకాశిస్తోంది రాగిణి.

చలి విపరీతంగా ఉండటంవల్ల భుజంచుట్టూ ఖరీదయిన రక్తవర్ణపు శాలువా ధరించిందామె. రాజసం ఉట్టిపడుతోందామె ముఖంలో.

"రాణీ! దేవుడి నెప్పుడూ చూడలేదు కానీ ప్రస్తుతం

దేవతను చూస్తున్నాను" అన్నా డుద్వేగంగా.

రాగిణి సిగ్గుపడి తల దించుకుంది.

సుకుమార్‌కి భార్య కొత్తదిగా కనబడుతోంది. అతని నరాలు విజృంభిస్తున్నాయ్. చటుక్కున రెండంగల్లో రాగిణిని చేరాడు. అతని పెదవులు ఆమె అధరాలపై అతుక్కుపోయాయి. సుకుమార్ వీపుమీద రాగిణి హస్తం కోమలంగా స్పర్శిస్తోంది.

ఎవరో ఛెళ్ళున కొట్టినట్టయింది సుకుమార్‌కి.

"ఛ! తను చేస్తున్నదేమిటి? తను ఇంత త్వరలో అభిప్రాయాలు మార్చుకునే బలహీనుడయ్యాడా! డామిట్? తను కోరిన స్వేచ్ఛ?"

ఏ భావాలూ కనబడనీయకుండా మామూలు మనిషయ్యాడు సుకుమార్. "డ్రా" తెరచి ఓ బాటల్ తీసాడు.

అదే ఎట్రాక్టో లిక్విడ్!

"రాణీ! నీకోసం ఖరీదయిన సెంటు తెచ్చాను."

"అబ్బ! ఇప్పుడెందుకు సుకుమార్!" అంటున్నా వినిపించుకోకుండా ఆ ద్రవాన్ని వ్రేళ్ళమీదికి వంపుకొని రాగిణి ధరించిన ఖరీదయిన శాలువామీద పూశాడు.

"రాణీ! ఎలా వుంది స్మెల్!"

"వండర్‌ఫుల్!" అందామె తన్మయత్వంగా.

బాటిల్‌ను తిరిగి డ్రాయరులో పెట్టేసి బాత్‌రూమ్ వేపు నడిచేడు సుకుమార్.

తలుపులు గభాలున మూసి, అలసటగా తలుపుకు జార్లబడి ఆలోచించాడు సుకుమార్.

"తాను ఈ స్టేజ్‌దాకా తప్పులేమైనా చేశాడా??"

ఏమీలేదు. తన చేతులకు మాత్రం ఆ ద్రవం అంటు

కుంది. సుకుమార్ గబగబా వాష్ బేసిన్‌లో చేతులుపెట్టి పది నిముషాలసేపు సోప్ వాటర్‌తో శుభ్రంగా కడిగాడు.

మరో పావుగంటలో రాగిణి అందించిన డ్రెస్సు వేసుకొని, కారులో బయలుదేరారు.

3

దారిపొడుగునా రాగిణికి రకరకాల చెట్లను చూపిస్తూ— కల్పించుకొని ఎన్నో కబుర్లు చెప్పేడు సుకుమార్. స్టీరింగ్ వదిలేసి కాస్సేపు ఫీట్లుచేసి రాగిణిని నవ్వించేడు.

నవ్వించాడనటమేమిటి? నమ్మించాడనవచ్చేమో!

రాగిణి మనస్సంతా ఉల్లాసంగా ఉన్నదా దినం. మెల్ల మెల్లగా చీకటిపడుతూండగా కారు ప్రొఫెసర్ మృత్యుప్రసాద్ ఇంటిముందాగింది. ఆ కాటేజ్ దానిచుట్టూ రకరకాల మొక్కలతో ఉన్న వాతావరణం రాగిణికెంతో నచ్చింది.

సుకుమార్ రాగిణితో వెళ్ళేసరికి, మృత్యుప్రసాద్ లాబొరేటరీ రూమ్‌లో ఉన్నాడు మైక్రోస్కోప్‌లో ఏదో జీవంలేని తేనెటీగను పరీక్షిస్తూ. పరిచయాలు జరిగేయి.

"మీరు వచ్చినందుకు చాలా సంతోషమమ్మా! సరదాగా అలా గార్డెన్‌లో తిరిగిరండి. ఓ పావుగంటలో పని పూర్తి చేసుకు వస్తాను."

"మరోమాట. నా ఇంట్లో మొహమాటం సహించను. డ్రాయింగ్‌రూమ్‌లో ఫ్లాస్కులో కాఫీ ఉంటుంది. ప్లీజ్ హావిట్ అండ్ గో ఫర్ ఎ రౌండ్!" అన్నాడు తలవంచి మైక్రోస్కోపులోకి చూస్తూ.

రాగిణి నవ్వి ఊరుకొంది. వేడివేడి కాఫీ సేవించి ఇద్దరూ తోటలోకి బయలుదేరారు.

చలిగాలి రివ్వున వీస్తోంది. రాగిణి తన శాలువాను ఒంటి

నిండా చుట్టుకొంది.

సుకుమార్ గుండె ఎంత కాదనుకున్నా దడదడ లాడు తూంది.

కొద్ది నిముషాల్లో రాగిణి ఈ లోకాన్ని వదిలిపెట్ట బోతోంది! అంతా అనుకున్న ప్రకారం జరగాలి!

చిరుచెమటలు తుడుచుకున్నాడు సుకుమార్.

పొడుగాటి కొయ్య స్థంభానికి అమర్చబడిన ఫ్లోరా సెంటు దీపం ఆ తోటకంతా కాంతి నందిస్తోంది.

"రాణీ, ఈ కేజ్ చూశావా?" అన్నాడు సుకుమార్ ఓ చోట ఆగి ఎదురుగా అమర్చబడిన పెట్టెవైపు చూపిస్తూ.

పెట్టెకు మరీ సన్నపాటి తీగల తలుపు ఉన్నది.

"అందులో ఏమున్నయ్?"

"ఆఫ్రికా తేనెటీగలు. తీసి చూపనా?"

"అమ్మో కుట్టవూ?" గుండెలపై చేతులు వేసుకుంది రాగిణి.

"పిచ్చిరాణీ! కదిపి వాటిని ఏమైనా చేస్తే మాత్రం కుడ తాయ్, తలుపులు తీసి వెంటనే మూసేద్దాం. నా దగ్గర గ్లోవ్స్ ఉన్నాయ్" అంటూ ఉన్ని గ్లోవ్స్ తీసి తగిలించుకున్నాడు.

తలుపు సగంతీసి రాగిణిని చూడమన్నాడు. రాగిణిపరీక్షగా పెట్టెలోకి చూసింది. ఆమె గుండెలు గుభిల్లుమన్నాయి!!

ఒక్కో తేనెటీగా నేరేడుపండంత ఉంది. లోపల బెల్లం మీద ఈగల్లా అటూ ఇటూ మెదులుతున్నాయి. సుకుమార్ దూరంగా తప్పుకొని రాగిణినే చూస్తున్నాడు.

రాగిణి ఉలిక్కిపడింది! తేనెటీగలు బయటికి రాసాగినై.

ఆమె చెవిప్రక్కగా "జయ్....య్....య్" మన్న శబ్దం రాగిణిని భయభ్రాంతురాలిని చేసింది.

ఆమె కాళ్ళక్రింద బాంబు పేలినట్లయింది!!

ఊహించని పరిణామం అది!

తన తలచుట్టూ గుంపులు గుంపులుగా, రొదచేసుకుంటూ తిరుగుతున్నాయా రాక్షస తేనెటీగలు!

'కెవ్వు'మని అరుస్తూ అప్పుడే వింటినుంచి సంధించిన బాణంలా తోటలోకి పరిగెత్తసాగిందామె. తేనెటీగలు ఆమె వెంటపడ్డాయి.

సుకుమార్ దూరంగా నిలబడి ఆసక్తిగా చూస్తున్నాడు రాగిణిని. పిచ్చిదానిమల్లే పరిగెడుతోంది రాగిణి.

రాగిణి ఒక్కసారిగా ఆగిపోయింది. రొప్పుతూ వెను దిరిగిచూసింది.

ఆమెనిప్పుడు తేనెటీగలు వెంబడించటంలేదు.

ఆమె గుండెలు కాస్త కుదుటపడ్డాయి.

అంతలోనే సుకుమార్ భయంకరంగా అరిచాడు. రాగిణి ఆందోళనగా సుకుమార్ నిలబడినవైపు చూసింది. తేనె టీగల గుంపు ఇప్పుడు సుకుమార్‌ను చుట్టుముట్టింది. సుకుమార్ క్రిందపడి పొర్లుతున్నాడు. చివరి ఆర్తనాదం చేస్తూ క్షణాలలో ప్రాణాలు వదిలాడు.

రాగిణి కొయ్యబారిపోయింది. ప్చ్! తాను ప్రాణభయంతో చేసిన రన్నింగ్ రేసేలో తన శాలువా ఎక్కడో పడిపోయిం దన్న విషయం రాగిణికి జ్ఞాపకం రాలేదు!

పాపం! తను తెచ్చినది సెంట్ అనుకొని, తన సూట్‌కు కూడా ఆ లిక్విడ్‌ను రాగిణి పూసి వుంచిందని, సుకుమార్‌కే తెలియదు. ఏమైతేనేం? సుకుమార్ తాను తీసుకొన్న గోతిలో తానే పడ్డాడు.

అప్పుడే బయటికి వచ్చిన ప్రొఫెసర్ మృత్యుప్రసాద్ జరిగిన విచిత్ర పరిణామానికి శిలావిగ్రహంలా నిలబడి పోయాడు.

***

శ్యామల ఆత్మహత్య!

వసుంధర

"శ్యామలను చంపేయాలి!" అనుకున్నాను. ఇది సామాన్య మైన నిర్ణయంకాదు. నా దృఢనిశ్చయం.

శ్యామల తెలిసి నాకే అపకారమూ చేయలేదు. పైగా ఎన్నో ఉపకారాలు చేసింది. నా దగ్గర ఆమెకు ఏ రహ శ్యాలూ లేవు. ఆమెకు వివాహమై రెండు సంవత్సరాలు గడిచింది. అయినా ఏడాదికి నాలుగైదుసార్లు పుట్టింటికి వస్తుంది. అందుకు ఒకటే కారణం- నేనుండే ఊరూ, ఆమె పుట్టిల్లూ ఒకటి కావడం.

నాదీ శ్యామలదీ ఈనాటి పరిచయంకాదు. నేను కాలేజీలో బియస్సీ చదువుతున్నప్పుడు ఆమె యస్సెస్సెల్సీ చదువు తూండేది హైస్కూల్లో. మనిషి చాలా అందంగా ఆకర్ష ణీయంగా ఉండడమే కాక- నాకు అందుబాటులో కూడా ఉండేది. అందుక్కారణం నేను శ్యామలా వాళ్ళింట్లోనే అద్దెకుండేవాడిని. నాకు తోడుగా మా అమ్మమ్మ ఉండేది.

అమ్మమ్మ వంక పెట్టుకుని చాలా తరచుగా మా ఇంటికి వస్తూండేది శ్యామల. పైకి కనబడే నా ప్రవర్తననుబట్టి చాలా బుద్ధిమంతుడిలా తప్ప అంచనా వేసిన శ్యామల తల్లి దండ్రులు తరచుగా నా దగ్గర లెక్కలు నేర్చుకోమని పంపించేవారు.

నాలోని ఉపాధ్యాయుడు ఆమెకు లెక్కలొకటే కాదనీ-ఇంకా ఏమైనా చెప్పాలనీ ప్రోత్సహించాడు.

ప్రయత్నాలు మొదలుపెట్టాను. మాకు బోలెడు అవకాశాలు. అమ్మమ్మ పూజలోకి పోయిందంటే, ఒకోసారి-గంటదాకా బయటకురాదు. అలాంటప్పుడు అమ్మమ్మ వంకతో వచ్చే శ్యామలను నెమ్మదిగా నా దారికి తీసుకురావడానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

ఎవ్వరికీ తెలియకుండా అతి రహస్యంగా శ్యామలను నేను కలుసుకుందుకు ఒక ఉపాయముంది. మా ఇంటి పడకగది తలుపులుతీస్తే శ్యామలావాళ్ళ కొట్టుగది వస్తుంది. ఆ గది ఆనుకుని ఉన్న గదిని తన పడకగదిగా చేసుకుంది ఆమె. ఆ గది తలుపు లోపల బిగించుకుని, రాత్రివేళ కొట్టు గదిద్వారా నా పడకగదిలోకి రావడం చాలా సులభం. ఎటొచ్చీ నా భార్యకు దొరకకూడదు మరి. అందుకే శ్రీమతిని ఏదో వంకపెట్టి పుట్టింటికి పంపించేస్తూంటాను-శ్యామల వచ్చినప్పుడల్లా. వెర్రి శ్రీమతి- అదంతా తనమీద ప్రేమే ననుకుంటుంది. ఆమెకు పుట్టింటి వెర్రి! అందువల్ల నన్ను వదలలేనంటూనే- అనుమతి లభించగానే వెళ్ళిపోతూంటుంది.

అన్నింటికీ హాయిగా భార్య ఉండగా ఈ కర్మేమిటనుకోవచ్చు- ఇది విన్న ఎవరైనా?

పొరుగింటి పుల్లకూర సామెత నిజమే అయుండాలి. శ్యామలవల్ల నాకు కలిగే ఆనంద మింతా అంతా అని చెప్ప లేను. అందులోను నాకులాంటి అవకాశం వస్తే చేతులు ముడుచుకునే మగవాళ్ళు ఎంతమంది ఉంటారు కనుక!

అయితే, ఇప్పుడా శ్యామలను చంపేయాలని నిర్ణయించు కున్నాను. అందులోనూ ఇది సామాన్య నిర్ణయంకాదు. నా దృఢనిశ్చయం.

శ్యామల నాకుచేసిన అన్యాయమేమీలేదు. మానసికంగా, శారీరకంగా నానుంచి ఏమీ దాచలేదు. బహుశా అదే ఆమె చేసిన తప్పేమో! ఆమె నా దగ్గర దాచని ఎన్నో రహస్యా లలో ఒకటి నాకు చాలా ముఖ్యమైనది. ఆ సంగతి ఆమెకు కూడా తెలియదు. తెలిస్తే కోరి మృత్యువు నాహ్వానించేది కాదు.

ఎప్పట్లాగే మా ఆవిడ ఊళ్ళోలేదు. రాత్రి పన్నెండు గంటల ప్రాంతాల శ్యామల నా గదిలోకి వచ్చింది. నేను ఎదురుచూస్తూనే ఉన్నాను. వెళ్ళి బలంగా కౌగలించుకున్నాను. ఆమె నవ్వి- "అందుకే మీరంటే నాకంత ఇష్టం!" అంది.

ఆమె నన్ను మీరు అనే అంటుంది. నా భార్య కాలేక పోవడం తన దురదృష్టమంటుంది. నేను ఆమెనెంతవరకూ ప్రేమిస్తున్నానో తెలియదుగానీ విపరీతంగా కామిస్తున్నాను. నా కళ్ళకు- ఆమె జాకెట్లోంచీ ఒక ఉత్తరం కనపడింది. "అదేమిటి?" అన్నాను.

ఆమె చాలా నెమ్మదిగా నవ్వి, ఆ ఉత్తరాన్ని నా కందిం చించి— "అది మా ఆయన రాసిన ఉత్తరం. చదువుదా మనుకుంటూనే మరచిపోయాను. ఇక్కడున్నంతకాలం మిమ్మల్ని కలుసుకోవాలని తప్ప — మరి దేనిమీదా ధ్యాస ఉండదు" అంది శ్యామల.

గర్వపడ్డాను. ఆ ఉత్తరాన్ని దూరంగా విసిరేశాను. భర్త ఉత్తరంకంటె శ్యామలకు నేను ముఖ్యం.

ఒక గంటలసేపు నాతో గడిపి వెళ్ళిపోయిందామె. ఒకసారి పక్క దులిపి వేసుకుందామనుకున్నాను. దుప్పటి కదిపేసరికి కవరు కనబడింది. అదే- శ్యామల భర్త రాసిన ఉత్తరం. ఏం రాశాడో?

ఒక్క నిముషం ఆలోచించాను. శ్యామలకు నా దగ్గర ఏమీ రహస్యాలు లేవు.... ఆమెకూ భర్తకూ మధ్య ఎటువంటి ఉత్తరాలు నడుస్తున్నాయో చూడాలనిపించింది. కవరు చింపాను.

"డియర్ శ్యామూ!

ఈ ఉత్తరం మీ ఆయన రాసిందనుకుని నువ్వు పొరబడి ఉంటావు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండడంకోసం నేనే తెలివిగా ఫ్రం అడ్రస్ మీ ఆయనది రాశాను. ఈ ఉత్తరం రాయవలసిన అవసరం ఎందుకొచ్చిందీ అంటావా- నువ్వు లేక నేను చాలా ఇబ్బంది పడుతున్నాను. ఇంకా ఎన్నాళ్ళు పుట్టింట్లో ఉంటావు? హాస్టల్లోంచి నీ ఇంటికి నేను మారిన దెందుకని?

త్వరగా వచ్చేసేయమని కోరుతున్నాను. సెక్సుకు సంబంధించినంతవరకూ నీ సిద్ధాంతం నాకు చాలా చాలా నచ్చింది. సెక్సుకు వావివరసలతో నిమిత్తంలేదు. ఏం చేసినా తప్పులేదు. ఎటొచ్చీ సంఘం హర్షించదన్న భయం ఉంటే — చేసే పని రహస్యంగా చేయాలి అని నువ్వు చెప్పిన సిద్ధాంతం నేను రోజుకొకసారి వల్లె వేసుకుంటాను.

"అయితే నీ సలహా ననుసరించి — ఇంకా మా వదిన దగ్గర చొరవచేయడానికి ధైర్యం రావడంలేదు. ఈసారి

నువ్వు వచ్చి నాకు మరింత ధైర్యం ప్రసాదిస్తే — తప్పక ఇంట్లో ప్రయత్నించగలను. వివాహమయ్యేవరకు ఏదైనా అవస్థపడక తప్పదుగదా? నువ్వు వచ్చేలోగా నాకొక ప్రేమ ఉత్తరం రాయగోర్తాను. ఫ్రం అడ్రస్ మా ఇంటిది రాసేసెయ్. ఇక్కడ నీకు నా చిరునామా, మా ఊళ్ళోని నా ఇంటి చిరునామా కూడా ఇస్తున్నాను.

ముద్దులతో— నీ

రామచంద్రరావు."

ఉత్తరం పూర్తి అయేసరికి నా పిడికిళ్ళు బిగిశాయి. ఒళ్ళంతా ఆవేశంతో వణికింది. వెధవ — చదువు పేరిట చేస్తున్న పని ఇదా — అనుకున్నాను. ఎందుకంటే ఆ రామచంద్రరావు స్వయానా నాకు తమ్ముడు. వాడికి నెల నెలా నేను కొంత డబ్బుకూడా పంపిస్తున్నాను.

రెండు చిరునామాలూ కరెక్టుగా సరిపోయాయి. హాస్టల్లో చదువు సరిగా సాగడం లేదనీ, తనకు మంచి గది ఒకటి దొరికిందనీ—అందువల్ల హాస్టల్లోంచి ఆ గదిలోకి మారిపోతున్నాననీ-క్యారేజీ భోజనం చేస్తున్నాననీ తమ్ముడు రెండు నెలల క్రితం రాశాడు.

నాలుగు రోజుల క్రితం "హఠాత్తుగా మీ తమ్ముడిక్కడికి వచ్చి ఒకరోజుండి మర్నాడు వెళ్ళిపోయాడు. ఎందుకో నన్ను చూసి భయపడ్డాడు" అని శ్రీమతి తన పుట్టింటి నుంచి ఉత్తరం రాసింది.

వెధవ—అక్కడి కెందుకువెళ్లాడో అర్థంకాక తన్నుకు చచ్చాను. ఇప్పు డర్థమైంది. శ్రీమతికి రాసిన ఉత్తరం ఇంకా టేబిలుమీద ఉంది. రేపు దాన్ని పోస్ట్ చేయాలను

కుంటున్నాను. ఇంతలో ఈ ఉత్తరం నేను చదవడం తటస్థించింది.

అయితే శ్యామల నాకిప్పుడు చాలా ప్రమాదకారిగా తయారయింది. నా తమ్ముడిని పాడుచేయడమేకాక - మా ఇంట్లోనే విష బీజాలు నాటడానికి ప్రయత్నిస్తోంది. ఆమెను నేను క్షమించలేను. ఈ సమస్యకు మరో పరిష్కారం కూడా కనబడలేదు.

అప్పుడే నేను దృఢంగా నిశ్చయించుకున్నాను. "శ్యామలను చంపేయాలి" అది సామాన్యమైన నిర్ణయం కాదు మరి.

కుర్చీలో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాను. టైము రెండుగంటలు కావస్తోంది. ఆలోచనలు ఎప్పటికీ తెగడం లేదు. ఆఖరికి అనిపించింది — నా ఆలోచనలను ఒక కాగితంమీద పెడితే బాగుంటుందని. శ్రీమతికి పూర్తి చేసిన ఉత్తరం — బల్లమీద పేపర్‌వెయిట్ క్రింద ఉంది. పక్కనే లెటర్‌పాడ్ ఉంది. బాల్‌పెన్ ఉంది. ఒక్కక్షణం ఆలోచించి రాయడం మొదలుపెట్టాను. నా హృదయంలోని కసి, సంఘర్షణ — నెమ్మదిగా కాగితంమీద చోటు చేసుకోసాగాయి. శ్యామల హత్యకు పథకం, రూపుదిద్దుకోసాగింది.

2

"వచ్చావా? నీకోసమే ఎదురుచూస్తున్నాను. ఇంట్లో అందరూ పడుకున్నారా?"

"అన్ని జాగ్రత్తలూ తీసుకోకుండా రానని మీకు తెలుసు గదా!"

"శ్యామలా — నీలో విశేషమేమిటో కానీ — నన్ను పూర్తిగా వశపర్చుకున్నావు. ఈరోజు నా ప్రేమనంతా నీ

ముందు వ్యక్తపర్చుకోవాలని ఉంది—"

"రోజూ వ్యక్త పరుస్తూనే ఉన్నారు కదా—"

"అదికాదు శ్యామలా! ఇంతకాలం మనమిద్దరం శారీరకంగా ప్రేమను వ్యక్తం చేసుకుంటున్నాం. కానీ అందుకు కారణం మనిద్దరి మనసులూ కలవడమేనన్న సంగతి నాకు తెలుసు. కానీ మనమెప్పుడూ ఒకరినొకరు మానసికంగా తృప్తిపర్చుకునే అవకాశంలేదు."

"శరీరాలు తృప్తి చెందితే మనసుకు తృప్తి కలగదా?"

"కలగదు శ్యామలా! ఉదాహరణకు నీకు లాటరీలో పది లక్షలు వచ్చేయనుకో—నాకోసం ఏం చేస్తావు? నాకు లాటరీలో పది లక్షలు వస్తే అదంతా నీ పేరిట దస్తావేజు రాస్తాను, ఎలా రాస్తానో చూద్దువుగాని—" అంటూ లెటర్ పాడ్‌లో ఒక కాగితంమీద ప్రేమ దస్తావేజు రాశాను.

శ్యామల అది చదివింది. ఆమె కళ్ళు మెరిశాయి.

"చూశావా? నా చర్య నీ కెంతో తృప్తి నిచ్చింది. అలాగే నీవేం చేయదల్చుకున్నావో నాకు రాసి ఇయ్యి—" అన్నాను.

ఆమె ఉత్సాహంగా ఏమో రాసి సంతకం చేసి నా కిచ్చింది. అది చదువుతూనే—నేను ఒక్క ఉదుటున ఆమెను బలంగా కౌగలించుకున్నాను. "ఏమిటిది?" అందామె.

"ఈరోజు నాకెంత తృప్తిగా ఉందో చెప్పలేను. నిజంగా నామీద నీకింత ప్రేమా?" అన్నాను. ఆమె కళ్ళలో వెలుగు, అభిమానం కనిపించాయి.

"భగవంతుడు ప్రత్యక్షమై నీ కోరికలన్నీ ఒక ఉత్తరంగా రాసి నాకు పంపితే అన్నీ తీర్చేస్తానన్నాడనుకో ఉత్తర

మెలా రాస్తానో తెలుసా?" అన్నాను నేను. ఆమె కుతూహలంగా నా వంక చూసింది. నేను రాయడం మొదలు పెట్టాను. నేనూ రాస్తూండగానే ఆమె చదవడం మొదలు పెట్టింది. నేను రాయడం పూర్తికాగానే ఆమె నా ముఖం నిండా ముద్దులు కురిపించింది.

"మరి నువ్వో?" అన్నాను. శ్యామల రాసింది. ఎంత బాగా రాసిందో చెప్పలేను. ఈసారి ఆమెను కౌగలించుకోలేదు. హఠాత్తుగా నిరుత్సాహంగా కూర్చుని "మనిద్దరం ఇంతగా ప్రేమించుకున్నాంగదా మనలో ఏ ఒక్కరు లేక పోయినా—"

శ్యామల నా నోరు మూసింది. మృదువుగా విడిపించుకుని "ఆ ఆలోచనే నా మతి పోగొడుతోంది" అన్నాను.

"మీరు లేకపోతే నేను పిచ్చిదాన్నైపోతాను" అంది శ్యామల.

"నేను ప్రపంచం మర్చిపోలేని ఒక ఆదర్శ ప్రేమలేఖ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంటాను." అన్నాను. అంటూనే ఒక విషాద భరిత లేఖరాసి సంతకం పెట్టాను. శ్యామలకూ ఆవేశం వచ్చినట్లుంది. ఆమె కూడా ఒక దీర్ఘ లేఖరాసి సంతకంపెట్టి నా చేతికిచ్చింది, అది చదివాను. తన చావును నేను భరించలేనని ఆమె అనుకుంటోంది. ఆ భావనతో నా చావును భరించలేనంటూ ఒక లేఖరాసింది. అది చాలా పెద్ద లేఖ. ఆ లేఖను నేనామెను హత్యచేయడం కోసం ఉపయోగిద్దామనుకుంటున్నాను.

ఆ లేఖ పూర్తిగా చదివేక నాకు కలిగిన ఉత్సాహమింతా అంతాకాదు. జీవితంలో తను ప్రేమించిన ఒకే ఒక వ్యక్తి మరణించేక ఇక సారం కనబడడం లేదనీ-బ్రతుకు అర్ధం తెలియడంలేదనీ-త్వరగా తనువు చాలించి స్వర్గ లోకంలో

తన భర్తను కలుసుకోవాలనుకుంటున్నదనీ రాసిందామె. చివర ఆమె సంతకం అందంగా మెరుస్తోంది. ఉత్సాహంతో ఆమెను గట్టిగా కౌగలించుకున్నాను. ఆమె మనోహరంగా నవ్వింది.

గదిలో ఒకగంటసేపు చీకటి రాజ్యం చేసింది.

"మరి వెడతాను" అందామెలేస్తూ.

"ఈ రోజు స్పెషల్‌గదా రెండు గ్లాసులతో పాలు సిద్ధంగా వున్నాయి మరి" అన్నాను.

ఇద్దరం చెరోగ్లాసుతోనూ పాలు తాగం, ఆమె వెళ్ళబోయింది. "నీ ఉత్తరం!" అంటూ ఆమెకు అందించాను. "ఊఁ" అని విసుగ్గా ఆమె జాకెట్లోకి తోసేసి వెళ్ళిపోయింది. నా చేతులు వణుకుతున్నాయి. ఆమె మరి రాదు. ఈ రాత్రితో ఆమెకు నాకూ సరి!

ఆమె వెళ్ళిపోయింది. నేను వెళ్ళి శుభ్రంగా రెండు గ్లాసులు కడిగేశాను. ఆమె తాగిన పాలలోని విషం ప్రభావం వల్ల మరొక్క రెండుగంటలలో ఆమె మరణిస్తుంది. వణుకుతూనే నా గదిలో ఆమె రాసిన ఇతర కాగితాలన్నీ ముక్కలు ముక్కలు చేసి లెట్రిన్‌లో ఫ్లష్‌లో కొట్టేశాను.

3

ఇదీ నా ప్లాను. ఇది నా అభిప్రాయంలో చాలా చాలా చక్కటి ప్లాను. జాగ్రత్తగా ఏ పని ఏ వరుసలో జరగాలో ఆ కాగితంమీద రాశాను. ఒకసారి చదువుకున్నాను. ఆ ప్లాను చదువుకున్నాక నాలాంటి తెలివైన వాడు హత్యచేస్తే దేవుడు కూడా పట్టలేడనిపించింది.

నా గదిలోంచి కొట్టు గది ద్వారా శ్యామల గదిలోకి

వున్న వివరం గురించి ఎవరూ తెలుసుకోలేరు. అందుకు సంబంధించిన జాగ్రత్తలన్నీ శ్యామల చాలా పక్కాగా ఏర్పాటు చేసుకుంది. శ్యామల' దగ్గరున్న ఉత్తరం ఆమె తాగిన విషం ఆమె ఆత్మహత్యని ధృవపరుస్తాయి. మూడు వంతులు శ్యామల తలిదండ్రులీ విషయాన్ని పోలీసులదాకా వెళ్ళనివ్వరు. నన్ను గురించి ఎవ్వరూ ఏ విధంగానూ అనుమానించలేరు.

నెమ్మదిగా నిద్రకు పడ్డాను. అంత బాగా నిద్రపట్టలేదు. కలత నిద్రలో ఎవ్వరో నా గదిలోకి వచ్చి టేబిల్ మీద నేను రాసిన కాగితాన్ని చూసినట్లూ నా మీద హత్యాప్రయత్న నేరం ఆరోపించినట్లూ అనిపించి ఉలిక్కిపడి లేచాను. టేబిల్ మీద వున్న కాగితాల్ని తీసుకెళ్ళి పాంటు జేబులో పెట్టేవరకూ తోచలేదు. ఆ తర్వాత కాస్త బాగానే నిద్ర నిద్రపట్టింది.

మర్నాడు నిద్రలేచేసరికి బాగా పొద్దెక్కిపోయింది. హడావుడిగా తెమిలి కాలేజీకి బయల్దేరాను. ఎడ్రస్ రాసిపెట్టి రెడీగా ఉన్న కవర్లో టేబిల్ మీద ఉత్తరం తోసేసి దారిలో పోస్ట్ చేసేశాను. క్లాసులో కుర్రాళ్ళకి పాఠం చెబుతున్నా నన్నమాటే కానీ నా మనసు మనసులో లేదు. రాత్రి నేను చేయబోయే శ్యామల హత్య గురించే పిచ్చిగా ఆలోచిస్తు న్నాను.

శ్యామలవంటి దాన్ని చంపడం ఎంత వరకూ న్యాయ మని అంతరాత్మ ప్రశ్నిస్తోంది. "శ్యామలకు నీ తమ్ముడితో సంబంధముందని తెలిసి ఆమెను చంపాలనుకుంటున్నావు? మీ ఇద్దరి సంబంధం తెలిస్తే ఆమె భర్త నిన్నేంచేయాలి?" అంటోంది అంతరాత్మ.

నేను వినపల్చుకోలేదు. శ్యామల పతిత కావచ్చు. కానీ ఆమె మూలంగా నా భార్య కూడా పతిత కాబోతోంది. నా తమ్ముడు పాడవుతున్నాడు.

ఆమెను చంపాలన్న ఆలోచన క్రమంగా తీవ్రతరమవుతోంది నాలో. మరొక్కసారి నా ప్లాను చదవాలనుకున్నాను. ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవాలి. అందుకే పాంటు జేబులోంచి కాగితం తీసి చదవసాగాను.

"ప్రియమైన సుబ్బుల్ని దీవించి వ్రాయునది...."

ఉలిక్కిపడ్డాను. గుండె ఆగింది. ఇది నేను నా భార్యకు రాసిన ఉత్తరం. మరి ఉదయం భార్యకు పోస్టుచేసినది.... అమ్మ బాబోయ్!

శ్యామలకూ నాకూ ఉన్న సంబంధం, శ్యామలకు నా తమ్ముడితో పరిచయమైన సంగతి, ఆమె వాడిని దేనికి ప్రోత్సాహిస్తున్నదీ, ఆమెను నేనేవిధంగా చంపదల్చుకున్నదీ అన్నీ వివరంగా రాశాను ఆ కాగితంలో. అదికూడా-శ్రీమతికి రాసిన లెటర్‌పాడ్‌లోని కాగితంమీద రాశాను. రెండూ మడతపెట్టి ఉన్నాయి. ఎంతో జాగ్రత్తగా ఉండాలనుకుంటూనే చాలా పెద్ద పొరపాటు చేసేశాను.

శ్రీమతికి నా ఆయువుపట్టు పోస్టు చేసేశాను. అది ఆమె చదివిందంటే కొంప మునిగిపోతుంది.

ఒక్కక్షణం మతిపోయినట్లయినా త్వరగా బుద్ధి పని చేసింది. ఉత్తరం ఎక్కణ్ణించి పోస్టు చేశానో గుర్తుంది. అక్కడ క్లియరెన్సు సుమారు ఒంటిగంట ప్రాంతాల. ఇప్పుడు టైము అయిదునిముషాల తక్కువ ఒంటి గంటయింది. సాధారణంగా పోస్టుమేన్ క్లియరెన్సు కాస్త లేటుగానే చేస్తాడు. ఉరకలు పరుగులమీద వెడితే అక్కడికక్కడే ఆ ఉత్తరం సంపాదించవచ్చు.

ఒక సైకిల్ పుచ్చుకుని అక్కడికి వెళ్ళాను. పోస్టు బాక్సుమీద ఇంకా 1.05 అని రాసి ఉంది. అంటే క్లియరెన్సు కాలేదన్నమాట. మనసు కుదుటపడింది. టైము చూసుకున్నాను. 1.10 అయింది. ఆలస్యంగా క్లియరెన్సు చేసే పోస్టుమేన్‌ని ఆ క్షణంలో అభినందించకుండా ఉండలేకపోయాను.

టైము గడుస్తోంది. ఒంటిగంటన్నరయినా పోస్టుమెన్ రాలేదు. అతగాడి ఆలశ్యానికి నా ఒళ్ళు మండసాగింది. కాస్త ఆలశ్యం ఫరవాలేదు కానీ మరీ ఇంత ఆలస్యమా అని విసుక్కోసాగాను. టైము రెండు కావచ్చేసరికి నాకు విపరీతంగా చిరాకు, కొద్దిగా అనుమానమూ కలగసాగాయి. ఆ సమయంలో ఆపద్బాంధవుడిలా వచ్చాడు పోస్టుమెన్. అతగాడు జేబులోంచి తాళాలుతీసి బాక్సు ఓపెన్ చేయబోతూండగా- "ఒంటిగంటా అయిదునిమిషాలకి క్లియరెన్సంటే- రెండూ అయిదుకి చేస్తున్నావు" అన్నాను.

అతగాడు నాకేసి చిత్రంగా చూసి, "క్లియరెన్సు ఒంటిగంటకే చేసేశానండీ- అయితే టైము బిళ్ళమార్చడం మరచిపోయాను. ఉత్తరాలను పంపించే పని పూర్తి చేసుకుని, బిళ్ళమార్చడం కోసం వచ్చాను" అన్నాడు.

మళ్ళీ మరోసారి గుండె ఆగింది. క్లియరెన్సు టైమింగు మార్చి పోస్టుమెన్ వెళ్ళిపోయాడు. నేనుమాత్రం మరి కాస్తసేపు అక్కడే వుండిపోయాను. ఉత్తరం నా చేయి దాటిపోయిందనీ- నేను ప్రమాదంలో ఇరుక్కున్నాననీ అర్థమైపోయింది. హాయిగా సాఫీగా నడచిపోతున్న నా జీవితనౌక ఇప్పుడు పెనుతుఫాను నెదుర్కోబోతోంది. ఈ ఇబ్బందులన్నింటికీ కారణం ఒకేఒక చిన్న ఉత్తరం. అది

నా శ్రీమతికి అందకుండా ఆపాలి.

మళ్ళీ త్వరగా బుద్ధి పనిచేసింది. సాయంత్రం 4 గం॥కి ఒక బస్సుంది. అది ఎక్కానంటే- రాత్రి 11 గం॥కి శ్రీమతి ఊరు చేరుకుంటాను. ఉత్తరం వచ్చేదాకా అత్తవారింట్లో కాపలాకాసి అది అందుకుని శ్రీమతిని తీసుకుని వెనక్కురావాలి.

కాలేజీకి వెళ్ళి సెలవు చీటీరాసి ఇచ్చేశాను. ఇంటికివచ్చి కొద్దిగా రెండు రోజులకు సరిపడ సామాను ఒక ఎయిర్ బ్యాగ్‌లో సర్దుకుని బయటకువచ్చి తలుపు తాళం తీస్తూండగా ఇంటిముందు కారాగింది. అందులోంచి రమణరావు దిగాడు.

"ఎక్కడికో బయల్దేరినట్లున్నావ్? నీ కోసం కాలేజీకి వెళ్ళాను. అక్కడ లేవన్నారు. ఎందుకైనా మంచిదని ఇంటికేసి వచ్చాను. నా ఊహ కరెక్టయింది. నువ్వు దొరికావు!" అన్నాడు రమణరావు.

"ఏమిటి విశేషం?" అన్నాను.

"ఈరోజు క్లబ్‌లో రోజీ డ్యాన్సు. నీకు మాటిచ్చాను గదా—రోజీ డ్యాన్సున్నరోజున క్లబ్‌కు తీసుకువెడతానని" అన్నాడు రమణరావు.

నాలాంటి సెక్సు పిచ్చివాళ్ళకోసమే రోజీ పుట్టిందని చాలా మంది అంటారు. చాలా అండర్‌గ్రౌండ్ క్లబ్బుల్లో రోజీకి మంచి పేరూ, డిమాండూ ఉంది. క్లబ్బులోనే తన చాలా భాగం జీవితం గడిపే రమణరావు ఆమె చిలిపిచేష్టల గురించి చాలా పర్యాయాలు నాకు చెప్పాడు. నేనుత్సాహంగా వినేవాడిని. కానీ ఎక్కడెక్కడి ఊళ్ళకో వెళ్ళి రోజీ డ్యాన్స్‌లు చూడ్డానికి నేను రమణరావులా ధనవంతు

డిని కాను మరి! అసలు నేనుంటున్న ఊరిలోనే క్లబ్బులకు వెళ్ళలేను నేను. రమణరావు చెప్పే కబుర్లు వింటూ లొట్టలు వేస్తుంటానంతే.

"నీలాంటివాణ్ణి క్లబ్బులోకి లాగడం మంచిదికాదనుకో. కానీ ఈ ఊళ్ళో రోజీ డ్యాన్సున్నప్పుడు తప్పక తీసుకు వెడతాను" అన్నాడెప్పుడో ఒకసారి రమణరావు. అతగాడి కెంత గుర్తు! నామీద అతనికున్న అభిమానానికి నాకు చాలా ఆనందం కలిగింది.

అంతలోనే—రోజీ డ్యాన్సు చూసే అవకాశం వదలు కోక తప్పదు.

"నేను అర్జంటుగా అత్తవారింటికి వెళ్ళాలి—"

"ఏమిటంత అర్జంటు—"

"తెలియదు. రమ్మని టెలిగ్రాం వచ్చింది. తెల్లారేసరికి అక్కడుండాలి!"

రమణరావు నవ్వాడు. "తెల్లారేసరికి కదా—నేనూ అక్కడికి వెళ్ళాలి. రాత్రి డ్యాన్స్ ప్రోగ్రాం అయేక నా కార్లో వెడదాం. తెల్లారేసరికి తప్పక అక్కడుంటాం—సరా?"

మనసు పీకింది. అత్తవారి ఊరు వెళ్ళడానికి—కారులో అయితే అయిదు గంటలు చాలు. రోజీ డ్యాన్స్ చూసి రమణరావు కారులో వెళ్ళడంలో నష్టమేముందీ అనిపించింది. మనసులో ఒక మూల భయం పీకుతూనే ఉంది. విధి నాకు ఎదురు దెబ్బ తీస్తుందేమోనని.

ఏమైతేనేం రమణరావు నన్ను లొంగదీసుకున్నాడు. రాత్రి తొమ్మిది గంటలకు ఆ క్లబ్‌కు వెళ్ళాం. సరిగ్గా 8-45 కు రోజి డ్యాన్స్ ప్రారంభమయింది. ఆమె ఈ

డ్యాన్స్ పారిస్ నైట్‌క్లబ్‌లో నేర్చుకున్నట్లు ప్రకటించి— నృత్యం ఆరంభించింది.

మేమున్న హాల్లో ఒక యాభై మంది మాత్రం ఉన్నారు. అందరూ గొప్పవాళ్ళలాగే కనిపిస్తున్నారు నా కంటికి.

నేనూ, రమణరావూ పక్కపక్కన కూర్చున్నాం. రమణ రావుతోపాటు నేనుకూడా కొద్ది కొద్దిగా తాగుతున్నాను.

రోజీ నిజంగానే పేరుకు తగ్గట్లు రోజాపువ్వులా వుంది. ఆమె చక్కగా నృత్యం ప్రారంభించింది. అయిదు నిమిషా లలో ఆమె నృత్యంచేసే పద్ధతి మారిపోయింది.

రోజీ క్రమంగా వంటిమీద బట్టలు తీసేయడం ప్రారం భించింది. ఒళ్ళంతా వేడెక్కిపోయింది. ఆమె బట్టలు తీసే పద్ధతి నన్ను చాలా రెచ్చగొట్టింది. నా మనసు రోజీతో నిండిపోయింది.

4

"రమణరావూ—నీ రుణం ఎలా తీర్చుకోగలను? నావంటి సామాన్యుడికి నీ ఖర్చులో ఎంత సౌఖ్యం కలిగిం చావు?" అనుకున్నాను, రోజీ ఒడిలో తల పెట్టుకొని. ఒక గంటసేపు రోజీ నాకు స్వర్గసౌఖ్యాలు చవిచూపింది.

నా కర్తవ్యం గుర్తొచ్చింది. నేను టైముచూసుకున్నాను. రాత్రి 10 గంటలు దాటింది.

"ఏమిటి టైము చూసుకుంటున్నారు?" రోజీ పలక రించింది.

"ప్రయాణం గురించా?" అంటూ రమణరావు అక్క డికి వచ్చాడు. నేను లేచి కూర్చున్నాను. "ఒక్క కునుకు తీసిపోదాం—3 గం॥ ప్రాంతాల బయల్దేరి వెడదాం— ఏమంటావు?" అన్నాడు.

ఒక్క క్షణం ఆలోచించాను. 2 గం॥కు బయల్దేరినా ఎనిమిది గంటల ప్రాంతాల అక్కడుంటాను. ఏమీ ఇబ్బంది లేదు. నా మనసులోని విషయం ఊహించాడో ఏమో రమణరావు వెళ్ళిపోయాడు.

మళ్ళీ నాకు మెలకువ వచ్చేసరికి — చాలా నీరసంగా అనిపించింది. టైము చూసుకున్నాను. వాచీ ఇంకా రెండు గంటలు చూపిస్తోంది. అంటే నేను 3 గం॥లే పడుకున్నా నన్నమాట. కానీ ఎంతో కాలంగా నిద్రపోయినట్లనిపిస్తోంది. ఇంకా మత్తుగా వుందికానీ నిద్రపోవాలని లేదు. ఇంకా గంట టైముందికదా అని బద్ధకంగా అలాగే పడుకున్నారు. పక్కలో సుందరి లేదు. జరిగినవన్నీ మననం చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాను.

ఈరోజు ఎంత అదృష్టం నాకు! అయాచితంగా ఒక రోజు లభిస్తేనే 'ఇంత ఆనందంగా ఉందే — రోజూ ఇటువంటి ఆనందం లభించే — రమణరావు అదృష్టం తలచుకుంటేనే అసూయ కలిగింది.

ప్రపంచంలో మరేమీ అవసరంలేదు. కాంత, కనకం — ఈ రెండూ వుంటే మగవాడికి అంతకంటే కావలసినదేముంది?

టైము మూడయింది. ఇంకా రమణరావు జాడలేదు. వులిక్కిపడి లేచాను.

"మెలకువ వచ్చిందా?" తియ్యని కంఠం వినిపించింది. గుర్తుపట్టాను. కొన్ని గంటలక్రితం నాకు ఆనందమిచ్చిన రోజీ.

"రమణరావుగారికి ఆరోగ్యం బాగాలేక ఇంటికి వెళ్ళిపోయారు. మిమ్మల్ని అన్నప్రకారం తీసుకు వెళ్ళలేక

పోయినందుకు సారీ చెప్పమన్నారు—" అంటూ ఆమె నా దగ్గరగా వచ్చింది.

"రమణరావుగారెంత మంచివారు. మీవంటి రసికుల్ని నాకు పరిచయం చేశారు—" ఆమె మృదువుగా నన్ను చుంబించింది.

ఆ క్షణంలో నా భావాలేమిటో చెప్పలేను. కంగారు, గర్వం, భయం, వుత్సాహం అన్నీ కలిపి—చిత్రమైన అనుభూతి కలిగింది.

మళ్ళీ నాకు బస్సే గతి—అయిదుగంటల ప్రాంతంలో ఒక బస్సు ఉంది—కానీ ఇదేమిటో—నాకింత నీరసంగా వుంది.

నేను తూలడం గమనించి—"ఉండండి కాఫీ ఇస్తాను" అంటూ ఆమె అక్కణ్నుంచి వెళ్ళి మరో క్షణంలో వచ్చింది. ఆమె తెచ్చిన వేడివేడి కాఫీ తాగాక కాస్త బలం చేకూరింది. "వస్తాను, చాలా థాంక్స్—" అంటూ అక్కణ్ణించి బయటపడ్డాను. రోడ్డుమీద కనబడ్డ రిక్షా ఎక్కి బస్సుస్టాండు చేరుకున్నాను. అప్పుడు టైము నాలుగయింది.

సరిగ్గా నాలుగున్నరకు—నా బస్సు స్టాండుకు వచ్చింది. ఎక్కి—టికెట్ తీసుకుని కూర్చున్నాను.

సరిగ్గా అయిదుగంటలకు బస్సు కదిలింది. ఎందుకో చెప్పలేను కానీ చాలా నీరసంగా వుంది. బస్సు కుదుపుకు మళ్ళీ కాస్త నిద్ర పట్టింది. అలా రెండుగంటలసేపు కునికిపాట్లు పడ్డాక—బస్సు ఒక ఊళ్ళో ఆగింది. అక్కడ న్యూస్‌పేపరొకటి కొన్నాను.

నేను రోజూ రెగ్యులర్‌గా వార్తలు చదువుతాను. అందులోనూ ముఖ్యంగా స్పోర్టున్యూసు—ఈ రోజు పేపరు

చదువుతూంటే ఏదో తేడా వుందనిపించింది. లేవర్ క్వార్టర్ ఫైనల్ నెగ్గినట్లు గుర్తుంది. ఈ పేపర్లో ఫైనల్సు నెగ్గిన ట్లుంది. సెమీ ఫైనలు సంగతి ఏమయింది?

కాజువల్‌గా ఒకసారి పేపరుమీది తేదీ పరికించాను. ఒక్కసారి తెల్లబోయాను. అది రేపటి తేదీ!

ఇదెక్కడి ఆశ్చర్యం? రేపటి పేపరీరోజెలా గొస్తుంది?

నిన్నటి తేదీ 21 అని స్పష్టంగా గుర్తుంది నాకు. మరి ఈ రోజు 23 ఎలా అవుతుంది?

మరోసారి యథాలాపంగా అడిగినట్లుగా—పక్కనున్న ఆయన్నడిగాను — "ఈరోజు తారీఖెంతండీ?" అని.

"ఇరవై మూడు!" అన్నాడాయన.

"ఆఁ" అన్నాను. "ఆర్ యూ ష్యూర్—" అన్న మాట అప్రయత్నంగా నా నోటమ్మట వచ్చింది. నా పక్క నున్నాయన నా వంక అదో రకంగా చూసి—ఏం మాట్లాడ కుండా ఊరుకున్నాడు.

నా బుర్ర తీవ్రంగా పని చేస్తోంది. మానసికంగా నేను ఒక రోజు వెనకపడ్డాను. ఇది ఎలా జరిగింది?

నేను 21 వ తేదీ బయల్దేరి రోజీ డ్యాన్స్‌కు వెళ్లాను. అందులో సందేహమేమీలేదు. డ్యాన్స్ క్లబ్ నించి బస్సు స్టాండుకి వచ్చేసరికి—23 వ తేదీ వచ్చేసింది. అంటే అక్కడ నేను పూర్తిగా ఒకరోజు ఉన్నానన్నమాట—కానీ ఎలా?

ఒకే ఒక్క పాజిబులిటీ: అక్కడ నేను నిద్రపోయి వుండాలి.

నా ఆలోచనకు నేనే ఉలిక్కిపడ్డాను. అంత నిద్రనేనెలా పోయాను?

అసలు నిజంగా నేనంతసేపు నిద్రపోయానా?

నేను సుమారు 24 గం॥ నిద్రపోయాను. అందువల్లనే నాకు చాలా నీరసంగా వుంది. ఎక్కువసేపు నిద్రపోయిన అనుభూతి వుంది. కానీ అన్ని గంటలు నిద్రపోవడానికి కారణం—

పరాయి ఆడది నాకు కొత్తకాదు. తాగుడు కూడా మరీ అంతకొత్తకాదు. ఎప్పుడూ ఆ అనుభవాల అనంతరం ఇంత నిద్ర పట్టలేదు. ఈసారి పట్టిందంటే కారణం ఏదో ఉండి ఉండాలి!

హఠాత్తుగా నాకు అసలు విషయం గుర్తుకొచ్చింది. దాంతో మరే ఆలోచనాలేదు. నేను పొరబాటున ఒక కాగితం శ్రీమతికి పోస్టు చేశాను. అది ఆమెకు చేరేలోగా అందుకోవాలని 21 వ తేదీన బయల్దేరాను. ఈ రోజు 23 వ తేదీ అంటే ఆ ఉత్తరం ఆమెకు నిన్ననే అంది ఉండాలి! ఇప్పుడీ పరిస్థితులలో ఏం చేయాలి?

శ్రీమతిని ఎలాగో మభ్యపెట్టాలి!

ఏదో కథ రాస్తున్నాననీ పొరబాటున అది పోస్టుచేశాననీ చెప్పాలి. లేకపోతే కావాలనే సరదాకి పోస్టుచేశానని చెప్పాలి. అక్కడి పరిస్థితినిబట్టి చూడాలి. ఒకవేళ అదృష్టం బాగుంటే ఉత్తరం ఇంకా అంది ఉండకపోవచ్చు.

ఆలోచనలదారి ఆలోచనలదే బస్సుదారి బస్సుదే! కరెక్టు టైముకి నన్ను ఊరు చేర్చింది బస్సు. రిక్షాలో అత్తవారింటి దగ్గర దిగాను. "బావొచ్చాడేవ్?" అంటూ నా మరదలు లోపలకు పరుగుతీసింది. నేను బ్యాగుతో ఇంట్లో అడుగు పెట్టగానే నవ్వుతూ మా ఆవిడ కనిపించింది.

శ్రీమతి ప్రసన్నవదనం చూస్తూనే నా మనసు పరవశించింది. ఆమె ముఖంలో ఎక్కడా అనుమానం కానీ, కోపం కానీ కనబడలేదు.

నేను మరీ అంత కొ_త్త అల్లుడిని కాకపోయినా మా మావగారిల్లు పెద్దదికాబట్టి నాకు వెంటనే ఒక ప్రత్యేకమైన గది దొరుకుతుంది. శ్రీమతీ నేనూ ఆ గదిలో కూర్చుని కబుర్లాడుకుంటున్నాం. ఆమె ఎంతకూ ఉ_త్తరం ప్రస_క్తి తీసుకురాకపోవడంతో ఉండబట్టలేక నేనే అడిగేశాను.

"మొన్న నేనో ఉ_త్తరం రాశాను. అది నిన్న అంది ఉండాలే!"

"అందకనే అందింది" అంది శ్రీమతి చిలిపిగా.

నా గుండె ఆగినంతపనయింది, ఉ_త్తరం అందిందన్న మాట. అయితే శ్రీమతి చలించదే?

"ఉ_త్తరం చదివావా?" అన్నాను.

"మీ ఉ_త్తరం చదవకుండా ఉండగలనా? చదివాను—" అంది శ్రీమతి,

"మరి...." అని ఆగిపోయాను. ఏమని అడగాలో తెలియక.

"ఊఁ—మరి—" అంది శ్రీమతి చిలిపిగా.

"అబ్బే—ఏం లేదు మరి...." అంటూ మళ్ళీ ఆగి పోయాను.

శ్రీమతి నాకు కా_స్త దగ్గరగా జరిగి "మీ మాట నేను పూ_ర్తి చేస్తాను—మరి మీరు వచ్చేశారుగా ఇంక ఉ_త్తరం అవసరమేముంది?" అంటూ రెండు చేతులూ నా మెడ చుట్టూ వేసింది.

నాకేం అర్థంకావడంలేదు. అంతా మిస్టరీలా వుంది. నేను పొరబడ్డానా? శ్రీమతికి కరెక్టు ఉ_త్తరమే పోస్టుచేశానా? అయితే శ్యామలను చంపాలని వేసుకున్న కార్యక్రమం రాసిన కాగితం ఏమయింది? ఇంట్లోనే ఉందా? మరి శ్రీమతికి

రాసిన ఉత్తరం కాగితం నా జేబులో ఉండిపోయింది. శ్రీమతికి పోస్టుచేసిన కవర్లో ఏ కాగితం పెట్టాను? సందేహం లేదు. నా హత్యాకార్యక్రమ వివరాలు శ్రీమతికి పోస్టు చేశాను. మరి?

"ఈ రోజు తారీకెంత?"

"అదేం ప్రశ్నండీ—ఇరవై మూడు" అంది శ్రీమతి.

"మరి నిన్న...." నా ప్రశ్న నాకే అసందర్భంగా తోచింది.

"ఇరవై రెండు...." అని "ఉండండి కాస్త జీలకర్ర అల్లం తెస్తాను. మీకు కాస్త పైత్యం చేసినట్లుంది—" అంటూ లేచింది శ్రీమతి. నేనామెను వారించలేదు. "నిన్న ఇరవై ఒకటి కాదా" అన్నాను స్వగతాన్ని పైకి అన్నట్లుగా. అల్లం మరికాస్త ఎక్కువ తేవాలనుకుందో ఏమో శ్రీమతి పరుగెత్తింది.

శ్రీమతి అల్లం జీలకర్రతో తిరిగి వచ్చింది. బలవంతంగా నానోట్లో వేసింది. నేను అల్లం జీలకర్ర నములుతూ అడిగాను—"ఒకసారి ఆ ఉత్తరం తెస్తావా!"

"ఎందుకండీ ఆ వుత్తరం" అన్న ఆమె ముఖంలో కొద్దిగా కంగారు స్పష్టంగా చూడగలిగాను. ఆ కంగారెందుకో నాకర్థం కాలేదు. శ్రీమతి నెమ్మదిగా లేచి వెళ్ళిపోయింది. ఒక అరగంట అనంతరం వచ్చింది. "కవరు కనబడింది కానీ ఉత్తరం కనబడలేదండీ చాలా జాగ్రత్తగా దాచాను మరి" అంది.

ఆ కవరును చూశాను. ఎడ్రస్ నేను రాసిందే. దాని మీద మా వూరి స్టాంపు 21 వ తేదీ అని వుంది. సందేహం లేదు. ఈ కవర్లో నేనే నా ఉత్తరం పొరబాటున పెట్టాను.

అది శ్రీమతికి చేరింది. చదివానంటుంది. నా మీద విరుచుకు పడదు. అసలు ఉత్తరంలోని విశేషాలగురించి ఏమీ మాట్లాడదు. "ఏమైనా సరే ఆ ఉత్తరం కావాలి. వెతికి తీసుకురా" అన్నాను కాస్త కటువుగా.

శ్రీమతి ముఖంలో ఆదుర్దా కనబడింది. కళ్ళలో కొద్దిగా భయముంది. మారు మాటాడకుండా వెళ్ళి ఓ పది నిముషాలలో వచ్చింది. "అమ్మయ్యా దొరికింది. ఇదిగో" అంటూ నాకో ఉత్తరం ఇచ్చింది. ఆత్రుతగా అందుకుని చదివాను.

అది నేను రాసిన ఉత్తరమేకానీ మొన్న పోస్టు చేసినది మాత్రం కాదు! అంతక్రితం రాసింది. అందులో తనులేక నేను అనుభవిస్తున్న విరహం గురించి రాశాను. దురదృష్టం కొద్దీ తారీఖు వేయలేదు.

"ఇది కాదు నేను రాసిన ఉత్తరం!" అన్నాను.

శ్రీమతి విసుగ్గా ముఖంపెట్టి "మీరేం రాశారో నాకు తెలియదు. ఏం పోస్టు చేశారో తెలియదు. మీకేమయిందో కూడా నాకు తెలియదు. నాకు నిన్నవచ్చిన ఉత్తరంమాత్రం ఇదే" అంది కచ్చితంగా.

ఏమనాలో తెలియలేదు. ఆ ఉత్తరం కోసం ఎందుకు నొక్కిస్తున్నదీ చెప్పడమెలా? శ్రీమతి ఎందుకు అబద్ధమాడుతోంది? ఏమిటి ఇందులోని మిస్టరీ!

నా బుర్ర వేడెక్కిపోయింది. "మీ ఒంట్లో సరిగా ఉన్నట్లు లేదు. ఇక్కడో నాలుగు రోజులుండి విశ్రాంతి తీసుకోండి" అంది శ్రీమతి.

"అబ్బె వీల్లేదు. ఈ రోజే వెళ్ళిపోవాలి" అన్నాను. మళ్ళీ శ్రీమతి ముఖంలో కంగారు. కళ్ళలో అసంతృప్తి— "మీరు వెళ్ళడానికి వీల్లేదు. మిమ్మల్ని వెళ్ళనివ్వను."

అందామె. అని అక్కణ్నించి వెళ్ళిపోయింది. నేను తీవ్రాలో చనలో పడిపోయాను. ఒక గంటలో డాక్టరు వచ్చాడు నా దగ్గరకు. డాక్టరు వెనుకే మావగారు వచ్చారు.

"నాకేం కాలేదే నేను కులాసాగానే ఉన్నాను." అన్నాను కొంచెం చిరాగ్గా.

డాక్టరు మౌనంగా నా దగ్గరకు వచ్చి పరీక్ష చేశాడు. నాడి చూశాడు. స్టెతస్కోపు పెట్టి చూశాడు. నాలిక చూపించ మన్నాడు. కళ్ళు పరీక్ష చేశాడు. అన్నీ అయేక "కనీసం నాలుగు రోజులపాటు విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరం —" అన్నాడు.

"కానీ—నీకు విశ్రాంతి తీసుకోవాలని లేదు."

"అలాగనకూడదు నాయనా నేను, పెద్దవాడిని చెబుతున్నాను విను. సరిగ్గా నాలుగంటే నాలుగు రోజులుండి వెళ్ళిపోదువుగాని. మీ కాలేజీకి టెలిగ్రాం ఇప్పిస్తానులే—" అన్నారు మావగారు. నేనేం మాట్లాడలేదు.

మావగారు వయసులో మా నాన్నగారికంటే కూడా చాలా పెద్దవారు. ఆయనంటే నాకు భయమూ, గౌరవమూ వున్నాయి. ఇంతవరకూ ఆయన మాటను కాదనే ధైర్యం నాకు లేకపోయింది. డాక్టరూ, ఆయన వెళ్ళిపోయాక ఏమీ ఎరుగని నంగనాచిలా వచ్చిన నా భార్యమీద విరుచుకు పడ్డాను.

"మీరెన్నైనా అనండి పడతాను. కానీ మీరు నాల్గురోజు లిక్కడుండాలి. మీరు లేక నాకిక్కడేమీ తోచడంలేదు. ఓ వారం రోజుల్లో మా అక్క వస్తోంది. అది వచ్చేక దాన్ని చూసి మీ దగ్గరకు వచ్చేస్తాను. అంతవరకూ ఇక్కడ ఎలాగా గడపడం అనుకుంటూంటే ఆపద్బాంధవుడిలా

మీరు వచ్చారు. మిమ్మల్ని వెళ్ళనిస్తానా ఎలాగైనా ఆపేస్తాను." అంటూ శ్రీమతి దగ్గరగా వచ్చి ప్రేమగా నా చుట్టూ చేతులు వేసింది.

ఆమె మాటలకు, చేతలకు దాసోహం అనకుండా ఉండ లేక పోయాను.

5

నా మనసులో మెదుల్తున్న ఆలోచనలకు సమాధానం లభించలేదు. కానీ నాల్గురోజులు నాలా తొందరగా గడిచి పోయాయి. శ్రీమతి నాతో ఎన్నడూ ఎరుగనంత ఉత్సాహంగా ప్రవర్తించింది. శ్రీమతి నా ఉత్తరం చదివివుంటే కోపగించుకోవడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించి ఉంటుంది. ఆ ఉత్తరం తను చదవనట్లే నటించి తన ప్రవర్తన ద్వారా నా దృష్టి పరాయి ఆడవాళ్ళ మీదకు పోకుండా ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోందేమో!

నేను తిరుగు ప్రయాణమై నా ఊరు చేరాను, ఇల్లుచేరి తలుపు తాళం తీయబోతూండగా ఇంటి యజమానులు చాలా హడావుడిలో ఉన్నట్లనిపించింది. వాళ్ళ ఇల్లు చాలా సందడిగా వుంది. ఏమిటో తెలుసుకుందుకు వెళ్లాను. ఏమిటి నేను తెలుసుకున్నవార్త. అది సామాన్యమైనదికాదు. నేను చేద్దామనుకున్నపని. నేను చేయకుండానే జరిగిపోయింది. శ్యామల నిన్న ఆత్మహత్య చేసుకుంది. "తన మరణానికి ఎవరూ బాధ్యులుకారనీ జీవితం మీద విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకుంటున్నాననీ" ఒక కాగితం రాసిపెట్టి మరీ చనిపోయిందిట, రాత్రి పడుకునేదాకా బాగానే ఉందట. తెల్లారేసరికి జరగవలసినది జరిగిపోయింది.

నాకు మతిపోయినట్లయింది. నేను మనసులో అనుకున్న విషయం వాస్తవంలో ఎలా జరిగింది?

నేను ఇంట్లో అడుగుపెట్టాను. మతిస్థిమితం తప్పింది. నిరుత్సాహంగా మంచంమీద కూలబడ్డాను.

శ్యామల ఆత్మహత్య చేసుకోవలసిన అవసరమేమిటో నాకు తెలియదు. ఆమెకూ నాకూ మధ్య రహస్యాలేమీలేవు. అందుకే ఆమె ఆత్మహత్య ఒక మిస్టరీగా తోచసాగింది నాకు.

కాసేపు బద్ధకంగా పడుకున్నాక లేచి ఒకసారి పక్క దులిపివేసుకుందా మనుకున్నాను. దుప్పటితీసి దులిపేసరికి ఒక కాగితం మడత క్రిందపడింది. ఏమిటై ఉంటుందా అని తీశాను. నా ఉత్తరం కాదది.

"డియర్ రమణరావ్!

నాకు పదివేలు కావాలి. ఈరోజు సాయంత్రానికి అన్నీ పది రూపాయనోట్లు- సరిగ్గా పదివేలు. ఎక్కడివ్వాలో తెలుసుగదా!

శ్యామల."

ఒక్కసారి బుర్రలో వెయ్యి బాంబులు పేలాయి. మొదటనేనది- శ్యామలను హత్యచేయడానికి నేను వేసుకున్న పథకం- రాసిన కాగితమని ఆశపడ్డాను. అయితే అది రమణరావు ఉత్తరమని ఏమాత్రమూహించలేకపోయాను. మరి రమణరావుని శ్యామల బ్లాకుమెయిల్ చేస్తోందని తెలిసింది. అంతవరకూ బాగానే ఉంది కానీ ఈ ఉత్తరం నా మంచంమీదకు ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?

క్షణక్షణానికీ మిస్టరీ పెరిగిపోతోంది. ఇంతవరకూ శ్యామల ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. కానీ ఇప్పుడేవో అనుమానాలు నాలో కలగసాగాయి. శ్యామల రమణారావుని బ్లాక్ మెయిల్ చేస్తోంది. అంటే ఆమెకు

శత్రువున్నాడు. అందులోనూ రమణరావు సామాన్యుడు కాడు. బాగా డబ్బున్నవాడు. శ్యామలను హత్యచేయించడం అతనికి కష్టంకాదు.

ఈ ఉత్తరం శ్యామల, రమణరావుకు రాసింది. అది రమణరావుదగ్గర ఉండాలికానీ ఇక్కడెందుకుంది? అంటే అతగాడిక్కడికి వచ్చాడా?

ఎందుకు వస్తాడు? ఎలా వస్తాడు?

అయితే అతను 21 వ తేదీన క్లబ్బుకు తీసుకెళ్ళాడు. అక్కడ నేను పూర్తిగా 24 గంటలు నిద్రపోయాను. అందుకేదో ముఖ్యమైన కారణముండాలి.

ఆలోచిస్తూంటే రమణరావుకీ శ్యామల ఆత్మహత్యకీ ఏదో సంబంధ ముండాలనిపించింది, కానీ అదేమిటో నాకు సరిగ్గా తెలియలేదు.

6

మర్నాడు పనిమనిషిద్వారా నాకు మరో ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. నా తమ్ముడు ఇక్కడ ఈ ఇంట్లో నేను లేనప్పుడు వచ్చి రెండ్రోజులున్నాడుట. వాడెందుకు వచ్చాడో అడిగి తెలుసుకోవాలనుకున్నాను కానీ పనిమనిషి కేం తెలుస్తుందిలే అని ఊరుకున్నాను.

అయితే వాడిక్కడికి వచ్చాడు. ఎందుకు వచ్చేడు? ఇంటి తాళం ఎక్కడిది వాడికి!

ఒక తాళంచెవి నాదగ్గరుంది. రెండోది మా శ్రీమతి దగ్గరుంది. నా తాళం నా దగ్గర జాగ్రత్తగానే ఉంది. తమ్ముడికి తాళం శ్రీమతి దగ్గరే దొరికివుండాలి. అయితే శ్రీమతి తమ్ముడికి తాళం ఇచ్చి ఉండాలి. అయితే ఆ సంగతి నాకెందుకు చెప్పలేదు? అందులో దాచవలసినదేముంది? వాడికేదో పనివుండి ఈ ఊరు రాదల్చుకుంటే,...

నేనూళ్ళో లేనప్పుడే వాడిక్కడికి వచ్చాడు. శ్యామల ఆత్మహత్య వాడిక్కడుండగానే చేసుకుంది. ఆ తర్వాత వాడు ఇక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

బాగా ఆలోచిస్తూంటే తమ్ముడికీ, ఆ ఉత్తరానికీ, శ్రీమతికీ, తాళంచెవికీ, శ్యామల ఆత్మహత్యకీ సంబంధ ముందనిపించ సాగింది. ఇంకా ఆలోచించేసరికి ఒక్క టనిపించింది. శ్యామల దుష్టస్వభావం గురించి శ్రీమతికి తెలిసి, తమ్ముణ్ణి పిలిపించి, బాగా బుద్ధిచెప్పి, నేనువేసిన పథకం ప్రకారం ఆమెను హత్యచేయవలసిందిగా తమ్ముడికి చెప్పిందేమో!

అయితే ఆ హత్య నేను చేయబోతున్నానని తెలిసికూడా శ్రీమతి తమ్ముణ్ణెందుకు పురికొల్పింది?

ఉత్తరం పొరబాటున పోస్టుచేసిన సంగతి గుర్తెరిగి నేనిక్కడికి వస్తానని ఆమె గ్రహించి ఉండాలి. ఆ సమ యంలో నన్నక్కడ ఆపి- తమ్ముణ్ణిక్కడికి పంపించి శ్యామలను హత్య చేయించింది. ఎందుకంటే తన భర్త హత్యకేసులో ఇరుక్కునే ప్రమాదంలేకుండా చేయాలన్నది ఆమె సంకల్పం! కాని ఎందుకో నాకు తృప్తి కలగటం లేదు.

మర్నాడు శ్రీమతికో ఉత్తరం రాసి పోస్టుచేశాను. ఆ మర్నాడు రాత్రికి వాళ్ళ ఊరువెళ్ళాను. ఈసారి నన్ను చూసి శ్రీమతి చాలా ఆశ్చర్యపోయింది. మా కిద్దరికీ ఏకాంతం లభించగానే ఆమెను ముద్దులతో నింపేశాను. నిజంగానే నాకు కసిగా ఉంది. అయితే....

నా కళ్ళకు ఆమె జాకెట్లోంచి ఏదో ఉత్తరం కనబడింది. అదేమిటని అడిగాను. ఆ కవరుతీసి నా కందించి, "మీర్ధు

రాసిన ఉత్తరమే!" అంది శ్రీమతి. ఇంకా కవరైనా చింపలేదు.

"ఇంకా చదవలేదా?"

"చదవడంకంటె గుండెల్లో పదిలపరుచుకోవడమే నాకు ఆనందం" అంది శ్రీమతి తడుముకోకుండా.

నా ఆలోచనలు వేరే పోతున్నాయి. శ్యామల కూడా భర్త ఉత్తరాలు వెంటనే చదవదు. విసుగని నాతో అంటుంది. ఆమె ఉత్తరం ఆమెకంటె ముందుగా నేనే చదివాను. అదే ఆమె కొంపముంచింది. అలాగే- శ్రీమతి కూడా....

నేనేదో పథకం వేసుకువస్తే, హఠాత్తుగా నా ఆలోచనలు మరోదారి తొక్కాయి. మర్నాడు మావగారిల్లు బాగా సర్వే చేశాను. శ్రీమతి పడకగది నానుకునే ఒక కొట్టు గది ఉంది. ఆ గది నానుకుని మరోగది ఉంది. ఆ గది ముఖ ద్వారం ఒక సందులోకి ఉంది. ఎవరైనా అందులో ఇండి పెండెంటుగా ఉండవచ్చు. అందులో ఒకతను అద్దెకుంటు న్నాడు. అద్దె ఠంచనుగా ఇచ్చేస్తాడు. కానీ నెలలో అన్ని రోజులూ ఇక్కడుండడు. అతను వ్యాపారస్థుడు. పేరు రమణరావు.

7

రమణరావు ఆఫీసులో ఎంక్వైరీ చేశాక అతను అప్పు డప్పుడు నా శ్రీమతి ఊరిలో మా మామగారింట్లో ఉంటూం టాడని తెలిసింది. ఇప్పుడు నాకు అన్నీ తెలిసిపోయాయి.

రమణరావుకీ నా భార్యకు సంబంధముంది. నేను శ్యామ లను కలుసుకుంటున్నట్లే వాడు శ్రీమతిని కలుసుకుంటు న్నాడు. శ్యామల చదవని ఉత్తరం నేను చదవగలిగిన రీతి

లోనే రమణరావు నా ఉత్తరం చదివాడు.

21 వ తేదీ నా భార్యదగ్గరకు పోవాలని వాడికి మన సయింది. లేదా శ్రీమతే కబురుపెట్టి వుంటుంది. నేనిక్క డుంటున్నానో, లేనో తెలుసుకుని రోజీ డ్యాన్సులో నన్నిరికించి, నా భార్యదగ్గరకు పోవాలనుకున్నాడు. విజయ వంతంగా వాడి పథకం నెరవేరింది.

అయితే అనుకోకుండా వాడికి నా ఉత్తరం దొరికింది. వాణ్ణి శ్యామల బ్లాకుమెయిల్ చేస్తోంది. వాడు ఈ ఉత్తరం సహాయంతో తమ్ముణ్ణి కలుసుకున్నాడు. శ్రీమతి దగ్గర తాళం తీసుకున్నాడు. శ్యామల దొరికేలా చేస్తానని తమ్ముణ్ణి మభ్యపెట్టి రెండ్రోజులపాటు ఏంచేయాలో వాడికి చెప్పాడు. పాలలో విషం తనే కలిపి ఉంటాడు. నాల్రోజులపాటు నన్నిక్కడ ఆపమని శ్రీమతిని కోరి ఉంటాడు. శ్యామల వ్రాసిన వుత్తరం పొరబాటున నా గదిలో పడిపోయి వుంటుంది. దాని విషయం అతడు మర్చిపోయి ఉంటాడు.

ఆరోజు క్లబ్‌లో 24 గంటలు నిద్రపోయేలా నన్ను చేసిన రమణరావు- శ్రీమతికి నేను రాబోతున్న విషయం చెప్పి ఉండాలి. అందుకే ఆమె అప్పుడు ఆశ్చర్యపడలేదు.

శ్యామల హత్యకేసు ఇప్పుడు పువ్వులా విడిపోయింది. కానీ ఇందులో ఏమీ నేను పైకి చెప్పలేను. నా పరువుకి సంబంధించిన విషయాలు చాలా ఉన్నాయి. మావగారంటే నాకు చాలా భయం. ఆయన తన పలుకుబడితో ఏమైనా సాధించగలడు. హత్యకేసు ఋజువుకాదు సరిగదా- నన్ను పిచ్చివాడని ఋజువుచేస్తాడు.

నా భార్య ఉత్తమ ఇల్లాలనీ, ఆమెను పాడుచేయ బోతోందనీ భావించి, శ్యామలను హత్యచేయాలనుకున్నాను. అన్నీ తెలిసే నా భార్యనేమీ చేయలేకపోతున్నాను.

ఇప్పుడు బాధపడడం అనవసరం. నాది తప్పుడు ప్రవర్తన అయినప్పుడు శ్రీమతిని నేను వేలెత్తి ఎలా చూపించగలను? నేను పొరబాటుగా ఇంతకాలం ప్రవర్తించాను. అదిప్పుడు దిద్దుకుని శ్రీమతి పొరబాటు కూడా దిద్దాలి.

అంతేకాదు- శ్యామల హత్యగురించి నాదగ్గర ఉన్న ఆధారాలతో ఈ కథంతా ఊహించాను. నా ఊహ నిజమన్న నమ్మకం నాకుంది. కానీ ఋజువుచేయడానికి ప్రయత్నించడం లేదు. అందుకు కేవలం భయమొక్కటే కారణంకాదు. నా ఊహ పొరబాటేమోనన్న భ్రాంతి కనీసం కొంత మనశ్శాంతైనా లభిస్తుంది.

ఆ తర్వాత ఒంటరిగా శ్రీమతిని పుట్టింటికి పంపించే పొరపాటు మాత్రం చేయలేదు నేను.

***

రమేష్ : ఒరేయ్! ఎందుకురా మీ వాడు యిందాకటినుండి నీళ్ళు త్రాగుతున్నాడు?

సురేష్ : మా వాడు బలానికి మందు త్రాగుతున్నాడు. ఆ మందును నాల్గురెట్లు నీళ్ళలో కలిపి త్రాగాలట. ఆ సంగతి మర్చిపోయి మా వాడు ఉత్తమందునే తాగివేశాడు. అందుకని ఇప్పుడు ఆ మందుకు నాలుగు రెట్లు నీళ్ళు త్రాగుతున్నాడు.

—యం. వెంకటేశం, తాడేపాకలాన్.

కొండమీది రాక్షసుడు!

శ్యాంబాబు

జనమేజయుడి గురించి ఆ ప్రాంతాలలో తెలియనివాళ్ళు లేరు. తెలిసినవాళ్ళందరూ అతన్ని 'కొండమీది రాక్షసుడు'గా రిఫర్ చేస్తుంటారు. దశాబ్దం క్రితం ఆంధ్ర రాజధాని మంత్రిత్వశాఖల పరిసర ప్రాంతాల్లోనూ, ప్రస్తుతం అరకువేలీ చుట్టుప్రక్కల ఊళ్ళలోనూ జనమేజయుడు జనమెరిగిన వ్యక్తి. 'సైకో ఎనాలిసిస్ ఆఫ్ క్రిమినల్స్'గురించి ఆంధ్రా యూనివర్శిటీ సైకాలజీ శాఖలో వుపన్యాసమివ్వడానికి సిన్హాగారు విశాఖపట్నం రాకుండా వుంటే జనమేజయుడి గురించి చెప్పుకొనే అవకాశం వచ్చేది కాదు నాకు.

ఆ రోజు ఉదయమే హోటల్ అప్సరా నూటపన్నెండో గదిలో, రాత్రి చూసిన మిస్ జాంజిబార్ నృత్యం తాలూకు టెక్నికలర్ కలను, సిన్హాగారి ఎర్లీ ఫోన్‌కాల్—స్వర్గంలో జోరీగలా చెడగొట్టింది.

"మేకప్ మైబాయ్! జనమేజయుడు చచ్చిపోయాడు!" సిన్హాగారి కంఠం మేలుకొలుపు పాడింది.

ఉదయమే శవాలన్నా, శృంగారమన్నా గొప్ప ఎలర్జి నాకు. 'ఆ చచ్చిపోయిన జనమేజయుడు కాస్సేపాగి చస్తే లోకానికి వచ్చిన నష్టమేమిటో' అనుకొన్నాను.

"అయిదు నిముషాల్లో వస్తున్నాను సార్!" అన్నాను ఉత్సాహాన్ని మాటల్లో పిచికారీ కొడుతూ.

"గుడ్! ఐ విల్‌బి ఇన్ ది డైనింగ్ రూమ్!" అన్నారు సిన్హాగారు ఫోన్ పెట్టేస్తూ.

అయిదు నిముషాలకు అరసెకను ముందుగానే డైనింగ్ హాల్లో అడుగుపెట్టాను పూర్తిగా డ్రెసప్పయి. అప్పటికే సిన్హాగారు బ్రేక్‌ఫాస్ట్ ముగించి మార్నింగ్ పేపరు తిరగేస్తున్నారు. భారీ పర్సెనాలిటీ, దట్టమైన కనుబొమ్మలు, వాటి క్రింద దీపాల్లా వెలుగుతోన్న ఎక్సరే కళ్ళు, సూదైన ముక్కు, బిస్మార్కు మీసం, బిగించిన పెదిమల మధ్య రావణాసురుడి కాష్టంలా కాలుతోన్న 'మొరాకో' చుట్ట.

"జనమేజయుడు ఎవరు?" అడిగాను సరాసరి బాయిల్డ్ ఎగ్స్‌మీద దాడి ప్రారంభిస్తూ.

సిన్హాగారు మొరాకోను నోట్లోంచి తీసి ఆష్‌ట్రేలో నుసి దులిపారు? "జనమేజయుడు స్వాతంత్ర్య పోరాటంలో గాంధిగారి శిష్యుడు....అనేకసార్లు లాఠీ దెబ్బలు తిని, జైలు కెళ్ళిన ప్రముఖుల్లో ఒకడు. స్వాతంత్ర్యం వచ్చాక జనమేజయుడిలో పరివర్తన కలిగింది. స్వాతంత్రోద్యమంలో తను పడిన కష్టాలకు ప్రతిఫలం అతను స్వాతంత్ర్యం వచ్చాక పొందడం ప్రారంభించాడు. తన పలుకుబడితో, పరిచయాల్తో, మెటర్నటీ లీవు దగ్గర్నుండి

మందు పర్మిట్లవరకూ ఏది కావాలంటే అది ప్రజలకు అంద జేస్తూ వారి ఫలంలో తనో ఫలం పుచ్చుకొంటూ లక్షలు సంపాయించాడు" చెప్పడం ఆపి, సిన్హాగారు మొరాకో మేఘాలు సృష్టించడం ప్రారంభించారు.

నేను బాయిల్డ్ ఎగ్స్ పూర్తిచేసి, బ్రెడ్ స్లయిసెస్‌కి ఫ్రూట్ జామ్ దట్టంగా పట్టించసాగాను.

సిన్హాగారు తను సృష్టించిన మేఘాలవైపు కాసేపు తదే కంగా చూసి, వర్షం కురిసే సూచనలేవీ కనిపించక పోవ డంతో, మళ్ళీ జనమేజయుడి గురించి చెప్పడం మొదలు పెట్టారు.

"తన వృత్తి యధేచ్ఛగా కొనసాగివుంటే ఈరోజు జనమేజయుడు ఎంత సంపాయించి వుండేవాడో చెప్పలేము గానీ, పదేళ్ళక్రితం హఠాత్తుగా పక్షవాతం వచ్చి రెండు కాళ్లూ చచ్చుబడి పోయేనాటికి అతను దాదాపు పదిలక్షలు సంపాయించాడని వినికిడి. తిరిగే కాళ్ళు పోయాక తను సంపాయించగలిగే దేమీలేదనీ, వున్నా పిల్లాపాప లేని తనకు ఇప్పటికి వున్నది చాలనీ నిశ్చయించుకొని, ఓ శుభ ముహూర్తాన అరకులోయకు దగ్గర్లో వున్న తన స్వగ్రామ మైన సన్యాసి పాలానికి మకాం మార్చేశాడు జనమే జయుడు.

సన్యాసిపాలేనికి వచ్చిన క్రొత్తల్లోనే దగ్గర్లోవున్న చిన్న కొండగుట్ట నొకదాన్ని అతి చవగ్గా గవర్నమెంటు దగ్గర్నుండి కొనేసి,దానిపైన పెద్ద ద్రాక్ష్యలా భవంతిలాంటిది ఒకటి కట్టించుకొని అందులో మకాం పెట్టాడు జనమే జయుడు. సాధారణంగా ఆ చుట్టుప్రక్కల పల్లెప్రజల్ని ఆ భవంతి దగ్గరకు రానిచ్చేవాడు కాదు. ఎవరైనా వెళ్ళినా

జనమేజయుడి నౌకర్లు వాళ్ళను తరిమివేసేవాళ్ళు.... అందు మూలంగా జనమంతా అతన్ని 'కొండమీది రాక్షసుడు' అని పిలుస్తూ వుంటారు.

ఉన్నట్లుండి ఈ ఉదయం గొప్ప ట్రాజెడీ జరిగి పోయింది.... ఉదయమే చల్లగాలిలో వెచ్చబడడానికి బయటి కొచ్చిన జనమేజయుడు కొండమీదినుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.... నిజమేమైనా అలా అని అతని నౌకరు, అతన్ని చక్రాల బండిలో బయటికి తెచ్చిన అతని మేనల్లుడు చెపుతున్నారు. కాని స్థానిక ఇన్‌స్పెక్టర్‌కు అది హత్యేమోనని అనుమానం కలిగి ఇక్కడి యస్. పి. కి ఫోన్‌చేస్తే, యస్. పి. మనం ఇక్కడున్నట్లు తెలిసి మనల్ని వెంటరమ్మని రిక్వెస్ట్ చేశాడు. మరి కొద్దిక్షణాల్లో పోలీసు జీప్ మనకోసం రావచ్చు" అన్నారు విషయాన్ని పూర్తిచేస్తూ.

సిన్హాగారు జనమేజయుడి కథ ముగిస్తూ వుండగానే పోలీస్ సూపరిండెంటు శరీరం గ్లాస్ డోర్ త్రోసుకొంటూ లోపలికి వచ్చింది. నేను కాఫీ ముగించి లేచి నిలబడ్డాను.

2

జనమేజయుడి శవం పడివున్న చోటుకు దాదాపు వంద గజాల దూరంలో పోలీసుజీపు ఆగింది. అక్కడినుండి పెద్ద పెద్ద రాతి బండల్ని, తుప్పల్ని, దాటుకుంటూ శవం పడి వున్న చోటుకు నడిచాము. చిన్న కొండగుట్ట అది. గుట్టకు ఒకవైపున ఎవరో పనిగట్టుకొని నిటారుగా చెక్కినట్లు గోడలా వుంది. తలెత్తి చూస్తే దాదాపు వంద అడుగుల ఎత్తునగాని కొండ పై అంచు కనిపించడంలేదు.

అంతకు ముందు రాత్రి వర్షం పడటంవలన బురదగా

లేకపోయినా, నేలంతా తడిగా, చిత్తడిగా వుంది.

జనమేజయుడి శవం ఓ ప్రక్కగా పడివుంది. తల ఒక వైపు నుజ్జవడంవలన రక్తం మడుగులా కారి తలచుట్టు రాతి నేలలో ఇంకిపోయి గడ్డకట్టింది. వేసుకున్న ఉన్నిప్యాంటు పడినవైపు బురదమరకల్తో వుంది. పాదాలకు ఉలెన్ మేజోళ్ళు వున్నాయి. పైన తెల్ల షర్టు, దానిమీద ఉన్ని చలి కోటు వున్నాయి. మెడచుట్టూ మఫ్లరు వుంది. చేతులకు తెల్లటి ఉన్ని గ్లవ్స్ వున్నాయి.

అరకులోయను 'ఆంధ్రా ఊటీ' అంటారు. వేసవి కాలంలోనే ఎంతో చల్లగా వుంటుంది. ఇక వర్షాకాలం లోనూ, చలికాలంలోనూ శీతోష్ణస్థితి సంగతి చెప్పనవసరం లేదు. విపరీతమైన చలి, జనమేజయుడు ఒళ్ళంతా ఉన్ని వస్త్రాలతో కప్పుకొన్నాడంటే ఆశ్చర్యం లేదు.

నేలను తాకీ తాకగానే మరణం సంభవించి వుండాలి. కనీసం కాలుకూడా కదిపి వుండడు.

శవానికి కాస్త ప్రక్కగా చక్రాలబండి వంకరతిరిగిపడి వుంది. ఓ చక్రం వంగిపోయి అదీ ఓ శవంలా వుంది.

చల్లటిగాలి సోకి నాకు వంట్లోంచి వణుకుపుడుతోంది. కోటు వేసుకోకుండా వచ్చినందుకు చింతించి ప్రయోజనం లేదిప్పుడు.

పోలీస్ ఫొటోగ్రాఫరు తన పని చకచకా చేసుకు పోతున్నాడు. "వాట్ డు యు సే సిన్హాజీ?" అడిగాడు యస్. పి.

సిన్హాగారు మొరాకోను పొదల్లోకి విసిరేసి, "పైకి వెళదాం పదండి" అన్నారు.

కొండపైకి వెళ్ళేదారి అవతలివైపునుండి వుంది. జీపు

వెళ్ళడానికి సరిపడా రోడ్డు వున్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

పైకివెళ్ళే రోడ్డు దాదాపు పదడుగుల వెడల్పుంది. రోడ్డు ప్రారంభంలో ఇనుపగేటు బార్లా తెరిచివుంది. 'వే టు సన్‌షైన్ బంగళో' అనే నల్లని అక్షరాలు తెల్లని బోర్డుమీద వ్రాసివున్నాయి. ఎవరో గొడ్లు కాసుకొనే కుర్రాడు కాబోలు బొగ్గుతో వంకరటింకరగా 'రాక్షసుడి కొంపకుదారి' అని తెలుగులో ఆ బోర్డుమీదే వ్రాశాడు. అయిదునిముషాల్లో జీపు చిన్న వంపుతిరిగి ఓ పెద్ద బంగళాముందు ఆగింది.

కొండ క్రిందనుండి చూస్తే తెలియడం లేదుగాని, జనమేజయుడి బంగళా చాలా అందంగా వుంది. కొండపైన 'టాప్ సాయిల్' దట్టంగా వుండివుండాలి. అక్కడక్కడా చిన్నచిన్న చెట్లు, బంగళాముందు చిన్న లాన్, పూల మొక్కలు వున్నాయి.

బంగళాముందు వరెండాలో నలుగురయిదుగురు మగ వాళ్ళు, ఓ నడివయస్సు ఆడమనిషి నిలబడి వున్నారు. మేం జీపుదిగి వరండాలోకి వెళ్ళాము.

ఇనస్పెక్టర్ అక్కడున్న వాళ్ళందరినీ మాకు పరిచయం చేశాడు. నల్ల ఉలెన్‌సూట్‌లో దర్జాగా కనిపిస్తున్న మనిషి జనమేజయుడి మేనల్లుడు. అతనిపేరు పరీక్షిత్తు. చీర కొంగంతా తడిసిపోయేట్లు ఏడుస్తోన్న ఆ ఆడమనిషి జనమే జయుడి చెల్లెలు, పరీక్షిత్తుకు తల్లి. వీళ్ళిద్దరూ రెండ్రోజుల క్రితమే జనమేజయుడ్ని చూసి పోదామని వచ్చారు.

ఇక మిగిలిన నలుగురు మగవాళ్ళలో ఒకడు వంట మనిషి. మరొకడు తోటమాలి. మిగిలిన ఇద్దరూ ఇంటి నౌకర్లు. అందరి ముఖాలూ విచారంగానూ, విచారంగా వుండడానికి ప్రయత్నిస్తున్నట్లుగాను కనిపిస్తోన్నయ్.

మేమందరం వరండాలోని సోఫాల్లో కూర్చున్నాం. నౌకర్లందరూ అలా నిలబడే వున్నారు. వాళ్ళతోబాటు ఇన్స్పెక్టరు, కానిస్టేబిలూ కూడా నిలబడ్డారు.

"మిస్టర్ పరీక్షిత్తూ! జనమేజయుడుగారి మరణానికి మాకూ చాలా విచారంగా వుంది. కాని ఇలాంటి విషయాలు జరిగినప్పుడు పోలీస్ ఫార్మాలిటీస్ తప్పవు. అన్యధా భావించక జరిగిన విషయం చెపుతారా?" అడిగాడు యస్. పి.

పరీక్షిత్తు నల్లమందు తిన్న మనిషికి మల్లే నిముషం పాటు శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు. ఫుల్ సూట్లో ఎంత గంభీరంగా కనిపిస్తున్నా అతని వయసు పాతికకు మించి వుండదని మనసులోనే అంచనా వేశాను.

"ఉదయం ఏడుగంటలకు ప్రతిరోజూ తోటలో తూర్పు వైపు ఓ అరగంటసేపు ఎండలో కూర్చోవడం అలవాటు మామయ్యకు. అలా చేయడం ఆయన ఆరోగ్యానికి మంచి దని డాక్టర్లు చెప్పారు. మామూలుగా సింహాచలం.... అంటే మామయ్య నౌఖరు రోజూ ఆయన్ను చక్రాల బండిలో కూర్చోపెట్టి బయటకు తీసుకెళ్ళేవాడు. నేను వచ్చిన రెండ్రోజులనుండీ నేనే ప్రతి ఉదయం స్వయంగా మామయ్యను వీల్ చైర్లో కూర్చోపెట్టి తోటలోకి తీసుకు వెళుతున్నాను.

ఈరోజు ఉదయం కూడా మామూలుగా మామయ్యను తోటలోకి తీసుకువెళ్లాను."

"తోట ఎక్కడుంది?" సిన్హాగారి ప్రశ్న వరెండాలో ప్రతిధ్వనించింది.

"తోట అంటే పెద్దపెద్ద చెట్లు అలాంటిదేమీ కాదు.

చిన్న గార్డెన్. ఇంటికి వెనకవైపు వుంది. అక్కడ రావి చెట్టు మొదలుదగ్గర వీల్‌చైర్లో కూర్చొంటే, ఉదయపు ఎండ తిన్నగా ఆయనమీద పడేది. అక్కడ ఓ అరగంట కూర్చొని దిగువ లోయలోకి చూస్తూ ప్రకృతి దృశ్యాన్ని ఆనందిస్తూ గడిపేవారు. రోజూలానే ఈ రోజూ నేను ఆయన్ను వీల్‌చైర్లో తీసుకెళ్ళి రావిచెట్టుక్రింద ఆపాను. ఆపగానే ఉదయం మాత్రలు వేసుకోవడం మరిచిపోయాననీ వెళ్ళి తీసుకురమ్మని అన్నారు. నేను వెనక్కు తిరిగి నాలు గడుగులు వేశానో లేదో నావెనక అలికిడయినట్లయి వెనక్కు తిరిగాను. అప్పటికే మామయ్య వీల్‌చైర్ చక్రాలను చేతులతో గిరగిర త్రిప్పుతూ కొండచివరికి వెళ్ళిపోతున్నారు. నేను పెద్దగా కేకపెట్టి రెండడుగులు వేసేటప్పటికే ఆయన కుర్చీతోపాటు కొండ అంచుమీదనుండి క్రిందకు పడి పోయారు" పరీక్షిత్తు చెప్పడం ఆపి రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొన్నాడు.

"అవును బాబూ! బాబుగారి బండిచక్రాలు చేతుల్తో గిర్రున త్రిప్పుకొంటూ కొండ అంచుకెళ్ళిపోవడం నేనూ చూశాను. సూత్తూండగానే అమాంతం క్రిందకి పడి పోయారు. వంటగది కిటికీలోనుండి నాకంతా కనిపిత్తానే వుంది" అన్నాడు వంటవాడు పరీక్షిత్తు చెప్పడం ఆపగానే.

"అంటే మీరు చెపుతున్న దాన్నిబట్టి ఆయన తనంతట తనే చక్రాలబండి నడుపుకొంటూ కొండ అంచు కెళ్ళా డంటారు. అలా ఆత్మహత్య చేసుకోవలసిన అవుసరం ఆయనకేమొచ్చింది?" అన్నాడు యస్. పి.

"అదే మా కెవురికీ అర్థంకావడం లేదు బాబూ...." అన్నాడు నౌకరు సింహాచలం.

"జనమేజయుడికి వారసులెవరు?" అడిగారు సిన్హాగారు మొరాకో తీసి వెలిగిస్తూ.

"నేనే! మామయ్యా! పెళ్ళిచేసుకోలేదనే విషయం మీకు తెలిసి వుండాలి!"—అన్నాడు పరీక్షిత్తు ఇబ్బందిగా ఫీలవుతూ.

సిన్హాగారు లేచి నిలబడ్డారు...." లెటజ్ గోటుది గార్డెన్! జనమేజయుడు క్రిందకు పడిపోయిన ప్రదేశాన్ని ఓసారి చూద్దాము"—అన్నారు.

అందరం బంగళా నుండి బయటికి వచ్చాము. కుడి ప్రక్కనుండి బంగళా వెనక తోటవైపు నడిచాము.

ఇన్‌స్పెక్టర్ మా ముందు దారి తీశాడు.

అంతకు ముందు రాత్రి వర్షం పడడం వలన తోటనేల కాస్త బురదగా వుంది. వీల్‌చైర్ చక్రాల గుర్తులు, వాటి మధ్య పరీక్షిత్తు బూటు గుర్తులు కనిపిస్తోన్నయ్....చక్రాల గుర్తులు రావిచెట్టు మొదలుకు వెళ్ళి ఆగిపోయాయి.... అక్కడినుండి పరీక్షిత్తు వెనక్కి తిరిగినట్లు బూట్లు గుర్తులు చెపుతున్నాయి.

రావిచెట్టు మొదలునుండి కొండ అంచువైపుకు కాస్త పల్లంగా వుంది. అక్కడినుండి కొండ అంచువరకూ ఎర్రగా వున్న తడిమట్టిలో వీల్‌చైర్ గుర్తులు స్పష్టంగా కనిపిస్తోన్నాయి. వీల్‌చైర్ చక్రాల గుర్తులతోపాటు వేరే అడుగుజాడ లేమీ లేవు.

వీల్‌చైర్ చక్రాల గుర్తులకు వెడంగా నడుస్తూ కొండ అంచుకు నడిచాము. క్రింద దూరంగా కనిపిస్తోన్న ప్రకృతి దృశ్యం అద్భుతంగా వుంది. అంచేతే జనమేజయుడు రోజూ ఆ చెట్టుక్రిందకు వస్తూ వుండివుండాలి. అంచు

క్రిందకు చూస్తే కళ్ళు తిరిగేట్లున్నాయి. దూరంగా అంబులెన్స్ రావడం కనిపిస్తోంది.

"ఈ వీల్ చైర్ గుర్తులు రావిచెట్టు దగ్గర అడుగుజాడలు చూస్తోంటే, పరీక్షిత్తు కథనానికి సరిపోయినట్లే వున్నాయి" అన్నాడు యస్. పి.

బలంగా మట్టిలో పడిన చక్రాల గుర్తులవైపు చూస్తున్న సిన్హాగారు చిత్రంగా నవ్వారు. పరీక్షిత్తువైపు చూశారు.

"అబ్బాయ్! అంత ప్రమాదకరంగా వుండే కొండ అంచున గోడ కట్టకుండా ఎందుకలా ఖాళీగా వదిలేశాడు?" అడిగారు.

"మామయ్య ఓ రకంగా కొత్త చాదస్తం మనిషనే చెప్పాలి. అనేకసార్లు ఆవైపు గోడకట్టించమని మామయ్యకు చెప్పాను. కాని ఆయన వినలేదు. రావిచెట్టుదగ్గర వీల్ చైర్లో కూర్చొంటే క్రిందలోయ సౌందర్యాన్ని అడ్డులేకుండా చూడాలని ఆయన ఉద్దేశ్యం" అన్నాడు పరీక్షిత్తు.

"జనమేజయుడు పడిపోవడం వంటవాడు చూశానన్నాడు. ఆ కిటికీ ఎక్కడ?" అడిగారు సిన్హాగారు.

అనవసరపు ప్రశ్నలనిపిస్తోంది నాకు. పక్షవాతం వచ్చి మూలన పడుండే ముసలాళ్ళకు ఏ క్షణాన ఏం మాయదారి ఆలోచన వస్తుందో చెప్పలేం. కంటికి కనిపిస్తున్న సాక్ష్యాన్ని బట్టి పరీక్షిత్తు చెప్పింది నిజమనీ, జనమేజయుడు తనంతట తను క్రిందకు దూకి చచ్చాడనీ నిశ్చయంగా తేలుతోంది.

పరీక్షిత్తు కొస్త దూరంగా కనిపిస్తోన్న పెంకుటింటి వైపు చూపాడు. పైన చిమ్నీలోనుండి వస్తోన్న పొగనుబట్టి అది వంటిల్లుగా అర్థంచేసుకోవచ్చు. వంటిల్లు కిటికీ మేము నిలబడ్డ చోటుకు స్పష్టంగా కనిపిస్తోంది. వంటవాడు

చెప్పింది నిజమే అయ్యుండాలి.

"నో డౌట్! దిస్ జె క్లియర్ కేస్! కట్ అండ్ డ్రైడ్!" అన్నాడు యస్. పి.

"యస్! యు ఆర్ రైట్!'' అన్నాను నేను.

సిన్హాగారు పరీక్షిత్తువైపు నవ్వుతూ చూశారు. "పరీక్షిత్తూ! భారతంలో పరీక్షిత్తు సముద్రంమధ్య ఒంటిస్థంభం మేడ కట్టుకొన్నా తక్షకుడి కాటునుండి తప్పించుకోలేక పోయాడు" అన్నారు.

పరీక్షిత్తు కంగారుగా చూశాడు. ''ఇన్స్పెక్టర్! ఆంబులెన్స్‌ను మేము వచ్చేవరకూ ఆపమను'' అన్నారు సిన్హాగారు, జీప్‌వైపు అడుగులువేస్తూ.

ఇన్స్పెక్టర్ కొండ అంచుకు వెళ్ళి విజిల్‌వూది ఆంబులెన్స్‌ను ఆగమని సంజ్ఞలు చేశాడు. జీపులో రెండు నిముషాల్లో ఆంబులెన్స్ దగ్గరికి చేరుకొన్నాం.

సిన్హాగారు పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ వెళ్ళి ఆంబులెన్స్ తలుపులు తెరిచారు. స్ట్రెచ్చర్‌మీద జనమేజయుడి శవం గుడ్డ కప్పబడివుంది. గుడ్డ పూర్తిగా తొలగించి శవం వైపు తదేకంగా నిముషంపాటు చూశారు. తర్వాత గబగబ నడుచుకొంటూ క్రింద వంకరతిరిగి పడివున్న వీల్‌చైర్ దగ్గరికి వెళ్ళారు.

నేనూ, సూపర్నెంటు విషయం అర్థంకాక ముఖాలు చూసుకొంటూ నిలబడ్డాం. సిన్హాగారు నవ్వుతూ మా ముందుకొచ్చి నిలబడ్డారు. "యస్. పి. భాయ్! జనమేజయుడు ఆత్మహత్య చేసుకోలేదు. పరీక్షిత్తు అతణ్ణి హత్యచేశాడు" అన్నారు మొరాకోను పొదల్లోకి విసిరేస్తూ.

"వ్హాట్?" అన్నాడు యస్. పి. ఆశ్చర్యంగా.

"అవును! అతనికి బహూశా వంటవాడి తోడ్పాటు వుండివుండాలి. ముందు ఇద్దర్నీ అరెస్ట్ చెయ్యండి. వంట వాణ్ణి కాస్త బెదిరిస్తే నిజం బయటపడుతుంది'' అన్నారు సిన్హాగారు జీపువైపు అడుగులువేస్తూ.

*   *   *

అంతా సిన్హాగారు చెప్పినట్లే జరిగింది. పరీక్షిత్తును, వంటవాణ్ణి అరెస్టుచేసి, వంటవాణ్ణి లాకప్‌లోపెట్టి కాస్త థర్డ్ డిగ్రీ ఉపయోగించేటప్పటికి నిజం చెప్పేశాడు. వంట వాడు నిజం చెప్పేప్పటికి పరీక్షిత్తుకూ ధైర్యంపోయి నిజం ఒప్పుకొన్నాడు.

వాళ్ళ కథనం ప్రకారం పరీక్షిత్తే, జనమేజయుడు వీల్ చైర్లో కూర్చొని వుండగా, గట్టిగా కొండ అంచువైపు ఓ తోపు తోశాడట. అంచువైపు పల్లంగా వుండడంవలన క్షణంలో వీల్‌చైరు కొండ క్రిందికి పడిపోయింది.

కాని; అసలు పరీక్షిత్తే హంతకుడని సిన్హాగారు ఎలా గ్రహించారు? పేడపురుగులా మెదడును ఈ ప్రశ్న తొలి చేస్తున్నా, సిన్హాగారు చెపుతారని తెలిసి కాచుకొని ఉన్నాను.

మొరాకో వెలిగించి వ్యాసమహర్షిలా నవ్వారు సిన్హా. "ఇటీజ్ క్వయిట్ సింపుల్ బోయ్! పరీక్షిత్తు, వంటవాడు చెప్పిన సాక్ష్యాలు రెండూ ఒకేవిధంగా వున్నాయి. అయితే హత్యకు క్లూ ఆ సాక్ష్యాలలోనే వుంది. ఇద్దరూ, జనమే జయుడు స్వయంగా చక్రాలు తిప్పుకొంటూ కొండ అంచుకు వీల్‌చైర్ తీసుకెళ్ళాడని చెప్పారు. ఆ ముక్కే వాళ్ళను పట్టిచ్చింది.

వీల్‌చైరు నడిచిన భాగమంతా చక్కగా గుర్తులుపడిన విషయం నీవు గమనించే వుండాలి. రాత్రి వర్షం పడడం

వలన బురద నేలమీద చక్రాల గుర్తులు చక్కగా పడ్డాయి. ఆ బురదమట్టి చక్రాలకుకూడా అంటుకొంది. జనమేజయుడు స్వయంగా వీల్‌ఛైర్ చక్రాలు త్రిప్పితే తప్పకుండా అతని తెల్లని ఉన్ని గ్లవుసునిండా బురద అంటుకొని వుండాలి. కాని జనమేజయుడి గ్లవుసు తెల్ల మల్లెపువ్వుల్లా వున్నాయి. అంటే జనమేజయుడు తనంతటతాను చక్రం తిప్పలేదనీ, ఎవరో త్రోశారనీ అర్థమవడంలా?

అందుకే నేను రెండోసారి అంబులెన్సులో అతని శవాన్ని, వంగిపోయిన వీల్‌ఛైర్‌నీ చూసింది. వాటిని చూశాకే పరీక్షిత్తు హంతకుడని నిశ్చయం చేసుకొన్నాను. పాపం! జనమేజయుడు కొండమీద ఇల్లు కట్టుకొన్నది, ఆ విధంగా మరణం కొని తెచ్చుకోవడానికేనేమో" అన్నారు సిన్హాగారు మిస్టరీ విడదీస్తూ. ***

భద్రకాళికి రైలు ప్రమాదంలో, కుడిచేతి బొటన వ్రేలు తెగిపోయింది. ఆ నష్టానికి పరిహారంగా కొంత డబ్బు ఇవ్వడానికి రైల్వే ఉద్యోగి వచ్చాడు.

"ఈ వ్రేలు పోయినందుకు పరిహారంగా, నాకు పాతిక వేలు ఇచ్చి తీరాలి," అంది భద్రకాళి.

"అమ్మా! మీరు సబబుగా ఆలోచించాలి. ఆ బొటనవ్రేలుకు అంత విలువ ఉన్నదంటే...ప్చ్!... నమ్మ శక్యంకాకుండా ఉంది," అన్నాడు ఉద్యోగి.

"మీరు కూడా సబబుగా ఆలోచించాలి. నా బొటనవ్రేలి విలువ మీరు తెలుసుకోవాలి. ఆ వ్రేలితోనే నేను మా ఆయన్ను నొక్కిపెడుతున్నాను" అని చెప్పింది భద్రకాళి.

—బొల్లాప్రగడ సుబ్రహ్మణ్యం, కాకినాడ-2.

బ్లాక్ మెయిలర్

అజీజ్

"మీకోసం ఒకతను వచ్చేడు. పంపించమంటారా?" అడిగేడు ప్యూన్.

వచ్చేవారం మా పత్రికలో వెయ్యబోయే సీరియల్ నవల తాలూకు స్క్రిప్ట్ చూస్తున్నదాన్నల్లా తలెత్తి, "ఎవరు?" అడిగేను.

"తాళవన్ అని చెప్పేడు. అర్జంటు పనిట!"

పేరునిబట్టి తమిళుడని తెలుస్తోంది. మా పత్రికకి తమిళ నాడులోనూ మంచి సర్క్యులేషన్ ఉంది. రోజూ, ఒకరో ఇద్దరో ఏజెంట్స్ ఆఫీసుకి వస్తూ పోతుంటారు. ఆ బాపతే కాబోలు.

"పంపించు!" అన్నాను స్క్రిప్ట్ మూసి.

ప్యూన్ వెళ్ళిన రెండు నిమిషాలకి స్ప్రింగ్ డోర్స్ కిర్రుమంటూ తెరుచుకున్నాయి.

లోనికి వచ్చిన వ్యక్తిని కాస్త పరీక్షగా చూసేను.

ముప్పైఐదేళ్ళుంటాయి. మిడిల్ హైట్. మనిషి నలుపు. పక్క పాపిడి తీసి, జుత్తు నుదుటిమీద పడేలా దువ్వుకు న్నాడు. చొక్కా, లుంగీ కాక, పాంటు షర్టు వేసుకున్నాడు. అదివరకతన్ని ఎక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదు.

"కూర్చోండి!" అన్నాను మర్యాదకి.

"జీవనజ్యోతి వారపత్రిక సంపాదకురాలు, శాంతిప్రియ మీరే కదూ?" అడిగే డతను తెలుగులోనే.

తలూపేను!

"నమస్తే! మీతో అర్జంటు పనుండి వచ్చేను!"అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

ప్రతి నమస్కారం జేసి—"చెప్పండి! ఇంతకీ, మీరు మా మేగజిన్ ఏజెంటా?" అడిగేను.

అతను నవ్వి—"నా. నా. నేనొక బ్లాక్ మెయిలర్ని" అన్నాడు.

క్షణం నా నోట మాటరాలేదు, గుడ్లప్పగించి అతన్ని అలా చూస్తుండిపోయేను. అతను బ్లాక్ మెయిలర్ అని తెలిపినందుకు కాదు! అతను చెప్పిన తీరు ఎలా ఉందంటే, అదేదో సామాన్యమైన విషయం అయినట్టూ, ఘనకార్యం అయినట్టూ అతి నింపాదిగా చెప్పేడు.

"నాతో ఏమిటి పని?" అడిగేను అసలు విషయానికి వస్తూ.

"ఎనిమిదేళ్ళ క్రితం మీరు తిరుపతిలో ఉండేవారు కదూ?"

తలూపేను!

"హాస్టల్లో ఉండి, తిరుపతి యూనివర్సిటీలో చదువుకునే వారు కదూ?"

తలూపేను, ఆశ్చర్యంగా!

అతను జేబులోంచి ఓ కవరు తీసి, నా ముందు పెట్టి- "చూడండి!" అన్నాడు.

తోసుకు వస్తున్న కుతూహలాన్ని బలవంతంగా తొక్కి-పెట్టి, మెల్లిగా కవరు విప్పి చూసేను. రెప్ప వెయ్యకుండా అలా చూస్తూ ఉండిపోయేను.

గుండె దడదడ కొట్టుకోసాగింది.

రెండు ఫోటోలు అవి!

ఒకటి ఎనిమిదేళ్ళ క్రితం—చేతిలో చెయ్యివేసి, తిరుపతి కొండెక్కుతూ మెట్లమీద నేనూ, వంశీమోహన్ తీయించుకున్న ఫోటో!

అప్పుడు తెల్లగా, సన్నగా చలాకీగా ఉండేదాన్ని. పెళ్ళయ్యాక కాస్త ఒళ్ళుచేసి గంభీరంగా మారిపోయేను.

రెండవ ఫోటో—నా హాండ్ రైటింగ్‌లో ఉన్న ప్రేమలేఖ తాలూకు ట్రూ కాపీ!

"వీటిని ఎలా సంపాదించేవు?" అడిగేను వణికే కంఠంతో.

"నా వృత్తి ఇదే! వంశీమోహన్ ఇప్పుడు విజయనగరంలోని ఓ డిగ్రీ కాలేజ్‌లో లెక్చరర్‌గా పని జేస్తున్నాడు. తిరుపతిలో ఉండగా మీ రతనికి రాసిన ఉత్తరాలు ఐమీన్ ప్రేమలేఖలు, మొత్తం ఇరవై ఆరు నా చేతికి చిక్కేయి. ఒక్కొక్కటి చేంతాడంత ఉత్తరం, అవి చదువుతుంటే ఉత్తరంకాక, అదేదో మహాకావ్యం చదువుతున్నట్టు అనుభూతి కలుగుతుంది.

ఋజువు కోసం అందులో ఓ లెటర్ ఫోటో తీసి ఇలా పట్టుకొచ్చేను. రెండో ఫోటో తాలూకు నెగెటివ్ కూడా నా దగ్గిరుంది" అన్నాడతను మామూలుగా.

కోపంతో నా మొహం ఎర్రబడింది. "పరాయివాళ్ళ ఆంతరంగిక విషయాలు దొంగిలించి బ్రతికే బ్రతుకూ ఓ బ్రతుకేనా? సిగ్గులేదూ?" అన్నాను తీక్షణంగా నవ్వి.

అతను నవ్వి "ముందే చెప్పాగా, ఇది నా వృత్తి అని! సిగ్గుదేనికి?" అన్నాడు.

అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న నా మస్తిష్కంలో, ఈదురుగాలి ప్రారంభమైంది.

గతం సినిమా రీలులా గిరగిర తిరగసాగింది.

ఎనిమిదేళ్ళ క్రితం తిరుపతి ఉమెన్స్ హాస్టల్లో ఉండి, తిరుపతి యూనివర్సిటీ ఎం. ఎ. లిటరేచర్ చేసేను. నా పదహారేళ్ళ ప్రాయంలోనే సాహిత్యం విపరీతంగా నా మనసుమీద ముద్ర వేసుకుంది. ఆ రోజుల్లోనే, నా సహాధ్యాయుడైన వంశీమోహన్‌తో పరిచయం ఏర్పడింది. అతను కథలూ, గేయాలూ, నాటకాలూ రాసేవాడు. చిత్రాలు వేసేవాడు. ఇద్దరి అభిరుచులూ, భావాలూ ఒకటే కావడంవల్ల కాలక్రమేణా చేరువయ్యాం,

సెలవుల్లో ఇంటికి వెళ్ళినప్పుడు, అతనికి రోజుకో ఉత్తరం రాసేదాన్ని. అతనూ అలాగే రాసేవాడు. చదువు ముగిసేక పెళ్ళిజేసుకోవాలనుకున్నాం. కాని, విధి మమ్మల్ని ఆ బంధనంలో ముడి వెయ్యదలచుకోలేదు. కులగోత్రాలూ అంతస్థులూ అడ్డు వచ్చేయి. మా నాన్న చండశాసనుడు. నా అంగీకార, అనంగీకారాలతో నిమిత్తం లేకుండా నా పెళ్ళి డాక్టర్ శ్రీకృష్ణతో జరిగిపోయింది. కొంతకాలం, గతం

నాలో ఒక మధుర స్వప్నంగా మెదిలి కాలక్రమేణా చెదిరి పోయింది.

మావారు మద్రాసులో ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ స్థాపించి వైద్యరంగంలో ఎంతో పరపతి సంపాదించేరు. సాహిత్య పిపాసినైన నేను, ఈ వారపత్రిక ప్రారంభించి, ఇటు సంపాదకురాలిగా, అటు పాఠకుల అభిమాన రచయిత్రిగా దిన దిన పురోగతి సాధిస్తున్నాను.

ఇప్పుడీ సంగతి మావారికి తెలిస్తే ఇంకేమైనా ఉందా? సుఖంగా, ప్రశాంతంగా సాగిపోతున్న నా జీవితంలో ఎటు వంటి పెనుతుఫాను రేగుతుందో? నాపట్ల మావారికున్న ప్రేమా, ఆదరణా ఏమైపోను? ఈ వ్యవహారం విడాకుల రూపం దాల్చి కోర్టువరకూ వెళితే నా ప్రిస్టేజ్ ఏంకాను?

చెప్పలేని వేగంతో గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"ముందు నా విషయం తేల్చి, తరవాత నింపాదిగా ఆలోచించండి!" అన్నాడతను నవ్వుతూ.

"ఎంత కావాలి?" అడిగేను ఓ నిర్ణయానికి వచ్చి.

అతను తడుముకోకుండా "ఆరువేలు!" అన్నాడు.

"ప్రస్తుతం అంత డబ్బు నా దగ్గర రెడీగా లేదు. రెండు నెలలు వ్యవధి కావాలి!" అన్నాను హీనస్వరంతో.

అతను క్షణం ఆలోచించి, "ఆల్‌రైట్! సరిగ్గా రెండు నెలల తరవాత వస్తాను. డబ్బు అందకుంటే—జర్నలిస్ట్ కదా, మీకు వేరే చెప్పనవసరం లేదు!" అన్నాడు లేస్తూ.

తలూపేను. "డబ్బిచ్చేక, ఆ నెగెటివ్‌తోబాటు ఉత్తరా లన్నీ ఇచ్చేస్తావుకదూ?"

అతను గదిలోంచిబైటికి వెళుతూ ఆగి, "ఈ తాళవన్ ఇంతవరకూ మాట తప్పి ఎరగడు!" అన్నాడు.

* * *

"మీ కోసం ఒకతను వచ్చేడు. పంపించమంటారా?" అడిగేడు ఫ్యూన్.

ఫైల్లోంచి తలెత్తి, "ఎవ్వరు?" అడిగేను.

"తాళవన్ అని చెప్పేడు. అర్జంటు పనిట!"

అతని కోసమే ఎదురు చూస్తున్నాను. ఫైల్ మూసి, "పంపించు!" అన్నాను. ఫ్యూన్ వెళ్ళిన రెండు నిమిషాలకి, స్ప్రింగ్‌డోర్స్ తోసుకుంటూ లోనికి వచ్చి—

"నమస్తే!" అన్నాడు తాళవన్.

"నమస్తే! రండి, కూర్చోండి." అన్నాను కుర్చీ చూపిస్తూ.

జేబులోంచి ఓ పాకెట్ బండల్ తీసి, కుర్చీలో కూర్చుంటూ "నాకు వేరే అర్జంటుపనుంది. త్వరగా వెళ్లాలి. డబ్బు సిద్ధం జేశారా?" అడిగేడు.

డెస్క్ తెరిచి, న్యూస్ పేపర్లో చుట్టిన పాకెట్ తీసి, అతని ముందుకి తోసేను.

గబగబ పాకెట్ విప్పి చూసి తెల్లబోయేడు.

అది డబ్బుకాదు! ఓ పుస్తకం!!

అతనికి తెలీకుండానే ముఖచిత్రం మీది పేరు చదివేడు పెద్దగా.

"కథకుల ప్రేమకథ! రచయిత్రి శాంతిప్రియ!"

తలెత్తి, "ఏమిటిది?" అడిగేడు ఆశ్చర్యంగా.

చిన్నగా నవ్వుతూ అన్నాను. "మిస్టర్ తాళవన్! నీ వల్ల నాకొక అద్భుతమైన ప్లాట్ దొరికింది. అది నేనీ మధ్య కొత్తగా రాసిన పుస్తకం! ఇప్పుడు మార్కెట్‌లో శరవేగంతో అమ్ముడు పోతోంది.

ఆ రోజు నీవు నన్ను కలుసుకున్న తరవాత, రెండు రోజుల వరకూ మనసు వికలమై నిద్రాహారాలు మాని, ఆ సంఘటన గురించే తీవ్రంగా ఆలోచించేను. అగ్నిసాక్షిగా నాతో తన జీవితం పంచుకున్న నా భర్తకు నా గతం తెలియనివ్వకుండా గుప్తంగా ఉంచి, మోసం చెయ్యడానికి నా మనస్సాక్షి అంగీకరించలేదు.

ఆ తీవ్ర సంఘర్షణకి తట్టుకోలేక, మూడోరాత్రి జరిగిందంతా పూసగుచ్చినట్టు నా భర్తకి చెప్పేను. ఆయన దేవుడు అందుకే, నా గతాన్ని ప్రతి టీన్ ఏజ్ యువతీ యువకుల జీవితాల్లో జరిగే అతి సామాన్యమైన సంఘటనగా తీసుకున్నారు. అంతేకాదు, ఆ సంఘటనని ఓ మధుర కావ్యంగా దేనికి చిత్రించకూడదు? అని నాకు సలహా ఇచ్చేరు.

వారి ప్రోత్సాహంతోనే, వారంరోజుల్లో ఈ పుస్తకం రాసి పడేసేను. తిరుపతిలో వంశీ మోహన్‌తో నా పరిచయం, స్నేహం, ఆ తర్వాత నా జీవితం అన్నీ పొందుపరిచేను. ప్రచురించి విడుదల చేసేను. ఇక చాలా?

ఈ రోజుతో నీ వృత్తికి ఉద్వాసన జరుగుతుంది. ఇతర్ల ఆంతరంగిక విషయాలు తస్కరించి బ్రతికే నీవంటి వారికి తగిన శిక్ష విధించి తీరాలి!" అంటూ టేబిల్ మీది కాలింగ్ బెల్ మోగించేను.

తాళవన్ ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి, పారిపోడానికి తలుపు వేపు తిరిగేడు. సరిగ్గా అదే క్షణంలో, స్ప్రింగ్ డోర్స్ తోసుకుంటూ బైట రెడీగా వున్న క్రయింబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డీ, సార్జంట్ డేవిడ్ లోనికి వచ్చేరు.***

ఉరిశిక్ష

బి. వై. నారాయణరెడ్డి

ప్రొద్దుటే జైలువార్డరు వెంకాయమ్మ, సుప్రీముకోర్టు గూడా నా అప్పీలు తోసివేశారనే సందేశాన్నందజేయడానికి నా రూము కొచ్చింది.

నా జైలు గది కాపలాకాసే యెర్ర బుట్టలు రెండూ విన్నాయీ వార్త. ఒకసారి ఓ నిముషంపాటు జాలిగా చూశారు నావంక.

నేను శూన్యంలోకి చూస్తూ వుండిపోయాను.

"పురోహితులవార్ని చూస్తావామ్మా" అంది వెంకాయమ్మ జాలిగా.

నిర్మోహమాటంగా "చూడ" నన్నాను........పాపం! నన్నెంతో బతిమాలింది....నన్నొప్పించలేకపోయానే అని బాధపడింది గూడా!

పాపం! వెంకాయమ్మను చూస్తుంటే జాలేస్తుంది.

కొంచెం మంచినీళ్ళు గ్లాసులో పోసుకున్నాను....

"నీళ్ళకి, రుచీ, రంగూ, వాసనా లేదు...."

ఎందుకో నీళ్ళు త్రాగినట్లు గూడా లేదు....మళ్ళీ నా రగ్గుపై కూర్చున్నా.

ఇక ఆలోచించగూడదు....రాత్రి పడుకుంటూనే కావల్సినంత వ్యవధి వుంటుందిగా ఆలోచించుకునేందుకు?

* * * *

పురోహితు డొస్తూనే లేచి నిలబడ్డా.

జైలు పురోహితుడు చూడ్డానికి చిన్న కుర్రాడిలా అవుపిస్తాడు. ధవళవస్త్రాల ఛాయల్లో తెల్లగా అవుపిస్తాడు....

"జాబులు సక్రమంగా అందుతున్నాయామ్మా?"

"ఆఁ....నా కున్నదల్లా ఒక తమ్ముడూ, అమ్మా."

"ఇంకేమైనా కావాలామ్మా?....చదువుకునేందుకు పుస్తకాలు?....పోనీ నాతో యేదైనా మాట్లాడాలని వుందా?"

"లేదు....ఇప్పుడేమీ వద్దు"—ఉన్న పుస్తకాలే ఇంకా పూర్తిజేయలేదు....కనీసం నేను భక్తురాల్నిగూడా కాదు."

"ఇంకెన్నాళ్ళండీ?" అని అనుకోకుండానే ప్రశ్నించాను. ప్రొద్దున్న వెంకాయమ్మ చెబుతున్నది గూడా నేను సరిగా వినలేదు.

పాపం! ఆయన ముఖం దిగులుతో వాడిపోయింది. ఎందుకో ఆయన్ను చూస్తే జాలేస్తుంది....

ఆమాటకొస్తే యిక్కడ ప్రతివార్ని చూసీ జాలిపడాలేమో ననిపిస్తుంది!

ఆయన లేచి నిల్చొన్నాడు.

"ఇంకా రెండువారా లిక్కడుండాలమ్మా....ఇండియా ప్రెసిడెంటుకు నీవు పంపించిన క్షమాపణ పత్రం అంగీకరించబడకుంటే బహుశాః మూడోవారంలో...."

ఆయనిక వెళ్ళిపోతే మంచిదనిపించింది. ఒక్కసారి నా కాళ్ళూ చేతులూ చల్లబడ్డట్టయింది. నాకేసి దీక్షగా నిముషం పాటు చూశాడు. మెల్లిగా వెళ్ళిపోయాడు.

రూములో అటూ ఇటూ పిచ్చిదానిలా తిరిగాను. వెంకాయమ్మ నా రూములోకొచ్చేదాకా తిరిగాను.

ఒక గ్లాసులో నీళ్ళు పోసింది. "ఇదుగో యీ మాత్ర వేసుకో.... నిద్రమాత్ర, డాక్టరుగారిచ్చారు" అంటూ వెంకాయమ్మ నా చేతిలో ఓ చిన్న మాత్ర నుంచింది.

అంగిట్లో మాత్ర వేసుకుని కాసిన్ని నీళ్ళు గొంతులో పోసుకున్నాను.

పాపం! వెంకాయమ్మకు నేనంటే యెంత దయ! నా కంబళి కూడా విదిలించింది.

"పడుకోమ్మా నిద్రపడుతుంది" అంది వెంకాయమ్మ నన్ను చూస్తూ.

వెంకాయమ్మ కంఠంలో ఎంత ఆప్యాయత. ఆమె సాన్నిధ్యంలో మనస్సెంతో తేలిగ్గా వుంటుంది. అనిర్వచనీయమైన అనుభూతులిస్తుంటాయి వెంకాయమ్మ సన్నిహితత్వం వల్ల. ఆవిడిలో అర్ధంగాని యేదో ప్రశాంతత. అందరిలా హడావుడిగా అవుపించదు. వస్త్రధారగా సాధారణంగా వుంటుంది.

నాకు వస్త్రాలంకరణలో కొంత ప్రవేశముందిలే. ఎవరెలా ధరిస్తే అందంగా వుంటుందో చెప్పగల శక్తి గూడా నాకుంది. సినిమాలకెడుతుంటే....

ప్రథమపర్యాయం శేఖర్‌బాబును కలిసింద సినిమా హాల్లోనే. మొదట కలిసినప్పు డదేదో సిగ్గు ముంచుకొచ్చింది ఆయన పలకరిస్తుంటే. అయినా యెలా పలక

రించాడు. ఎంత చౌరవ.

ఇప్పుడింకాయన లేరీ భూమ్మీద. చనిపోయారు. కొద్ది దినాల్లో నేనూ చనిపోతాను.

అబ్బా! కళ్ళు తిరుగుతున్నాయి. బహుశాః ఆ నిద్ర మందేమో! ప్రక్కని పడివున్న నల్లగుడ్డ తీసి అందించింది వెంకాయమ్మ.

"తుది ఘడియల్లో ఇలా చేస్తారేమో గదూ?" అని ప్రశ్నించాను గుడ్డను నా కళ్ళ కడ్డంగా కట్టుకుంటూ వెంకాయమ్మను.

ఆమె యేమీ మాట్లాడలేదు. ఆ మసక వెలుతుర్లో ఆమె ముఖకవళికలు గూడా అపుపించలేదు.

ఖూనీకేసు పేపర్లో చూచినప్పుడల్లా అమ్మ అంటుండేది ప్రజలెప్పుడూ ముద్దాయిని చూసి జాలిపడుతుంటారని!

పాపం! అమ్మ ఆ స్థితి తన కుటుంబంలోకే వస్తుందని కలలోగూడా అనుకొని వుండదు.

"కుట్ర చేసి" ఇది తీర్పులో జడ్జిగారన్న పదం!

తాత్కాలికోద్రేకంలో కంటే కుట్రచేసి చంపటం నీచమైందట! ఏం చట్టం? ఎన్నో దినాలాలోచించి ఒక నిర్ణయానికొచ్చి చేయడం తప్పట! ఆ క్షణంలో పట్టు తప్పి విచక్షతాజ్ఞానం లేని క్షణంలో చేసింది తప్పుగాదట!! అయినా వాళ్ళకేం తెలుసు?

సుశీల! శేఖర్‌బాబుమీద కాస్త జాలి చూపించి వుంటే దానిమీదగూడా నాకు జాలి వుండేది.

అసలు శేఖర్, సుశీలకోసం ఇలా చేస్తాడని అనుకుంటే....

* * *

"భోజనం సహించదు. నాకీ దినం అసలేమీ వద్దు."

"కొంచెం తినేందుకు ప్రయత్నించమ్మా వనజా! అసలే తిండి తినకుంటే...." వెంకాయమ్మ జాలిగా బతిమాలు తుంటే నవ్వాలనిపించింది. పోలేరమ్మ దున్నపోతును మేపినట్లుగా మేపుతున్నారు నన్నుగూడా. దాన్నయితే జాతరలో బలిస్తారు. నన్ను ఏమీ పండుగలేకుండానే....

పెద్దపండుగ దగ్గరకొస్తూందిగా.

సంక్రాంతి పండుగంటే శేఖరంబాబు కవిత్వం చెప్పేవాడు నా కింకా గుర్తుంది.

"పల్లని సంక్రాంతి సంబరంబులు సూడ
నురిశిక్షయైనను మఱపు వచ్చు"

ఉరిశిక్ష....చనిపోయిందాకా గొంతు కురి....

"వనజా....చల్లారిపోతుంది తీసుకోమ్మా కాఫీ" వెంకాయమ్మ జాలి గొంతు విన్పిస్తూంది.

చల్లారిపోతుంది....ఉరి వేస్తే అంతా చల్లారిపోతుంది.

అంతంకోసం అసలీవిధంగా నిరీక్షిస్తూ కూర్చోవడమంటేనే చాలు సగం చంపినట్టు....మరి సుశీల చావబోతున్నట్టు అనుకుందాం....అనుకోకుండా అతన్ని చూచింది, నిజంగా అదే హాయి!

* * *

మధ్యాహ్నం అమ్మ నన్ను చూడడానికి వచ్చింది.

అమ్మా రామూ, క్రొత్తగా అవుపించారీరోజు నా కళ్ళకి. రాముకెంత ఠీవి. పదహారేళ్ళకంత ఠీవి. ఏం కుర్రాడు? పోనీలే వాడన్నా అమ్మకు కొంత శాంతినిస్తాడు.

అసలమ్మ గూడా వాణ్ణి ప్రేమించినంతగా నన్ను ప్రేమించదు,

అయినా అమ్మ హృదయాని కిదొక గొడ్డలిపెట్టు....

"అమ్మగూడా ప్రెసిడెంటుకొక దయాపత్రాన్ని రాసుకుంటుందక్కా! బహుశా...."

అమ్మ కళ్ళనుండి నీళ్ళు జలజల రాల్తున్నాయి.

"టైం అయిపోయిందమ్మా" అన్నాడు సెంట్రీ డ్యూటీలో పోలీసువాడు.

"కొంచెంసేపు పడుకోమ్మా....వనజా పడుకో," దిగులుగా చెప్పి వెళ్ళిపోయారు అమ్మా రామూ.

డాక్టరుగా రొచ్చారు.

ఏదో ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళారు.

వచ్చేవారం నాకు ముప్పైరెండో యేడొస్తుంది.

కృష్ణస్వామిగారి కిచ్చి నన్ను 16వ యేట పెళ్ళి చేశారు అమ్మా నాన్నా. ఆయన్నొదిలేసినందు కమ్మ యెప్పుడూ నన్ను సాధిస్తుంటుంది. అయినా నేను మాత్రం ఈషన్మాత్ర మైనా బాధపడలేదు దాన్నిగురించి. మాకు సంతానమే కలిగి వుంటే యేమో! కనీసం అప్పట్లో ఆయన మిలటరీకెళ్ళకున్నా అదో రకం!

ఆయన మిలటరీనుంచి తిరిగి వచ్చినప్పుడు....అబ్బా! ఏదో క్రూరంగా, విషాదంగా అవుపించేవాడు. అసలాయన్ను వదలకుంటే ఇంతయేదిగాదు.

అయినా అయేదో యేమో!

నేను శేఖరంబాబును కలవడం....సుశీలను చంపడం జరగాలని వ్రాసుంది గామోసు....

నన్నీ స్థితిలో శేఖరంబాబొచ్చి చూస్తే....

అయినా సుశీలంటే యెందు కాయనకంత పిచ్చి?

సుశీల తనది కాదని తెలుస్తూనే ఆత్మహత్య చేసుకు

నేంత పిచ్చి! తన చేయిదాటి పోయిందని తెలియంగానే ఆత్మహత్య!!

ఆయన్నా నేనంతగానే ప్రేమించాను. నిజం చెప్పా లంటే ఆయన్ను తప్ప ఇంకీ ప్రపంచంలో నే నెవ్వర్నీ ప్రేమించలేదు. ప్రేమించలేనుగూడా....

*   *   *

ఈ వారం నాకో సంవత్సరంలా గడిచింది. కానీ రోజులు దగ్గరపడేకొద్దీ త్వరగా గడుస్తున్నట్లనిపిస్తోంది. నా జైలుకొట్టు గోడలపైనుండి ప్రతి చిన్ని గుర్తూ, దంతెల గురించిన ప్రతి వివరమూ నాకు తెలుసు. గోడకెన్ని పగుళ్ళున్నాయి, దంతెలెన్ని పగుళ్ళుబారాయీ, యెక్క డెక్కడ సున్నం రాలిపోయిందీ - అంతా వివరంగా చెప్ప గలను. రోజూ కళ్ళప్పగించి వాటికేసి చూస్తూండడమేగా నా పని!

సుశీలను ప్రథమ పర్యాయం నేను దర్శించింది ఒక చెప్పుల షాపులో. అందంగా, నల్లగా, యెత్తు మడమలూ, యెంతందమైన చెప్పు లేసుకుందో! పాదాలుకూడా యెంతం దంగా వున్నాయ్.

ఆమె అంత అందగత్తేమీ కాదు. అయినా అందంగా వుంది అనిపించుకునేందుకు చేయాల్సిందంతా తెల్సుకుంది. ఆ చీరెకట్టు.... కళ్ళుకూడా అందంగానే వుంటాయిలే!

వయస్సు 35 సం॥ల కొక్క దినంకూడా తక్కు వుండదు. అయినా అంత పెద్దదనిపించదు. చనిపోయి నప్పుడు తప్ప...!

ఆ రోజు చెప్పుల షాపులో చూసినపుడు శేఖరుబాబుకూ ఆవిడకూ సంబంధముందని అసలు తెలీదు!

ఏదో కాలక్షేపం కోసం కొన్నాళ్ళతనితో తిరిగి వుంటుంది గాని, జీవితాంతం అతనితో వుందామనే వూహే వుండి వుండ దావిడకు మాత్రం! కొన్నాళ్ళయేక అతనంటే వెగటు పుట్టింది.

నాకిప్పుడు గుర్తుకొస్తుంది. శేఖరుబాబు ఎన్నోసార్లు త్రాగి యింటికొచ్చేవాడు. మంచి తెలివిగలవాడు. అయితే మాత్రమేం? గుర్రప్పందాల్లో, జూదాల్లో తను సంపాదించిందంతా పోగొట్టుకునేవారు. సినిమాలకూ షికార్లకూ డబ్బెక్కడ నుండి వచ్చేదో మరి! బహుశా సుశీల యిస్తుండేదనుకుంటా. మరలా యెందుకు మారిపోయిందో అర్థం కాకుండా వుంది.

ఆడవాళ్ళంతే అందరున్నూ. ఎప్పుడెలా మారుతారో, ఎందుకు మారుతారో వారికీ తెలీదు. వూరికే అన్నారా "స్త్రీ బుద్ధిః ప్రళయాంతకి" అని. ఆడాళ్ళంటే మతిపొయ్యేవాడిలా నాకెప్పుడూ అనిపించలేదు. అసలు సగర్వంగా నాతో ఆ విషయం పదేపదే అంటుండేవాడు గూడా!

అసలెందు కిదంతా తవ్వుకోడం? దానివల్లేం లాభం?

ఆయన చనిపోయారు. నేనూ చనిపోబోతున్నా.

* * *

తెల్లవారింది.

"మిమ్మల్ని చూసేందు కొకరొస్తున్నా రీ దినం. వారు మీకు తెలియదు. జైళ్ళ సంస్కారాన్ని గురించీ, జైళ్ళను గురించి చాలా పుస్తకాలు వ్రాశారు వారు. దోషుల్ని, క్రూరంగా ఘోరమైన నేరాల్ని చేసినవారిని గూడా సంస్కరించారు క్రితంలో. వారితో ఒకసారి మాట్లాడితే పదేపదే వారిని చూడాలనిపిస్తుంది మీకూను. మీ హృదయం తేలిక

పడాలంటే వారి సాన్నిధ్యం ఎంతో సహకరిస్తుంది." అంది జైలు డాక్టరమ్మ ప్రొద్దున్నే.

నేనేం పలకలేదు. ఎవర్నీ నాకు చూడాలని లేదు. చూడ నిష్టంలేదని నా అభ్యంతరం తెల్పేందుకూ నాకు శక్తి లేకుండా వుంది.

కొంత వింతగా అవుపించే వృద్ధ రచయిత "జైలుశ్రీ" విచిత్రంగా మాట్లాడుతాడు. మంత్రముగ్ధుల్ని చేస్తుంది వారి వాక్చాతుర్యం!

ప్రొద్దున్నే యేదో పూలసంతకు వెళ్ళివచ్చారట! కొన్ని వి త్తనాలూ కొన్నారట!

కొంతమందలాంటి విషయాలు మాట్లాడుతుంటే విసుగేస్తుంది వినటానికి. కానీ "జైలుశ్రీ"గారి మాటలు నా హృదయాన్ని తేలిక పరుస్తున్నాయి.

ఆయన కొన్ని రోజాపుష్పాలు తెచ్చారు. వెళ్ళిపోతూ కొన్ని వెంకాయమ్మ చేతికిచ్చి నా కోసం నీళ్ళలోవేసి వుంచమని చెప్పిపోయారు.

నా నేరాన్ని గురించి కదపనన్నాలేదు. నేనూ చెప్ప లేదు....

"ఎవర్నన్నా చూడాల్నా? ఏమైనా చెప్పాల్నా" అన్నారు.

"అఖర్లేదు'' అని జవాబిచ్చాను.

ఆప్యాయంగా నా భుజంమీద చెయ్యేసి ''వస్తానమ్మా'' అని సెలవు పుచ్చుకున్నారు.

వారు నాటే గింజలు మొలుస్తాయో, లేదో!

రేపటితో వారమవుతుంది.

ఎప్పుడు చీకటి పడుతుందో, ఎప్పుడు తెల్లారుతుంద్రో

నాకు తెలియకుండానే జరుగుతుంటుం దొక్కొక్కప్పుడు.

కాఫీ త్రాగడం, భోంచేయడం, బట్టలు మార్చుకోడం, పోలీసులు కాపలా మారడం, యిలా ముక్కలుముక్కలుగా విభజింపబడ్డ పెద్దవస్తువులా అనిపిస్తుంది రోజంటే....

గడచిపోతున్నాయి రోజులు....

* * *

మురళీ ఒకరకంగా మంచివాడే. మరయితే యెందుకలా తయారయ్యాడా అనిపిస్తుంది. మా ఆయనగారి స్నేహితు డట. అయినా నే నాయన్ని వదలిపెట్టినాననే సంగతి తెలిసి గూడా అప్పుడప్పుడూ వస్తుండేవాడు. నేనంటే యెంతో దగ్గరగా మాట్లాడేవాడేగాని నన్నింకో విధంగా మాత్రం యెప్పుడూ ప్రేరేపింపలేదు. అయినా అతనంటే యెందుకో నాకు మమతుండేది.

ఆ పిస్టలు అతనిదీ. దానికి లైసెన్సులేదనీ, అది తను మిలిటరీలో నున్నప్పుడు సంపాదించిందనీ అంటుండేవాడు.

"నీ దగ్గరుంచుకో; ఆడవాళ్ళ దగ్గరుండే పిస్టళ్ళ నట్టే పట్టించుకోరులే యీ పోలీసువాళ్ళు" అని నాకిచ్చిపోయాడు. దాన్ని వాడే విధంగూడా నాకు తెలియజేశాడు మురళీ. నేనూ పిస్టలు కాల్చడం సులభంగానే నేర్చుకున్నా!

ఆ పిస్టలు నా ట్రంకుపెట్టి అడుగున గుడ్డలక్రింద చాలా నాళ్ళబట్టే పడుంది. దాన్నిగురించి శేఖరంబాబు కెప్పుడూ చెప్పనుగూడా లేదు. కొన్నాళ్ళు పోయాక పాపం మురళీ రైలుక్రింద ప్రమాదవశాత్తు పడి మరణించాడని తెలిసింది.

శేఖరుబాబుదగ్గ రీ విషయం దాచానుగానీ నా దగ్గర కూడా వారెన్ని విషయాలు దాచలేదూ? అలాగంటే సుశీల విషయం మంజువాణి చెప్పిందాకా నాకు తెలీలేదు గదా!

మంజువాణీ నేనూ కలిసి చదువుకున్నాము. టైపిస్టుగా పని చేస్తూంది. శేఖరంబాబు నిట్టే గుర్తుపడుతుంది. మా ఇంటికీ వాళ్ళింటికీ అట్టే దూరంగూడా లేదు.

శేఖరంబాబు ఇంకో స్త్రీతో నుండగా లీలామహల్లో చూచిందట!

నా కనుమానం తోచింది.

"నేనొక స్నేహితునితో సినిమా కెళ్తున్నా నీ రోజు" అని శేఖరంబాబు నాకు చెప్పినప్పు డనుమానించే మంజువాణి చెప్పిందంతా ఏకరవుపెట్టాను.

"మంజువాణి పొరపాటు పడి వుంటుంది" అన్నాడు.

ఎంతో తరచితరచీ అడగంగా ఆవిడతో తిరుగుతున్నట్లు ఒప్పుకున్నాడు గత్యంతరంలేక.

అయినా సుశీల తన మేనేజరుగారి బంధువనీ, చాలా డబ్బుకలదనీ, కేవలం సరదాగా మాత్రమే కాదంటే యేమౌతుందోనని సుశీలతో తిరుగుతున్నాననీ, ఇతరత్రా తనకూ దానికీ ఇంకేవిధమైన సంబంధమూ లేదనీ, యింకా యేమేమో....

ఎంత చమత్కారంగా అబద్ధాలాడాడు. అయినా అప్పట్లో తనతోతప్ప ఇంకే స్త్రీతోనూ శేఖరంబాబుకు సంబంధ ముండదనుకున్నా!

అయినా ప్రణయం సంగతి కొచ్చేప్పటికి పడతులెంత పరాభవింపబడుతుంటారో గదా?

సుశీలను గురించి ఒక పీడకలొచ్చింది. అమ్మో! ఎంత భయంకరంగా వుంది కల!

ఇంకా బ్రదికే వుంది. నన్ను చూడ్డానికొచ్చింది. కట కటాలు పైనుండి మాట్లాడింది. నేనెందుకు జైల్లో

వున్నానో, ఆమె యేంజెబుతుందో నా కర్థంగాలేదు, కానీ మాట్లాడుతూ వుంది. ఆ ముఖం, ఆ కళ్ళు, స్పష్టంగా అవుపించాయి. కొంచెంసేపు అటుచూడ్డం మానేశాను....

మళ్ళీ దానిముఖం చూసేప్పటికి నాకు వణుకు పుట్టింది. ముఖం ఒక పుర్రెగా మారిపోయింది. విశాలనయనాలకు బదులుగా రెండు పెద్ద తొర్రలు!!

అప్పుడు గుర్తొచ్చింది, దాన్ని నేను చంపానని! అది కలని!!

* * *

అనుకోకుండా "జైలుశ్రీ"గారు ప్రవేశించారు నా గది లోకి మధ్యాహ్నం! మామూలుగా జైలు దర్శించేందు కొచ్చారట, అలా నన్నూ చూసిపోదామనుకున్నారట.

చంపబడేవాళ్ళను చూసిపోదామనే మనస్తత్వమింకా నా కర్థమవడంలేదు! కాసే పవీ ఇవీ మాట్లాడారు. చివరికి నా నేరాన్ని గురించి నేను పశ్చాత్తాప్పడుతున్నానేమోనని ప్రశ్నించారు.

జవాబు చెప్పేందు క్కాస్త తటపటాయించాను.

నన్ను వారు గమనిస్తూనే వున్నారు.

వారి ఉద్దేశ్యం నా కర్థమయింది. ఇంకెవరిదగ్గరయినా అయితే అబద్ధమాడుతుండేదాన్ని. అదీగాక కనీసం నాకు నా శిక్ష రద్దయేందుకు తోడ్పడేవారన్నా అలా చేద్దును ... గానీ వీరి ప్రశాంత దనం చూస్తూంటే నా కబద్ధమాడాలని పించలేదు.

ము క్తసరిగా "పశ్చాత్తాపపడ్డంలేదు," అన్నాను కాస్త కటువుగానే వుంది నా ధోరణి. అలా వుండాలని వాంఛించి చేసింది మాత్రంగాదు.

వారొక వేడి నిట్టూర్పు వదిలారు.

"మీరు నిజం చెబుతున్నారని అనుకోను. అయినా ఇకా విషయాన్ని గురించి మిమ్మల్ని బాధించను. అయినా మళ్ళీ ఆలోచించమ్మా....భయమక్కర్లేదు" అని చెప్పి మెల్లిగా వెళ్ళిపోయారు. వారి తెల్లపంచె గాలికి రెపరెపలాడింది.

*　　　*　　　*

మంగళవారం—

నిద్ర లేచాను. జైలు వాతావరణం నిశ్శబ్దంగా వుంది.

"ఆఖరు రాత్రి గడిచిపోయింది. ఈ పరువుకూ నీకూ ఇక ఋణం తీరిపోయిందమ్మా వనజా" అని చెప్పేందు కొచ్చిన దేవదూతలా అవుపించింది ప్రాతఃకాల సూర్యరశ్మి.

వెంకాయమ్మొస్తూనే లేచి నిల్చొన్నాను. ఆదుర్దా ఒక్కసారి ఉప్పొంగింది నాలో. వెంకాయమ్మ రోజులా నా కళ్ళల్లోకి చూళ్ళేదు. శూన్యంలోకి చూస్తూ నిలుచొంది.

"వనజా....అధికార్లు నీ అంత్యదినాన్ని లక్ష్మీవారం వరకూ వాయిదా వేశారమ్మా. ప్రెసిడెంటు క్షమాభిక్షకూడా నీకు దొరకలేదు."

ఆమె ముఖమెలా యెన్ని అవస్తలు పడుతుందో, ఆ మసక చీకట్లో అవుపించకపోయినా ఆమె గొంతు రాపిడి చూసి నేను సులభంగా వూహించుకోగలిగాను. నిశ్శబ్దంగా వుండిపోయాను.

అవును. ఆరోజు మంగళవారమే:—

ఆ మంగళవారం రాత్రి మంచంపై పడుకుని దొర్లుతూనే వున్నా రాత్రంతా. ఎంతో ఆదుర్దాగా ఆరాటపడిపోయా....శేఖరంబాబు రాలేదు.

ప్రొద్దున్నే ఒక కుర్రాణ్ణి వారి రూముకు పంపించాను.

వాడు త్వరగా రాలేదు. బహుశా: నా ఆదుర్దా వాడాలశ్యం చేస్తున్నాడనిపించేలా చేసిందేమో!

వాడు రాకున్నా బాగుండేది. వచ్చి భయంకరమైన వార్త తెచ్చేడు: విషం తిని శేఖరంబాబు మరణించాడట! ఒక చీటీ మాత్రం సుశీల అడ్రసుతో వ్రాసివుంచాడట.

అది ఆవిడ తప్పుగాదనీ, తను జీవించి దుర్భరస్థితిలో వుండాల్సొచ్చింది గనక తనే ఆత్మహత్య చేసుకున్నాననీ వ్రాశాడట....కానీ నాకు మాత్రం యేమీ వ్రాయలా....

పంచాయితీ నాడు తేలిన వివరాలివి.

మంగళవారం రాత్రి సుశీలను కలిశాడు. సుశీల పెండ్లి చేసుకోబోతున్నట్లు, తనకూ శేఖరానికీ యింకేవిధమయిన సంబంధమూ లేదనీ, అదే ఆఖరు రాత్రనీ చెప్పిందిట. అది భరించలేక శేఖరంబాబు ఆ రాత్రే ఆత్మహత్య చేసుకున్నాడు.

కానీ పంచాయితీ దార్లతో మాత్రం సుశీల చెప్పింది పచ్చి అబద్ధం!

తనకూ శేఖరంబాబుకూ సంబంధం లేదట! అప్పుడప్పుడూ ఏదో మాట్లాడుకునేవారట! అతనే ఎప్పుడైనా అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించేవాడనీ, తనకు చిరాకు వేసి నాల్గు చీవాట్లు వేసేదనీ చెప్పి తెలివిగా తప్పించుకుంది.

శేఖరంబాబు గుణాలెంచేందుకయినా స్థోమతలేని నీచురాలికెన్ని మాటలు?

శేఖరంబాబు మరణవార్తని గురించి పేపర్లలో రెండు ముక్కలు వేశారు.

నిజం మరి....ఆయనంటే యెవరికి మోజు, నాకు తప్ప?

సుశీలంటే నాకు చెప్పరాని అసహ్యం పుట్టుకొచ్చింది.

ఇంతకుముందెప్పుడూ నా జీవితంలో ఇంకెవర్నీ అంతగా అసహ్యించుకోలా! శేఖరంబాబు మరణానికి కారకురాలైన ఆ నీచురాలిని చంపి కాకులకీ, గద్దలకీ వేయాలనుకున్నాను.

సుశీలను చంపాలని గట్టిగా నిర్ణయించుకునేందుకు నాకు మూడు నెలలు పట్టింది. ప్రాసిక్యూషన్ అన్నదేమంత బాగు లేదు. నేనప్పుడే చంపివుంటే నేరమంత పెద్దదిగాదట. ఇంత వ్యవధి యివ్వబట్టే నేరంయొక్క తీవ్రత యెక్కువయిందట.

మురళి ఇచ్చిన పిస్టలు లేకుంటే యింతయేదిగాదేమో!

ఇదంతా ఆలోచిస్తుంటే నా మనస్సంతా యేదో ఒక రకంగా అయిపోతూంది. పురోహితులవా రన్నారు. నేను చేసిన నేరాన్ని గురించి వూరికే ఆలోచించేకంటే పశ్చాత్తాప్పడేందుకు ప్రయత్నిస్తే మనశ్శాంతి వుంటుందని.

సుశీలను నేను ఎప్పుడెలా చంపాలని నిశ్చయించుకున్నానో నా కిప్పుడట్టే గుర్తు రావడంలేదు.

ఒకనాటి రాత్రావిడ రూము కెళ్ళాను. చీకటి సమయం. రూము మధ్యలో నిలుచున్నాను. నా చేతిలోని పిస్టలు "ఢాం" అంది.

సుశీల అరుస్తూ నేలమీద పడిపోయింది. పిస్టలింకా నా చేతిలోనే వుంది.

నేను శవాన్నెప్పుడూ చూళ్ళేదు. అయినా ఆవిడ శవంగా మారిపోయిందని మాత్రం తెలిసికున్నాను.

నేను కసికొద్దీ సుశీలను చంపేను.

ఇప్పుడు నన్నూరికే చంపేస్తున్నారు....

* * *

రాత్రి భోజనమయింది. అది నా ఆఖరు భోజనం.

నన్ను చూచిపోయేందుకు వెంకాయమ్మొచ్చింది. అమ్మా రామూ దగ్గర నుంచొచ్చిన వుత్తరాలిచ్చి వెళ్ళింది. వెళ్తూ వెళ్తూ డాక్టరు నిద్రమందిస్తారని చెప్పిపోయింది. ఆమె ముఖమన్నా చూళ్ళేదు.

ఎందుకో పెద్దగా ఏడ్వాలనిపిస్తుంది. కాని దుఃఖం గొంతుదాటి రావటంలేదు.

పురోహితులొచ్చారు. వారి కళ్ళలో నిస్పృహ, నిరుత్సాహం, నా ఆత్మశాంతికై తన సర్వస్వం ధారబోసి చేస్తున్న త్యాగం అవుపిస్తున్నాయి.

ఆయనకూ నాకూ మధ్య అఖండమయిన అఘాతం! "జైలుశ్రీ" ఒప్పుకున్నట్లు దైవంమీద నాకు నమ్మకం లేదంటే మాత్రం వారొప్పుకోరు.

"ఆఖరుసారి నీకేదన్నా కోరిగ్గా వుంటే చెప్పమ్మా" అనడిగారు.

"నీకు సహాయం చేయాలనుంది" కొంచెం తడబడ్డారు. "నీకు కావలపిన మానసిక ధైర్యం, రేపు నువ్వు శూన్యంలోకి ప్రయాణం చేసేందు కవసరమైన మనస్థయిర్యం యిచ్చేందుకు ప్రయత్నిస్తాను."

నేనేమీ మాట్లాడలేదు.

పురోహితులు భగవద్గీత నందుకున్నారు.

"జీవితంగాని, చావుగాని, ఉన్నదైనా లేనిదైనా, ఏదైనా సరే మనల్ని దేవుని ప్రేమనుండి మాత్రం దూరం చెయ్యలేవు."

ప్రార్థనచేసి "ప్రొద్దున్న నీ వెంబడే వుంటానమ్మా" అని వెళ్ళిపోయారు.

మెల్లిగా గోడకేసి పొర్లాను.

ప్రవాహంలా వుప్పొంగిన భయం, దానితో కలగూర గంపలా కలిసిపోయిన భావాలు, ఆలోచనలు పెరిగిపోతున్నాయి.... ప్రవాహం పొంగువార్తోంది....

* * *

అధికారొచ్చారు.

"లేమ్మా వనజా?"

మెల్లిగా లేచాను. నా బట్టలిచ్చారు ధరించుకోమని. నా యెర్రంచు తెల్లకోక. ఎర్రని రవికె. ఉతికి యిస్త్రీచేసిన బట్టలు. నావి నేను ధరిస్తున్నా ఏదో క్రొత్తగావుంది.

తెల్లవారింది. కానీ యింకా మసగ్గా వుంది నాకేమో!

అంతా కలలాగుంది.

నా బట్టలు చెప్పులు నావే....నా నల్లచెప్పులు.

నన్ను ఎక్కడికో నడిపించారు.

అడుగో పురోహితుడు....

నా ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నారు.

"ఇదిగో, ఇది తాగమ్మా!"

కాఫీ నా కడుపులోకి వేడిగా దిగుతోంది.

గ్లాసిచ్చేశాను.

నా చేతులు వెనక్కి విరిచి కడ్తున్నారు.

ఏడిస్తే? వద్దు! దానివల్ల లాభం?

ముఖానికేదో కప్పారు. గొంతుచుట్టూ యేదో చుట్టారు. చీకట్లో ఒంటరిగా కాళ్ళకేదో చేస్తున్నారు.

చీకటి. కటిక చీకటి.

శేఖరంబాబూ! ఎక్కడున్నారు....

దేవా రక్షించు....కరుణించు ప్రభూ....

భగవాన్!....రక్షించి!!....క్షమించు!!!

***

చిల్లరదొంగ చిదానందం!

కురుమద్దాలి విజయలక్ష్మి

సాయంత్రం నాలుగు గంటలయింది.

వర్షాకాలం, మబ్బులు దట్టంగా కమ్మాయి. అందువల్ల నాలుగు గంటలకే వెలుతురు తగ్గి మసక చీకటి ఆక్రమించు కుంది నలువైపుల.

విజయవాడ—బస్సు స్టాండులో జనం కూడా కిటకిట లాడుతున్నారు. తాము ఊరెళ్ళే బస్సు తొందరగా రావాలని వాన రాకుండా ఉంటే బాగుంటుందని ఓసారి ఆకాశంవైపు మరోసారి బస్సు వచ్చే రూట్ వైపు ఆతృతగా చూస్తు న్నారు.

తాటాకుల బుట్ట, చేతి సంచి, చిన్న ట్రంకుపెట్టె• కూతురు సుబ్బరత్నంతో బుచ్చయ్య బస్సు స్టాండింగులో అడుగుపెట్టాడు.

సామాన్లు చూస్తు వుండమని బుచ్చయ్య బస్సెన్నింటి కొస్తుందో కనుక్కురావటానికి వెళ్ళాడు.

సుబ్బరత్నం, బుచ్చయ్యకి ఒక్కతే కూతురు. సుబ్బరత్నంకి పద్దెనిమిదేళ్ళు నిండిపోతున్నాయని దిగులుపడుతుండగానే క్రితం యాడాది మంచి సంబంధం వచ్చింది. పెళ్ళయిపోయింది.

సుబ్బరత్నంకి దిగులుగా ఉండటం గ్రహించి మామగారి పేర కార్డుముక్క రాసి బస్సెక్కించేవాడు సుబ్బరత్నం భర్త సుందరరావు. అక్కడ భర్త బస్సెక్కిస్తే ఇక్కడ స్టాండింగ్ కొచ్చి బస్సుదిగేది. బుచ్చయ్య వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తుండేవాడు.

ఇక్కడ మళ్ళీ నాలుగు రోజులు కాగానే భర్తమీద మనసుపోయేది, వెంటనే తండ్రిచేత తాను ఫలానా బస్సుకొస్తున్నట్లు కార్డుముక్క రాయించి ప్రయాణమయేది.

ఇవాళ అలాగే ఒంటరిగా బైలుదేరింది సుబ్బరత్నం.

సుబ్బరత్నం అమాయకురాలు. బస్సులో ఒంటరిగా ప్రయాణంచేసినా, బస్సు ఎక్కించటానికి మనిషి, బస్సు దిగంగానే మనిషి స్టాండింగ్‌లో హాజరుగా వుండాల్సిందే.

అరటిపళ్ళు, జామపళ్ళు, పచ్చళ్ళు, పిండివంటలతో పుట్టింటి నుండి నిండు సామానుతో నుంచుంది సుబ్బరత్నం. మనిషికూడా నిండుగా చామనచాయ రంగు అయినా చారడేసి కళ్ళు, నల్లతాచులాటి బారెడు జడలో నిండుగా పెద్ద పూలదండ, వళ్ళంతా అటు అత్తారు పెట్టినవి ఇటు పుట్టింటారు పెట్టిన నగలు, చూడంగానే మహాలక్ష్మిలా ఉంటుంది.

కళకళలాడుతూ మహాలక్ష్మిలా ఉన్న సుబ్బరత్నం, జేబుదొంగ చిదానందంకి కళ్ళనిండుగా బహు ముచ్చటగా కనపడింది.

సుబ్బరత్నం ఒంటరిగా నుంచొని ఉండటం చూసి చిదానందం లేచినవేళ తలుచుకుంటూ సుబ్బరత్నంకి దగ్గరగా వచ్చి నుంచున్నాడు.

"ఈ పిల్ల వంటినిండా బంగారం దిగేసుకుని ఒంటరిగా ప్రయాణం చేస్తున్నది. సమయం చూసి ఓ నగైనా కొట్టేయాలి. బస్సులు కిటకిటలాడుతుంటాయి. ఛాన్స్ పోనీకూడదు." చిదానందం దొంగచూపులు చూస్తు అనుకున్నాడు.

బుచ్చయ్య బస్సు ఎప్పుడొస్తుందో కనుక్కొని సుబ్బరత్నం వద్ద కొచ్చాడు.

సుబ్బరత్నం పక్కన బుచ్చయ్యని చూచి "మ్చ.... మ్చ...." అనుకున్నాడు చిదానందం.

సాధారణంగా చిదానందం కళ్ళబడ్డ వస్తువుగాని, మనిషిగాని చిదానందం కాకుండా ఉండదు.

"బస్సొస్తున్నదా అయ్యా?" అంది సుబ్బరత్నం.

"పావుగంటలో వస్తుందని చెప్పాడు. మబ్బులు దాగా ముసిరాయి. చినుకులు పడకముందే బస్సెక్కితే కష్టముండదు." అన్నాడు బుచ్చయ్య తల పైకెత్తి చూస్తూ.

"నాకేం కష్టం అయ్యా బస్సులో తడుస్తానా, పెడతానా! నువ్వు రిక్షాబండి ఎక్కవు వానలో తడిసి పోతావు ఇల్లు చేరేటప్పటికి." అంది సుబ్బరత్నం.

వీళ్ళ మాటలు విన్న చిదానందం కళ్ళు మిలమిలలాడాయి.

"శ్రీమహాలక్ష్మి ఒంటరిగానే ప్రయాణం చేస్తున్నదన్నమాట. అంటే తన పంట పండిందన్నమాట. ఏ ఎరువేస్తే ఈ పంట తన చేతికి వస్తుంది?" చిదానందం ప్లాన్ ఆలో

చిస్తూ వీళ్ళ సంభాషణ వినటానికి ఓ చెవి యిటు పారేసి నుంచున్నాడు.

"అల్లుడుగారికి మినప సున్నుండలు ఇష్టంకదా? పెట్టటం మరచిపొయ్యేవు వెళ్ళంగానే సున్నుండలు తెచ్చానని చెప్పు." అన్నాడు బుచ్చయ్య తాటాకుల బుట్ట వైపు చూస్తూ.

తలాడించింది సుబ్బరత్నం.

"అరిశలిష్టంకదా అని అదేపనిగా తినకు రత్నం, అజీర్తి చేస్తుంది, నాలుగురోజులున్నా పాడుకావు. జాగ్రత్తగా ఉంచుకుని తిను."

"అలాగే, నువ్వొకసారి రాకూడదా అయ్యా మా ఊరు. ఆయన నిన్ను రమ్మని చెప్పమన్నారు."

"మధ్యమధ్య నువ్వొస్తున్నావు, ఎప్పుడయినా అల్లుడు గారు వస్తున్నారా యె. అన్నట్లు మరచేపొయ్యా. మునసబు గారు నిన్న కనపడి అన్నారు.... 'మీ అల్లుడు సుందర రావుకి మా మేనల్లుడు ప్రకాశంకి ఇదివరకే పరిచయం ఉందిట, మొన్న మా ప్రకాశం చెప్పాడు సుందరరావు చాలామంచివాడు బుద్ధిమంతుడు అని.... అదృష్టవంతుడి వోయ్ బుచ్చయ్యా! మంచి అల్లుడిని సంపాదించావ్!' అంటూ అల్లుడిగారి గురించి తెగ మెచ్చుకున్నారు."

సుబ్బరత్నం మురిసిపోతూ సిగ్గుపడింది.

చిదానందం మెదట్లో ఛప్‌మని లైట్ వెలిగింది.

చిదానందం ఆలశ్యం చెయ్యలేదు. బుచ్చయ్య దగ్గర కొచ్చి నుంచున్నాడు. పొడిదగ్గు దగ్గాడు "అబ్బబ్బ, ఈ వెధవ బస్సు ప్రయాణం, ఓ పెద్ద న్యూసెన్స్ టైమ్ ప్రకారం ఏ బస్సు రాదు. మీ రెందాకా వెళ్ళాలి?" అంటూ మాట్లాడించాడు.

తనుకాదు ఊరెళ్ళేది తన కూతురని, వెళ్ళేది ఏవూరు అయినది చెప్పాడు బుచ్చయ్య.

తనూ అదేవూరు వెళుతున్నానని చెప్పాడు చిదానందం.

"మా అల్లుడిగారి ఊరేనన్నమాట మీదీను. సరిసరి...." అంటూ బుచ్చయ్య. చిదానందంతో మాటల్లో పడ్డాడు.

పది నిమిషాల తర్వాత బస్సు వచ్చింది.

సుబ్బరత్నం బస్సెక్కింది.

చిదానందం, బుచ్చయ్య సామాను అందిస్తుంటే అందుకుని సుబ్బరత్నం దగ్గర పెట్టాడు.

కావాలని హడావిడి చేసినందున బస్సులో కొందరు చిదానందాన్ని చూశారు. చిదానందానికి కావలసిందదే.

కండక్టర్ బెల్ నొక్కాడు.

బస్సు బైలుదేరింది.

"జాగ్రత్తమ్మా రత్నం!" అన్నాడు బుచ్చయ్య.

సుబ్బరత్నం తలాడించింది.

చిదానందం బస్సులో సగం మందికి వినిపించేటట్లు "ఫరవాలేదు, కంగారుపడకండి. వస్తాను. జాగ్రత్తగా ఇంటికెళ్ళండి వానరాకముందే." అన్నాడు.

కండక్టరు టిక్కట్లు కొస్తుంటే చిదానందం, సుబ్బరత్నం వైపు వేలు చూపించి "నేను నా భార్య, రెండు టిక్కట్స్ చీపురుపల్లికి," అన్నాడు పదిరూపాయల నోటు కండక్టరు చేతిలో పెట్టి.

కండక్టర్ చీపురుపల్లికి రెండు టిక్కట్లు కోసి ఇచ్చాడు, చిల్లరనోట్లతోపాటు.

కండక్టర్ వచ్చి తనెళ్ళేది ఏ వూరో అడిగితే డబ్బులిచ్చి టిక్కట్టు తీసుకుందామని సుబ్బరత్నం అలాగే కూర్చుంది.

ఎప్పుడు సుబ్బరత్నం ఒంటరిగా ప్రయాణం చేసినా టిక్కట్టివ్వమని తనే కండక్టరుని ముందడగదు. కండక్ట రొచ్చి అడిగితే డబ్బులిచ్చి ఊరిపేరు చెప్పేది. టిక్కట్టు పుచ్చుకొనేది.

బస్సు వెళ్ళే రూట్ బాగా తెలుసు చిదానందానికి. చీపురుపల్లి వెళ్ళాలంటే రోడ్డు వారగా పదమూడో మైలు రాయివద్ద బస్సు ఆపుతారు. చీపురుపల్లి అక్కడికి రెండు మైళ్లు. పొలాలు దాటి అడ్డుదోవన నడిచి వెళితేగాని చీపురు పల్లి రాదు. చీపురుపల్లి ఎవరెళ్ళాలన్నా నడిచే వెళతారు.

"చీపురుపల్లిలో యెవరైనా దిగేటట్లయితే తన ప్లాన్ ఫలించదు. గప్‌చిప్‌గా ఆ పై స్టాప్‌లో దిగిపోవటమే. ఎవరూ బస్ దిగకపోతేనే తన ప్లాన్ ఫలిస్తుంది. అయినా తను చాలా రిస్కుతో కూడిన వ్యవహారంలో తల దూర్చ బోతున్నాడు. ధైర్యేసాహసే లక్ష్మీ అన్నారు." చిదానందం ఆలోచిస్తున్నాడు.

బస్సు జోరుగా పోతున్నది.

సుబ్బరత్నం, టిక్కట్టు గురించి కండక్టరు గురించి ఆలోచించటం మరచిపోయి భర్త గురించి తియ్యని తల పుల స్వర్గంలో మునిగిపోయింది.

నెక్ట్స్ స్టాప్‌లో బస్ ఆగింది.

చిదానందం బస్ దిగాడు. తానో సోడా తాగాడు. మరో సోడా కొట్టించి కిటికీ దగ్గరగా కూర్చున్న సుబ్బరత్నంకి సోడాకాయని కిటికీలోంచి అందించాడు.

చిదానందం తనని అడగకుండానే సోడా ఇవ్వటం సుబ్బ రత్నంకి నచ్చలేదు. అయినా ఏమీ అనలేదు. మర్యాదగా "వద్దండి" అంది.

"ఫరవాలేదు తీసుకో, కొట్టించాగా," అన్నాడు కిటికీ లోంచి సోడాకాయని సుబ్బరత్నం ముఖం దగ్గరగా తెచ్చి.

సుబ్బరత్నంకి తీసుకోక తప్పలేదు. అయిష్టంగానే సోడా తీసుకు తాగింది.

ఛిదానందం బస్ ఎక్కాడు.

సుబ్బరత్నం కాళీచేసిన సోడాకాయని చిదానందం తీసుకుని కాస్తంత సుబ్బరత్నం మీదకు వంగి అటు కిటికీ లోంచే సోడాబండి అబ్బాయికి డబ్బులు సీసా అందించాడు.

సుబ్బరత్నం వెనకసీట్లో కూర్చున్న ఆమె,సుబ్బరత్నం సోడా తాగటం చిదానందం సీసాని డబ్బుని కిటికీలోంచి కుర్రాడి కివ్వటం చూసింది. అది గమనించాడు చిదానందం.

"వచ్చే స్టాపుగాక పై స్టాపు. జాగ్రత్తగా కూర్చో" అని చిదానందం తన సీటులోకి వచ్చి కూర్చున్నాడు.

అటు తిరిగివున్న సుబ్బరత్నం చిదానందం అన్న మాట సరీగా వినిపించుకోలేదు. వెనకసీట్లోవాళ్ళు వినాలనే చిదానందం అన్నాడు. వాళ్ళు విన్నారు.

"ఇంకా అయిదారుచోట్ల బస్ ఆగుతుంది. అతనేది ఇప్పించినా తీసుకోకూడదు," అనుకుంది సుబ్బరత్నం.

ఆగిన బస్‌లో నలుగురు ఎక్కారు, ఒకళ్ళు దిగారు.

కండక్టర్ విజిల్ వేశాడు.

బస్సు భారంగా బైలుదేరింది.

మరోస్టాపులో బస్ ఆగినప్పుడు ఇద్దరు దిగారు. ఎవరూ ఎక్కలేదు.

బస్ బైలుదేరింది కండక్టర్ విజిల్ విని.

వచ్చేదే చీపురుపల్లి.

చీపురుపల్లిలో ఎవరూ 'బస్ ఎక్కరాదని దిగరాదని' భగవంతుడిని ప్రార్థిస్తున్నాడు చిదానందం.

"ఇంకో అయిదుచోట్ల బస్ ఆగింతరువాత తన ఊరు వస్తుంది.'' లెక్కేసుకుంటున్నది సుబ్బరత్నం.

అరగంటలో నెక్స్ట స్టాప్ వచ్చింది.

"చీపురుపల్లి, నెమలికర్రు, దిగేవాళ్ళు దిగండి" అంటూ అరిచాడు కండక్టరు.

బస్ ఎక్కువసేపు ఆగదు, అందుకే కండక్టర్ తొందరగా దిగమని కేకవేశాడు.

చిదానందం లేచి నుంచున్నాడు.

కిందకి తొంగి చూశాడు. ఎవరూ లేరు. అంటే బస్ ఎక్కేవాళ్ళు లేరు. బస్‌లో అందరి వైపు చూశాడు. ఎవరూ దిగే ప్రయత్నంలో లేరు. చిదానందం గబగబ సుబ్బరత్నం చిన్న ట్రంకుపెట్టె చేతి సంచి తీసుకుని వేగంగా బస్ దిగి కింద పెట్టి మళ్ళీ బస్సెక్కి తాటాకుల బుట్ట అందుకున్నాడు. అప్పుడు చూసింది సుబ్బరత్నం, తాటాకుల బుట్టని చిదానందం అందుకోటం.

గబుక్కున లేచి నుంచుంది సుబ్బరత్నం.

"దిగు దిగు, మళ్ళీ బస్సు బైలుదేరుతుంది," అన్నాడు చిదానందం, సుబ్బరత్నంతో.

వీడెవడు? వీడికేమన్నా మతిపోయిందా? అన్నట్లు అయోమయంగా చూసింది చిదానందం వైపు.

"ఏంటీ దిగమంటే అట్టా చూస్తావ్, ఈ బస్సు నీ అబ్బది కాదు," అన్నాడు చిదానందం కాస్త కోపంగా.

"ఏంటమ్మా ఆలశ్యం దిగమంటుంటే," కండక్టర్ అరిచాడు.

"ఇక్కడ కాదు నే దిగాల్సింది...." ఇంకా ఏదో అన బోయింది సుబ్బరత్నం.

చిదానందం క్విక్‌గా సుబ్బరత్నం జబ్బ పట్టుకున్నాడు. "దిగెహె" అన్నాడు.

సుబ్బరత్నం చెయ్యి విదిలించుకోబోయింది. చిదానందం ఉడుంపట్టు పట్టాడు, సుబ్బరత్నాన్ని రెండడుగులు ఇవతలికి లాగాడు.

బస్సులో అందరి కళ్ళు వీళ్ళమీద పడ్డాయి.

బస్సులో చాలామంది ఉన్నారనే ధైర్యంతో సుబ్బరత్నం ధైర్యంగా...."ఎవరు నువ్వు దొంగ చచ్చినోడా?" అంది గింజుకుంటూ.

చిదానందం ఈడ్చిపెట్టి సుబ్బరత్నం చెంప మీద కొట్టాడు.

"కెవ్" మంది సుబ్బరత్నం.

చిదానందం నోరు తెరిచాడు.

"ఒసేయ్! రత్నం! ముందు కిందకి దిగి ఆ తర్వాత నాతో తేల్చుకుందువుగాని తాడో పేడో? వెధవ్వేషాలు బస్సులో వేసి ఇక్కడా నా పరువు తీయకు!"

"ఏంటి నువ్వనేది? నేనెందుకు బస్ దిగాలి? ఎవరు నువ్వు నన్ను బస్‌దిగమనటానికి?" అంది సుబ్బరత్నం.

"ఏంటయ్యా గోల?" అన్నాడు కండక్టరు వీళ్ళ దగ్గరకు వచ్చి.

"రత్నంకి నాకు పెళ్ళయి ఆరునెలయిందండి. ఓసారి కాపురానికి కొచ్చింది. చెప్పాపెట్టకుండా పుట్టింటికి చెక్కేసింది. మా మామగారి బలవంతం వల్లనే వెళ్ళి మళ్ళీ తీసుకువస్తున్నాను. నాతో రానని గోలచేసి ఏడ్చింది. దానికీ

మనువు యిష్టంలేదు. నా గొంతు కోశాడు నా మామ."

చిదానందం చెపుతుంటే సుబ్బరత్నం అడ్డు తగిలింది.

"ఛీ....ఛీ... నీవు నా మొగుడివా? అబద్ధం వీడో దొంగ నన్ను దింపాలని చూస్తున్నాడు, మాదీవూరుకాదు."

"ఒసేయ్ రత్నం! అబద్ధాలాడకే ఇదిగో మనిద్దరికీ టిక్కట్టు తీసుకున్నానా? చీపురుపల్లిలో రాములోరి గుడివద్ద మనయిల్లు."

"ఏమిటీ గోల, దిగుతారో బస్ పోనీమంటారో కనుక్కో?" డ్రైవరు అరిచాడు.

చిదానందం, సుబ్బరత్నం జడపట్టుకుని గుంజాడు. మరో చెంప వాయించాడు. బూతులు తిట్టాడు. సుబ్బరత్నానికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది. ఏడవసాగింది.

ధైర్యంగా భర్తలా ప్రవర్తిస్తున్న చిదానందం, గోలుగోలున ఏడుస్తూ వీడు నా భర్తకాదంటున్న సుబ్బరత్నం, ఏది నిజమో బస్‌లో ఎవరికీ అర్థం కాలేదు. కొందరటూ కొందరిటూ చేరారు.

"భర్తని కాదని ఎక్కడికిపోతావమ్మాయీ!"

"సొంతింట్లో లాగా బస్‌లో పోట్లాడుకుంటే ఎలా?"

"పుట్టింట్లోంచి బైలుదేరిన దానివి మొగుడు దగ్గరకుగాక ఎక్కడికెళ్ళాలని?" చిదానందం వైపు వాళ్ళన్నారు సుబ్బరత్నంతో.

"ఏమయ్యా! ఆ అమ్మాయి నువు భర్తవుకాదంటూ లబో దిబో మంటున్నది. ఆ అమ్మాయి భర్తవి నీవని ఆధారం ఏమిటి?"

"ఆమె వళ్ళంతా సొమ్ములున్నాయి. సొమ్ముకోసం నువ్వు నాటకం ఆడటం లేదుకదా?"

మరికొందరు సుబ్బరత్నంను జాలిగా చూస్తూ చిదానందంతో అన్నారు.

చిదానందం గొంతు సవరించుకున్నాడు. దీనంగా ముఖం పెట్టాడు.

"దీని మూలంగా ఈ రోజు మీ ముందు అబద్ధాల కోరులా, దొంగలా నిలబడాల్సి వచ్చింది. నా ఖర్మ! పెళ్ళి గాక ముందు రత్నం అంటే నా భార్య, ఎవడినో ప్రేమించింది. నా మామ నిజం తెలుసుకుని వాళ్ళకులం వీళ్ళకులం ఒకటి కానందున, దీని నోరు మూయించి మోసంచేసి నాకు కట్టాడు. పెళ్ళయింతరువాత పెళ్లాం కాకపోతుందా? నిజం తెలిసి కూడా నేను నయానభయాన చెప్పాను. ఆడిని మరచిపో బాగా చూసుకుంటానని, అయ్యభయంవల్ల అక్కడ తల వూపి నాతో బైలుదేరింది. ఇప్పుడేం ఆలోచించిందో, నే లేకపోతే దానిష్టం వచ్చిన చోటుకి పోవచ్చనో. ఇలా నాటకం ఆడుతున్నది!"

"అబద్ధం!" అంది సుబ్బరత్నం మరింతగా ఏడుస్తూ. ఆమెకు భయంతో ఎక్కిళ్ళుపట్టాయి.

బస్సులోవున్న అందరికీ ఏం చేయాలో తెలియలేదు. బస్సు ఆగిందని తొందరపడుతున్నారు. ఈ కధేమిటో అని ఆతృత పడుతున్నారు.

"అబద్ధం అని యీ పిల్లమొత్తుకుంటున్నది. నువ్వేమో నీ పెళ్ళాం అంటావ్ ఏంటయ్యా గోల!" కండక్టర్ విసుక్కున్నాడు.

"నువు భర్తవయితే ఫరవాలేదు. కాక దొంగవనుకో యీ అమ్మాయిని నీ పరం చేసిపోతే ఆనక మా మీద కొస్తుంది," డ్రైవర్ అన్నాడు చివరకు.

చిదానందం మొహం ఎర్ర జేసుకొని రుసరుసలాడాడు.

"ఏంటీ! నే దొంగనా? ఏదీ మళ్ళామాటను, నీ పెళ్ళామే నిన్ను నలుగురిలో అల్లరిపెడితే నువ్వేం చేస్తావ్? వదిలేసి పోతావా? నా పెళ్ళాం కాదంటున్నావుగా బస్సులో వదిలేసి పోతాను. తర్వాత పోలీసు యాక్షన్ తీసుకుంటాను. అందాకా ఈ రత్నాన్ని జాగ్రత్తగా చూడకపోతే నీ మెడకి బిగుస్తుంది వుచ్చు."

ఏం చేయాలో తెలియలేదు బస్సులో వాళ్ళకి కండక్టర్ కి డ్రైవర్ కి.

చిదానందం ధైర్యం వచ్చింది. సుబ్బరత్నం ఏదన్నా మాట్లాడబోపటానికి నోరు తెరవబోయినప్పుడల్లా నిజం మొగుడిలా చెయ్యిచేసుకుంటూ బూతులు తిట్టసాగాడు.

ఏం చెయ్యాలో డ్రైవరికి తోచలేదు "మీ గోలతో బస్సు ఆగితే ఆనక లేటుగా బస్ నడిపినందుకు నా మీద కొస్తుంది," అన్నాడు.

"ఇందాక ఆ అబ్బాయి సోడాకొట్టిస్తే యీ అమ్మాయి తాగింది. మాట్లాడాడు కూడా నేచూశా," అంది సుబ్బరత్నం వెనకసీట్లో ఆవిడ.

రెండు టిక్కట్లు చిదానందం చీపురుపల్లి కి తీసుకున్నట్లు సుబ్బరత్నం అసలు టిక్కట్టే తీసుకోనట్లు గుర్తుకొచ్చింది కండక్టర్ కి.

"మీరంతా అలా చిరాకు పడవద్దు. నాతో ఓ నలుగురు బస్సుదిగి నా మాట వినండి న్యాయం తెలుస్తుంది." అన్నాడు చిదానందం.

చిదానందంతో ఓ అరడజనుమంది దిగారు బస్సు.

"నా పేరు సుందరరావు. మా మామగారి పేరు బుచ్చయ్య

నా పెళ్ళాం పేరు సుబ్బరత్నం, నా కిష్టం అని మా అత్త గారు అరిశెలు, సున్నివుండలు చేసిచ్చింది. నే చెప్పే వివరాలు చాలనుకుంటా. వెళ్ళి దాన్నడగండి ఏం చెపుతుందో?" అన్నాడు చిదానందం.

దిగిన వాళ్ళు మళ్లీ బస్సెక్కారు.

"మీ ఆయన పేరేంటి? మీ అయ్యపేరేంటి? నీపేరేంటి? మీ అమ్మ ఏ మేం చేసి యిచ్చింది పిండివంటలు?" అని అడిగారు.

"సుందరరావు, బుచ్చయ్య, సుబ్బరత్నం, అరిశెలు, మినపసున్నుండట.'' టకటక జవాబిచ్చింది సుబ్బరత్నం. ఉన్నమాట చెపితే యీ దొంగబండారం బైటపడుతుందని.

బండారం బైటపడలా. బస్సులోంచి బలవంతానా చిదానందం సహాయంతో సుబ్బరత్నాన్ని దింపి బస్సురయ్యిన వెళ్ళిపోయింది.

చిదానందాన్ని గురించి సానుభూతి, సుబ్బరత్నంలాటి బరితెగించిన ఆడదాన్ని గురించి రకరకాలుగా మాట్లాడు కుంటూ కూర్చున్నారు బస్సులోవాళ్ళు.

బస్సు పదిగజాలు వెళ్ళి టర్నింగ్ తిరిగింది.

బస్సులో ప్రయాణం చేస్తున్న ముప్పై ఏళ్ళ మన్ మోహన్‌కి చటుక్కున ఏదో ఆలోచన వచ్చింది.

కండక్టర్‌తో చెప్పి, బస్సు ఆపుచేయించాడు.

మన్‌మోహన్ చేతిలో చిన్న బ్రీఫ్‌కేసు మాత్రమే వుంది.

"దయచేసి నేచెప్పేది వినండి. ఇందాక దిగిన వాళ్లు భార్యాభర్తలు కాదని నాకు అనుమానం వచ్చింది. నిజంగా భార్యాభర్తలయితే ఫరవాలేదు. నిజంగా అతను దొంగో, హంతకుడో అయితే ఒక యువతికి అన్యాయం చేసిన

వాళ్ళమేగాక నేరంలో భాగస్తులం కూడా అవుతాము. మనం ఇక్కడ బస్సు ఆపి కొందరం దిగి వెళదాము. నిజం తెలుస్తుంది." అన్నాడు గంభీరంగా మన్ మోహన్.

"ఇప్పటికో అరగంట లేట్ అయింది. బస్సు ఆగేది లేదు. కావాలనుకున్నవాళ్ళు దిగిపోండి." అన్నాడు కండక్టర్.

ఎవరూ బస్ దిగలేదు. మన్‌మోహన్‌కు మాత్రం ఎందుకో అతను మోసగాడై వుంటాడనిపించింది.

మన్‌మోహన్ ఒక్కడే బస్ దిగాడు.

బస్ వెళ్ళిపోయింది.

మన్‌మోహన్ బ్రీఫ్ కేసుతో చకచక వెనుకకు రాసాగాడు.

ఇందాక బస్ ఆగిన చోట నిర్మానుష్యంగా వుంది. మన్‌మోహన్ నలువైపులా చూస్తూ ఆగిపోయాడు. చీపురుపల్లి కెళ్ళే దోవలో ఎవరూ కనిపించలేదు.

భూదేవి చిన్నక్లూ యిచ్చింది.

అంతకు క్రితం చినుకులు పడటంవల్ల నేలమీద అడుగుల గుర్తులు కొద్ది కనపడుతున్నాయి. అడుగుజాడల ప్రకారం అక్కడ నుంచి మన్‌మోహన్ ఎడం చేతివైపు చెరుకుతోట వుంటే అటు సాగాడు.

చెరుకు గడలు నలిగినవి తప్పించుకుంటూ చేను సగం లోకి వెళ్ళాడు. మాటలు వినపడి చటుక్కున ఆగాడు. అప్పటికి కనుచీకటిగా మనిషి దగ్గరగా అయితే తప్ప కన పడని విధంగా వాతావరణం వుంది.

"వద్దు. వద్దు! నన్ను వెదిలెయ్యి. సొమ్ములన్నీ యిచ్చాగా, నన్నేం చేయకు." సుబ్బరత్నం దీనంగా అంటున్నది.

"సొమ్ములూరికే యిచ్చావా! నే ఎంత కష్టపడితే యిచ్చావ్? మళ్ళీ దీనికీ కష్టపెడుతున్నావు. పదిమందిలో. భార్యవయావు. ఈ కాసేపు నీవళ్లు నీదికాదనుకుంటే సరి పోలే?" సుబ్బరత్నాన్ని లోంగదీసుకోటానికి ప్రయత్నిస్తూ అన్నాడు చిదానందం.

మన్‌మోహన్ చప్పుడు కాకుండా బ్రీఫ్‌కేస్ తెరిచి పిస్టల్ బైటకి తీశాడు. వాళ్ళదగ్గరగా వచ్చాడు.

"హేండ్సప్ దొంగ భర్తగారూ!"

చిదానందం నిర్ఘాంతపోయాడు.

హుందాగా, మంచి పర్సనాలిటీతో ఓ చేత పిస్టల్ మరో చేత్తో బ్రీఫ్‌కేసుతో తననే గురిగా చూస్తున్న మన్‌మోహన్‌ని చూడంగానే చిదానందం ప్రాణాలు ఓసారి అలాపోయి తిరిగి వచ్చాయి. చేతులు పైకెత్తేశాడు.

"పారిపో ప్రయత్నించవద్దు. నా పిస్టల్ ఎప్పుడూ గురి తప్పలేదు. నా ఆలోచన ఎప్పుడు నన్ను మోసం చెయ్య లేదు. జాగ్రత్తగా విను. ఈ మధ్య బస్సుల్లో రకరకాల దొంగతనాలు జరుగుతున్నాయని మాకు రిపోర్ట్ వచ్చింది. మా వాళ్ళం నలుగురం మారువేషాలలో వివిధ బస్సులలో రోజూ ప్రయాణం చేస్తున్నాము. ఇద్దరు చిల్లర దొంగలు తప్ప ఎవరూ దొరకలేదు.

ఇందాక బస్సులో నీతోపాటు వెనుక సీటులో నేనూ ప్రయాణం చేస్తున్నాను. బస్సులోనే నీ మీద చర్య చేసు కుంటే నలుగురిలో నేను ఇంటలిజెన్స్ శాఖనుండి వచ్చిన సి. ఐ. డీ. నని తెలిసిపోతుంది. బస్సు దొంగలు జాగ్రత్తపడతారు. అందుకని కాస్త దూరంలో బస్సు ఆపి దిగి వచ్చాను. పిచ్చి ఆలోచనలు చేయకు. తప్పించుకో జూస్తే, గుండు గురి తప్పకుండా కాళ్ళిరగకొడుతుంది.

నే చెప్పినట్లుచెయ్యి." మన్‌మోహన్ పిస్టల్ కిందికి పైకి ఆడిస్తూ అన్నాడు.

చిదానందం సర్వం తనకి దక్కిందని సంతోష పడుతున్న సమయంలో వురమని పిడుగులా తల వాల్చేశాడు.

"చూడమ్మా! నేవచ్చాను ఇహ నీకేం భయంలేదు. నీ సామాను వీడి నెత్తిన పెట్టు బైలుదేరు. సి.ఐ.డీ. అంటే నీకు తెలియదేమో మారువేషంలో వున్న పోలీసు వాళ్ళము. అన్నట్లు నీ సొమ్మేది?"

"వీడు నన్నుకొట్టి తిట్టి నా సొమ్మంతా ఆఖరికి మంగళ సూత్రాలతో సహా తీసిపెట్టెలో పెట్టాడు. అన్ని దీనిలోనే వున్నాయి. దేముడిలాగా వచ్చారు బాబూ!" అంది సుబ్బరత్నం చెయ్యెత్తి దండంపెడుతూ.

సుబ్బరత్నం చేత చిదానందం తల మీద పెట్టే, బుట్ట, సంచి పెట్టించాడు.

మన్‌మోహన్ చేతిలో పిస్టల్ అలాగే వుంచుకున్నాడు.

సుబ్బరత్నం, చిదానందం, మన్‌మోహన్, ముగ్గురు బైలుదేరి ఇందాక ఎక్కడ బస్ దిగారో అక్కడొచ్చి ఆగారు.

పదినిమిషాల తర్వాత మరో బస్ వచ్చింది.

మన్‌మోహన్ ప్రయాణీకుల సాయంతో సుబ్బరత్నం చీర పెట్టెలోది తీసి చేతులు కదలకుండ చిదానందాన్ని కట్టేశాడు.

ఆ తర్వాత జరగవలసినవన్నీ చకచక జరిగిపోయాయి. చిదానందాన్ని టూటవున్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి అంతా వివరంగా చెప్పాడు ఇన్‌స్పెక్టర్. మన్‌మోహన్‌ను అభినందించి కేసు రిజిష్టరు చేశాడు.

***

కట్టుడు పళ్ళు

ఏ. వీ. మోహనరావ్

సాయంత్రం ఐదుగంటలా పది నిముషాలైంది.

రోడ్ నెంబరు ఆరు నిర్మానుష్యంగా వుంది. ఈ చివరి నుండి ఆ చివరకు రెండువైపులా కలిపి మొత్తం ఇరవై నాలుగు ఇళ్ళున్నాయి. అన్నీ పెద్దవే. ప్రతి ఇంటిముందు పూలతోటలున్నాయి, అందరికీ కార్లున్నాయి. అక్కడున్న వాళ్ళకోసం వచ్చిపోయేవాళ్ళుకూడా కార్లలోనే వస్తుంటారు.

ఎనిమిదో నెంబరు బంగళా రిటైర్డ్ లెఫ్టినెంట్ కర్నల్ సూర్యప్రకాశ్‌గారిది. ఆయన భార్య చాలారోజుల క్రితం చనిపోయింది. ఒక్కగానొక్క కూతుర్ని ఎయిర్‌ఫోర్స్‌లో వింగ్ కమాండర్‌గా పనిచేసే వ్యక్తి కిచ్చి పెళ్ళి చేశాడు. ఉద్యోగరీత్యా కూతురూ, అల్లుడూ ఫారిన్‌లో వున్నారు. మనవరాలు అనితను తెచ్చి తనదగ్గరే వుంచుకొన్నాడు. అనితకు పధ్నాలుగేళ్ళుంటాయి. అమ్మాయి సెయింట్ మార్క్స్ కాన్వెంట్‌లో ఎనిమిదో క్లాసు చదువుతూంది.

రోజూ మనవరాల్ని సూర్యప్రకాశ్‌గారే కార్లో తీసుకెళ్తారు స్కూలుకు. తిరిగి తనే తీసుకొస్తాడు.

ఆరోజు శనివారం. ఉదయం వాన కురిసింది బాగా. గాలిలో తేమ ఎక్కువై బాగా చలిగా వుండింది. సూర్యప్రకాశ్‌కు రెండో ప్రపంచ యుద్ధకాలంలో బర్మా సెక్టరులో పని చేసేప్పుడు పట్టుకున్న ఆస్త్మా జబ్బు, సర్వీసు వదిలినా కదలనని మొండికేసింది.

దగ్గు బాగా ఎక్కువయింది. స్కూలు వదిలే టైము కన్నా తగ్గకుండా పోతుందాని ఎదురు చూశాడు. లాభం లేకపోయింది. నిముషాలు గడిచేకొద్ది జబ్బు ఎక్కువయింది. తను వెళ్ళి అనితను తీసుకురావడం కుదరదని, స్కూలుకు ఫోన్‌చేసి, ఆటోలో వచ్చేయమని చెప్పాడు.

పనిమనిషి వచ్చి "అయ్యగారూ! టీ త్రాగుతారా?" అడిగింది.

"వద్దు! అనిత వచ్చాక ఇద్దరం త్రాగుతాం. ఫ్లాస్కులో పోసివుంచు!" అన్నాడు సూర్యప్రకాశ్.

కాశ్మీరు శాలువా తీసి ఒంటినిండా కప్పుకొని, హాండ్ స్టిక్ అందుకొని, బంగళా వెలుపలికొచ్చి సిమెంట్ పాట్ మీదుగా నడిచి గేటు దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

టైము చూసుకున్నాడు సూర్యప్రకాశ్. ఆరున్నర దాటింది.

మెల్లిగా బంగళాలోనికొచ్చి స్కూలుకు ఫోన్ చేశాడు. ఎవ్వరూ ఫోన్ ఎత్తలేదు. అంటే అంతా వెళ్ళిపోయి వుంటారని తీర్మానించుకున్నాడు.

అనిత ఏమైనట్లు?

ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్ళిందా?

అలా వెళ్ళదలచుకొంటే తనకు ఎక్కడినుంచైనా ఫోన్ చేసి చెప్పి వుండేది. పోనీ ఎవరింట్లోనన్నా బాతాఖానీ కొడుతూ కూర్చుందా? అలా జరిగినా తను కొంచెం ఆలస్యంగా వస్తానని ఫోన్‌చేసి వుండేది. అనితను చాలా క్రమశిక్షణతో పెంచాడు తను. అందువల్లే సూర్యప్రకాశ్‌కు కంగారు ఎక్కువైంది.

హాల్లో గోడగడియారం ఎనిమిది కొట్టింది.

గేటుదగ్గర కారేదో ఆగిన చప్పుడైంది.

సూర్యప్రకాశ్ లేచి పోర్టికోలోకి వచ్చి నిలబడ్డాడు బహుశా అనిత ఆ కార్లో వచ్చివుంటుందని.

సూట్ వేసుకునివున్న మనిషెవరో వస్తున్నట్లు కనుపించింది.

సూర్యప్రకాశ్ అతనికి ఎదురువెళ్ళాడు.

ఇద్దరూ దగ్గరయినారు.

"నమస్తే!" అన్నాడు సూట్‌వాలా.

ప్రతి నమస్కారంచేస్తూ "మీరు...." అన్నాడు ఎవరో అర్థంగాక.

"ఆ ఎందురింట్లో వుంటాను. నాపేరు రామ్మూర్తి. నాతో కొంచెం వెలుపలకు రావాలి!" అన్నాడతను.

"ఎందుకు?" అడిగాడు అర్థంగాక సూర్యప్రకాశ్.

"వెళ్తూ మాట్లాడుకుందాం" అన్నాడతను సమాధానంగా.

సూర్యప్రకాశ్ మనసు ఏదో కీడుని శంకించింది. మారు మాట చెప్పకుండా అతనివెంట వెళ్ళాడు. గేటు బయట వున్న కారెక్కి రోడ్ చివరికంటా పోనిచ్చి, కుడివేపు త్రిప్పాడు.

రోడ్ మొదట్లో జనం గుంపుగా వున్నారు. కొంతమంది

పోలీసులుకూడా కనుపించారు. రోడ్‌లో పోలీస్‌జీప్ పార్క్ చేసి వుంది.

"ఏమిటీ హడావుడి ?" అడిగాడు సూర్యప్రకాశ్ రామ్మూర్తిని.

"చూద్దురుగాని రండి!" అన్నాడు రామ్మూర్తి.

ఇద్దరూ కారుదిగి గుంపులోంచి దోవచేసుకొని వెళ్లారు. మధ్యగా మున్సిపాలిటీ వాళ్ళ చెత్తకుండీ వుంది. దానికీ, కాంపౌండ్ గేటుకు మధ్యనున్న ఖాళీస్థలంలో స్కూల్ యూనిఫాంలో వున్న అనిత శవం పడివుంది. ఆమె గుండెల్లోంచి కత్తిపోటు ద్వారా అయిన గాయంవల్ల రక్తం ప్రవహించి, తెల్లటి జాకెట్ మొత్తం ఎర్రగా తయారయింది తడిసి.

"అనితా" అరచాడు పెద్దగా సూర్యప్రకాశ్.

అందరూ ఆ అరుపు విని బిక్కచచ్చిపోయారు.

పోలీస్ ఇన్‌స్పెక్టరు అందర్నీ వెనక్కి తరిమాడు. సూర్యప్రకాశ్ శవం పైనపడి ఏడవసాగాడు. రామ్మూర్తి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్‌ను ఊరడించారు.

ఆరోజు జరిగిందంతా చెప్పాడు సూర్యప్రకాశ్.

ఇన్‌స్పెక్టర్ మొత్తం నోట్ చేసుకుని, రామ్మూర్తితో, సూర్యప్రకాశ్‌ని తీసుకెళ్ళి జాగ్రత్తగా చూస్తూండమని చెప్పాడు.

'అనిత' శవాన్ని పోస్టుమార్టం చేసేందుకు, జీప్‌లో కెక్కించి తీసుకుపోయారు.

బంగళాకు చేరగానే, సోఫాలో పడుకున్నాడు శవంలా సూర్యప్రకాశ్. ఆయనకు జీవితమంతా అగమ్యగోచరంగా అయినట్లు తోచింది. హాల్లో చుట్టూ తగిలించివున్న అనిత

ఫోటోలు, పిచ్చిగా చూడసాగాడు. రామ్మూర్తి ప్రక్కనే కూర్చుని, ధైర్యం చెప్పడం మొదలెట్టాడు. అనిత అమ్మ నాన్నలకు జరిగిన దారుణం తెలుపుతూ, రామ్మూర్తే కేబుల్ పంపాడు.

ముక్కుపచ్చలారని పసిపిల్ల అనిత. ఆమెను హత్య చెయ్యవలసిన అవసరం ఎవరికి కలిగివుంటుందో అర్థం కాలేదు సూర్యప్రకాశ్‌కు.

2

విల్స్‌ఫ్లేక్ ఫిల్టర్‌కింగ్ సిగరెట్ దమ్ములాగి, పొగ గాలిలోకి వదులుతూ ఎదురుగా కూర్చున్నమనిషి చెప్పే దంతా శ్రద్ధగా విన్నాడు విఖ్యాత డిటెక్టివ్ సుధాకర్.

"సూర్యప్రకాశ్‌గారూ! మీకెవరిపైనన్నా అనుమానం వుందా?" అడిగాడు సుధాకర్ అంతా విన్న తర్వాత.

"లేదుసార్! ఆ పసిపిల్లను చంపేంత కారణంగానీ, కార్పణ్యంగానీ ఎవ్వరికైనా ఎందుకుంటుంది?" ఎదురు ప్రశ్న వేశాడు.

"మీరు పోలీసులు కలసి సంపాదించిన సమాచారాన్ని బట్టి మీ మనమరాలు అనిత, ఐదుగంటలా పదినిముషాలకు స్కూల్లోంచి బయలుదేరింది. నడచి వచ్చినా ముప్ఫయి నిముషాలకన్నా ఎక్కువ వ్యవధిపట్టదు మీ యింటికి. స్కూలు రోడ్ చివరనున్న దుకాణం మనిషి ఆ అమ్మాయిని చూచినట్లు సాక్ష్యం చెప్పాడంటున్నారు. ఆ తర్వాతే ఏదో జరిగింది. అదేమిటో తెలుసుకోవాలి మనం. ఆమెకు తెలిసిన మనిషే తారసపడి వెంట నడచి వుండొచ్చు. కాకుంటే క్రొత్తవ్యక్తి వెంట వెళ్ళిపోయేందుకు అనిత మరీ పసిపిల్లగాదు. అవునా?" అడిగాడు సుధాకర్ సిగరెటూ పారేస్తూ.

"అవునండీ!" అన్నాడు సూర్యప్రకాశ్.

"అనితను మీ వీధిలో వుండే అందరికీ తెలుసా?"

"తెలుసు!"

"వాళ్ళ అడ్రసులు పేర్లుతో సహా రాసి పంపండి నాకు. గుర్తుంటే వాళ్ళ వయస్సులూ ఉద్యోగాలు కూడా రాయండి. ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆలోచిస్తాను." అన్నాడు సుధాకర్.

"అలాగే!" అంటూ లేచాడు సూర్యప్రకాశ్.

ఆయన్ని సాగనంపి సుధాకర్, కారెక్కి టూ టౌన్ పోలీస్‌స్టేషనుకు వెళ్ళాడు.

"రండి! రండి!" అంటూ ఆహ్వానించాడు మూర్తి సాదరంగా సుధాకర్‌ను.

"నీతో పనుండి వచ్చాను" అన్నాడు సుధాకర్ కూర్చుంటూ.

"పనిలేకుండా మీరు రారని నాకూ తెలుసు!"

"ఆ మిలట్రీవాలా సూర్యప్రకాశ్ మనమరాలు అనిత హత్యకేసు నువ్వే దర్యాప్తు చేస్తున్నావా?"

"ఆఁ!"

"ఎంతదాకా వచ్చింది పరిశోధన?"

"అదో సెక్స్ క్రైమ్! ఆ అమ్మాయిని, ఆ కిరాతకుడెవరో చెరచాలని ప్రయత్నం చేసినట్లున్నాడు. ఆమె తిరగబడినట్లుంది. భయపడి కత్తితో పొడిచి చంపినట్లున్నాడు, తన గుట్టు బట్టబయలు కాకుండా వుండేందుకు" అన్నాడు మూర్తి.

"ఐ. సీ."

"ఆ కత్తి కూడా మాయం చేశాడు. దానికోసం ఆ

ప్రాంతాలన్నీ గాలించాం. దొరకలేదు!"

"డాక్టర్ రిపోర్టు ఏమిచ్చాడు?"

"నేను చెప్పిందే రాశాడు. ఆ పసికందు బుగ్గలు కొరికి నట్లు గాయమయినాయి. పళ్ళు బాగా వెడల్పుగా వున్నాయట. ముందుండే నాలుగు పళ్ళల్లో మధ్యలో పన్ను లేనట్లుందతనికి. గాయమయిన తీరును బట్టి ఊహించాడు డాక్టరు."

"కొంతవరకు ఈ క్లూ దొరకడం మంచిదే."

"ఇప్పుడు ఈ కేసు...." అంటూ నసిగాడు మూర్తి.

"నేను పరిశోధిస్తున్నాను" అంటూ లేచాడు సుధాకర్.

3

గంట ఏడయింది. చీకటి బాగా అలుముకుంది.

గేటు తోసుకుని డిటెక్టివ్ సుధాకర్ అసిస్టెంట్ వసంత సూర్యప్రకాశ్ ఇంటి కెదురుగా వున్న ఇంట్లోకి వెళ్ళింది.

సూర్యప్రకాశ్‌గా రిచ్చిన లిస్టు ప్రకారం వరుసగా అందరినీ కలుసుకోసాగింది వసంత.

పోర్టికోలోకి వెళ్ళగానే, ఎదురుగా నలభై సంవత్సరాల వయస్సులోవున్న స్త్రీ కనిపించింది.

"ఎవరమ్మా?" అంది ఆవిడ.

"నేను లీవర్ కంపెనీ నుండి వస్తున్నాను. టూత్‌పేస్టు సేల్స్ బూస్ట్ చేసేందుకు కాన్వాస్ చేస్తున్నానండీ!" అంది వసంత వెళ్ళి ఆవిడ కెదురుగా నిలబడి.

"అయ్యో! ఆయన ఇంట్లో లేరే!" అంది ఆమె.

"ఫరవాలేదు! మీరున్నారుగా?" అంది వసంత.

"నా మొహం! నేను పాతకాలం మనిషిని. బాయలర్ లోంచి కచ్చికలు తీసుకొని పళ్ళు తోముకుంటూ వుంటాను.

ఆ పేస్ట్‌ల సంగతి నాకు తెలీదు. పైన అద్దెకుండే అబ్బాయిని అడిగి చూడు కొంటాడేమో?" అంది ఆమె.

"థాంక్స్! నేను దిగి వచ్చేలోగా మీ వారొస్తే మాట్లాడుతాను" అంది వసంత.

వసంత మెట్లెక్కి పైకి వెళ్ళింది. వరండాలో వున్న వాలుకుర్చీ వేసుకుని ఏదో పుస్తకం చదువుతున్నాడు పరబ్రహ్మం. అడుగుల చప్పుడు కాగానే తలెత్తి వసంత కేసి చూశాడు.

"నమస్తే!" అంది వసంత.

అతను కూడా ప్రతి నమస్కారంచేస్తూ "ఎవరుకావాలి?" అడిగాడు.

"ఉద్యోగరీత్యా వచ్చాను. నాకు అందరూ కావాలి!" అంటూ తనొచ్చిన పని వివరంగా చెప్పి, టూత్‌పేస్టు ట్యూబ్ అందించింది.

అతను ట్యూబ్ తీసుకుని వివరాలు చదవసాగాడు.

"మరో విషయం! మేము అందాల నవ్వులపోటీ ఒకటి ఆర్గనైజ్‌చేస్తున్నాం. మొదటి ప్రైజు యాభై వేల రూపాయలు. మీరు అందంగా నవ్వితే నేను ఫొటో తీసుకుంటాను. ఆ తర్వాత దాన్ని డెవలప్‌చేసి మేము ప్రింట్లు వేసుకుని పోటీలో ఎంటర్ చేసుకుంటాం. మీకు అభ్యంతరమేమిలేదుగా?" అడిగింది వసంత.

కాసేపు ఆలోచించి "లేదు!" అన్నాడు.

"అయితే ఓమారు నవ్వండి!" అంది వసంత కెమెరా తీసి ఫ్లాష్‌గన్ బిగించి.

పరబ్రహ్మం నవ్వుతూ నిల్చున్నాడు.
వసంత స్నాప్ తీసుకుంది క్లిక్‌చేసి.

హాండ్‌బ్యాగ్‌లోంచి టైప్‌చేసిన ఫారం తీసి అందించి "దీన్ని జాగ్రత్తగా చదివి కాస్త ఫిలప్‌చేసి ఇవ్వండి!" అంది.

పరబ్రహ్మం కుర్చీలో కూర్చుని మొత్తం చదివి. ప్రక్కనే వుంచుకున్న పెన్‌తో గబగబ రాయడం మొదలెట్టాడు. రెండు నిముషాల తర్వాత కాగితం అడిగి అందిస్తూ "ఇలా మీరే అందరిళ్ళకూ వెళ్తున్నారు?" అడిగాడు.

"అవును. ఈ వాడ నాకు అప్పగించారు. నాకు రోజుకు పాతిక రూపాయ లిస్తారు. ఏ ఉద్యోగం లేనిదానికి ఇది నయమనిపించింది. కష్టమైనా సరే చేస్తున్నాను." అంది వసంత.

"పోనీండి! నాకు ప్రైజ్‌వస్తే మీకో సగం ఇస్తాను!" అన్నాడు పరబ్రహ్మం కొంటెగా వసంత అంద చందాలు గమనిస్తూ.

"నిజంగా! అయితే మీకే రావాలని ప్రార్థిస్తాను." అంది వసంత, సరంజామా సర్దుకుంటూ.

"కాఫీ త్రాగుతారా?"

"వద్దండీ!"

"పోనీ మరేదైనా," అంటూ నసిగాడు.

పరబ్రహ్మం మెదడులో కుమ్మరిపురుగులు కదుల్తున్నాయన్న విషయం అర్థంచేసుకోవడానికి ఆమెకు ఎక్కువసేపు పట్టలేదు.

"వద్దండీ! ఇంకా చాలా ఇళ్ళకు వెళ్ళాలి నేను. ఇప్పటికే చీకటిపడింది. థ్యాంక్స్! వస్తాను" అంటూ అతని జవాబుకోసం ఎదురు చూడకుండా మెట్లు దిగి క్రిందకు వెళ్ళింది.

4

ఆ మరుసటి రోజు వసంత మళ్ళీ పరబ్రహ్మం ఇంటికి వచ్చింది.

సూట్ కేస్‌లన్నీ సర్దుకొని వున్నాడు పరబ్రహ్మం.

వసంతను చూడగానే "మీరా? ఏమిటలా వచ్చారు?" అడిగాడు.

"ఏం లేదు! మీ ఫోటోలు ప్రింటుచేయించాను. ఒక కాఫీ ఇచ్చిపోదామని వచ్చాను." అంది కవరు వెలుపలకు తీస్తూ.

"దాంతో నాకేం అవసరంలేదే! నేను అర్జంటుగా ఊరెళుతున్నాను. ట్రయిన్ టైం అవుతుంది." అన్నాడు పరబ్రహ్మం.

వసంతా ఇల్లు కలయజూసి, సామాను ఘనపరిమాణం పరిశీలించి, "ఊరెళుతున్నారా? ఈ ఊరినుండి మకాం ఎత్తేస్తున్నట్లున్నారే?" అంది.

"అవును! ఇక్కడ నాకేం మనస్సు బాగుండటంలేదు!"

"కారణం తెలుసుకోవచ్చా?"

"నాకే తెలీదు! మీకేం చెప్పేది. మీరు వెళ్ళిపోండి. నేనూ బయలుదేరాలి!" అన్నాడు పరబ్రహ్మం.

"అవునవును! ఒక్క విషయం అడిగి తెలుసుకుందామని వచ్చాను. మీ ఫొటో చూసి మా కంపెనీలోని డెంటల్ ఎక్స్‌పర్ట్, ముందు పళ్ళల్లో ఒక్కటి కట్టుడిపన్ను అయి వుండాలని, బల్లగుద్ది చెప్పాడు. నేను అతనికి మీరు కట్టుడుపళ్ళు కానన్నచోట సంతకంచేసి ఇచ్చిన డిక్లరేషన్ చూపించాను. అయినా అతను ఛాలెంజి చేస్తున్నాడు.

కట్టుడు పన్ను వున్నవాళ్ళను పోటీలో పాల్గోనివ్వరు.

రేపు నిజంగా మీకు ప్రైజు వచ్చినా ముందు టెస్టులు చేస్తారు. అప్పుడు గనుక కట్టుడు పన్ను ఉన్నట్లు బయటపడితే చీటింగ్ ఆక్ట్ క్రింద మిమ్మల్ని పోలీసులు అరెస్టు చేస్తారు. ఆ డిక్లరేషను మార్చుకో దలచుకుంటే చెప్పండి! ఇస్తాను. అనవసరంగా పోలీసులతో గొడవ తప్పుతుంది!" అంది వసంత ప్రశాంతంగా.

పోలీసులన్న మాట రెండుసార్లు వినగానే పరబ్రహ్మాని కెందుకో ముచ్చెమటలు పోశాయి. కకావికలు పడుతున్నట్లు కనుపించాడు.

"ఆ డిక్లరేషను ఇవ్వండి!" అన్నాడు నిదానంగా.

వసంత బ్యాగ్‌లోంచి తీసి ఇచ్చింది.

అందుకుని పరపర చింపి ముక్కలు ముక్కలు చేసి దూరంగా విసిరి కొట్టాడు పరబ్రహ్మాం.

వసంత అచేతనంగా, నిలుచుంది.

"ఆ పోటీలు, ప్రైజులూ, నాకు అవసరంలేదు. దయ చేసి నన్ను వదలి వెళ్ళిపోండి! క్విక్!" అన్నాడు పరబ్రహ్మాం.

వసంత అక్కడ్నుంచి బయలుదేరింది వెనక్కి.

సూర్యప్రకాశ్ ఇంటికి వెళ్ళి అక్కడ్నుంచి సుధాకర్‌కు ఫోన్‌చేసి, పరబ్రహ్మాం ప్రయాణం గురించి చెప్పింది.

పరబ్రహ్మాం టాక్సీ చేసుకొని సికింద్రాబాదు స్టేషనుకు వెళ్ళాడు.

ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్ పై నుంది.

ఫస్టుక్లాస్ కౌంటర్ ముందున్న 'కాన్‌కోర్స్'తో సుధాకర్ నిలుచున్నాడు. అతని వెంటోమనిషి వున్నాడు. కొద్దిసేపట్లో వసంతకూడా వచ్చి సుధాకర్‌ను కలుసుకొంది.

పరబ్రహ్మం లగేజీ ఒక స్తంభం ప్రక్కన పెట్టి వెళ్ళి టిక్కెట్ తెచ్చుకున్నాడు.

మరో పావుగంటలో రైలు వెళ్ళిపోయింది.

5

హోటల్ నటరాజ్‌లో దిగాడు పరబ్రహ్మం.

అతన్ని అనుసరించి వెళ్ళిన వెంకటేష్ కూడా, అదే హోటల్లో రూం తీసుకున్నాడు. అతనిని చూడగానే ఎవరైనా 'బాగా డబ్బున్న' వ్యక్తి అనుకుంటారు.

ఇద్దరూ భోజనాల దగ్గరో లిఫ్ట్‌లోనో, రూఫ్‌గార్డెన్‌లోనో తారసపడసాగారు ఒకరికొకరు.

పలకరింపులు లాంటివి లేకుండానే రెండు రోజులు గడిచిపోయాయి.

మూడో రోజు వెంకటేష్ విష్ చేశాడు, పరబ్రహ్మంను భోజనం దగ్గర.

అతను కూడా విష్ చేశాడు.

"మిమ్మల్నెక్కడో చూసినట్లుంది!" అన్నాడు వెంకటేష్.

"నాకు మిమ్మల్ని ఎక్కడో చూచినట్లు లేదు!" అన్నాడు పరబ్రహ్మం.

"మీరేం చేస్తుంటారు? ఏ ఊరినుండి వచ్చారు?"

"ఒక ఊరని లేదు. ఇంజనీరును."

"హైద్రాబాద్‌లో వుండేవారా?"

"ఆఁ! కొద్దిరోజులున్నాను."

"అదే! అక్కడే చూసుంటాను మిమ్మల్ను. మాది హైద్రాబాదు." అన్నాడు వెంకటేష్.

"ఇక్కడేదైనా ఆఫీసుపనా?"

"కాదు! ఏ పనీలేకుండా ఎన్నేళ్ళుతిన్నా, ఎలా తిన్నా

తరగనంత ఆస్తి మా నాన్న సంపాదించి ఇచ్చాడు. ఇలా ఊళ్ళు తిరుగుతూ వుండటమే నా పని!'' అన్నాడు వెంకటేష్.

''లక్కీ-ఫెలోవి!'' అన్నాడు పరబ్రహ్మం.

''మీరు కాదా?''

''పనిచేస్తేగానీ పొట్ట గడవదు.తెచ్చుకున్న డబ్బు ఐపో వచ్చింది. ఇంకా ఏ పనీ చేతికందలేదు!''

"డబ్బు గురించి కంగారుపడకండి. ఎంత కావలిస్తే అంత తీసుకోండి. ఇస్తాను. పనికూడా మీకు వచ్చే ఏర్పాట్లు చేస్తాను. ఈ ఊళ్ళో నాకు చాలామంది ఫ్రెండ్స్ వున్నారు" అన్నాడు వెంకటేష్.

"థాంక్స్! అవసరమైనప్పుడు అడుగుతాను!" అన్నాడు పరబ్రహ్మం.

భోజనాలు పూర్తయినాయి. ఎవరి గదులకు వాళ్ళు వెళ్ళి పోయారు. వెంకటేష్ గదిలో ఫోన్ మ్రోగింది.

రిసీవరు ఎత్తాడు.

'హల్లో' అనగానే రిసెప్షన్‌లోంచి "హైద్రాబాద్ నుండి ట్రంకాల్ వచ్చింది సార్" అంటూ కనెక్షన్ ఇచ్చాడు.

"నమస్తే సార్! నేను వెంకటేష్‌ను" అన్నాడు మెల్లిగా.

"ఏమిటి ప్రోగ్రెస్?" అవతలవేపు నుండి సుధాకర్ అడిగాడు.

"బాగా పరిచయం చేసుకున్నాను. డబ్బుకు ఇబ్బంది పడుతున్నట్లున్నాడు. అతని తీరునుబట్టి, చాలా లోతు మనిషని అర్థంచేసుకున్నాను. ఒకపట్టాన బైటపడేరకం కాదు!"

"అవును. రెండ్రోజుల్లో అతన్ని లీలామహల్ పిక్చ

రుకు తీసుకెళ్ళు. నేను ప్రొప్రయిటరుతో మాట్లాడి 'ప్రెచు రస్ మర్డర్' అనే పిక్చర్ స్క్రీన్ చేసే ఏర్పాట్లు చేశాను. సినిమా చూస్తున్నంతసేపూ అతని రియాక్షన్స్ బాగా గమనించు. విశేషాలుంటే ఫోన్ చెయ్యి." అన్నాడు సుధాకర్.

వెనువెంటనే లైన్ కట్ అయిపోయింది.

వెంకటేష్ లైటార్పి పడుకున్నాడు.

6

ఆతర్వాత రెండురోజులకు గదికొచ్చాడు పరబ్రహ్మం. రెండొందలు కావాలని అడిగాడు. వెంకటేష్ మారుమాట చెప్పకుండా పర్సులోంచి తీసి ఇచ్చాడు. అందుకుని థాంక్స్ చెప్పాడు. ఈ రెండు రోజుల్లో ఇద్దరు బాగా మిత్రులయ్యారు కూడా.

గదిలోంచి వెళ్ళబోతుండగా "మిస్టర్ పరబ్రహ్మం!" పిలిచాడు.

ఏమిటన్నట్లు వెనక్కి తిరిగి చూశాడు అతను.

"సాయంత్రం మీకేమైనా పనుందా?"

"లేదు? ఎందుకు?"

"మంచి ఇంగ్లీషు పిక్చరు వచ్చింది లీలామహల్‌లో. సరదాగా వెళ్ళొద్దామా?" అడిగాడు వెంకటేష్.

"నాకంత ఇంటరెస్టు లేదు!" అన్నాడు పరబ్రహ్మం.

"నాకోసం రాలేరా! కంపెనీ ఉంటుంది. ఒంటరిగా చూడడం అలవాటులేదు!"

"సరే. అలాగే. మీకోసం వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు గదిలోంచి.

సాయంత్రం ఇద్దరూ టిక్కెట్లు పుచ్చుకుని హాలులోనికి వెళ్ళారు. జనం పల్చగా వున్నారు.

సినిమా మొదలైంది.

ఇంటర్వెల్ దాకా చూశారు.

అనిత హత్యకేసు లాంటిదే, సినిమాలోనూ వుంది. అందమైన పసిపాపను, సెక్స్‌కోసం, బలవంతం చెయ్యబోయి, ఆమె అరవడంతో దారుణంగా చంపేస్తాడు హంతకుడు. ఆతర్వాత పోలీసులు అతన్ని పట్టుకునే ప్రయత్నం చేస్తారు.

వెంకటేష్ సినిమా చూడడం మాని పరబ్రహ్మంను చూడసాగాడు. హత్య జరిగింది మొదలు కుర్చీలో అటూ ఇటూ కదలసాగాడు. కణతలు నొక్కుకోవడం మొదలెట్టాడు. జేబు రుమాలుతో నుదురు తుడుచుకున్నాడు నాలుగైదు సార్లు.

"బోర్‌గా వుంది. తలనొప్పి వస్తుంది! నే వెళ్తాను. మీరు ఉండి చూసిరండి!" అన్నాడు పరబ్రహ్మం ఇంటర్వెల్ కాగానే.

"చూస్తే ఇద్దరం చూద్దాం! లేకుంటే వెళ్ళిపోదాం!" అన్నాడు వెంకటేష్.

"ఎందుకు దండుగ. నే వెళ్తాను!"

"వద్దు! ఇద్దరం వెళ్దాం!" అంటూ వెంట నడిచాడు. ఆటో వేసుకుని హోటల్‌కు వచ్చారు.

దిగాక, పరబ్రహ్మం తిన్నగా రూంకు వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పదకొండు గంటలకు ఫోన్‌చేసి జరిగింది వివరంగా చెప్పాడు సుధాకర్‌కు. అంతా విని, "దీనితో అతడే అనితను హత్యచేశాడనేది రూఢి అయింది మనకు. ఇక రుజువు కావాలి" అని ఆతరువాత చెయ్యవలసింది వివరంగా చెప్పాడు వెంకటేష్‌కు.

ఫోన్ కట్‌చేసి లైటార్పి పడుకున్నాడు వెంకటేష్.

7

తెల్లవారింది.

రెస్టారెంటులో టిఫిన్ చేస్తూ కూర్చున్నాడు వెంకటేష్.

ఎదురుగా వచ్చి కూర్చున్నాడు పరబ్రహ్మం.

"తలనొప్పి తగ్గిందా?" అడిగాడు వెంకటేష్.

"ఆc!"

"ఇవాళ నీతో నాకు కొద్దిగా పనుంది" అన్నాడు వెంకటేష్.

"ఏమిటి?"

"ఏంలేదు! నేనొక చోటికి వెళ్తున్నాను. నువ్వు తోడు రావాలి!"

"ఇప్పుడే వెళ్దామా?"

"మరోగంట తర్వాత. ఈలోగా నీ కేదయినా పనుంటే వెళ్ళి చూసుకొని వచ్చెయ్!"

"నా కంత ముఖ్యమైన పనేమీ లేదు!"

"ఇక్కడో మనిషికి సంవత్సరం క్రితం పాతికవేలు అప్పుగా ఇచ్చాను. అతను నెలలోగా తిరిగిస్తానన్నాడు. నాలుగుసార్లు వెళ్ళి అడిగాను. ఇదిగో అదిగో అంటూ తలాయిస్తున్నాడు. ఇప్పుడు కూడా అతనికోసమే వచ్చాను. కానీ అతను సరిగ్గా సమాధానం చెప్పడం లేదు. ఈ దినం కాస్త బెదరించాలనుకున్నాను. నువ్వు తోడుగా వుంటే నాకు సపోర్టుగా వుంటుంది," అంటూ చెప్పాడు తన పని గురించి.

ఆతర్వాత గంటకు ఇద్దరూ బయలుదేరారు. సత్యనారాయణపురం ముందువైపున్న కాలనీలో అడుగుపెట్టారు. చిన్నచిన్న వీధుల్లోంచి నడచివెళ్ళి పాడుబడ్డ ఇంటి ముందు ఆగారు.

"ఇందులోనే అతనుండేది!" చెప్పాడు వెంకటేష్.

"దయ్యాలకొంపలాగుంది!" అన్నాడు బ్రహ్మం.

ఇద్దరూ లోనికి వెళ్ళారు. విరిగిపోయిన తలుపులు మూసి ఉన్నాయి. వెంకటేష్ తట్టాడు.

రెండు నిముషాల తర్వాత అవి తెరచుకున్నాయి. అవతలివేపు నడి వయసులో వున్న మనిషి నిలబడి వున్నాడు.

"నువ్వా? మళ్ళీ వచ్చావేం?" అడిగాడు అతను విసుగ్గా.

"డబ్బు ఇచ్చాక రాక తప్పుతుందా?" అంటూ లోనికి నడిచాడు వెంకటేష్. అతన్ని అనుసరించాడు పరబ్రహ్మం.

"ఇప్పట్లో నాదగ్గర నయాపైసా దొరకదని చెప్పాను."

"ఈ హరికథలు ఏడాదినుంచీ వింటున్నాను. నాకు డబ్బు కావాలి. నీ పాట్లు నీవి. డబ్బు నిల్చున్న పళాన కక్కాల్సిందే!"

"కక్కితే వచ్చేది డబ్బు కాదు! రాత్రి తాగిన సారా!" అన్నాడతను.

"వొళ్ళు దగ్గరపెట్టుకొని మాట్లాడు. అవాకులూ చెవాకులూ ప్రేలావంటే ప్రాణాలు తీస్తాను!" అన్నాడు వెంకటేష్ పళ్ళు కొరుకుతూ.

బ్రహ్మంకు భయం పుట్టింది.

వెంకటేష్ భుజం పట్టుకుని వెనక్కి లాగి, "అతని దగ్గర లేదంటున్నాడుగా, ఘర్షణపడి ఏం ప్రయోజనం? ఎప్పుడిస్తాడో అడగరాదూ!" అంటూ సలహా చెప్పాడు.

"వీడి సంగతి నీకు తెలీదు! పెద్ద స్మగ్లర్ వీడు. డబ్బు లేకకాదు, తిరిగి ఇవ్వంది. ఎగ్గొడదామని ఆలోచన!" అంటూ చెప్పి, వెంటనే అవతల వ్యక్తివేపు తిరిగి "నే

నొప్పుకోను! నా డబ్బు ఇప్పుడే ఇచ్చి తీరాలి!" అన్నాడు.

"ఇవ్వను. మీ తాతతో చెప్పుకో!" అన్నాడు అతను నిర్లక్ష్యంగా.

వెంకటేష్ రెచ్చిపోయాడు. "ఇవ్వవా? అయితే నిన్ను మీ తాత దగ్గరకే పంపుతాను." అంటూ సర్రున పాంటు జేబులోంచి రివాల్వరు వెలుపలకు లాగి, ఢన్ ఢన్ ఢన్ మంటూ గుండ్లు పేల్చాడు. ఎదురుగా వున్న వ్యక్తి తక్కున నేలకూలిపోయాడు. అమ్మా అని అరచి తల వ్రేలాడేశాడు.

వెంకటేష్ వొంగి అతని చెయ్యి తీసి నాడి కొట్టుకొంటుందో లేదో చూశాడు. తక్కున వదిలేసి "చనిపోయాడు" అన్నాడు బ్రహ్మంతో.

"ఎంతపని జరిగింది? ఇది హత్య!" అన్నాడు బ్రహ్మం.

"ఆవేశంలో జరిగింది!"

"అని పోలీసులు నిన్ను వదుల్తారనుకున్నావా? వేట కుక్కల్లా వెంటబడతారు."

"దట్స్ రైట్! మనం ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం!" అన్నాడు వెంకటేష్.

ఇద్దరూ పరుగుపరుగున మెయిన్‌రోడ్‌కొచ్చి, ఆటో ఎక్కి హోటల్‌కు చేరుకున్నారు.

"రివాల్వరు అక్కడే వదిలేశావా?" అడిగాడు బ్రహ్మం మెల్లగా.

"లేదు! దగ్గరే వుంది!" అంటూ తీసి చూపించాడు వెంకటేష్. బాగా కంగారుపడిపోతున్నాడు అతను.

"ముందు దాన్ని వదలించుకోవాలి! ఆ తర్వాతే నువ్వు

నిశ్చింతగా వుండగలవు," అన్నాడు బ్రహ్మం.

"ఎలా? నాకేం తోచటంలేదు!" అన్నాడు వెంకటేష్.

"మెల్లిగా వెళ్ళి గవర్నరుపేట సెంటరులో నిలబడి, కాలవలోకి విసిరిపారెయ్యి. పీడా వదులుతుంది!" అన్నాడు బ్రహ్మం.

"ఐడియా బాగుంది. కానీ జనం చూడరూ!"

"జనం లేనప్పుడే చెయ్యి ఆ పని."

"ఆలోగా పోలీసులొస్తే...."

"అంత తొందరగా రాలేకపోవచ్చు. మరీ అనుమానంగా వుంటే ప్రస్తుతానికి ఫ్లష్‌టాంక్‌లో పడేసివుంచు. అక్కడ ఎవ్వరూ వెతకరు!" అన్నాడు బ్రహ్మం.

అలాగే చేశాడు వెంకటేష్. ఆ రాత్రి పరబ్రహ్మం గదిలోనే వుండిపోయాడు వెంకటేష్.

రాత్రి రెండు గంటలదాకా ఇద్దరూ మేలుకునే కూర్చున్నారు పోలీసులు వస్తారేమోనని.

ఎవ్వరూ రాలేదు అంతదాకా.

"నువ్వెళ్ళి అది పారేసి రారాదూ!" అన్నాడు బ్రహ్మం.

"అలాగే!" అంటూ మళ్ళీ ఫ్లష్‌టాంక్‌లోంచి రివాల్వర్ తీసి జేబులో వేసుకుని వెలుపలికి వెళ్ళిపోయాడు వెంకటేష్.

తిన్నగా పోస్టాఫీసుకు వెళ్ళి ట్రంకాల్ బుక్‌చేశాడు సుధాకర్‌కు. అరగంట తర్వాత కనెక్షను దొరికింది.

జరిగిందంతా వివరంగా చెప్పాడు సుధాకర్‌కు.

"గుడ్! చాలా బాగా అమలుపరచావ్ మన ప్లాను! అతను నువ్వు రివాల్వరు పారేసేందుకు సూచించిన మార్గంలోనే, తను హత్యచేసిన కత్తిని కూడా వదలించుకొని

వుంటాడు. మన పథకంలో ఆఖరి నాటకం రేపు ఆడదాం. నేను పన్నెండు గంటలకల్ల విజయవాడ వస్తున్నాను," అని అతడికి మరికొన్ని సూచనలిచ్చాడు సుధాకర్.

8

"మిస్టర్ బ్రహ్మం! నాకు భయంగా వుంది. ఇక్కడ్నించి వెళ్ళిపోదామనుకుంటున్నాను!" అన్నాడు వెంకటేష్ కుర్చీలో కూర్చుంటూ.

"భయమా? ఎందుకు?" అడిగాడు బ్రహ్మం.

"పోలీసులు నన్ను అనుమానిస్తున్నారట. ఆ రివాల్వరు లైసెన్సు నా పేరనుంది. తూటాలు టెస్ట్ ఫైర్‌చేసి కనుక్కున్నారట! ఒక ఫ్రెండ్ కలిసి చెప్పాడు. అదే జరిగితే నేను ఉరికంబమెక్కి తీరాలి! తెలియక ఆవేశంలో చేసిందానికి ఉరిశిక్ష అనుభవించి ఈ జీవితం అంతం చేసుకోవడం నా కిష్టంలేదు. అందుకే పారిపోదామనుకుంటున్నాను." అన్నాడు వెంకటేశ్.

"అది అంత సులభంగాదు! ఈ దేశంలో ఎక్కడున్నా పట్టుకుంటారు నిన్ను."

"అందుకే మరో దేశం వెళ్ళాలనుకుంటున్నాను. పైగా ఈ రహస్యం నీకు తెలుసు. ఇప్పుడు మనం స్నేహితులం. మన ఇద్దరి మధ్యా మనస్పర్ధలొస్తే ఓనాటికి నువ్వే నన్ను పోలీసులకు అప్పగించవచ్చు."

"అబ్సర్డ్! అయినా మరో దేశం ఎలా వెళ్తావ్?"

"మద్రాసులో ఫ్రెండున్నాడు. డబ్బిస్తే దొంగ వీసాలు ఎన్ని కావాలన్నా తెస్తాడు. అతని ద్వారా పోదామనుకుంటున్నాను."

"అయితే నన్ను గూడా తీసుకెళ్ళు."

''నువ్వెందుకు రావడం! హాయిగా ఇక్కడుండండి!''

''హాయి! ఎక్కడుంది. నీలాగే నేను ఆవేశంలో చిన్న పొరపాటు చేశాను. పోలీసుల్ని తప్పించుకొని తిరుగుతున్నాను. అయినా వాళ్ళు నా వెంట పడుతున్నట్లుగానో, నన్ను అరెస్ట్ చేసేందుకు వస్తున్నట్లుగానో అనిపించి ప్రతి క్షణం బ్రతకలేక ఛస్తూ, చావలేక బ్రతుకుతూ వున్నాను. మనిద్దరం వెళ్దాం. వేరే దేశంలో హాయిగా ఉందాం! తీసుకెళతావా?''

''ఏమిటి నువ్వు చేసిన నేరం!'' అడిగాడు వెంకటేశ్.

మౌనంగా వుండిపోయాడు బ్రహ్మం.

''నా రహస్యం నీకు తెలుసు. నీ రహస్యం నాకు తెలిసినా నా వల్ల నీకే హాని జరగదు! ధైర్యంగా చెప్పు!''

''అనితనే ముక్కుపచ్చలారని అమ్మాయిని హత్య చేశాను!'' అన్నాడు తలగడ కళ్ళకు అడ్డంగా పెట్టుకుని.

''ఎందుకు?''

''ఆమె హైద్రాబాదులో నేనున్న ఇంటికెదురుగా వుండే బంగళాలో వుండేది. చాలా అందంగా కనుపించింది. వయస్సు చిన్నదైనా మనిషి బాగా ఎదిగిన పడుచులా కనుపించేది. ఆమెను అనుభవించాలనిపించింది. వెంటబడ్డాను. ఒకరోజు ఒంటరిగా దొరికింది. పార్కులోకి తీసుకెళ్ళాను. చీకటిగా వున్న ప్రాంతంలోకి తీసుకెళ్ళి బలవంతం చేశాను. ఆ అమ్మాయి అరచి అల్లరి చెయ్యబోయింది. భయపడి దగ్గరున్న కత్తితో పొడిచి చంపాను. ప్రాణాలు సులభంగానే పోయాయి. ఆమె శవాన్ని ఎత్తుకొని పార్కు ప్రక్కనున్న రోడ్‌పైని చెత్తవేసే సిమెంట్ తొట్టి వారగా పడేసి వెళ్ళిపోయాను.''

"రిటైర్డ్ లెఫ్టినెంట్ సూర్యప్రకాశ్ మనమరాలు అనిత సంగతేనా నువ్వు చెప్పేది?"

"అవును! అక్షరాలా ఆమె సంగతే!" అన్నాడు బ్రహ్మం.

"ఆ పిల్ల పెద్దమనిషి కూడా కాలేదని పేపర్లలో చదివాను.

"నేనూ చదివాను. ఆమె అలాంటది. నువ్వు చూడలేదామెను. మత్తెక్కిస్తుంది. ఆ మత్తులో మైమరచి పశువులా మారిపోయాను. హత్య చేశాను. ఇలా తప్పించుకొని తిరుగుతున్నాను. నన్నూ నీతో తీసుకెళ్ళు" అన్నాడు పరబ్రహ్మం.

"బాధపడకు. నిన్ను కూడా తీసుకెళ్తాను నా వెంట బట్టలు సర్దుకో!" అన్నాడు వెంకటేష్.

బ్రహ్మం గబగబ ఐదు నిముషాల్లో సర్దుకున్నాడు.

పరబ్రహ్మం, వెంకటేశ్ రూంలోంచి వెలుపలికొచ్చారు. మెట్లు దిగి రిసెప్షను దగ్గరకు రాగానే ఎదురుగా కనుపిస్తున్న సుధాకర్‌ను చూపి "నమస్తే!" అన్నాడు వెంకటేశ్.

"ఓ. కే!" అడిగాడు సుధాకర్.

పాంటు జేబులోంచి టేప్‌రికార్డరు తీసి అందించి "అంతా ఓ. కే!" అన్నాడు.

బిలబిలమంటూ పోలీసులు లోనికొచ్చి పరబ్రహ్మాన్ని అరెస్టు చేశారు.

వెంకటేశ్ నవ్వుతూ నిల్చున్నాడు.

"ఇంత మోసమా?" ఆశ్చర్యపోతూ అన్నాడు పరబ్రహ్మం.

"నాదికాదు! ఇదంతా డిటెక్టివ్ సుధాకర్‌గారి పథకం.

సూర్యప్రకాశ్‌గారు ఇచ్చిన లిస్టుప్రకారం అందరి పళ్ళను ఫోటోలు తీసుకొచ్చింది అసిస్టెంట్ వసంతగారు. అందరిలోను మీ ఒక్కరిదే మధ్యపన్ను కట్టుడుదని పరీక్షలో తేలింది. హంతకుడికి మధ్యపన్ను లేదని డాక్టరు సర్టిఫై చేశాడు. అందువలన ఆ రోజునుంచే నీ మీద వేట ప్రారంభమైంది. మా అనుమానాలు ధృవపరుచుకోవడానికి రుజువులు సంపాదించటానికి ఇన్నిరోజులు పట్టింది" చెప్పాడు వెంకటేశ్.

జీవితంలో ఓడిపోయిన వ్యక్తిగా నేలకు తల దించుకున్నాడు పరబ్రహ్మం. ***

"ఎలా ఉంది నీ వ్యాపారం"? కొత్తగా ఓ డ్రస్ ఎంపోరియం ఓపెన్ చేసిన ఫ్రెండుని పరామర్శించాడు బాబ్జీ.

"ఏం చెప్పనోయ్! నిన్నంతా కలిపి ఒక్క డ్రస్ మాత్రం అమ్మగలిగాను. ఈ రోజు పరిస్థితి యింకా ఘోరం," అన్నాడు.

"ఏం? అదెలా?" ఆశ్చర్యపోయాడు బాబ్జీ.

"నిన్న కొన్నవారు ఆ డ్రస్ ఈ రోజు వాపసు చేసారు," వాపోయాడా స్నేహితుడు.

—జి. దుర్గా బాబ్జి, రూర్కెలా.

మృత్యువు నీడ

ఎల్. రామగోపాల్

ఎండ విపరీతంగా కాస్తుంది. ఇరుకైన కొండదారి కావడం వల్ల, ఎత్తు పల్లాలతో, రాళ్ళు రప్పలతో, నడవడానికి చాల కష్టంగా ఉంది. ఎండకు చెమటలు పట్టి గుడ్డలన్నీ పూర్తిగా తడిసిపోయాయి.

టైం చూచుకున్నాను. ఒంటి గంట దాటింది. చక చక నడవడం మొదలు పెట్టాను. ఎక్కడికి వెళుతున్నానో, ఎందుకు వెళుతున్నానో నాకు తెలియదు. నిద్రలో నడుస్తున్న వాడిలా, గమ్యం లేని పయనం నాది. నా ఆకారం నాకే భయం కలిగిస్తుంది.

గుడ్డలన్నీ చినిగిపోయి, మాసిపోయి చాల అసహ్యంగా ఉన్నాయి. గడ్డం బాగా మాసిపోయింది. శరీరం అంతా నీరసంగా ఉంది.

నడుస్తున్న వాడినల్లా, ఏదో శబ్దం విని, చటుక్కున తల పైకెత్తాను. అంతే! గుండె ఆగినంత పనయింది.

బ్రహ్మాండమైన బండ దొర్లి నామీదకే వస్తూంది.

అంతే! మరుక్షణంలో ఆ బండ నా తలమీద పడింది. ఒక్కసారిగా 'అమ్మా!' అని అరిచాను పెద్దగా.

చటుక్కున మెలకువ వచ్చింది.

గదిలో బెడ్‌లైట్ వెలుగుతుంది. నా శరీరం అంతా భయంతో కంపిస్తుంది. ఆ చల్లటి రాత్రిపూట కూడ విప రీతంగా చెమటలు పట్టాయి.

మంచం దిగి సిగరెట్ వెలిగించి కుర్చీలో కూర్చున్నాను. ఒక్కసారి నాకు వచ్చిన కలను జ్ఞప్తికి తెచ్చుకున్నాను. అబ్బ! ఎంత భయంకరమైన కల.

నాకు చాల ఆశ్చర్యంగా వుంది. ఈ మధ్య రెండు వారాలనుంచి, ప్రతిరోజు ఇలాంటి పీడకలలే వస్తున్నాయి. రైలులోంచి పడిపోయినట్లుగాని, లోయలోకి దొర్లినట్లుగాని, పెద్ద బిల్డింగ్ మీద నుంచి పడినట్లుగాని, ఏదో విధంగా నా చావును సూచించే కలలు ప్రతిరోజు వస్తున్నాయి.

కాని కలలమీద పెద్దగా నమ్మకంలేని వాడిని కావడం వల్ల, బొత్తిగా లక్ష్యపెట్టలేదు. కలలమీద నాకు నమ్మకం లేకపోయినా, ప్రతిరోజు అలాంటి కలలే రావడం మాత్రం నాకు చాల ఆశ్చర్యంగా వుంది.

అదీగాక ఈ కలలన్నీ వేకువఝామున వస్తున్నాయి. వేకువఝామున వచ్చే కలలు తప్పకుండా నిజమౌతా యంటారు! రెండు వారాలనుంచి నాకిలాంటి కలలు వస్తున్నా ఇప్పటివరకు నాకేమీ జరగడంలేదు.

కాని ఒక్కటి మాత్రం నిజం. ఈ కలలవల్ల ఏమీ జరగడం లేదు.

కాని ఒక్కటి మాత్రం నిజం. ఈ కలలవల్ల ఏమీ

జరగడంలేదనే నిర్లక్ష్యంతో వున్నా. అనుక్షణం నన్నేదో అదృశ్య శక్తి చావుకు దగ్గరగా తీసుకువెళుతుందనే భావన కల్గుతుంది. ఎందుకో అర్థంకాదు. నా రోజులు దగ్గర పడుతున్నాయని, నాకు కొద్దిరోజుల్లోనే చావు వుందని అనుమానం కల్గుతుంది. ఆ భావన కల్గినప్పటినుంచి, నా కెందుకో బ్రతకాలనే తాపత్రయం ఎక్కువ అవుతుంది.

ఆలోచించడం మాని, సిగరెట్ విసిరేసి, కిటికీ తలుపులు తెరిచాను. అప్పుడప్పుడే తెల్లవారుతుంది. చిన్నగా నిట్టూర్చి కిచెన్‌లోకి వెళ్ళి స్టౌ వెల్గించాను.

2

"నిజం చెబుతున్నాను. ఏమీ అనుకోవద్దు. నీకు పది రోజుల్లో చావు తప్పదు!" అన్నాడు రమేష్ నా వైపే చూస్తూ. తనకు జ్యోతిష్యం బాగా తెలుసునని వాడి నమ్మకం వాటికి సంబంధించిన గ్రంధాలు ఏవేవో స్టడీ చేశాడు.

నేనేం మాట్లాడలేదు. అతని మాటలు వింటూ అతని వైపే చూస్తూ కూర్చున్నాను. నాకు యీ లోకంలో ఆప్తుడు, స్నేహితుడు అతడొక్కడే.

"సారీ జగన్! అసలు ఇటువంటి విషయాలు ఎవ్వరికీ చెప్పకూడదు. ముఖ్యంగా నీలాంటి స్నేహితులకు అసలు చెప్పకూడదు. కాని మనస్సు ఉండబట్టలేక చెప్పేశాను. నీ చేతినిబట్టి చూస్తే, నీ 'లైఫ్ లైన్‌లో' ఇంక పదిరోజులే గడువుంది. అంతేకాక, నీకు వచ్చే కలలు కూడ నీ చావును ధృఢపరుస్తున్నాయి. పోతే ఇంకో విచారకరమైన విషయం ఏమిటంటే. నీకు మామూలుగా చావురాదు. ఏదైనా ఆక్సిడెంటులో మరణిస్తావు. ఇది నిజం!" అన్నాడు రమేష్ చిన్నగా నిట్టూర్చి.

చిన్నగా నవ్వాను. నేను ఊహిస్తున్నదీ, రమేష్ మాటల్లో చెప్పాడు. అంతే!

కాని నాకు అదోరకమైన ఉత్సాహం కల్గుతుంది. నాకు చావు ఎలావస్తుందో తెలుసుకోవాలని ఉంది. నాకు చావంటే భయం లేకపోలేదు. కాని నా చావువల్ల బాధపడేవాళ్ళు ఎవ్వరూ లేరు. ఒంటరివాణ్ణి. నేను ఉన్నా, లేకపోయినా ఒక్కటే.

నాకు మొదటినుంచి ఈ 'పామిస్ట్రీ' మీద, జోస్యాల మీద, కలలమీద బొత్తిగా నమ్మకం లేదు. నేను వీటికి వ్యతిరేకిని. కాని నాకు నమ్మకం లేని వాటివల్లే నా చావు ధృఢపడుతుందంటే, నాకు ఆశ్చర్యంతోపాటు, వీటిని గురించి తెలుసుకోవాలనీ ఉత్సాహం కూడా కల్గుతుంది.

"నా లైఫ్ లైన్ ప్రకారం నేను పది రోజుల్లో చని పోతాను. సరే! మరి నీ 'లైఫ్ లైన్' ప్రకారం నీకెంత ఆయుస్సు ఉందో చెప్పగలవా?"

రమేష్ సీరియస్‌గా చూచాడు నావైపు. "నేను నిజం చెబుతున్నాను. ఎనభై సంవత్సరాల ఆయుస్సు ఉంది నాకు. ఎందుకైనా మంచిది నీవు కాస్త జాగ్రత్తగా ఉండు!" అని హెచ్చరించాడు.

"అలాగే! నీ మాటలు గుర్తుంచుకుంటాను. సీ యు ఎగైన్!" చకచక బైటకు నడిచాను.

3

ఆరోజు ఆఫీసునుంచి బైటకు వచ్చేసరికి బాగా చీకటి పడింది. పక్కనే ఉన్న హోటల్లో కాఫీ త్రాగి, నీరసంగా నడుస్తూ 'బస్‌స్టాప్'కు చేరుకున్నాను. అప్పటికే, నేను మామూలుగా వెళ్ళే బస్సు వెళ్ళిపోయింది. నెక్స్ట్ బస్ కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాను.

రమేష్‌తో మాట్లాడి అప్పుడే నాల్గు రోజులు గడచి పోయాయి. ఈ నాల్గురోజులనుంచి, నా చావును గురించి, కించిత్తు భయంతో, ఉత్సాహంతో ఎదురుచూస్తూనే ఉన్నాను. కాని ప్రతి చిన్న విషయంలో జాగ్రత్తపడుతూనే ఉన్నాను.

ఇప్పుడు కనీసం రోడ్డు క్రాసుచెయ్యాలన్నా, పది నిముషాలు అన్ని వైపులా చూచిగాని రోడ్డు దాటడం లేదు. బస్సులో కిటికీదగ్గరగాని, డోర్‌దగ్గరగాని కూర్చోవడం లేదు, సాధ్యమైనంతవరకు నిర్మానుష్యమైన ప్రదేశాలకు, వాహనాల రద్దీ ఉండే ప్రదేశాలకు వెళ్ళడంలేదు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకొన్నా మృత్యువు ఆక్సిడెంట్ రూపంలో యెలా వస్తుందో చూడాలని ఉంది నాకు.

బస్సు వచ్చి ఆగింది. ఎక్కి మధ్యగా ఉన్న సీట్లో కూర్చున్నాను, బస్సు బయలుదేరింది. మధ్యమధ్యలో అక్కడక్కడా ఆగుతూ వెళుతుంది.

ఇంక రెండు 'స్టాపులు'లు దాటితేగాని నేను దిగవలసిన చోటు రాదు.

"సార్! మీరు కాస్త లేస్తారా! ఆడవాళ్ళు కూర్చుంటారు!" నెమ్మదిగా అడిగాడు కండక్టర్.

తల త్రిప్పి చూచాను. ఎదురుగా పాతికేళ్ళ యువతి, చిన్న పిల్లాడిని ఎత్తుకొని నిలబడలేక పోతుంది. నాకు అటువైపు ఇటువైపు ఇద్దరు చిన్నపిల్లలున్నారు. నేను లేచి నిలబడితే, ఆమె కూర్చోవచ్చు.

"మీరు కూర్చోండి!" అంటూ లేచి నిలబడి పైన ఉన్న 'ఐరన్ రాడ్' పట్టుకున్నాను. ఆమె నా సీట్లో కూర్చొని కృతజ్ఞతగా చూచింది నావైపు.

బస్సు వేగంగా పోతుంది. ఆలోచిస్తూ తలవంచి రోడ్డు

వైపే చూస్తున్నాను.

ఎదురుగా ఒక కారు వస్తుంది. డ్రైవర్ తాగి ఉన్నాడేమో, రోడ్డంతా మెలికలు తిరుగుతూ వస్తుంది. ఆ పరిస్థితిలో ఆక్సిడెంట్ జరిగే అవకాశం ఉంది. బస్సు డ్రైవర్ హారన్ మ్రోగిస్తూ కాస్త వేగం తగ్గించాడు.

కారు బాగా దగ్గరకు వచ్చేసింది. బాగా కుడివైపుకు వెళ్ళిపోయిన కారు హఠాత్తుగా ఎడంవైపుకు తిరిగింది. అంతే! బస్సు ఒక్కసారిగా మలుపు తిరిగి, రోడ్డు పక్కనుంచి దూసుకు వెళ్ళిపోయింది. బస్సు డ్రైవర్ చాకచక్యం వల్ల ఏక్సిడెంటు తప్పింది.

అయితే అసలు జరగవలసిందంతా అప్పుడే జరిగింది.

బస్సు ఒక్కసారిగా మలుపు తిరగడంతో, నేను పట్టుకున్న ఐరన్‌రాడ్ పట్టుతప్పి తూలిపడ్డాను. నా వెనుకవైపే డోర్ ఉండడంవల్ల దొర్లుకుంటూ, డోర్ నెట్టుకొని రోడ్డు మీద పడిపోయాను. క్రింద పడగానే వేగంగా ఒక కారు నా మీదకు రావటం గుర్తుంది.

అంతే! పెద్దగా అరిచి క్రింద పడిపోయాను.

చటుక్కున మెలకువ వచ్చింది. మంచం మీద నుంచి క్రింద పడడంవల్ల చెయ్యి బాగా గీసుకుపోయింది. మెడనరం పట్టి, నడుం నొప్పి పట్టుకుంది. భయంతో శరీరం అంతా వణికిపోతుంది.

రెండు నిముషాలపాటు నీరసంగా అలాగే నేలమీద చతికిల పడ్డాను.

జరిగిందంతా జ్ఞప్తికి వస్తుంది. అయితే అంతా కలన్నమాట. ఎంత సహజంగా ఉంది. నిజంగా అంత భయంకరమైన చావు వస్తుందంటే ఎందుకో భయంగా ఉంది.

నెమ్మదిగా లేచి సిగరెట్ వెల్గించి కుర్చీలో కూర్చు న్నాను. అప్పుడే తెలతెలవారుతుంది. చిన్నగా నిట్టూర్చాను.

4

ఆ రోజు ఆదివారం. ఉదయం తొమ్మిది గంటలు కావొస్తున్నా మంచం మీదనుంచి దిగబుద్ధి కావడంలేదు. మామూలుగా అయితే ఈపాటికి ఏ బజారు సెంటర్లోనో, ఏ సినిమాహాలు దగ్గరో ఉండేవాడిని.

కాని ఈ రోజు అలాకాదు. రమేష్ చెప్పిన గడువులో చివరి రోజు ఇది. చాల జాగ్రత్తగా ఉండవలసిన రోజు.

నిద్రలేచింది మొదలు ఎందుకో నా మనసు నిరాశా, నిస్పృహలతో నిండిపోయింది. ఇల్లు కదలకుండా మంచం మీదనే పడుకున్నాను. ఆలోచిస్తూనే మళ్ళీ మళ్ళీ నిద్ర పోయాను,

సాయంత్రం నాల్గుగంటలయింది. మధ్య మధ్యలో కాఫీ త్రాగినా, భోజనం లేకపోవడంవల్ల బాగా ఆకలిగా వుంది. లేచి వెళ్ళి కాఫీ పెట్టుకొని త్రాగాను. కాస్త ఉత్సాహం వచ్చినట్లయింది. చకచక స్నానం చేసి బట్టలు మార్చు కున్నాను.

ఉదయం నుంచి మంచం మీదనే పడుకొని ఉండడం వల్ల చాల బోర్‌గా ఉంది. కాస్త అలా బజారుకు వెళ్ళవస్తే గాని హాయిగా వుండేట్లులేదు.

'నా జాగ్రత్తలో నేను ఉంటా! ఏం జరుగుతుందో చూద్దాం?" అనుకొని గదికి తాళంవేసి వీధిలోకి నడిచాను.

మొదటగా కన్పించిన హోటల్లోకి దూరి తృప్తిగా టిఫిన్ తిన్నాను. కడుపులోకి కాస్త ఆహారం వెళ్ళగానే, కొత్త శక్తి వచ్చినట్లయింది. బిల్లు చెల్లించి బైటకు వచ్చి నెమ్మ

దిగా నడవ సాగాను. ఈ రోజు నేను ఏ వాహనాలు ఎక్క దలుచుకోలేదు.

పది అడుగులు కూడ నడిచానో లేదో రమేష్ కన్పిం చాడు.

"హల్లో జగన్! ఏమిటి విశేషాలు! ఈ మధ్య బొత్తిగా కన్పించడంలేదు. ఇప్పుడు నీ దగ్గరకే బయలుదేరాను!" అన్నాడు ఉత్సాహంగా.

చిన్నగా నవ్వాను. ఈ పదిరోజులు ఇద్దరం కలుసుకోక పోయినా, టెలిఫోన్‌లో అన్ని విషయాలు మాట్లాడు కుంటూనే ఉన్నాం. ప్రతిరోజు నా యోగక్షేమాలు కను క్కుంటూనే ఉన్నాడు రమేష్.

పిచ్చాపాటి మాట్లాడుకుంటూ నడవసాగాం! "ఏదైనా సినిమాకు వెళదామా!" అడిగాడు రమేష్.

నేను తల వూపాను. ఎందుకంటే, మూడుగంటలపాటు అక్కడా ఇక్కడా తిరుగుతూ, రిస్క్ తీసుకునే కంటే, హాయిగా హాలులో గడిపెయ్యవచ్చు. ఇద్దరం సినిమాహాలు వైపు నడిచాం.

సినిమా పెద్దది కావడంవల్ల, సినిమా వదిలేసరికి పది గంటలు దాటింది.

రమేష్ టాక్సీ చేసుకొని వెళ్ళిపోయాడు. నేను నెమ్మదిగా నడిచి ఇంటికి చేరుకున్నాను.

5

ఉదయాన్నే మెలకువ వచ్చింది. నిద్ర లేవగానే ఎందుకో చాల ఉత్సాహంగా అన్పించింది.

ఎప్పటిలా ఆ రోజు నా కెలాంటి పీడకలా రాలేదు. అంతేకాక, రమేష్ చెప్పిన గడువు నిన్నటితో తీరిపోయింది.

ఇక ఫర్వాలేదు అనుకున్నాను. జోష్యం మీది నా అభిప్రాయం మరింత బలపడింది. చకచక కాల కృత్యాలుముగించి, బట్టలు మార్చుకున్నాను. పేపర్ బోయ్ పేపరు వేసి వెళ్ళాడు.

కుర్చీలో కూర్చుని పేపరందుకున్నాను.

"ఘోరమైన కారు ప్రమాదం!—

గతరాత్రి పదిన్నరగంటల ప్రాంతంలో పన్నెండవ నెంబరు సిటీ బస్సు, ఓవర్ బ్రిడ్జి దగ్గిర ఓ టాక్సీతో ఢీ కొనటంవల్ల, టాక్సీ పక్కన వున్న పల్లంలోకి దొర్లిపోయి అందులో ప్రయాణం చేస్తున్న రమేష్‌బాబు అనే లెక్చరరు టాక్సీ డ్రైవరు అక్కడికక్కడే మరణించారు. పోలీసు దర్యాప్తు సాగిస్తున్నారు.

—మా ప్రత్యేక విలేఖరి"

వార్త చదివి దిగ్భ్రాంతి చెందాను. ఆ షాక్ నుండి తేరుకోవడానికి నాకు అయిదు నిముషాలు పట్టింది.

మెదడంతా మొద్దుబారిపోయింది. రాత్రి రమేష్ టాక్సీలో వెళ్ళాడు. రమేష్ ఇల్లు ఓవర్‌బ్రిడ్జి దాటి ఇంకా రెండు ఫర్లాంగుల దూరం వెళ్తేగాని రాదు. ఇల్లు చేరకముందే.... ఆ పైన ఊహించలేక పోయాను.

కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. మనసంతా విచారంతో నిండిపోయింది. పేపరు మడిచి పక్కగా పెట్టి కుర్చీలో వెనక్కువాలాను.

"సారీ జగన్! నువ్వు నమ్ము, నమ్మకపో. నాకు మాత్రం ఎనభై సంవత్సరాల ఆయుస్సు వుంది. కాని నీకు మాత్రం పదిరోజులకంటే ఎక్కువలేదు. ఎందుకైనా మంచిది కాస్త జాగ్రత్తగా ఉండు!"—రమేష్ మాటలు నా కింకా విన్పిస్తున్నాయి

***

సీరియల్

(గత సంచిక తరువాయి)

33

ఆలోచిస్తున్న మురళి మనసులో ఒకేఒక్క సాధనం తళుక్కున మెరిసింది.

అది చేతిలోని స్క్రూడ్రైవరే! వెంటనే కీ హోల్‌లో స్క్రూడ్రైవర్ జొనిపి అటూ ఇటూ తిప్పాడు. అయిదు నిమిషాల ప్రయత్నం తరువాత క్లిక్‌మంది. హేండిల్ పట్టుకుని లాగాడు. తలుపు తెరుచుకుంది.

గది లోపలకు సంతోషంగా అడుగువేశాడు. వెంటనే అన్వేషణ ప్రారంభించాడు.

బీరువాలు, అలమరలు, టేబుల్ సొరుగులు మొత్తం గాలించాడు. బీరువాలో వున్న బట్టలన్నీ దులిపి క్రింద పడేశాడు. పరుపులు, దిళ్ళు నిర్దాక్షిణ్యంగా కోసివేసి గాలించాడు. క్రింద కూర్చుని నేలంతా పరీక్ష చేశాడు. గోడలన్నీ తడిమి చూశాడు. ఏవిధమైన ఆచూకీ దొరకలేదు.

ఒక వ్యక్తికి డబల్‌రూం ఎందుకా అని ఆలోచిస్తూ బెడ్‌రూంలోకి నడిచాడు. డబుల్‌స్ప్రింగ్ కాట్‌పై ఫోమ్ బెడ్ అమర్చబడివుంది. తలపైకెత్తి చూశాడు. గోడల నిండా శృంగార తైలవర్ణ చిత్రాలు కన్పిస్తున్నాయి. పరుపులు, దిళ్ళు చెక్‌చేశాడు. డ్రెస్సింగ్ టేబుల్‌వద్దకు వెళ్ళి పౌడర్‌డబ్బా తీసి క్రింద గుమ్మరించాడు. అద్దం వెనుక వున్న ప్లాస్టిక్ ప్లేట్ వూడదీసి చూశాడు. అనుమానింప తగిన వస్తువులేమీ లభించలేదు.

నిరాశగా నిట్టూర్పు విడుస్తూ మళ్ళీ చూశాడు. మురళి చూపు హఠాత్తుగా ఓ తైలవర్ణ చిత్రంపై ఆగిపోయింది. ఆ చిత్రంలో ఓ హాలీవుడ్ తార బేతింగ్ డ్రస్‌లో వుంది. మురళి తన చూపును ఆ చిత్రంనుండి మరల్చలేకపోయాడు. ఒక్క అండర్‌వేర్ మాత్రమే ధరించివున్న ఆ సుందరాంగి తన హొయలన్నీ ఒలకబోస్తోంది.

ఒక్కక్షణం ఆ చిత్రంమీదనుండి దృష్టిమరల్చి నలువైపులా వున్న చిత్రాలను చూశాడు. అతని కెందుకో ఆ చిత్రంలోనే ఏదో ప్రత్యేకత కన్పించింది.

మిగిలిన చిత్రాలకన్నా ఆ చిత్రానికి కొంచం 'కదలిక' యెక్కువ అన్పించింది. వెంటనే ఆ చిత్రపటాన్ని పైకెత్తాడు. అతని ప్రయత్నం ఫలించింది. అక్కడ ఒక విచిత్రమైన తాళంచెవి దొరికింది. చాలా పెద్దసైజులో వుంది.

ప్రతి గోడను అణువణువు శోధిస్తూ ఓచోట టక్కున ఆగిపోయాడు. అక్కడ మళ్ళీ టెస్ట్‌చేసి చూశాడు. ఏదో లోహపు శబ్దం విన్పించింది. ఎంతవరకు ఆ శబ్దం వినవస్తోందో తడిమి చూశాడు. రెండడుగుల చతురస్రాకారంలో వినవస్తూంది.

స్క్రూడ్రైవరు వుపయోగించి అవలీలగా ఆ రేకును పెళ్ళగించివేశాడు.

మురళి కళ్ళు తళతళ మెరిశాయి. అతని ఆలోచనలకు అకస్మాత్తుగా రూపం వచ్చేసింది. లోపల నల్లగా నిగనిగ లాడుతూ ఐరన్ సేఫ్ కన్పించింది. సంతోషంగా తాళం చెవిని కీహోల్‌లో పెట్టబోయాడు. కానీ కుదరలేదు. తాళం చెవి సైజు చాలా పెద్దదయింది.

ఏదో ఆలోచన వచ్చి తాళంచెవి రెండు కొనలకు రెండు చేతులతో పట్టుకొని బలంగా లాగాడు. అది 'టప్'మంటూ రెండుగా విడిపోయింది. లోపల అసలు తాళంచెవి కన్పించింది. దాని నుపయోగించి అతి సులువుగా ఐరన్ సేఫ్ తెరిచాడు.

మురళి కళ్ళు మెరిసాయి.

లోపల అనేక రకాలైన డాక్యుమెంట్లు, ఫోటోలు వున్నాయి. చకచక చదవగలిగినవన్నీ చదివాడు. కోటు జేబులోంచి 'మినియేచర్ కెమేరా' తీశాడు. మొత్తం కాగితాలను, ఫోటోలను ఫోటో తీశాడు.

మురళి మనస్సు సంతోషంతో చిందులు వేసింది. తను వచ్చిన పని నూటికి రెండు వందల పాళ్ళు సక్సెస్ అయింది. లైట్ రాకెట్ బృందం జీవం మొత్తం తన చేతికి చిక్కింది. ఇక లైట్ రాకెట్‌ను క్షణాలమీద బంధించవచ్చు. ఆలస్యం చేస్తే చాలా అనర్థాలు జరిగే ప్రమాదం వుంది.

అంతలో బయట ఎవరో తాళం తీస్తున్న శబ్దం విన్పించింది.

"ఏమిటీ, అప్పుడే కాంప్‌కు వెళ్ళిన రామ్మూర్తి తిరిగి

వచ్చాడా?" ఆశ్చర్యపోయాడు మురళి.

వెంటనే ఎక్కడివక్కడ వదిలేసి కుర్చీలు, బల్లలు తీసుకొని వెళ్ళి క్రితంసారిలా వేసుకొని వాటిపై కెక్కి బాత్ రూం వెంటిలేటర్‌ను చేరుకున్నాడు. కంగారులో ఊడదీసి పెట్టిన అద్దం క్రిందపడి 'బళుక్'మని పగిలిపోయింది. ఇక ఏమీ ఆలోచించకుండా అవతలవైపు చటుక్కున దూకేశాడు.

గుండె కొంచెం కుదుటపడింది. అయినా వెంటనే యీ హోటల్‌లోంచి బయటపడాలి. జరిగిన మోసం తెలుసుకుని శత్రువులు వెంట తరమకముందే జాగ్రత్త వహించాలి.

గబగబ రూంలోకి నడిచాడు. అంతే! వెనుకనుండి ధన్‌మంటూ తలపై ఇనుప రాడ్‌తో ఎవరో మోదారు. భూకంపం వచ్చిందా అన్నట్లు తల్లడిల్లిపోయాడు. గదంతా గిర్రున తిరిగిపోసాగింది. క్రిందకు పడిపోతూ వెనక్కి తిరిగి చూశాడు మురళి.

154వ నంబర్ గల రూంలో ఛెస్ ఆడుకుంటూ కన్పించిన యిద్దరు వ్యక్తులు మసకమసకగా కన్పించారు. ఆ తరువాత స్పృహ తప్పిపోయింది మురళికి.

34

కారు వేగంగా దూసుకుపోతోంది.

కారులో కూర్చున్న ధర్మేంద్ర మస్తిష్కం తీవ్రంగా ఆలోచిస్తోంది. 'ప్రస్తుతం తన నంబర్ ఫైవ్' అని తెలుసుకున్నాడు. అయితే తనను నంబర్‌తోనే పిలుస్తారా? పేరు పెట్టి పిలుస్తారా? తన పేరేమిటి?

లైట్ రాకెట్ స్థావరం ఎక్కడ? X-లైట్ ఎలా వుంటాడు? అక్కడ ఎలా ప్రవర్తించాలి? X-లైట్ ఎలాంటి ప్రశ్నలు అడుగుతాడు? ముఖ్యంగా నంబర్ ఫైవ్‌కు

ప్రాణస్నేహితులుంటే తన పని మరీ యిరకాటంలో పడు తుంది.'

"కంగ్రాచ్యులేషన్స్ భుజంగరావ్! మనపేరు నిలబెట్టావ్! అంతమందిని తప్పించుకొని వజ్రాలతో సహా బయటపడటం నిజంగా గొప్ప విషయం" భుజం తడుతూ అన్నాడొకడు.

"ఇంత జరుగుతున్నా ఆ గుంటనక్క ధర్మేంద్ర ఏం చేస్తున్నాడో? ఎక్కడా కనిపించలేదు! చదరంగపు ఎత్తులు ఆలోచిస్తూ ఎక్కడ కూర్చున్నాడో?" ఇంకొకడు అన్నాడు.

ఉలిక్కిపడ్డాడు ధర్మేంద్ర! అయినా పైకి కనబడనివ్వ కుండా జాగ్రత్తపడ్డాడు.

"వాట్ మిస్టర్ ఫైవ్? చాలా మౌనంగా వున్నావ్? ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడేవాడివి!" ప్రశ్నిం చాడు మొదటి వ్యక్తి.

ధర్మేంద్ర గుండెలలో రైళ్ళు పరిగెత్తాయి. ఏం మాట్లా డాలి?

"అబ్బ! అంత కష్టపడివస్తే కాస్త రెస్ట్ తీసుకోనివ్వ కుండా ఏమిటి మీ గొడవ?" డ్రైవింగ్ సీటులోవున్న వ్యక్తి విసుగ్గా అన్నాడు.

మళ్ళీ అతనే చెప్పాడు.

"మిస్టర్ ఫైవ్! ఇక కమిషనర్ వేషం తీసేయండి. మళ్ళీ మనం మామూలు మనుషులమైపోవాలి."

"ఓ. కె" అంటూ ధర్మేంద్ర తను రెండోసారి వేసు కున్న కమిషనర్ వేషం తొలగించివేయడం ప్రారంభించాడు.

కారు బ్యారేజ్‌కి అవతలవైపు ఆగింది. కారులోంచి ఒకడు ముందు దిగాడు. ధర్మేంద్ర చేతిలోని వజ్రాలకేస్‌ను తీసుకున్నాడు.

"సమావేశం రెండుగంటలకు హెడ్‌క్వార్టర్స్‌లో జరగబోతోంది. ముఖ్యులంతా తప్పక హాజరు కావాలి. అంతా అనుమానం కలగకుండా ప్రవేశించండి. గుడ్‌బై" అంటూ వెళ్ళిపోయాడు.

మిగిలిన యిద్దరితోబాటు ధర్మేంద్ర కూడా కారులోంచి క్రిందకు దిగాడు. కారు వేగంగా ముందుకు వెళ్ళిపోయింది.

ధర్మేంద్ర గుండెలలో పిడుగుపడింది. హెడ్‌క్వార్టర్స్ ఎక్కడో తెలియదు. ఎలా వెళ్ళాలి? 'అనుమానం కలగకుండా ప్రవేశించండి' అన్నాడు కాబట్టి అది బహుశా జన సమ్మర్ధం కలిగిన ప్రాంతమే అయివుండాలి.

పవిత్ర కృష్ణానదీ గర్భంలో నుండి వెలువడే చల్లని గాలి వింత అనుభూతులను కలిగిస్తోంది.

భుజంమీద గట్టిగా చెయ్యిపడటంతో వులిక్కిపడి చూశాడు. తనతోబాటు దిగిన వ్యక్తులలో ఒకరు.

"ఏమిటి బ్రదర్ ఆలోచిస్తున్నావ్? టైం ఒంటిగంట అయింది. అలా వెళ్ళి టీ త్రాగి మీటింగుకు వెళ్దాం" అన్నాడు ముందుకు నెడుతూ.

గుండె కుదుట పడింది ధర్మేంద్రకు. అంతలోనే తనను వీళ్ళు పరీక్ష చేయడం లేదుకదా - అన్న అనుమానం వచ్చింది.

"సరే పద!" అన్నాడు అతనితో కలిపి నడుస్తూ.

"మిస్టర్ జోసెఫ్! సరిగ్గా రెండుగంటలకు రండి. వెళ్ళి ఏ లాడ్జింగ్‌లోనన్నా వుండిపోయావంటే బాస్ చేత శిక్ష తప్పదు." అంటూ హెచ్చరించాడు మరోవ్యక్తి.

"అలాగే మరి నువ్వు?" అడిగాడు జోసెఫ్.

"నాకు వేరే పనివుంది. ఆ సమయానికి వస్తాను. మీరు

వెళ్ళండి" చెప్పాడు రెండోవ్యక్తి.

ఇరువురూ తలూపి నడక సాగించారు. అతనిపేరు జోసెఫ్ అని తెలుసుకున్నాడు ధర్మేంద్ర.

"నా స్వామిరంగ! ఇంకా రెండు రోజులు! ఆ తర్వాత చూసుకో, రాజ్యం అంతా మనదేకదా?" అంటున్నాడు జోసెఫ్.

"ఎందువలన?" అడిగాడు టక్కున. తర్వాత తను అడగడం తప్పని గ్రహించాడు.

"ఏమిటి కొత్తగా మాట్లాడుతున్నావ్? అప్పుడే మర్చిపోయావా? రెండు రోజులాగితే యీ దేశం వుంటుందా? దేశంలో యీ రాజకీయ నాయకులుంటారా? అంతా మనమే! అప్పుడు చూసుకో, ఎంత డబ్బు! ఎంత గౌరవం!!" సంతోషంతో అంటున్నాడు జోసెఫ్.

ధర్మేంద్ర గుండెలు గుబగుబలాడాయి.

అసలు దుండగుల ప్రణాళిక ఏమిటి? ఇంకా రెండు రోజులలో అఖిల భారత 'రాజకీయ నాయకులుంటారా?' అంటున్నాడు. కమల్‌నాథ్ అనుమానించినట్లుగా ఒకవేళ వాళ్ళందర్నీ మూకుమ్మడిగా హత్యచేయటానికి నిజంగా కుట్ర జరుగుతున్నదా??

35

చల్లని గాలికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు మురళి. వెనుక తలకు పెద్ద కట్టుగట్టినట్లు అనిపిస్తోంది. ఒకసారి చుట్టూ చూశాడు.

కారులో బాక్‌సీటుమీద పడుకొని వున్నాడు. తలవద్ద ఒకవ్యక్తి రివాల్వర్ పట్టుకొని రెడీగా కూర్చొని వున్నాడు. మాట్లాడకుండా నోటికి టేప్ అంటించాడు.

గతమంతా కళ్ళముందు మెదిలింది. మెల్లగా తలదగ్గర కూర్చొనివున్న తనిని చేతితో తట్టాడు.

"ఏమిటి? ఏంజరిగింది?" విసురుగా అడిగాడు ఆ వ్యక్తి.

వాంతి వస్తున్నదని, కారు ఆపుచేయమని సైగచేశాడు మురళి. కారు నిర్జన ప్రదేశంలో ప్రయాణం చేస్తోంది. ఒక్క నిమిషం వారు ఆలోచించుకొని కారు ఆపారు. నోటి కంటించిన టేప్ లాగివేశారు. మెల్లగా లేవదీసి క్రిందకు దింపారు. ఇరువురూ చెరొకవైపు పట్టుకొని రోడ్ ప్రక్కనే కార్పొరేషన్ వారి చెత్త కుండీవద్దకు తీసుకువెళ్ళారు. మురళి ఆ చెత్తకుండీలోనే వాంతి చేసుకున్నాడు. చెత్త కుండీమీద వున్న నంబర్ను జాగ్రత్తగా గుర్తుపెట్టు కున్నాడు.

మళ్ళీ జాగ్రత్తగా కారు ఎక్కించారు. కారు వేగంగా కదిలింది.

"మిష్టర్ మురళీ!" పిలిచారు.

"మురళి ఎవరు? నాపేరు బాబూరావు" ఆశ్చర్యబోతు న్నట్లు నటిస్తూ అన్నాడు మురళి.

"మిష్టర్! అతనికంటె ఘనుడు ఆచంటమల్లన్న! నీ పేరు మురళి. డిటెక్టివ్ ధర్మేంద్రకు అసిస్టెంట్ వి" నవ్వా డతను.

మురళి ఏమీ మాట్లాడలేదు. ముందుచూపు లేకుండా తను చేసిన పనికి సిగ్గుపడ్డాడు. ఇప్పుడేం చెయ్యాలో తోచడంలేదు.

"మిష్టర్ మురళి, పాపం చాలా బడలికగా వున్నారు. కాఫీ తీసుకోండి" ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులోకి పోసి యిచ్చారు.

"థాంక్స్" అంటూ గ్లాసు అందుకొని కాఫీని గుటగుట త్రాగేశాడు మురళి. కాఫీ గొంతులోకి వెళ్ళగానే మనసుకు కొంచం ఉత్సాహం వచ్చింది. అయితే అంతలోనే కళ్ళు మూతలు పడసాగాయి. శత్రువుల మోసం అర్థం చేసుకొనే లోగానే మగతగా ప్రక్కకు వాలిపోయాడు.

మళ్ళీ కళ్ళుతెరిచి చూసేటప్పటికి డన్‌లప్ పిల్లోపై పడుకొని వున్నాడు మురళి. చేతులొకసారి విదిలించాడు. 'ఆశ్చర్యం! తనను బంధించనైనా బంధించలేదు. అంటే తప్పించుకు పోలేనని ధైర్యమా వీళ్ళకు? యింత ధైర్యం ఎలా వచ్చిందో?' ఆలోచిస్తూండగానే తలుపు తెరుచుకొని ముగ్గురు వ్యక్తులు లోపలకు వచ్చారు.

ఇరువురి చేతులలో రివాల్వర్లు నిగనిగమెరుస్తున్నాయి. వారిలో మధ్యనున్న వ్యక్తి మురళికి దగ్గరగా వచ్చాడు.

"వాట్ మిష్టర్ మురళీ? ప్రశాంతంగా నిద్రపట్టిందా?" నవ్వుతూ అడిగాడు.

మాట్లాడకుండా ఆలోచిస్తూ నిల్చుండిపోయాడు మురళి.

"వాట్ మిష్టర్ మురళీ, ఆలోచిస్తున్నావు. తప్పించుకు పారిపోదామనా? కలలో కూడా ఆ సాహసం చేయకు. ఏ మాత్రం తప్పించుకు పోదామని ప్రయత్నించినా మా షూటింగ్ ఎక్స్‌పర్ట్స్ చేతిలో చావు తప్పదు. గుర్తుంచుకోండి" హెచ్చరించాడు.

మౌనంగా వుండిపోయాడు మురళి.

"మిష్టర్, హైద్రాబాద్ ఎందుకొచ్చావ్?"

"నీకు తెలుసు. మళ్ళీ నేను చెప్పడం అనవసరం!" నోరు విప్పాడు మురళి.

"వెరీగుడ్! అసలు రామ్మూర్తిని ఎలా అనుమా

నించారు?"

"నో. నేను చెప్పను?"

"ఆల్ రైట్! మా రామ్మూర్తి గురించి ఏం సమాచారం సేకరించావ్?"

"నేనేమీ సేకరించలేదు!"

"అబద్ధం! నువ్వు మా రాకెట్‌కు సంబంధించిన అనేక వివరాలు తెలుసుకున్నావ్! మా భావి కార్యక్రమాలను, మా రాకెట్‌లోని ముఖ్యవ్యక్తుల చిరునామాలను మినియేచర్ కెమేరాతో ఫోటోలు తీశావు. ఆ ఫోటోలు మాకు కావాలి!" చెప్పాడు చాలా స్పష్టంగా.

"కెమేరా మీ దగ్గరే వుందికదా! ఇంకా నన్నడగడం దేనికి?" శూన్యంలోకి చూస్తూ అన్నాడు మురళి.

అతను బిగ్గరగా నవ్వాడు.

"మిష్టర్ మురళీ! మిమ్మల్ని తక్కువగా అంచనావేశాం. ఎప్పుడు నువ్వు చాలా తెలివిగలవాడివేనని యిప్పుడు భావిస్తున్నాం. ఎందుకంటే ఆ కెమేరాలో ఫిల్మ్ లేదు!"

ఆశ్చర్యంగా చూశాడు మురళి.

"వాట్, ఫిల్మ్ లేదా? ఏమైపోతుంది. దానికేమైనా రెక్కలున్నాయా, ఎగిరిపోవడానికి!"

"రెక్కలు వున్నాయో, వూడాయో నాకు తెలియదు. ఆ కెమేరాలో మాత్రం ఫిల్మ్‌లేదు. అది ఎక్కడ దాచావో మర్యాదగా చెప్పు? లేకపోతే చెప్పించగల శక్తిసామర్థ్యాలు మాకు వున్నాయి" కఠినంగా అన్నాడు.

"అయాం వెరీసారీ! అది ఎక్కడవుందో నాకు తెలియదు!"

"నో. నీకు తెలుసు. మర్యాదగా చెప్పకుంటే చిత్ర

హింసలపాలు అవవలసి వస్తుంది. క్విక్" హెచ్చరించాడు.

"మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి. ఆ విషయం నేను చచ్చినా చెప్పను" దృఢంగా అన్నాడు మురళి.

చిన్నగా నవ్వాడతను.

"నీ చేతనే కాదు, నీ బాస్ చేతగూడా రహస్యాలు చెప్పిస్తాను" అంటూ ప్రక్కన వున్నతనికి సైగచేశాడు.

అతను తలతో పెడీపెడీమని మురళి కడుపులో కుమ్మాడు.

లోపల నరాలు తెగిపోయాయా అన్నంత బాధకలిగింది. ఉండచుట్టుకొని నేలమీద పడిపోయాడు. నోటిలోంచి రక్తం కారింది.

నేలమీదనుండి లేపి నిలబెట్టి అడిగాడు మళ్ళీ.

"వాట్ మిష్టర్ మురళీ! చెబుతావా? తరువాత ట్రీట్‌మెంట్ కోసం ఎదురుచూస్తావా?"

నోట్లోంచి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ తల అడ్డంగా తిప్పాడు మురళి. అతనిలో కోపం వెల్లువలా ఉప్పొంగుతోంది. తిరగబడితే ఆ ముగ్గుర్నీ అవలీలగా దెబ్బతీసి పారిపోవచ్చు. కానీ అందులో యిద్దరు షూటింగ్ ఎక్స్‌పర్ట్స్! ఇంకా బయట ఎంతమంది వున్నారో తెలియదు. తను రివాల్వర్ తీయడానికి కూడా అవకాశం లేదు. అసలు రివాల్వర్ జేబులో వుంచారో, లేదో?

ఆ వ్యక్తి మళ్ళీ ఏదో సైగచేశాడు.

మొదటి వ్యక్తి మురళి దగ్గరకు వచ్చి వరుసగా షర్ట్, పాంటు, బనీన్, అండర్‌వేర్ అన్నీ విప్పేశాడు. చివరకు ఒంటిమీద నూలుపోగు కూడా లేకుండా చేశారు.

సిగ్గుతో మురళి కుంచించుకుపోయాడు.

"మిష్టర్ మురళీ! సరిగ్గా రెండునిమిషాలు టైం యిస్తున్నాను. ఈలోపు చెప్పకపోతే నువ్వు మరవాలన్నా మరువలేని విధంగా, చిరస్మరణీయంగా ఉండేటట్లు మా బాస్ పేరు X-లైట్ నీ గుండెలమీద ఎర్రగా మచ్చపడేట్లు కాలుస్తాం. మర్యాదగా చెప్పు" అన్నాడు ప్రక్కవానికి మళ్ళీ సైగచేస్తూ.

గుండెల్లో రాయిపడింది మురళికి. నిగ్రహం కూడగట్టుకొని చెప్పనన్నట్లు తల అడ్డంగా తిప్పాడు.

వెంటనే ఆ వ్యక్తి ఎలక్ట్రిక్ హీటర్ ఆన్‌చేశాడు. రెండవవ్యక్తి ఓ స్టీల్‌రాడ్‌ను హీటర్‌పై వేడిచేయడం ప్రారంభించాడు.

రెండు నిమిషాలు గడిచాయి.

ఇనుపరాడ్ ఎర్రగా, సింధూరం పూసినట్లుగా కాలి తయారయింది.

అతను ఆ రాడ్ పుచ్చుకొని మురళి దగ్గరకు వచ్చాడు.

36

హోటల్ హైలాండ్స్!

నగరంలో హోటల్స్ అన్నీ నిద్రబోతున్నా, హోటల్ హైలాండ్స్ మాత్రం మేలుకొనేవుంది.

డిటెక్టివ్ ధర్మేంద్ర జోసెఫ్‌తో సహా హోటల్ హైలాండ్స్‌లోకి ప్రవేశించారు.

టీ త్రాగిన తరువాత జోసెఫ్ అటూ ఇటూ చూసి ఎవరూ పరిశీలించడం లేదని నిర్ణయించుకున్నాక ఎలక్ట్రిసిటీ కంట్రోల్ రూంలోకి ప్రవేశించాడు. ధర్మేంద్ర ఏ మాత్రం తప్పటడుగు వేయక జాగ్రత్తగా జోసెఫ్‌ను అనుసరించాడు.

జోసెఫ్ జేబులోంచి కాయిన్‌తీసి తన నంబర్‌గల స్విచ్ క్రిందవున్న హోల్‌లో జారవిడవడం, వెంటనే ఎర్రబల్బు

వెలగడం, లోపల సైరన్ మ్రోగినట్లు వినబడటం, ఆ వెంటనే స్విచ్‌మీద మూడుసార్లు చిటిక వేయడం, వెంటనే నీలం బల్బు వెలగడం, ఆ తరువాత ద్వారం తెరుచుకోవడం అంతా సూక్ష్మంగా పరిశీలించి తూ. చ. తప్పకుండా అలాగే చేసి లోపలకు ప్రవేశించాడు ధర్మేంద్ర.

అంత కట్టుదిట్టంగా, నగరానికే నడిబొడ్డున, అత్యం తాధునికంగా స్థావరాన్ని నిర్మించిన శత్రువుల ధైర్యానికి, నైపుణ్యానికి జోహారు లర్పించకుండా వుండలేక పోయాడు.

విశాలమైన హాలులోకి ప్రవేశించగానే అది అత్యవసర సమావేశమని గుర్తించాడు. దాదాపు పాతికమంది సభ్యులు కుర్చీలలో కూర్చుని వున్నారు.

రెండు నిమిషాలు గడిచాయి. ఎక్కడో బజర్ మ్రోగింది. అంతా తలలు వెనక్కు తిప్పారు. ముందు ఎక్కడో తలుపు ఒకసారి తెరుచుకొని, వెంటనే మూసుకున్న శబ్దమయింది. అంతా తిరిగి ముందుకు తిరిగారు. అంతే ధర్మేంద్ర ఎదుటి దృశ్యం చూసి అదిరిపోయాడు.

ఒక వ్యక్తి లోపలకు వచ్చాడు. అతను పూర్తిగా గ్లాస్ మాస్క్‌లో వున్నాడు. ఆ వ్యక్తి ఆకారం పూర్తిగా కన్పిం చడంలేదు. అంతా అస్పష్టంగావుంది. 'బహుశా అతనే X—లైట్ అయివుండాలి' అనుకున్నాడు.

ధర్మేంద్రలో ఆవేశం పెల్లుబికింది. అదే మరో పరిస్థితిలో అయితే ఒక్క ఉదుటున ఆ వ్యక్తి పైకి ఉరికివుండేవాడే! కానీ యిప్పుడు అతనిపైబడితే తన ప్రాణమే పోతుందేమో నని సందేహించాడు.

"వెరీ కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్‌ఫైవ్! కొన్ని లక్షల ఖరీదు చేసే వజ్రాలు సంపాదించావు. నేటినుండి నీ హోదా

పెరుగుతూంది. అలాగే నీకు ముట్టజెప్పే డబ్బు కూడా పెంచుతున్నాం." నవ్వుతూ అన్నాడు.

"థాంక్యూబాస్!" అన్నాడు నంబర్ ఫైవ్ వేషంలోవున్న ధర్మేంద్ర.

"నీకు తరువాత లక్షరూపాయలు కాష్ యివ్వబడుతుంది. అప్పటివరకు అడ్వాన్స్ అందుకో" అంటూ ప్రక్కనేవున్న బ్రాందీబాటెల్ తీసి విసిరాడు.

"థాంక్యూబాస్" ఆ బాటిల్‌ను నేర్పుగా అందుకొని అన్నాడు ధర్మేంద్ర.

తనకు ప్రస్తుతం బ్రాందీ బాటెల్ ఎందుకు ప్రజంట్ చేశాడో గ్రహించాడు ధర్మేంద్ర. వజ్రాల అపహరణ కేసులో ఏమైనా మోసం చేసివుంటే బ్రాందీ త్రాగిన నిషాలో నిజం చెప్పేస్తానని బాస్ వేసిన ఎత్తు అని గ్రహించాడు.

"ఛీర్స్!" అన్నారు మిగిలిన వారంతా గ్లాసులు తీసుకుంటూ.

గుండె నిబ్బరం చేసుకొని బాటిల్ ఎత్తి గడగడ త్రాగేశాడు. గొంతు భగ్గుమని మండిపోతోంది. ఎక్కడికో గాలిలో తేలిపోతున్నట్లు అనిపించింది. ఎంతో నిగ్రహంతో మనసులో ఆలోచనలను అదుపుచేసుకుంటూ X—లైట్ ప్రశ్నలకు ఎదురు చూడసాగాడు ధర్మేంద్ర.

"మిస్టర్ ఫైవ్! వజ్రాలు అపహరించేటప్పుడు ఏదైనా విశేషం జరిగిందా? ఎవరికైనా రహాశ్యాలు చెప్పావా? ముఖ్యంగా నువ్వు వజ్రాలు ఏమైనా కాజేశావా?" సూటిగా తీవ్రంగా కళ్ళలోకి చూస్తూ అడిగాడు X—లైట్.

"నో బాస్! ఏమీ అపసవ్యంగా జరగలేదు. అంతా సక్రమంగానే, మన ప్లాను ప్రకారమే జరిగింది." ముద్ద

ముద్దగా మాట్లాడాడు ధర్మేంద్ర.

"వెరీగుడ్! మీ తరువాత కార్యక్రమాలు త్వరలోనే అందచేయబడతాయి. అంతా మీ రూంలలోకి వెళ్ళి రెస్ట్ తీసుకోండి. గుడ్ బై" అన్నాడు బాస్.

ఎక్కడో బజర్ మ్రోగింది. అంతా తలలు వెనక్కు తిప్పారు. తలుపు ఎక్కడో తెరుచుకొని, మూసుకున్న శబ్దమయింది. రెండు క్షణాలాగి అంతా ముందుకు తిరిగారు.

ధర్మేంద్ర మదిలో మళ్ళీ అనుమానాలు! 'తన రూం ఎక్కడ? తనకు కార్యక్రమం ఎలా అందచేస్తారు?' ఒక్క క్షణం ఆలోచించి వెంటనే మత్తుగా ప్రక్కనున్న వాని భుజంమీద తలవాల్చేశాడు.

"అరె! వీడు మత్తులో అప్పుడే సోలిపోయాడే! మిస్టర్ భాషా, వీడ్నిటుపట్టుకోండి. రూంలోకి తీసుకెళ్ళి వదిలి పెడదాం" అంటూ అతను ధర్మేంద్రను పట్టుకొని మెల్లగా నంబర్ ఫైవ్ అని వున్న గదిలోకి తీసుకు వెళ్ళి ఫోమ్ బెడ్‌పై పడుకోబెట్టి వెళ్ళిపోయారు.

అడుగుల శబ్దం దూరమవగానే చటుక్కున లేచి నిల్చున్నాడు ధర్మేంద్ర. ఒకమూలగా ఫ్రిజ్ లోంచి ఐస్‌వాటర్ తీసుకొని మొఖం కడుక్కున్నాడు. మత్తు కాస్తా దిగిపోయింది.

అద్దంలో మేకప్ సరిచేసుకుంటూండగా టీపాయ్ పై వున్న ఫోన్ మ్రోగింది.

వెంటనే వెళ్ళి రిసీవర్ ఎత్తాడు.

X-లైట్ అవతలనుండి మాట్లాడుతున్నాడు.

"హల్లో మిస్టర్ ఫైవ్! ఓ చిన్నపని చేయండి. మన గెస్ట్ రూం నంబర్ 'టూ'కు వెళ్ళి అక్కడి పరిస్థితిని

కొంచెం సానుకూలం చేయండి." అంటూ ఫోన్ పెట్టే శాడు.

'గెస్ట్ రూం అంటున్నాడు! వీళ్ళకు అతిథులు ఎవరు? అక్కడ వున్న పరిస్థితి ఏమిటి? దానిని తాను ఎలా సాను కూలపరుస్తాడు.' ఒక్క క్షణం ఆలోచించి ఏదో నిర్ణయించు కున్నట్లుగా చిన్నగా తలపంకించి రూంలోంచి బయటకు వచ్చి కుడివైపుగా నడక సాగించాడు.

కొంతదూరం వెళ్ళేసరికి గెస్ట్ రూం వన్, టూ....వరు సగా కన్పించాయి. గదులన్నీ చాలా అధునాతంగా నిర్మింప బడ్డాయి.

రెండవ నంబర్ గదివద్దకు వెళ్ళాడు. అక్కడ గోడ కున్న పుష్ బటన్ నొక్కాడు. వెంటనే గోడలోంచి ఓ తలుపు తెరుచుకుంది. లోపలకు ప్రవేశించాడు.

లోపల స్టూలుమీద ఓ వ్యక్తి కూర్చొని వున్నాడు. అతని గడ్డం బాగా మాసిపోయివుంది. ఎన్నాళ్ళనుండి వున్నాయో, బట్టలు చివికిపోయి మురికివాసన కొడు తున్నాయి.

ఎవరో వచ్చిన శబ్దం విన్పించగానే చటుక్కున తల ఎత్తాడతను.

ధర్మేంద్ర అతన్ని చూసి ఆశ్చర్యపోయాడు. అతనెవరో కాదు, ముఖ్యమంత్రి సెక్రెటరీ రామ్మూర్తి!

"మళ్ళీ ఎందుకు వచ్చావు? నేను చచ్చినా ఆ విషయాలు చెప్పను. ఏమైనాసరే, మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి." అలవాటయిపోయినట్లుగా గొణుక్కున్నాడు.

ఆ కంఠం గుర్తుపట్టాడు. అదే కంఠం! తనకు ఫోన్ చేసి సేట్ రతన్‌లాల్ దోపిడీకి సంబంధించిన అమూల్య

మైన సమాచారం అందజేసిన కంఠం యిదే!

అతనికి దగ్గరగా నడిచాడు.

"మిస్టర్ రామ్మూర్తీ!" లాలనగా పిలిచాడు.

ఆశ్చర్యంగా తల ఎత్తాడతను. అటువంటి పిలుపు విని ఎన్నాళ్ళయిందో?

"అయామ్ డిటెక్టివ్ ధర్మేంద్ర!" చిన్నగా అన్నాడు.

"ధర్మేంద్రజీ!" ఆనందంతో రామ్మూర్తి గొంతు పొర బోయింది. ఆయన కళ్ళనుండి టపటప ఆనందబాష్పాలు క్రిందకు రాలాయి.

"ధర్మేంద్రజీ! మీరు వచ్చారన్నమాట! నా ఇన్నాళ్ళ కష్టం, నిన్నటి నా ప్రయత్నం ఫలించిందన్నమాట! ధర్మేంద్రజీ! ఇక ఎంతోకాలం వీరి బాధలు పడలేను. నాకు విముక్తి ప్రసాదించండి." దుఃఖభారంతో అప్పుడే వయో వృద్ధుడై పోయినట్లు మాట్లాడుతున్నాడు.

"డియర్ సర్! మిమ్ములను వాళ్ళు ఎందుకు బాధిస్తు న్నారు. మీనుండి వారికి కావలసిన సమాచారం ఏమిటి?" అడిగాడు ధర్మేంద్ర.

"ముఖ్యమంత్రిగారు కొన్ని రహస్య పత్రాలు, రాష్ట్రాభి వృద్ధికి, రక్షణకు సంబంధించిన ప్రణాళికలు అన్నీ ఒక సీక్రెట్ ఐరన్ సేఫ్‌లో భద్రపరుస్తారు. ఆ సేఫ్ లాకింగ్ సిస్టం నాకు తెలుసు. అది చెప్పమని రోజూ నా ప్రాణం తోడేస్తున్నారు." బాధగా చెప్పాడు.

"మిస్టర్ రామ్మూర్తీ! ప్రస్తుతం మీ వేషంలో దుండ గుల అనుచరు డొకడు ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీగా చలామణి అవుతున్నాడు. మీకు తెలుసా?"

"తెలుసు సర్! అంతేకాదు, ప్రతి రాత్రి ముఖ్యమంత్రి

సెక్రెటరీ యిక్కడే బంధితుడై వున్నాడు. ప్రతి రాష్ట్రం లోనూ, చివరకు కేంద్రంలో గూడా శత్రువులు ప్రముఖ స్థానాలను చేజిక్కించుకొనివున్నారు. అన్నీ తెలిసీ ఏమీ చేయలేని పరిస్థితిలో వున్నాను." ఆవేదన ధ్వనించింది రామ్మూర్తి కంఠంలో.

"ఆల్ రైట్ సర్! త్వరలోనే మన దేశానికీ, మీకూ విముక్తి కలుగుతుంది. ఇంతవరకు మీ ప్రాణాలపై ఆశ వదులుకొని గూడా రహస్యాలను కాపాడినందుకు జాతి మీ కెంతో ఋణపడివుంటుంది. సాధ్యమైనంత త్వరలో మళ్ళీ కలుస్తాను." అంటూ బయటకు నడిచాడు ధర్మేంద్ర.

రూంలోకి వెళ్ళగానే ఫోన్ గణగణమని మ్రోగింది. చటుక్కున రిసీవర్ అందుకున్నాడు ధర్మేంద్ర.

"హల్లో మిష్టర్ ఫైవ్! వెళ్ళినపని సెక్సెస్ అయిందా?" అవతలనుండి X-లైట్ కంఠం విన్పించింది.

"ఎస్ బాస్. సక్సెస్!" చెప్పాడు ధర్మేంద్ర.

"థాంక్యూ! ఏం చెప్పాడు? త్వరగా చెప్పు?" ఆతృత ధ్వనించింది అతని గొంతులో.

"బాస్! అతనికి లాకింగ్ సిస్టం గుర్తులేదట! ఎప్పుడో ఒకే ఒక్కసారి సేఫ్ ఓపెన్ చేశాడట! సాధారణంగా ముఖ్యమంత్రి స్వయంగా ఆ వ్యవహారాలు చూసుకుంటారట! అయితే ఒక సమాచారం అందచేశాడు. లాకింగ్ సిస్టం ప్లాన్‌వున్న కాగితం, అయిరన్ సేఫ్‌వున్న గదిలోని వాల్ క్లాక్‌లో రహస్యంగా దాచివుంచారట!" కట్టుకధ విన్పించాడు ధర్మేంద్ర.

"థాంక్యూ వెరీమచ్ మిష్టర్ ఫైవ్! మరో విషయం, యిన్ని కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించిన నీపై

మరో కార్యభారం మోపుతున్నాను."

"చెప్పండి బాస్! నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" ఉత్సాహంగా అన్నాడు ధర్మేంద్ర.

"నువ్వు వెంటనే కనకపురి వెళ్ళు. అక్కడ నీకోసం మనవాళ్ళు యిద్దరు ఎదురు చూస్తుంటారు. నీవు వెళ్ళి అక్కడ కార్యక్రమం జయప్రదంచేసి త్వరగా తిరిగిరా! మన ప్రణాళిక ముగించడానికి యింక ఎంతో సమయంలేదు మనకు. క్విక్" అంటూ కనకపురిలో నిర్వర్తించవలసిన కార్యక్రమాన్ని వివరించాడు X-లైట్.

ఆ కార్యక్రమాన్ని విన్న ధర్మేంద్ర అదిరిపోయాడు.

37

"మిష్టర్ మురళీ! చివరిసారిగా హెచ్చరిస్తున్నాం. మర్యాదగా ఆ ఫిల్మ్ ఎక్కడుందో చెప్పు?" గర్జించాడతను.

"నో. నాకు తెలియదు!" విసురుగా సమాధానం చెప్పాడు మురళి.

"ఆల్‌రైట్. నీ గుండెలపై కుంపటిలా మా బాస్ గుర్తుండే శిక్ష విధిస్తాం" అంటూ ఎర్రగా కాలిన ఆ స్టీల్ రాడ్‌ను మెల్లగా మురళి ఛాతీపై ఆదించాడు. 'కెవ్వు'మని కేకేశాడు మురళి. హృదయం భగ్గుమంది. అతను కర్కశంగా మరోసారి స్టీల్‌రాడ్‌ను ఆనించి 'X'ను పూర్తి చేశాడు. రెండవసారి మురళికి నోటివెంట మాటగూడా రాలేదు.

"మిష్టర్ మురళీ! సరిగ్గా మరో అరగంట సమయం యిస్తున్నాను. బాగా ఆలోచించుకో! అప్పటికీ నీ మొండి పట్టుదల విడవని పక్షంలో 'లైట్' అనే పదం కూడా నీ ఛాతీపై చోటు చేసుకుంటుం" అంటూ చకచక బయటకు

వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి. మిగిలిన ఇద్దరూ అతనిని అనుసరించారు.

బాధగా బెడ్‌పై వాలిపోయాడు మురళి. ఛాతీపై చితి పేర్చినట్లుంది. బాధగా ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నాడు.

'ఎలాగైనా ఇక్కడినుండి తప్పించుకోవాలి. అమూల్యమైన లైట్‌రాకెట్ రహశ్యాలు త్వరగా ప్రభుత్వానికి అందచేయాలి. లేనిపక్షంలో వూహించలేని అనర్థాలు జరుగుతాయి' ఆలోచిస్తూ కళ్ళు తెరిచిన మురళి ఒక్కక్షణం ఆశ్చర్యపోయాడు.

"తనను బంధించకుండా ఉండటానికి కారణం ఇదన్నమాట!" అనుకున్నాడు. పైన రివాల్వింగ్ మైక్రోస్కోప్ అమర్చబడివుంది. 'అంటే శతృవులు తన ప్రతి కదలికను పైనుండి గమనిస్తూనే వుంటారన్నమాట!'

"మరి ఎలా తప్పించుకోవడం?" ఆలోచనలతో సతమతమై పోతున్న మురళి ఉలిక్కిపడ్డాడు. ఎక్కడో సైరన్ మ్రోగుతున్నట్లు, ఆ వెంటనే అంతా పరిగెడుతున్నట్లు శబ్దం వినబడింది.

"సైరన్ మ్రోగిందంటే వారికేమైనా అపాయమా? లేక ఏదైనా సమావేశానికి పిలుపా? ఏది ఏమైనా తన కొకమంచి అవకాశం" అనుకున్నాడు మురళి.

గబగబ మంచంపైనుండి లేచాడు. గట్టిగా అరిచాడు ఓసారి. చిందరవందరగా గంతులు వేశాడు. ఎవరైనా పైనుండి పరిశీలిస్తుంటే యీ పిచ్చి చేష్టలకు దిగి వస్తారని మురళి ఆలోచన.

అయిదునిమిషాలు గడిచాయి. ఎవరూ రాలేదు.

ఆనందంగా నిట్టూర్చాడు మురళి.

"థాంక్ గాడ్! పైనగానీ, గది బయటగానీ ఎవరూ కాపలాలేదు. అంటే యింతకు ముందు సైరన్ పిలుపుకు అంతా ఎక్కడకో వెళ్ళివుంటారు" గబగబ వెళ్ళి తలుపు లాగాడు. రాలేదు. బహుశా బయట లాక్ చేసి వుంటారు.

ఇప్పుడెలా? మురళి దృష్టి గదిలోవున్న ఎలక్ట్రిక్ హీటర్‌పై పడింది. వెంటనే హీటర్ అందుకొని స్విచ్ ఆన్ చేసి తలుపు గడిదగ్గర వుంచాడు. అయిదునిమిషాలలో ఇనుపగడి వేడెక్కి వంగిపోయింది.

బలంగా తలుపును లాగాడు. గడి మధ్యకు విరిగిపోయి తలుపు తెరుచుకుంది. రెండడుగులలో బయటకు వచ్చాడు మురళి. బయట నడవాలో ఎవరూ లేదు. బహుశా అంతా ఎక్కడకో వెళ్ళి వుంటారు.

ఎటు వెళ్ళాలో తెలియదు. ధైర్యంచేసి ఒకవైపుగా నడిచాడు. కొంతదూరం వెళ్ళేసరికి కాంపౌండ్ వాల్ కన్పించింది. మురళిలో ఆనందం అవధులు దాటింది. ఉత్సాహంగా అటువైపు అడుగులు వేశాడు.

అంతలో ప్రక్కన ఏదో శబ్దమయింది. చటుక్కున ప్రక్కకు తిరిగి చూశాడు. చెట్లచాటునుండి ఒక వ్యక్తి పరిగెత్తుకు వస్తున్నాడు. అతని చేతిలో రివాల్వర్ వుంది.

ఇక ఒక క్షణం కూడా ఆలోచించలేదు మురళి. అతని చేతిలో తన గుండెలపై కాల్చిన ఇనుపరాడ్ మాత్రమే వుంది.

సరిగ్గా గురిచూసి ఆ రాడ్‌ను అతనిపై విసిరాడు మురళి. ఆ రాడ్ సరాసరి వెళ్లి అతని మొఖాన్ని తాకింది. అతను కెవ్వున అరుస్తూ క్రిందపడ్డాడు. వెంటనే అతన్ని చేరుకొని చేతిలో రివాల్వర్ లాక్కొన్నాడు మురళి. అతను నిల

ద్రొక్కుకొని లేవబోతూండగా మురళి చేతిలోని రివాల్వర్ నిప్పులు కక్కింది. అతను కుప్పలా కూలిపోయాడు.

మురళి గబగబ ప్రహరీ గోడను చేరుకున్నాడు. కొంచం ఎత్తుగానే వుంది అయినా గమనించలేదు మురళి. ఆవేశం ఉప్పొంగగా పైకి లంఘించాడు. ఒకే ఒక్క జంప్‌లో గోడ పైకి చేరుకున్నాడు. అవతల మామూలురోడ్! అంతే, ముప్పిరిగొన్న సంతోషంతో రోడ్ మీదకు దూకాడు. వెంటనే పరుగు ప్రారంభించాడు.

తన పరారీవార్త ఏ క్షణంలోనైనా శత్రువులకు తెలియవచ్చు. తెలిసినవెంటనే తీవ్రస్థాయిలో వేట ప్రారంభిస్తారు. వేగంగా, కాలు సత్తువకొద్దీ పరుగెత్త సాగాడు.

"తను ప్రస్థుతం ఎలాగైనా కనకపురి చేరుకోవాలి. అక్కడ జరగనున్న మారణ హోమాన్ని అరికట్టాలి." అదే మురళి ప్రస్థుత ధ్యేయం!

మురళి కళ్ళు మెరిశాయి. ఎదురుగా టాక్సీ వస్తోంది. అది శత్రువులదో, మిత్రులదో? ఎవరిదైనా సరే, తనకు ప్రస్థుతం ఓ వాహనం కావాలి.

రివాల్వర్ స్టడీలో వుంచుకొని టాక్సీని ఆపాడు. అది ప్రయివేట్ టాక్సీనే! శత్రువులదికాదు!

'థాంక్ గాడ్!" అనుకుంటూ టాక్సీ ఎక్కాడు.

"ఎక్కడకు సార్?" అడిగాడు డ్రైవరు.

"కనకపురి!" చెప్పాడు మురళి.

కారు వేగాన్ని అందుకుంది. రోడ్ ప్రక్కనే వున్న టెలిఫోన్ బూత్ చూడగానే చటుక్కున ఆ విషయం గుర్తుకు వచ్చింది మురళికి.

టాక్సీ ఆపి వెంటనే బూత్ లోకి నడిచాడు.

క్రయింబ్రాంచ్‌కు కాయిన్స్ వేయనక్కరలేదు. చకచక నంబర్లు తిప్పాడు.

అవతల నుండి ఐ.జి. రెస్పాన్స్ యిచ్చాడు.

"హల్లో మిస్టర్ కిషోర్‌కుమార్! నేను మురళిని మాట్లాడుతున్నాను. ఒక ముఖ్య విషయం: లైట్ రాకెట్ భావి కార్యక్రమాలు, అందులోని వ్యక్తులు అడ్రస్‌లతో సహా ఫోటో తీశాను. ఆ ఫిల్మ్ కార్పొరేషన్‌వారి 155వ నంబర్ గల చెత్తకుండీలో వుంటుంది. వెంటనే ఆ ఫిల్మ్‌ను స్వాధీనం చేసుకొని, ఆ ఫిల్మ్‌లోని వ్యక్తులను తక్షణం బంధించండి. బి కేర్! నాకు చాలా అర్జంట్ పని వుంది" అంటూ కనకపురిలో జరగబోవు విషయం చెప్పి, ఫోన్ పెట్టేసి కారెక్కాడు.

కారు వేగంగా కనకపురివైపు దూసుకుపోయింది.

38

కనకపురి ఒక మాదిరి గ్రామం. అక్కడ ప్రజలలో నలభై శాతం ముస్లిమ్స్! మిగిలిన అరవై శాతం హిందువులు. ప్రక్కనే చిన్న సహజ నౌకాశ్రయం వుండటంవలన బ్రిటిష్‌వారి కాలంనుండి ఆ గ్రామాని కొక ప్రత్యేకత, ప్రాముఖ్యత వుంది. అక్కడ వారికి వ్యవసాయం ముఖ్య వృత్తి.

ధర్మేంద్ర కనకపురిలోకి అడుగిడగానే అక్కడ లైట్ రాకెట్‌కు సంబంధించిన యిరువురు వ్యక్తులు తమను తాము పరిచయం చేసుకొని, తాము యింతవరకు నిర్వహించిన కార్యక్రమమంతా వివరించారు.

కనకపురి కరణంగారు హిందువు. పంచాయితీ ప్రెసి

అపరాధ పరిశోధన పోటీ-96 [ఫలితాలు]

జులై '76 నెల "అపరాధ పరిశోధన పోటీ_96"కి సరియైన సమాధానాలు :

1. ఐ. కె. గుజ్రాల్.
2. గడియారం.
3. సెక్సు సాహిత్యం.
4. మామిడి.
5. మారిషస్.

పై జవాబుల ప్రకారం ఒక్కరు మాత్రమే ఆల్ కరక్టుగా పంపారు. వీరికి అక్టోబర్ '76 నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత :

(1) శ్రీ సి. సుధాకర రావ్,
(సంస్కృత పండిత్)
పి. ఎస్. ఆర్. యం. జడ్. పి. హైస్కూల్,
కొత్తపాలెం పోస్టు,
గూడూరు తాలూకా,
(నెల్లూరు జిల్లా.)

డెంట్ ముస్లిమ్. రాజకీయంగా వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే మరుక్షణం బూడిదవుతుంది. కరణంగారి యింట్లో పెద్ద నౌకరు ముస్లిమ్! ఈ విషయమే దుండగుల దృష్టిని ఆకర్షించింది.

ఒక వారం రోజులనుండి ఆ వూరిలోని హిందువుల ఇండ్లలోని వస్తువులు ముస్లిమ్‌ల ఇళ్ళలోనూ, ముస్లిమ్‌ల ఇళ్ళలోని వస్తువులు హిందువుల ఇళ్ళలోనూ కన్పిస్తు న్నాయి. హిందువులు పవిత్రంగా భావించే దేవాలయాలలో ముస్లిమ్‌లు అప్రాచ్యపు పనులు చేస్తున్నారు. ముస్లిమ్‌లు పూజించే 'పీరు'లను హిందువులు అవమానిస్తున్నారు. హిందువుల ఆడపిల్లలను ముస్లిమ్ యువకులు, ముస్లిమ్ పడుచులను హిందువుల యువకులు అవమానిస్తున్నట్లు వార్తలు పెంపొందాయి.

ఎంతో అన్యోన్యంగా వుండే ఆ గ్రామంలోని హిందూ ముస్లిమ్‌ల మధ్య అంతులేని కల్మషం పెరిగిపోయింది. రెండు రోజులక్రితం ఒక ముస్లిమ్ ఇల్లు హిందువు, ఆద్వే షంతో హిందువు ఇల్లు ముస్లిమ్ తగులబెట్టుకోవడంతో ఆ కల్మషాలు పతాకస్థాయిని చేరుకున్నాయి.

అయితే ఎవరికివారు తాము ఎవరికీ అన్యాయం చేయడం లేదు అంటున్నారు. ఎవరు ఈ ఘోరకృత్యాలు చేస్తున్నారో అర్థంకావడం లేదు. ప్రతిమనిషి ప్రక్కవానిని గూడా నమ్మే పరిస్థితిని దాటిపోయాడు. కరణంగారికీ, వారి పెద్ద నౌకరుకు తరచు వాగ్వివాదం జరుగుతోంది. కారణం ఎవరికీ తెలియదు.

ప్రస్తుతం దుండగులలో ఒకతను ముస్లిమ్‌గానూ, మరొకతను హిందువుగాను వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

చెప్పుకోండి చూద్దాం?

1. కుడిచేతికున్న వ్రేలి గుర్తులే ఎడమ చేతికి వుంటాయా?

2. వ్రేలి గుర్తులవలె 'కంఠస్వరాలు' వేరుగా వుంటాయా?

3. ఆత్మహత్యకు పాల్పడి, ప్రమాదంనుండి తప్పించుకున్న వారికికూడా శిక్ష పడుతుందా?

4. 'హేబీస్ కార్పస్' అంటే ఏమిటి?

5. హత్యకు ఉపయోగించిన ఒక కత్తిని శుభ్రంగా కడిగి, దాన్ని పరీక్షిస్తే, ఆ కత్తిని హత్యకు ఉపయోగించినట్లు తెలుస్తుందా?

6. మిషన్ గన్ ట్రిగ్గర్ ఒక్కసారి నొక్కితే ఎన్ని 'బుల్లెట్స్' బయటకు వస్తాయి?

7. ఒక్కసారిగా మిషన్ గన్ నుండి వెలువడిన బుల్లెట్లు స్ప్రెడింగ్ 'రేంజ్' అన్నిటికీ సమానంగానే వుంటాయా?

—కె. చందర్‌రావ్.

జవాబులు:

1. వుండవు.

2. అవును.

3. పడుతుంది. ఆత్మహత్య ప్రయత్నం కూడా నేరమే.

4. నేరము ఋజువుకానిదే నేరస్థుడ్ని 'జైల్లో' వుంచరాదు అని.

5. తెలియదు.

6. .32 బుల్లెట్లు.

7. వుంటుంది.

"ఇంతవరకు మీరుచేసిన కృషి అమోఘం! ఈ రోజుతో ఈ కార్యక్రమం ముగించమని బాస్ ఆర్డర్! రేపు ఈ సమయానికి హిందూ ముస్లిమ్‌లమధ్య విపరీతంగా ద్వేషం రగిలి కొట్లాటలు జరగాలి. ఈ వార్త దేశం నలుమూలలా ప్రాకేవి. దేశం మొత్తం మత విద్వేషాలతో మారణహోమం కావాలి" ప్లాన్ చెప్పాడు మిష్టర్ షైప్ ఉరఫ్ ధర్మేంద్ర.

"ఓ. కె. మిస్టర్ షైప్! చివరి కార్యక్రమంగా కరణం గారి పెద్ద నౌకరును ఎత్తుకొచ్చి చంపేస్తే మన పని పూర్తయిపోతుంది," అన్నారిద్దరూ!

చిన్నగా ఉలిక్కిపడ్డాడు ధర్మేంద్ర.

"ఏమిటి మీరంటున్నది?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఎస్ మిష్టర్ షైప్! ఇంతవరకు హిందూ ముస్లిమ్ మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు సృష్టించాం. చివరిసారిగా ఆ కాలీషాను చంపేసి కసితీరక హిందువులే అతనిని చంపినట్లుగా చిత్రించి ఆ శవాన్ని ముస్లిమ్‌ల కళ్ళ బడేటట్లుచేస్తే చాలు! ఇక ముస్లిమ్‌లు రగులుకొన్న అగ్నిగోళంలా హిందువులపైబడి వాళ్ళను బూడిదచేస్తారు," నవ్వుతూ అన్నాడావ్యక్తి.

వాళ్ళ కార్యక్రమానికి కడుపుమండిపోయింది ధర్మేంద్రకు

"వెరీగుడ్! అయితే మీరు కాలీషాను చంపకుండా బంధించి తీసుకురండి. అ తరువాత కార్యక్రమం నేను నిర్ణయిస్తాను" ఆజ్ఞాపించాడు ధర్మేంద్ర.

"ఓ.కె. మిష్టర్‌షైప్!" అంటూ ఇద్దరూ వెళ్ళిపోయారు.

చిన్నగా నిట్టూరుస్తూ కరణంగారింటికి బయలుదేరాడు ధర్మేంద్ర.

కరణం భగవంతరావుగారంటే ఆ గ్రామంలో అందరికీ

సప్లిమెంట్ పోటీ-22 [ఫలితాలు]

జూలై '76 నెల "సప్లిమెంట్ పోటీ_22"కి సరియైన జవాబు :

X	V	Y	U	W

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒక్కరు వ్రాశారు. వీరికి అక్టోబరు '76 నెల నుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

శ్రీమతి బి. సుభద్రాదేవి,
వేగవరం—పోస్టు,
జంగారెడ్డి గూడెం—వయా,
(ప. గో. జిల్లా).

భక్తిశ్రద్ధలున్నాయి. ఆయన మాట మంచితనం, నిదానం అందుకు కారణం గూడా!

ఆ రోజు భగవంతరావుగారు, పెద్దనౌకరు కాలీషా మీద కారాలు మిరియాలు నూరుతున్నారు.

"ఏరా! నీకు కళ్ళు నెత్తికొచ్చాయా? ఒళ్లు కొవ్వెక్కిందా? అమ్మాయిగారు స్నానాల గదిలో స్నానం చేస్తుంటే, దొంగచాటుగా లోపలకు ప్రవేశిస్తావా? అసలు నీకెన్ని గుండెలురా?"

"సాబ్! మాటలు జాగ్రత్తగా మాట్లాడండి. అలాంటి అలవాటు మా జాతి మొత్తంలో లేదు. మమ్మల్ని అవమాన పరుస్తున్నారు మీరు." కోపంగా సమాధాన మిచ్చాడు కాలీషా.

"నీకు మాటలతో చెబితే అర్థం కాదురా! ఈ రోజు స్నానాల గదిలోకి వెళ్ళావు, రేపు పడకగదిలోకే వెళతావు. నిన్ను ఏం చేసినా పాపంలేదు" అంటూ చెయిన్ తీసుకొని కొట్టడానికి మీదకు వస్తున్న భగవంతరావు, గుమ్మంలో నిలబడి లోపలకు చూస్తున్న యిద్దరు ముస్లిమ్ యువకులను చూసి ఆగిపోయాడు.

"ఛీ! ఇక నీ ముఖం నాకు చూపించకు ఫో!" చెయిన్ అవతల పారేసి గర్జించారు భగవంతరావు.

అప్పటివరకు కిటికిలోనుండి అంతా చూస్తున్న ధర్మేంద్ర గిరుక్కున వెనక్కు తిరిగిన కాలీషాను చూసి ఆశ్చర్య పోయాడు.

అతను కాలేషా కాదు. మురళి!

"మురళి యిక్కడకు ఎలా వచ్చాడు? ఎందుకువచ్చాడు? ఈ విషయం ఎలా తెలిసింది? కాలీషాగా ఎప్పటినుండి నట

అపరాధ పరిశోధన పోటీ-98

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-9-'76 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబర్ '76 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. ఈ మధ్య ఇక్కడ జరిగిన భూకంపంలో బాగా జన నష్టం జరిగింది—? (చైనా, పెరూ.)

2. కల్తీ నేడు అన్నిటిలో వున్నా, వీటిలో ఎక్కువగా జరుగుతున్నది—? (మందులు, నూనెలు.)

3. 'దీన జనోద్ధరణ' అని చెప్పే నాయకులు వీరి విషయం బొత్తిగా విస్మరించారు—? (రోగులు, ముష్టివారు.)

4. ఇది ప్రమాదకరమైన వ్యాధి—? (కలరా, క్యాన్సర్.)

5. ఈ దేశం విషయంలో మన అంచనాలన్నీ తలక్రిందులైనాయి—? (అమెరికా, బంగ్లాదేశ్.)

స్తున్నాడు?" అనుకుంటూ, రోడ్ మీద తలవంచుకు వెళు తున్న మురళికి వినబడునట్లు చిన్నగా యీలవేశాడు.

గిరుక్కున వెనక్కు తిరిగాడు మురళి. ధర్మేంద్రను గుర్తించాడు. ఇద్దరూ కళ్ళతోనే ఒక్క క్షణం సంభాషించు కున్నారు.

ఆ తరువాత ఊరి వెలుపల వున్న చింతతోపులో డిటెక్టివ్ లిరువురూ కలుసుకున్నారు.

మురళి జరిగినవన్నీ క్లుప్తంగా చెప్పి "సార్. రామ్మూర్తి ముఖ్యమంత్రిగారి సెక్రెటరీ కాదు. అతను X-లైట్‌కు సెక్రెటరీ! ముందుముందు జరగబోవు కార్యక్రమాలు అన్నీ సభ్యులకు అతని ద్వారా అందజేయబడతాయి. అతని రూం అన్వేషణలో చాలా విషయాలు తెలిశాయి. దేశవ్యాప్తంగా వున్న లైట్ రాకెట్ సభ్యులందరి చిరునామాలు దొరికాయి. అవి ఐ.జి.కి అందించాను. ఇక్కడి కార్యక్రమం గూడా నేను అక్కడే తెలుసుకున్నాను. హడావుడిగా యిక్కడకు వచ్చేటప్పటికే పరిస్థితులు విషమించివున్నాయి. కాలీషాపై హత్యాప్రయత్నం జరగనున్నదని గుర్తించి, అతన్ని క్షేమంగా పోలీస్‌లకు అప్పచెప్పి నేనతనివేషంలో వున్నాను. అన్నట్లు మీ విశేషాలు ఏమిటి? మీ కెలా తెలిసింది? మీరెలా వచ్చారు?" కుతూహలంగా అడిగాడు.

ధర్మేంద్ర జరిగిన విషయాలన్నీ వివరంగా వివరించి "ఇప్పుడు నేను లైట్ రాకెట్‌లో ఒక ముఖ్య సభ్యుడ్ని! ఈ కార్యక్రమం జయప్రదం చేయమని నన్ను పంపారు. అన్నట్లు మనం యిక్కడ త్వరగా ముగించి వెళ్ళాలి. అక్కడ పరిస్థితులు చాలా విషమంగా వున్నాయి. X-లైట్ ఏదో పెద్ద ప్లాన్ వేస్తున్నాడు." చెప్పాడు ధర్మేంద్ర.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇప్పటికే వేలాది పాఠకులు సభ్యులుగా చేరారు. వెంటనే మీరూ చేరండి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 (అన్ని ఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్ గా పంపబడతాయి. ఏ నెలలోనైనా మీరు కాపీలు తీసుకోకపోతే, వి. పి. తిరిగొస్తే మీ సభ్యత్వము రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని కూడ వి. పి. ద్వారా పంపగలము.

7. ప్రస్తుతము ఈ క్రింది సెంటర్లలో ఏజెంట్ ద్వారా 'హోమ్ డెలివరీ' ఏర్పాటు వున్నది: రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, హైద్రాబాదు, అనకాపల్లి, తెనాలి, పామిడి, కరీంనగర్, సీలేరు ప్రాజెక్ట్, శ్రీశైలం ప్రాజెక్ట్, హిందూపురం, తాడేపల్లిగూడెం, గుంటూరు, నెల్లూరు, భీమవరం, బెల్లంపల్లి, నంద్యాల, సూర్యాపేట, కర్నూలు.

ఆ తరువాత మరో పది నిమిషాలు యిద్దరూ జరగ వలసిన కార్యక్రమం గురించి చర్చించుకున్నారు. లైట్ రాకెట్‌లోని ఇద్దరు వ్యక్తులను బంధించి, పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఆ ఊరి పెద్దలకు జరిగిన విషయాలను వివరించి అందరినీ శాంతపరిచారు.

మురళి బంధింపబడిన అనుచరులలో ఒకనిగా తయారయి వచ్చాడు.

కనకపురి ప్రజలవద్ద వీడ్కోలు తీసుకొని డిటెక్టివ్ లిరువురూ బయలుదేరారు.

39

"కాబట్టి మనమంతా పురోగమించాలి...." లైట్‌రాకెట్ నాయకుడు X-లైట్ ఉపన్యాసం అనర్గళంగా సాగిపోతున్నది.

సభ్యులంతా ఊపిరి బిగపట్టి మరీ వింటున్నారు. అంతలో సైరన్ మ్రోగింది. ఉలిక్కిపడ్డారంతా.

"ఎవరో వస్తున్నట్లున్నారు" అంటూ X-లైట్ ప్రక్కనే వున్న బటన్ నొక్కాడు. ఎదురుగా వున్న టి.వి. స్క్రీన్‌పై రెండు ప్రతిబింబాలు కనపడసాగాయి. కొద్ది క్షణాలలో ఆ ఇరువురు వ్యక్తులు లోపలకు ప్రవేశించి X-లైట్‌కు శెల్యూట్‌చేసి వారి వారి స్థానాలలో కూర్చున్నారు.

"హల్లో మిస్టర్ ఫైవ్ అండ్ ఫిఫ్టీన్! మీ కార్యక్రమం విజయవంతం అయిందనుకుంటాను." X-లైట్ ప్రశ్నలో లౌక్యం ధ్వనించింది.

(సశేషం)

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) ఆగస్టు '76 నెల "అపరాధ పరిశోధన" మాస పత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

చూసుకో ప్రతిరూపం!
తీర్చుకో ప్రతీకారం!!

పంపినవారు: శ్రీ కె. సాయిశ్రీనివాస్, కేరాఫ్-బొప్పూడి వెంకటరావు, నరసారావుపేట-522601.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మృత్యువుకు ప్రతినిధి!
హంతకులకు ప్రత్యర్థి!!

పంపినవారు: శ్రీమతి గరిమెళ్ళ వనజ, బి. ఎస్. సి., ఖైరతాబాద్, హైదరాబాదు500004.

లేఖలు

ఈ నెల కథలలో సింహపు పిల్ల, తెలివి ఒకరి సొత్తు కాదు, తలుపులు మూసి పడుకోండి ఉత్తమంగా వున్నాయి. 'పరలోక ప్రాప్తి' సీరియల్ ఇంటరెస్టుగా నడుస్తోంది. సప్లిమెంట్‌లో వసుంధరగారి 'వందకు పదివేలు' మంచి సస్పెన్స్‌లో నడిచింది రచయిత్రికి నా అభినందనలు.

—బి. షాజు. హిందూపురం.

'టెలిఫోన్ టెక్నిక్'లో పరిశోధన బాగుంది. 'పవిత్రతకు పరీక్ష' నూతన కథావస్తువుతో చాలా బాగుంది. 'సుమత్రా దీవి' అందరికీ తెలిసిన పాత కథ. చదవటానికి ఫర్వాలేదు అనిపించింది.

—టి. సూరిబాబు, కర్నూలు.

సుమత్రా దీవి, సింహపు పిల్ల కథలు బావున్నాయి. 'పరలోక ప్రాప్తి' సీరియల్ ఏకబిగిన చదివించేస్తోంది. సప్లిమెంట్‌లో హంతకులు-ఆగంతకులు, వందకు పదివేలు నాకు నచ్చిన నవలలు.

—పి. ప్రభాకరరావు, రామాజిపల్లి.

ఈ నెలలో అన్నీ వెరైటీ కథలే. శ్యాంబాబుగారి 'టెలిఫోన్ టెక్నిక్' మరియు వసుంధరగారి 'పవిత్రతకు పరీక్ష' నిస్సందేహంగా ఉత్తమ కథలు. వసుంధరగారి ఉత్తమ నవల 'వందకు పదివేలు' మాకు మాంచి ఉత్తేజాన్ని కలిగించింది. 'ఖైదీ' స్థానాన్ని మళ్ళీ పూడ్చగలరని ఆశిస్తూ—

—కాసారపు సంజీవయ్య, జగిత్యాల.

వసుంధరగారి 'పవిత్రతకు పరీక్ష' చెప్పుకోదగిన గొప్ప స్టోరీ. అజీజ్, శ్యాంబాబు, పెందుర్తిగార్ల రచనలు ఆణి ముత్యాల్లా ఉన్నాయి. సప్లిమెంట్ నాలుగు నవలల్లో ఏది ఉత్తమంగా ఉందో నిర్ణయించలేకపోతున్నాము. అన్నీ ఉత్తమ నవలలే నా దృష్టిలో!

—యస్. సత్యానంద్, బెల్లంపల్లి.

ఈ నెల "అపన"లో ఏ కథ బాగుంది అనేదానికన్నా, అన్ని కథలు ఆణిముత్యాలే అని చెప్పవచ్చును. సప్లిమెంట్‌లో అజీజ్‌గారి 'ప్రాణాలు దక్కితే చాలు' నవల నాకు బాగా నచ్చింది. త్వరలో మరో సీరియల్ వేయండి. —యస్. విజయకుమార్, బెంగుళూరు-11.

ఆగస్టునెల ప్రతి కథలోనూ ఏదో కొత్తదనం అగుపిస్తోంది. ఇది బాగాలేదని అనడానికి ఏ కథలోను ఆస్కారం లేదు. కంచర్ల రమణగారి 'కలికి' టెర్రిబుల్‌గా వుంది. సప్లిమెంట్ నాలుగు నవలల్లోను దేనికదే బాగుంది. ఈనెల అక్కడక్కడ ప్రచురించిన జోక్స్ చాల ఘాటుగా వున్నాయంటే నమ్మండి!

—సి. హెచ్. రాజా, బొంబాయి-12.

'పవిత్రతకు పరీక్ష' ఈనెల పత్రికకే హైలైట్. అడుగడుగునా పాఠకుల ఆలోచనా శక్తికి పరీక్షపెట్టిన వసుంధర గారికి అభినందనలు. 'టెలిఫోన్ టెక్నిక్' నిజంగా ఒక టెక్నిక్కే! 'కలికి' కథాగమనం బావున్నా కొన్నివేల వోల్టుల కరెంట్ ప్రవహింపజేసి కలికిని సృష్టించడం హాస్యాస్పదంగా ఉంది.

—ముద్దా రమేష్, కాకినాడ.

పవిత్రతకు పరీక్ష, మనిషిలో మనిషి, టెలిఫోన్ టెక్నిక్ ఈ నెల అసనలోని ఆణిముత్యాలు. మళ్ళీమళ్ళీ చదివించేలా బెస్ట్‌గా వున్నాయి. 'వందకు పదివేలు' నవల చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది. సప్లిమెంట్‌లో మరో పెద్ద సీరియల్ అందిస్తారని ఆశతో ఎదురుచూస్తున్నాం.

—హవంతీ రఘువిమల ప్రసాద్, బోర్గాం.

వసుంధరగారి 'పవిత్రతకు పరీక్ష' ఈ నెల నాకు నచ్చిన నవల. ప్రతి వ్యభిచారి శర్మలాగా కళ్ళు తెరిస్తే, కొంద రాడపిల్లలైనా సుఖపడగలరు. రచయిత్రికి నా ధన్యవాదాలు. నాల్గు నవలలతోబాటు, టెలిఫోన్ టెక్నిక్, సింహపుసిల్ల నాకు బాగా నచ్చిన కథలు.

—ఎం. ఏ. గోపాల్, కూచనపల్లి.

ఈ నెల కథల్లో వసుంధరగారి 'పవిత్రతకు పరీక్ష', శ్యాంబాబుగారి 'టెలిఫోన్ టెక్నిక్', రాజేశ్వరిగారి 'మని షిలో మనిషి' వెరైటీగా వున్నాయి. నవలల్లో 'వందకు పదివేలు' ఎక్సలెంట్. మంచి కథలతోపాటు, మంచి పత్రిక అందిస్తున్నందుకు మీకు, రచయితలకు ధన్యవాదాలు.

—ఎల్. రామగోపాల్, నెల్లూరు-3

Editedand Published by S. DAMODAR REDDY (phone: 36959), 3-4-554 Narayanaguda Hyderabad-500029, and printed at Kranti press, Madras-1